అరుణతార

సాహిత్య సాంస్కృతిక మాస పత్రిక

సంపుటి : 34 సంచిక : 5 సెప్టెంబర్ - అక్టోబర్ 2011

వెల : రు 20 (288) పేజీలు : 100

పోరాటం ఎప్పటి దాకా...

తెలంగాణ వచ్చేదాకా...

అని నినదించిన

సకల జనుల సమ్మె!

శిక్ష పూర్తి చేసుకున్న రాజకీయ ఖైదీలను బేషరతుగా విడుదల చేయాలంటూ కమిటీ ఫర్ ద రిలీజ్ ఆఫ్ పొలిటికల్ ప్రిజినర్స్ (సి.ఆర్.పి.పి.) ఆధ్వర్యంలో 13-09-2011న జరిగిన ధర్నా, బహిరంగసభ దృశ్యాలు

గుంటూరు జిల్లా జీతన్ మరాండీ కళాబృందం ఉరిశిక్ష రద్దు కమిటీ ఆధ్వర్యంలో జీతన్ మరాండీ, అతని సహ కళాకారుల ఉరిశిక్షలు రద్దుచేయాలంటూ జరిగిన ప్రదర్శన, ధర్నా

KLVA1D1M156

అరుణతార
సాహిత్యసాంస్కృతిక మాసపత్రిక

288 సంపుటి : 34 ◆ సంచిక : 5 ◆ సెప్టెంబరు - అక్టోబరు, 2011

సంపాదకుడు
చలసాని ప్రసాద్

వర్కింగ్ ఎడిటర్
డి.వి. రామకృష్ణారావు
ఎం.ఐ.జి. - 14, ఎ.పి.ఐ.ఐ.సి. కాలనీ,
కార్బైడ్ కంపెనీ ఎదురుగా,
మౌలాలి, హైదరాబాద్ - 500040
* కేవలం పోస్ట్, బుక్‌పోస్ట్ ల ద్వారా
రచనలు పై చిరునామాకూ,
* ఇ-మెయిల్ ద్వారా
arunatara1977@gmail.com
కూ రచనలు పంపవచ్చు

కొరియర్, రిజిస్టర్డ్ పోస్ట్ ల ద్వారా
రచనలు పంపితే...
టి. కృష్ణాబాయి
9-19-3, సి.బి.ఎం. కాంపౌండ్
విశాఖపట్నం - 530 003

చందాలు పంపాల్సిన చిరునామ
మేనేజర్
ఎస్. రవికుమార్
5-1307, దొరసానిపల్లె రోడ్,
ప్రొద్దుటూరు, కడప జిల్లా - 516360
సెల్ : 9866021257

విరసం కార్యదర్శి చిరునామా
పాణి
50-348, L 19 B II,
అరోరా నగర్, బి క్యాంప్, కర్నూల్ - 2

ఈ సంచిక వెల : రు. 20

సంపాదక లేఖ...

తెలంగాణ ఆకాంక్ష నాలుగు దశాబ్దాలుగా వివిధ రుపాల్లో వ్యక్తమవుతున్నా పరిష్కరిద్దామనే కనీస స్పృహ మన పాలకులకు లేదు. ఏ సమస్యకైనా శాస్త్రీయమైన సమాధానం కనుగొందామన్న దృష్టిలేదు. వాయిదావేసే లేక అణిచివేతతో బదులుచెప్పే ప్రణాళిక మాత్రమే ఉంది. కాశ్మీరు కావచ్చు, ఈశాన్య రాష్ట్రాలు కావచ్చు, తెలంగాణ కావచ్చు. ఇంకా అలాంటి అనేక ప్రాంతీయ ఆకాంక్షలు ఈ అరవై ఐదేళ్ల అసమ వృద్ధి నుంచి పుట్టినవే. కొత్త కొత్త రూపాల్లో, కొత్త కొత్త ప్రశ్నలు ఇంకా అనేకం వస్తూనే ఉన్నాయి. ఒక ప్రశ్న వచ్చిందంటే దానికి జవాబు ఉన్నట్లే. ఆ జవాబును కనుగొనే ఉద్దేశ్యం, విజ్ఞత, హేతుబద్ధత, విచక్షణా ఉన్నాయా లేదా అనేదే మౌలిక ప్రశ్న. మన పాలకులకు ప్రజలకు జవాబు చెప్పే ఉద్దేశ్యం, సమస్యలకు జవాబు వెదికే ఉద్దేశ్యం ఎప్పుడూ లేవు. ఏ ప్రశ్నకయినా వారి వద్ద ఉన్న జవాబు ఒక్కటే, అది బలప్రయోగం. చారిత్రక పరిణామాలను దృష్టిలో పెట్టుకొని, న్యాయబద్ధంగా పరిష్కారాలు కనుగొనడం ఈ పాలకులకు సాధ్యం కాదు. మన పాలకులంతా రాజకీయవాదులేగాని రాజకీయ నీతిజ్ఞులు కారు. అవకాశవాదమేగాని రాజకీయ విజ్ఞత లేదు. ఉన్నదంతా పెట్టుబడి, సామ్రాజ్యవాద పెట్టుబడుల అండతో ఉన్న దళారీ భూస్వామ్య, బూర్జువా వర్గ నాయకత్వమే.

మన రాష్ట్రంలో చూస్తే తెలంగాణ అంశంతో మొదలు పెట్టి, దళితులపై జరిగిన మారణకాండలు, ముస్లిం మైనారిటీలపై జరిగిన మారణకాండలు, ఎస్.సి. రిజర్వేషన్ల వర్గీకరణ, జల వివాదాలు, భూపోరాటాలు, వాకపల్లి, బల్లుగూడలు, సోంపేట, కాకరాపల్లిలు, పోలేపల్లి, తడ, సుళ్లూరుపేటలు ఇలా అనేక సామాజిక, రాజకీయార్థిక సమస్యలు సమాధానాలు లేకుండా కొనసాగుతున్నాయి. ప్రజల పట్ల బాధ్యత లేని పాలకుల విధానాలు, వారికి అనుబంధంగా ప్రజల పట్ల బాధ్యతను విస్మరించి, పాలకుల పట్ల విధేయతే లక్ష్యంగా నడుస్తున్న న్యాయ, పోలీసు, పరిపాలన వ్యవస్థలు రాజ్యమేలుతున్నాయి. రాజ్యాంగంపై ప్రతినబూని అధికారం చేపట్టిన, రాజ్యాంగ బద్ధంగా నడుచుకుంటామని హామి పడిన 'ప్రజా ప్రతినిధులు' చట్టవ్యతిరేక కార్యకలాపాల్లో మునిగిపోయి, ప్రజా వ్యతిరేక పాలనను ప్రజలపై రుద్దడంలో కృతకృత్యులయ్యారు.

తెలంగాణ ప్రజల దశాబ్దాల ఆకాంక్షను ఎత్తిపడుతూ సింగరేణి కార్మికులు, ఆర్‌టిసి కార్మికులు, వివిధ రంగాల, వివిధ శాఖల ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు వారికి మద్దతుగా ఆటో కార్మికులు వివిధ రంగాల అసంఘటిత కార్మికులు, ముక్తకంఠంతో 42 రోజులపాటు సకల జనుల సమ్మెను విజయవంతం చేశారు. సకల జనుల సమ్మె గుణదోషాల చర్చ అలా ఉంచితే, ఒక ప్రజాస్వామిక ఆకాంక్షను ఇంకా ఎలా వ్యక్తంచేయాలి. 700 మందికి పైగా ఆత్మబలిదానాలతో తెలంగాణ పోరాటం 'అహింసా' పద్ధతిలోనే నడుస్తోంది. ఇంత ఉద్యమం జరిగాక ఘనత వహించిన అధికార కాంగ్రెస్ పార్టీ గతంలో ఉద్యమకారులపై కేసులు ఎత్తివేయించినట్లు నాటకమాడి, సకల జనుల సమ్మె అనంతరం తెలంగాణ రాష్ట్ర సమితి పొలిట్‌బ్యూరో సభ్యుడు, ప్రజా వైద్యుడు, కవి, రచయిత డా. చెరుకు సుధాకర్‌పై దేశ భద్రతా చట్టాన్ని (ఎన్ఎస్ఎ) ప్రయోగించి తెలంగాణ ఉద్యమకారులకు, మొత్తంగా ప్రజాస్వామికవాదులకు ఒక సవాల్ విసిరింది. ఉద్యమాలపట్ల ఈ పాలకుల వైఖరి ఏమిటో, ఎలా ఉంటుందో, ఎలా ఉండబోతుందో, తెలంగాణ ఆకాంక్ష పట్ల ఎలా వ్యవహరించబోతున్నారో ఈ చర్య చాటి చెప్పింది. కోస్తాప్రాంత బూర్జువ వర్గ ప్రయోజనాలు పరిరక్షించడం కోసమే కాంగ్రెస్ అధిష్టానం తెలంగాణపై నాన్చివేత వైఖరితో ఉన్నది. సకల జనుల సమ్మెను అర్థవంతంగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ రాజకీయ నాయకత్వం నిజాయితీతో వ్యవహరించలేదు. ఈ మొత్తం పరిస్థితి తెలంగాణ ప్రజానీకాన్ని మరింత బలమైన ప్రత్యామ్నాయ పోరాట మార్గాల అన్వేషణలోకి నెట్టేసింది. అయితే తమ ఉద్యమాలలో ఎంతో సృజనాత్మకతను ప్రదర్శించిన, గొప్ప పోరాట సంప్రదాయాల చరిత్ర కలిగిన తెలంగాణ ప్రజలు పాలకుల దుర్మార్గాన్ని ప్రతిఘటించడంలో తప్పక కొత్తదారులు కనుగొంటారు. ప్రజల మధ్య వైరుధ్యాల్ని పెంచే కుటిల యత్నం చేస్తున్న పాలకుల దుర్మార్గాలకు వ్యతిరేకంగా అన్ని ప్రాంతాల ప్రజలు 'మనం 99 శాతం మందిమి' అనే స్ఫూర్తినీ, ఐక్యతనూ వ్యక్తం చేయాల్సిన సందర్భమిదే. మన జ్ఞానం సరిపోనపుడు, సందిగ్ధత నెలకొన్నప్పుడు పాలకుల నిర్ణయాలకు వ్యతిరేక నిర్ణయాల్లోనే మన ఐక్యతనూ వ్యూహాన్నీ స్నేహాన్నీ చాటాలి.

ఈ సంచికలో...

సంపాదకీయం (5 - 7)
ప్రాంతీయ ఉద్యమాలు - తెలంగాణ - పి.వరలక్ష్మి

వ్యాసం (8 - 9)
తెలంగాణ సకల జనుల సమ్మె... - సి.ఎస్.ఆర్. ప్రసాద్

కరపత్రం (10 - 11)
విప్లవ రచయితల సంఘం

కరపత్రం (12 - 13)
కమిటీ ఫర్ ద రిలీజ్ ఆఫ్ పొలిటికల్ ప్రిజినర్స్ (సి.ఆర్.పి.పి.)

నివేదిక (14 - 18)
"రాజకీయ ఖైదీల హక్కుల దినం"

సంస్మరణ (19 - 23)
గురుశరణ్ సింగ్ స్మృతిలో - డౌన్ మెమొరీ లేన్ - పోరాట రంగస్థలం - వరవరరావు

జ్ఞాపకాలు (24 - 25)
జ్ఞాపకాల దొంతరలు - చలసాని ప్రసాద్

రిపోర్టు (25)
జార్ఖండ్ ప్రజాకళాకారులపై ఉరిశిక్షలకు వ్యతిరేకంగా

వ్యాసం (26 - 33)
తెలుగు సాహిత్య విమర్శ - మార్క్సిస్టు సిద్ధాంత పరికరాలు - కాత్యాయనీ విద్మహే

పాట/కవిత్వం (33 - 53)
పాట పల్లవిస్తది.. ఆట తాండవిస్తది - ఉప్పెన; మాకొద్దీ సీమాంధ్రుల పాలనా... - స్వర్ణమ్మ; మూగ వేణు(వు) - పి. రామకృష్ణ; సాంబశివరావు కవితలు రెండు - గర్వకారణం, సూర్యంగారూ... మీరు లేరూ?; అస్వతంత్ర కుహనా స్వతంత్రులం - భూ సాంబశివరాజు; పాణి కవితలు ఐదు - అబూజ్‌మాడ్, మృత్యువొక గతితర్కం, అలవాటుకొద్దీ..., లోకభాషణం, ఎప్పటికి తీరేను; అరబ్ కవి నిజార్ ఖబ్బానీ కవితలు; జీతన్ - జూలూరు గౌరీశంకర్; ఈ మౌనం కచ్చితంగా యుద్ధనేరమే! - అనామధేయుడు; దాడి - ఎం. రాఘవాచారి

వ్యాసం (54 - 57)
థర్మల్ వెలుగులో శలభాలవుతున్న జనం - నల్లూరి రుక్మిణి

ప్రతిస్పందన (58 - 61)
మో కవిత్వాన్ని ఎలా చూడాలి? - పాణి

కథలు (62 - 75)
కూట్లో రాళ్ళు తీసేటందుకు - వీరబ్రహ్మాచారి;
ఓ పగ్ని కథ - ఎన్.డి.;
జెన్నీ, మకరందరావూ!
- ఎన్. వి. ఎస్. నాగభూషణాచార్యులు

కథనం (75 - 85)
ప్రజాయుద్ధంలో మట్టి వాసనలు - సాధన

పుస్తక సమీక్ష (85 - 89)
నడుస్తున్న చరిత్రకు వ్యాఖ్యానం 'చిలుకలు వాలిన చెట్టు' - కె. నాగేశ్వరాచారి

పుస్తక పరిచయం (90 - 92)
గతితార్కిక భౌతికవాదం - కొడవటిగంటి రోహిణీప్రసాద్

నవల సీరియల్ (93 - 98)
గుమ్మెటమోత
- పాణి

చందాలు, బకాయిలు మనియార్డర్, డి.డి.ల రూపంలో మేనేజర్‌కు పంపించండి.
డి.డి.లను ఎస్. రవికుమార్, ప్రొద్దుటూరు పేర తీయండి.
విడి సంచిక వెల : రు. 10; సంవత్సర చందా : రు. 100; జీవితచందా : రు. 1000

రెండవ కవర్ పేజి : కమిటీ ఫర్ ది రిలీజ్ ఆఫ్ పొలిటికల్ ప్రిజినర్స్ (సి.ఆర్.పి.పి.) ఆధ్వర్యంలో ధర్నా, బహిరంగ సభ దృశ్యాలు, జీతన్ మరాండీ కళాబృందం ఉరిశిక్ష రద్దు కమిటీ ఆధ్వర్యంలో ప్రదర్శన, ధర్నా దృశ్యాలు.
ఫొటోలు : సి.ఆర్.పి.పి. ఎ.పి. కమిటీ, విరసం గుంటూరు యూనిట్.

సంపాదకీయం

ప్రాంతీయ ఉద్యమాలు - తెలంగాణ

- పి.వరలక్ష్మి

తెలంగాణ సకలజనుల సమ్మె మరోసారి దేశం నలుదిక్కులు పిక్కటిల్లేలా తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను చాటి చెప్పింది. అన్ని రోజులూ ప్రభుత్వం సమ్మెనెలా విచ్ఛిన్నం చేయాలని ఆలోచించిందేగాని తానిచ్చిన హామీని నిలబెట్టుకునే ప్రయత్నం చేయలేదు. 9 డిసెంబర్ 2009న చిదంబరం ప్రకటన వెలువడిన వెంటనే దాన్ని వెనక్కు తీసుకోడానికి చేసిన అల్లరితో ప్రారంభమై రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పక్షాలు తెలుగు ప్రజల మధ్య దూరాన్ని పెంచుతూపోయాయి. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఎంత ఆలస్యం అయితే అంతగా ఆ దూరం పెరుగుతూపోతుంది. అది పాలకపక్షాలకు ఎంత ప్రయోజనకరమో పోరహక్కులకు అంత భంగకరం.

వేర్పాటువాదమూ, సమైక్యవాదమూ సరే, ప్రజలమీద మూకుమ్మడిగా పశుబలం ప్రదర్శిస్తున్నపుడు తెలంగాణ అడిగినందుకు తగినశాస్తే జరుగుతోందిలే అని రాష్ట్రంలోని తక్కిన ప్రాంతం వాళ్ళు అనుకుంటున్నారా అని అనుమానించేంత మౌనం నెలకొనింది. విద్యార్థులపై ఎక్కడైనా లాఠీచార్జి జరిగితే యావత్తు విద్యార్థిలోకం రోడ్డుమీదికొస్తుంది. ఇప్పుడు ఉస్మానియా విద్యార్థులను పోలీసులు చితక్కొడితే కోస్తాంధ్ర, రాయలసీమ విద్యార్థులు నిరసన తెలపరు. తెలంగాణకు అనుకూలమేనని ప్రకటించిన రాజకీయపక్షాల విద్యార్థిసంఘాలతో సహా. ఒక్క విద్యార్థులే కాదు, అన్ని సమూహాల పరిస్థితీ ఇదే. తెలంగాణ ఎన్ని పరీక్షలనెదుర్కొంటోందో అది బుద్ధిజీవులకు అన్ని పరీక్షలు పెడుతోంది. పెట్టుబడివర్గాలు రెచ్చగొట్టిన భావోద్వేగాలు కోస్తా, రాయలసీమ ప్రాంతపు బుద్ధిజీవుల్ని ఎంత కార్నర్‌కు నెట్టివేశాయంటే అమెరికా యుద్ధోన్మాదం గురించో, హిందూ మతోన్మాదం గురించో మాట్లాడేందుకు చోటిచ్చిన వేదికలు ఇక్కడ తెలంగాణ ప్రజాస్వామిక ఆకాంక్షకు మద్దతునివ్వడానికి చోటివ్వడం లేదు. దానికనుగుణంగా మేధోవర్గమూ వీలైనంత మౌనం పాటిస్తోంది.

మరోవైపు వర్తమాన రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో తెలంగాణ ఒక సంచలనమైంది. అది ప్రభావితం చేయని రంగం లేదు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి తెలంగాణ విడిపోవాలని కోరుకోవడంలో తమకంటూ ఒక పరిపాలనావ్యవస్థను ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకోవాలన్న ఆకాంక్ష మాత్రమే కాదు. అలా ఏర్పడబోయే రాష్ట్రంలో దళితుల స్థానమేమిటి, ముస్లింల స్థానమేమిటి, సెజ్‌లు, పోలవరంలు వగైరా దోపిడీ అభివృద్ధి పథకాల మాటేమిటన్న ప్రశ్నలూ వాటితాలూకూ ప్రజాస్వామిక ఆకాంక్షలు ప్రత్యేకరాష్ట్ర ఉద్యమబాటలో పెనవేసుకుపోయి నడుస్తున్నాయి. ఒక్క ప్రాంతీయ అసమానతలే కాదు వ్యవస్థ సృష్టించిన అన్నిరకాల వివక్షతలపై గొంతెత్తిన సమూహాలు తెలంగాణ వేదిక కింద జమైనాయి. గత రెండు దశాబ్దాల సామ్రాజ్యవాద నూతన ఆర్థికవిధానాలు అసమానతలను తీవ్రతరం చేశాయి. గ్లోబలైజేషన్ అన్ని దేశీయ ఉత్పత్తి రంగాల నడుములు విరగ్గొడుతూ నిర్వాసితుల్ని పెంచుతూ పోయింది. వీరిలో ఎక్కువమంది ఆదివాసులు, దళితులే. (అది అందించిన నూతన అవకాశాలను అందిపుచ్చుకున్నది అగ్రకులాలవాళ్ళు, బిసిలు.) అనేక సామాజిక ఉద్యమ నిర్మాణాల కిందనున్న ప్రజలకు రాజ్యంపై పోరాడేందుకు ఒక ఉమ్మడి పోరాట వేదిక కావాలి. అది ఇప్పుడు తెలంగాణ అయింది. ఇలా అవడం కూడ యాదృచ్ఛికం కాదు. బ్రిటిష్ పాలనవల్ల కోస్తాప్రాంతంలో అభివృద్ధి చెందిన ఆధునిక బూర్జువావర్గం రాష్ట్రంలోని వనరులపై ఆధిపత్యాన్ని నెలకొల్పుకుంది. అటు చవకగా వనరులు, శ్రమశక్తి పొందడానికి అనువైన ప్రాంతాలు తెలంగాణలో ఉండడం, వాటిని మార్కెట్ చేసుకునేందుకు వాణిజ్యపరంగా అభివృద్ధిచెందిన హైదరాబాద్ ప్రాంతం అక్కడే ఉండడంతో అంతర్గత వలసవాదం అన్ని రంగాల్లో ప్రాంతీయ అసమానతలను తీవ్రతరం చేసింది. పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధికి ఇది అనివార్యం. (అది సామ్రాజ్యవాద దశలో ఎలా బడుగు దేశాలను ప్రకృతి వనరులు కొల్లగొట్టడానికి, చవకగా 'మానవవనరులు' కూడ పొందడానికి ఉపయోగించుకుంటుందో చూస్తూనే ఉన్నాం.) బూర్జువావర్గం రాజకీయాధిపత్యం కోసం ప్రాంతీయ ఉద్యమాలను లేవనెత్తినా వాటిలో ప్రజల ప్రయోజనాలు కలిసే ఉంటాయి కాబట్టి అది విశాల ప్రజారాశుల్ని సమీకరిస్తుంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఉద్యమం కింద వివిధ సమూహాల ప్రజలు సమీకరింపబడడానికి కారణం ఆయా సమూహాల్లో తీవ్రతరమైన సంక్షోభమే. తెలంగాణ సాంస్కృతికోద్యమంలో ఇదికూడ ప్రతిఫలించింది.

దశాబ్దాల ప్రాంతీయ ఆకాంక్షలు, జాతుల ఉద్యమాలు నూతనశక్తులు కూడగట్టుకొని మరింత బలోపేతమై ముందుకువచ్చాయి. తెలంగాణ ఉద్యమం ఊపందుకుంటున్న సమయంలోనే (9 ఫిబ్రవరి, 2011) గూర్ఖాల్యాండ్ కోసం పోలీసు కాల్పుల్లో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. 1980నాటి ఉద్యమం 1200 మంది బలిదానం చేశాక విద్రోహానికి గురై నీరుగారిపోయాక 2008లో ఆత్మగౌరవ పోరాటంగా తిరిగి ఊపిరిపోసుకుంది. ఇక్కడ కూడా ఉద్యమాన్ని చల్లార్చడానికి తాత్కాలిక కౌన్సిళ్లు, త్రైపాక్షిక

చర్చలు-కథ కొత్తదేం కాదు. అయితే చెప్పుకోదగ్గ అంశం ఏంటంటే 30ఏళ్ళు అధికారం నెరిపిన సిపిఎం ఇక్కడ గూర్ఖాల్యాండ్‌ను అసాధ్యం చేసే లక్ష్యంతోనే దేశవ్యాప్తంగా ప్రత్యేకరాష్ట్రాల పట్ల వ్యతిరేక వైఖరితో ఉన్నట్టుగా ప్రవర్తిస్తోంది. నిజానికి ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ గూర్ఖాల్యాండ్‌పై తీర్మానం చేయడమే కాదు, మొట్టమొదట, అంటే స్వాతంత్ర్యం వచ్చిన కొత్తల్లోనే ప్రత్యేక రాష్ట్ర డిమాండ్‌ను వారే బలంగా ముందుకు తీసుకొచ్చారు!

ఆగస్టునెల నుండి మణిపూర్ ప్రాంతీయ ఉద్యమకారుల దిగ్బంధనంలో అట్టుడికిపోతోంది. ఆ ప్రాంతాన్ని భారతదేశానికి కనెక్ట్‌చేసే జాతీయరహదారులు మూసుకుపోయాయి. 27లక్షలమంది నిత్యావసరాలు, మందులు దొరక్క అల్లాడుతున్నారని పత్రికలు రాశాయి. నాగాజాతి ఉద్యమానికి వ్యతిరేకంగా తరాల నుండి బ్రిటిష్, భారత పాలకవర్గాలు ప్రోత్సహించిన కుకీల తిరుగుబాటు రక్తపుటేరును పారించింది. స్వతంత్ర్య నాగాదేశం నుండి స్వయంప్రతిపత్తి, మహానాగాల్యాండ్ రాష్ట్రం దాకా వివిధ స్థాయిల్లో నాగాజాతి ఆకాంక్షలు ఒకవైపు ఉంటే నాగాలు మెజారిటీగా ఉన్న జిల్లాల నుంచి తమ ప్రాంతాలను విడదీసి సదర్ జిల్లాను ఏర్పాటు చేయాలన్న కుకీల డిమాండ్‌ను ఆ రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. జాతుల, తెగల భౌగోళిక అస్తిత్వాలను, ఆకాంక్షలను గుర్తించి గౌరవించాల్సిన ప్రజాస్వామిక వైఖరిని భారతపాలక వర్గం ఏనాడూ అవలంబించలేదు. సాధ్యమైనంతవరకు అది తంపులు పెడుతూపోయింది. తెలుగుప్రజల మధ్య కూడ మంటపెట్టింది.1960ల్లో ప్రారంభమైన బోడో జాతి ఉద్యమం విపరీతమైన అణచివేతను ఎదుర్కుంటోంది. అటానమస్ కౌన్సిల్ వాళ్ళ ఆకాంక్షలు తీర్చలేదు. ప్రభుత్వవైఖరి వల్ల ప్రాంతేతరులపై దాడులదాకా అది పోయింది.

వేలకొద్దీ బలగాల ముందుకు కర్ఫ్యూలను ధిక్కరించడమే పోరాటరూపంగా యువకులు, మహిళలు పెద్ద ఎత్తున కశ్మీరియత్ ఆకాంక్షను చాటుతున్నారు. గ్లోబలైజేషన్ నేపథ్యంలో తమ సార్వభౌమాధికారాన్ని పలుచన చేసుకున్న భారత ప్రభుత్వం ఆర్టికల్ 370 అన్నా, స్వయంప్రతిపత్తి అన్నా ఉలిక్కిపడుతుంది. వందలకొద్దీ సంస్థానాలను విలీనం చేసుకున్న బ్రిటిషిండియాలో, దేశవిభజన, తదనంతరం భారత ప్రభుత్వం విలీనం చేసుకున్న స్వతంత్ర్య సంస్థానాల్లో కశ్మీర్, ఈశాన్య రాష్ట్రాలు, ఆదివాసీ ప్రాంతాలు కేంద్రానికి పెద్ద సవాలుగానే ఉన్నాయి. అధికార మార్పిడి ముందూ, ఆ తర్వాత కూడ జాతి ఆకాంక్షలు నెరవేరింది లేదు, చల్లారింది లేదు. స్వాతంత్ర్యం ప్రకటించిన వెంటనే రాష్ట్రాల పునర్విభజన కోరుతూ ఎన్నో డిమాండ్లు ముందుకొచ్చాయి. దేశం నుండి విడిపోయే హక్కు అలా ఉంచితే దేశంలోనే తమకంటూ ప్రత్యేక అస్తిత్వం కోరుకున్నా అది వేర్పాటువాదమై, అదేదో పెద్ద అపచారంగా చిత్రీకరించబడుతోంది. 2000లో ఏర్పడిన మూడు రాష్ట్రాలు దశాబ్దాల ఉద్యమాల ఫలితమే అయినా వాటి విభజన ఓట్లు, సీట్లు ప్రాతిపదికన జరిగి స్వయంప్రతిపత్తి వంటి భావనల పట్ల ఎలాంటి గౌరవం లేని బి.జె.పి. లాభపడింది. జార్ఖండ్ రాష్ట్రాన్ని ఆదివాసులు కోరుకున్న సంతాల్ పరగణాల ప్రాంతాలతో (బీహార్, మధ్యప్రదేశ్, బెంగాల్, ఒడిశాలలో ఉన్నాయి) ఏర్పరచడం అసాధ్యమని తేల్చింది ప్రభుత్వం.

ఆనాడు ఫజల్‌అలీ నేతృత్వంలోని రాష్ట్రాల పునర్విభజన కమిటీ ప్రతిపాదనలు, ప్రజల అనుమానాలు, అభ్యంతరాలకన్నా బూర్జువావర్గ ప్రయోజనాలకు ప్రాముఖ్యతనిచ్చి రాష్ట్రాల సరిహద్దులు గీశారు. తెలంగాణ గురించి చెప్పిందే చెప్పడం అవుతుంది కాని ఆంధ్ర, తెలంగాణ అసమ అభివృద్ధి దృష్ట్యా కొంతకాలమైనా హైదరాబాదు రాష్ట్రాన్ని వేరుగా ఉంచాలని సూచించిన ఫజల్ అలీ కమిషన్ ఆ దృష్టితోనే నాగ్‌పూర్ రాజధానిగా విదర్భ రాష్ట్ర ప్రతిపాదన చేసింది. కాని 1960లో దాన్ని మహారాష్ట్రలో కలిపేశారు. ఇప్పుడు మహారాష్ట్రలో 70శాతం ఖనిజ సంపద ఉన్న విదర్భ అత్యంత వెనకబడిన ప్రాంతం. ఆకలిచావులకు, రైతుల ఆత్మహత్యలకు ప్రసిద్ధి. ఒక దశాబ్దకాలంలో దేశంలో 32 వేల రైతుల ఆత్మహత్యలు నమోదైతే అందులో 70శాతం వాటా విదర్భది. దానివల్ల 2006లో ప్రభుత్వం విడుదల చేసిన రు 3,750 కోట్ల రిలీఫ్ ప్యాకేజి దేశంలో అతిపెద్ద స్కాముల్లో ఒకటైంది. విదర్భ కోసం రాజీవ్‌గాంధీ ఉన్నప్పుడే వేసిన సంగ్మాకమిటీ ప్రత్యేక రాష్ట్ర డిమాండును బలపరిచింది. అయినా మళ్ళీ ప్రణబ్ ముఖర్జీ కమిటీ వేశారు. అదే కథ. ఇక్కడ శివసేన దేహం ముక్కలైనా రాష్ట్రం ముక్కలు కానివ్వం అని శివాలెత్తుతోంది.

1956లో తెలంగాణను విలీనం చేసినట్లుగానే వింధ్య ప్రాంతాన్ని మధ్యప్రదేశ్‌లో కలిపేశారు. వ్యతిరేకించిన వేలాదిమంది నిరసనకారులను అరెస్టు చేశారు. చాలామంది ప్రాణాలు పోగొట్టుకున్నరు. ఇప్పటికీ ఆకాంక్ష చల్లారలేదు. యథావిధిగా అసమ అభివృద్ధి, వివక్ష. ప్రత్యేక వింధ్యప్రదేశ్ కోసం 2000 మార్చిలో రాష్ట్రశాసన సభ ఏకగ్రీవ తీర్మానం చేసింది కూడ.

దేశవ్యాప్త ట్రెండ్‌గా నడుస్తున్న ప్రాంతీయ ఉద్యమాల నేపథ్యంలో అసమ ఆర్థిక వ్యవస్థతోపాటు ఇండియన్ యూనియన్ స్వభావం అర్థమవుతోంది. అది రాష్ట్రాల సరిహద్దులను అహేతుకంగా గీసి జాతుల, తెగల అభివృద్ధికి గండికొట్టింది. వివిధ సంస్థానాల కింద విభిన్న వ్యక్తిత్వాలను సంతరించుకున్న ప్రాంతాలను స్వేచ్ఛగా ఎదగనియ్యక అన్నిటినీ తన చేతికింద పెట్టుకుని సార్వభౌమాధికారిగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోంది. భిన్నత్వంలో ఏకత్వం అని చెప్తుంటారుగాని భిన్నత్వాన్ని గుర్తించి గౌరవించే స్ఫూర్తే ఉంటే ఇన్ని సమస్యలుండవు. భారత ప్రభుత్వం బ్రిటిష్ పాలకుల విభజించి పాలించే నీతిని, విస్తరణవాదాన్ని, పెట్టుబడిదారీ మార్కెట్ ప్రయోజనాలను పరిరక్షిస్తోంది. ఫెడరల్ వ్యవస్థ లక్ష్యం సాధారణంగా మార్కెట్‌ను, దాంతో ముడిపడిన రాజకీయ అధికారాన్ని (పరిమితంగానైనా) రాష్ట్రాలకు ఇవ్వడమై ఉంటుంది. భారతరాజ్యం ఫెడరల్ స్ఫూర్తి కలిగిలేదని, అన్ని విషయాల్లో అది సార్వభౌమాధికారిగా ఉంటుందనే విమర్శ సహేతుకమైనదే. అది స్థానిక బూర్జువాజీ ప్రయోజనాలకు ఆటంకంగా పరిణమిస్తుంది. వివిధ జాతుల సమాహారంగా ఉన్న

దేశంలో భాషా, సాంస్కృతిక రంగాల్లో కేంద్ర ఆధిపత్యం సెంటిమెంట్‌ను రెచ్చగొడుతుంది. హిందీని జాతీయభాషగా గుర్తించినప్పుడు దక్షిణాదిన ద్రవిడస్థాన్ ఉద్యమం తలెత్తడం ఒక ఉదాహరణ. సమస్య పరిష్కారానికి ఇక్కడ కేంద్ర ప్రభుత్వం అతితెలివిగా హిందీతోపాటు ఇంగ్లీషును అధికారభాషగా గుర్తించడం మర్చిపోకూడదు. తెలుగు ఆత్మగౌరవ నినాదంతో అతి తక్కువ కాలంలో ప్రాంతీయ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రావడమైనా, వివిధ రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు బలపడడమైనా ఆయా ప్రాంతాల్లోని బూర్జువా వర్గాలు కేంద్రంతో తలపడడమే. అయితే వాళ్ళ ప్రయోజనాలు నెరవేరేంతవరకే ఆ ఘర్షణ ఉంటుంది. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాలు కూడ ఒక దశకు చేరుకున్నాక నేతల విద్రోహాలకు గురవ్వడం చూస్తునే ఉన్నాం.

ఏమైనా ప్రాంతీయ పార్టీలు బలపడడంతో జాతీయపార్టీల సార్వభౌమాధికారం సన్నగిల్లుతూ సంకీర్ణ ప్రభుత్వాలు అనివార్యమైన స్థితి వచ్చాక ప్రత్యేక రాష్ట్రాల డిమాండ్లు కేంద్రాన్ని మరింత ఇరకాటన పెడుతున్నాయి. తాజాగా ఉత్తర్‌ప్రదేశ్‌ను నాలుగు రాష్ట్రాలుగా విభజించాలని ఆ రాష్ట్ర అసెంబ్లీ తీర్మానం చేసింది. ఇది ఎన్నికల ఎత్తుగడ అనుకున్నా ఇది బిఎస్‌పి రాజకీయాలను మరోసారి దేశంలో బలంగా ముందుకు తీసుకుపోయింది. 1955లో అంబేద్కర్ ప్రతిపాదనకు ఇది దగ్గరగా ఉండడం కలిసొచ్చే మరొక అంశం. జాతీయ స్థాయిలో పెద్ద రాష్ట్రాల ఆధిపత్యం ఉండకూడదంటూ యుపిని విభజించడం అవసరమని అంబేద్కర్ ఫెడరల్ స్ఫూర్తికి అనుగుణంగా వ్యాఖ్యానించారు. పైగా దశాబ్దాలుగా యుపిని 3, 4 చిన్న రాష్ట్రాలుగా విభజించాలనే డిమాండ్ ఉండనే ఉంది.

ప్రాంతీయ ఉద్యమాలన్నింటిలోనూ చర్చకు వచ్చేది ఆర్థిక అసమానతలే. అయితే ఆర్థిక అసమానతలే ఈ ఉద్యమాలను ప్రేరేపించవు. ఆయా ప్రాంతాల చారిత్రక, సాంస్కృతిక ప్రత్యేకతలు తమకొక ప్రత్యేక అస్తిత్వభావనను కలిగిస్తాయి. ఉద్యమ సన్నివేశంలో ఇది ఇంకా బలంగా వ్యక్తమవుతుంది. తెలంగాణ రాష్ట్ర ఉద్యమం అత్యద్భుత సాంస్కృతిక వ్యక్తీకరణకు దారులు వేసింది. ఉద్యమ నేపథ్యంలో సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో లెక్కలేనన్ని పరిశోధనలు జరిగాయి. సాహిత్య సృజనను లెక్కవెయ్యడమైతే సాధ్యంకాదు. ఆదివాసీ, రైతాంగ సాయుధపోరాటాల నుండి నక్సలైట్ ఉద్యమాల వరకు పోరాటాలతో పెనవేసుకున్న చరిత్ర సాంస్కృతిక రంగాన్ని చాలా ప్రభావితం చేసింది. ఆట, పాట, పోరాటాలకు విడదీయలేని సంబంధాన్ని విప్లవోద్యమం సృష్టించింది. విప్లవోద్యమం గ్రామీణ ఫ్యూడల్ వ్యవస్థను ప్రకంపనలకు గురిచేసి ఉద్యమాలను సమాజపు అట్టడుగు పొరల్లోకి తీసుకెళ్ళింది. ఈ నేపథ్యం ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి కలిసి వచ్చింది. 1969లో విద్యార్థి ఉద్యమంగా మొదలై అనేక దశలగుండా అది సకల జనుల్లోకి వ్యాపించింది.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం భౌగోళిక విభజన ప్రాతిపదికగా నడుస్తున్నా అందులో లోతైన అంశాలు చాలానే ఇమిడి ఉన్నాయి. వేలకొద్దీ సైనిక బలగాలు, హెలికాప్టర్ గస్తీలు చూస్తే కేంద్ర ప్రభుత్వం దీనిని కేవలం ఒక రాష్ట్ర విభజనగా గాక అంతకంటే చాలా గంభీరమైన సమస్యగా చూస్తున్నట్టు అర్థమవుతుంది.

ఇక్కడ మళ్ళీ మొదటికొస్తే నూతన ఆర్థికవిధానాలు పేదలజీవితాలను అతలాకుతలం చేస్తూ వాటివెంట ప్రజలపట్ల విపరీతమైన అణచివేతనూ తీసుకొచ్చాయి. ప్రజల ఆరాటాల, పోరాటాల వేదికలన్నీ ధ్వంసమయ్యాక తెలంగాణ రాష్ట్ర ఉద్యమ నీడన అవి సమీకృతమయ్యాయి. పాలకులు చూపెడుతున్న నక్సలైట్ బూచీ ఒక రకంగా ఇదే కావొచ్చు. అయితే ఉద్యమాన్ని నడిపే శక్తుల సంకుచిత ప్రయోజనాలు ఉద్యమ రూపానికే కాదు, వివిధ శ్రేణుల పోరాటశక్తులు విడుదలవ్వకుండా అనేక పరిమితులు విధిస్తున్నది. విస్థాపన, వనరుల దోపిడి వంటి ముఖ్యమైన సమస్యలపై పోరాటాలు నిర్మించే శ్రద్ధ వారికి లేదు. తెలంగాణ వస్తే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని, భూతలస్వర్గం వస్తుందని భ్రమలు కల్పించడం వల్ల జరుగుతున్న అనర్థాలు అన్నీ ఇన్నీ కావు. ఎన్నికల వరకు భావోద్వేగాలను నిలిపి ఉంచాలని తప్ప వారికి ఏ ప్రణాళికా లేదు. ఆ భావోద్వేగాలు పోరాటరూపాలలో బైటపడే దారులు కనిపించక ఆత్మహత్యల రూపంలో బద్దలవుతున్నాయి. బాధాకరమైన విషయం ఏమంటే అవి త్యాగాలుగా కీర్తించబడు తున్నాయి. కేవలం నిరసన ప్రదర్శనకుగాక ప్రభుత్వాలను ఊపిరాడన్వికుండా చేసే పోరాటాల్లో ప్రజలను సమీకరించి వాటితోపాటే నడిచేలా బూర్జువా నాయకుల మెడలు వంచే ప్రత్యామ్నాయ రాజకీయశక్తులు బలహీనపడిన స్థితి ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తోంది. అందువల్లే ప్రతీఘాతుక, కుహనా ఉద్యమాలు తెలంగాణేతర ప్రాంతాలలో అనేక గందరగోళాలనూ సృష్టించగలుగుతున్నాయి. ఈ స్థితి నుండి బైటపడకపోతే ప్రజాస్వామిక తెలంగాణ, సామాజిక తెలంగాణల మాటేమోగాని అసలు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటే సుదూర స్వప్నమయ్యే ప్రమాదము ఉంది.

మీ రచనలను అరుణతారకు ఈ-మెయిల్ కూడా చేయవచ్చు!

పేజ్‌మేకర్ ఓపెన్ ఫైల్, పి.డి.ఎఫ్. పద్ధతులలో (అను 6.0లో అయితే మేలు),

మైక్రోసాఫ్ట్ వర్డ్, ఎం.ఎస్. భాషాలో కూడా అరుణతారకు మెయిల్ చేయగలరు

ఈ-మెయిల్ ఐ.డి. : arunatara1977@gmail.com

వ్యాసం

తెలంగాణ సకల జనుల సమ్మె...

- సి.ఎస్.ఆర్. ప్రసాద్

సుదీర్ఘ కాలం నుండి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రజా ఉద్యమం సాగుతూ ఉంది. ఉద్యమకారుల మాటల్లోనే చెప్పాలంటే సకల జనుల సమ్మె ఉద్యమానికి పరాకాష్ట అది ఉద్యమ విస్తృతిని, లోతును స్ఫురింపజేసే పోరాట రూపం. బహుశా జాతీయోద్యమ కాలంలో సాగిన సహాయ నిరాకరణోద్యమంతోనూ లేదా ఒక శాసనోల్లంఘన ఉద్యమంతోనూ పోల్చదగిన పోరాట రూపం. సకల జనుల సమ్మెలో భాగంగా జరుగుతూఉన్న ప్రభుత్వోద్యోగుల, టీచర్ల, ఆర్.టి.సి., సింగరేణి కార్మికుల సమ్మెకు కూడా ఒక ప్రత్యేకత ఉంది. ఆర్థిక డిమాండ్లపైన గాక సమాజమంతా కోరుతూ ఉన్న ఒక రాజకీయ డిమాండ్‌పై సమ్మె జరగడం గమనించాల్సిన విషయం. నిజానికి తెలంగాణ రాజకీయ నాయకులు జరుపుతున్న ఉద్యమాల కంటే ఈ సకల జనుల సమ్మెయే తెలంగాణ ప్రజల మనోభావాన్ని యావత్తు దేశానికి బలంగా చాటి చెప్పింది. 'ఎస్మా' లాంటి దుర్మార్గపు చట్టాన్ని అమలు చేస్తామని బెదిరించినా, హైకోర్టు తీరు ప్రకారం సమ్మెలో పాల్గొన్న దినాలకు జీతాలు చెల్లించేది లేదని హెచ్చరించినా, నెల రోజులకు పైగా సాగిన సకల జనుల సమ్మె, దాని ఫలితంగా తెలంగాణ ప్రాంతంలో ఏర్పడిన ప్రతిష్టంభన ఢిల్లీ పాలకులకు తెలంగాణ ప్రజల వాడీ, వేడీ తగిలేలా చేశాయి. మంత్రుల, శాసన సభ్యుల, పార్లమెంట్ సభ్యుల రాజీనామాలు, రాజకీయ నాటకంలో భాగమనే నిజం అందరికన్నా ఎక్కువగా ఢిల్లీ ప్రభువులకు తెలుసు కాబట్టే వాటి కారణంగా అక్కడ కదలికరాలేదు.

రాజీనామాలు ఆమోదించమంటూ పదేపదే ఇటు శాసన సభ స్పీకరును అటు లోకసభ స్పీకరునూ ప్రాధేయపడటం మినహా రాజీనామా చేసిందేమీ లేదు. తాము చేసిన రాజీనామాల పట్ల వాళ్ళకు చిత్తశుద్ధి ఉంటే రాజీనామా చేసిన మరుక్షణం నుండే బాధ్యతల నుండి స్వచ్ఛందంగా వైదొలగి, జీతాలు నిరాకరించి, ప్రభుత్వం ఇచ్చిన బంగాళాలను వదిలిపెట్టి, గన్‌మాన్‌లను నిరాకరించి ప్రజా ఉద్యమంలో భాగస్వాములయ్యేవారు. అలా జరగలేదు సరికదా ఎవరికి వాళ్ళే ప్రాణత్యాగాల నుండి సకల త్యాగాలకూ సిద్ధమేనని పదేపదే వాగ్దానాల వర్షం కురిపించారు. రాజకీయ నాయకుల ఈ దొంగాటను సామాన్య ప్రజలు ఎట్లా అర్థం చేసుకున్నారన్నది ఒక అంశం. కాని తెలంగాణలోని మేధావులు, రచయితలు, కళాకారులు ఈ కోణం నుంచి రాజకీయ నాయకులపై ఒత్తిడి తీసుకురావలసింది.

ఒక విస్తృతమైన స్థాయిలో, ప్రాంతంలో అన్ని ప్రజారాశులతో కూడిన ఒక ఉద్యమం విజయవంతం కావాలంటే అది కేవలం తానెంచుకున్న ఒక రాజకీయ డిమాండ్‌తో మాత్రమే సరిపెట్టుకోక, మానవ జీవన పార్శ్వాలన్నింటిలోనూ ఏదో ఒక కదలికను తీసుకురాగలగాలి. కొత్త విలువలను, కొత్త ఆలోచనాలనూ, కొత్త పోరాట రూపాలనూ సమాజం ముందు ఉంచగలగాలి. అదే ఆ ఉద్యమానికి జవజీవాలనిస్తాయి. సజీవంగా ఉంచుతాయి. సమగ్రతనిస్తాయి. ఉద్యమం పూర్తయ్యే నాటికి అనుకున్న రాజకీయ లక్ష్యాన్ని పూర్తిగా సాధించుకున్నా, పాక్షికంగా సాధించుకున్నా, లేక వైఫల్యం చెందినా ప్రజలకు ఒక కొత్త చూపును, కొత్త ఆలోచనను అందించి వారి చైతన్య స్థాయిని గతంలో కంటే ఉన్నతీకరించడం జరుగుతుంది.

నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా, దొరల రాజకీయ ఆర్థిక, సాంఘిక ఆధిపత్యానికి వ్యతిరేకంగా చరిత్రాత్మక రైతాంగ సాయుధ పోరాటాన్ని నడిపిన వారసత్వం తెలంగాణ ప్రజలది. నక్సల్బరీ నిప్పురవ్వ శ్రీకాకుళంలో చెలరేగి దెబ్బతిన్న తదనంతరం దాని వారసత్వాన్ని అంది పుచ్చుకొని ఒక దావానలాన్ని సృష్టించిన చరిత్ర తెలంగాణ ప్రజలది. నిరంతర చైతన్యీకరణ, పోరాటశీలత, త్యాగనిరతి కలిగిన ప్రజలు కాబట్టే అలాంటి రెండు మహత్తర పోరాటాలలో వాళ్ళు భాగస్వాములయ్యారు. అలాంటి తెలంగాణలో జరుగుతూ ఉన్న ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ఈ పోరాటభావాలు కొంత మేరకైనా ప్రతిఫలిస్తాయని ఆశించడం దురాశ కాదనుకుంటా.

భౌగోళిక తెలంగాణ కాదు, ప్రజాస్వామిక తెలంగాణ, సామాజిక తెలంగాణ - కావాలని ప్రజాతంత్రవాదులు, విప్లవవాదులూ సంస్థలూ, కోరడం సరి అయిందే. అయితే ఈ డిమాండ్‌ను ప్రజల్లోకి తీసుకువెళ్లడంలో, అర్థం చేయించడంలో. ఆ శక్తులు ఏ మేరకు పని చేశాయో ఆలోచించుకోవల్సిన అవసరం ఉంది. దాని కనుగుణమైన డిమాండ్లను బలంగా ముందుకు తీసుకరావడం, పార్లమెంటరీ రాజకీయ నాయకుల దొంగాటల్ని ప్రజల ముందు బహిర్గత పరచడం ఈ శక్తులు చేసి ఉండవలసింది. దానికి సంబంధించిన కొన్ని ఆందోళనా కార్యక్రమాలైనా ఎజెండా మీదకు తీసుకురావల్సి ఉంటుంది.

కోస్తా ఆంధ్ర జిల్లాల సంపన్న వర్గాలు, పెట్టుబడిదారీ వర్గాలు తెలంగాణ ప్రాంతంలో ముఖ్యంగా హైదరాబాద్ నగరంలోనూ దాని చుట్టు పక్కల ప్రాంతాలలోనూ రకరకాల పేర్లతో వేలాది ఎకరాల స్థానిక ప్రజల భూముల్ని కబ్జాచేసి వాళ్లను కూలీలుగా

మార్చారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సందర్భంలో అలాంటి వ్యక్తులు ఆక్రమించుకున్న భూముల్ని స్వాధీనం చేసుకొమ్మని ప్రజాస్వామ్య విప్లవ శక్తులు పిలుపు ఇచ్చి ఉంటే ఉద్యమంలో గుణాత్మకమైన మార్పు వచ్చి ఉండేది. లాంకో రాజగోపాల్, కావూరి సాంబశివరావు, రామోజీ ఫిలింసిటీ - ఇలాంటి కోస్తా వలసవాదుల ఆర్థిక ఆధిపత్య చిహ్నాలైన భూముల్ని ఆస్తుల్ని ప్రజలు ఆక్రమించుకొనేలా చేయగలిగితే, లేదా కనీసం అందుకు తగిన పిలుపు నీయగలిగితే ఉద్యమ తీవ్రత వేరొక విధంగా ఉండేది. ఆదే విధంగా కోస్తా ఆంధ్రా వలసవాదుల ఆర్థిక సాంఘిక ఆధిపత్యాన్ని ప్రశ్నించడానికి, అరికట్టడానికి ఉపయోగపడే ఇతరేతర పద్ధతులు కూడా ఉద్యమంలో భాగం చేయగలిగితే బాగుండేది. సీమాంధ్ర ప్రాంతం నుంచి తెలంగాణ జిల్లాలకు వచ్చే ఆర్‌టిసి బస్ సర్వీసులను అడ్డుకోగలిగారేగాని, ఆ ప్రాంతం నుండి వచ్చే బడా బాబుల ప్రవేట్ సర్వీసులను అడ్డుకొనే ప్రయత్నాలే చేయలేదు. అదే విధంగా ఈ ఆధిపత్య చిహ్నాలుగా తెలంగాణ ప్రాంతంలో ఉండే విలాస వంతమైన హోటళ్లు, ఐమాక్స్ థియేటర్లు, రిసార్టులు, కార్పొరేట్ విద్యా సంస్థల్ని, ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియాను బాయ్‌కాట్ చేయమని పిలుపునిచ్చి ఉంటే ఉద్యమం మరింత అర్థవంతంగా ఉండేది.

సీమాంధ్ర వలసవాదుల దోపిడీ గురించి, పీడన గురించి, ఆధిపత్యం గురించి పదేపదే ఎన్ని వందల ఉపన్యాసాలు చేసినా వాటి మూలాలలోకి వెళ్లి పరిశీలించకపోతే, ప్రశ్నించాల్సిన చోట ప్రశ్నించకపోతే, నిలవరించాల్సిన చోట నిలవరించకపోతే ఉద్యమస్వభావం బూర్జువా స్వభావానికి భిన్నంగా ఉండే అవకాశమే లేదు. ఇది చేయని కారణంగానే ఇంత సుదీర్ఘ కాలం నుండి విస్తృతమైన స్థాయిలో ప్రజాఉద్యమం జరుగుతూ ఉన్నా బాణం ఎక్కు పెట్టబడవలసిన వైపు ఎక్కుబెట్టబడలేదు. దెబ్బతగలాల్సిన చోట తగలలేదు. దీంతో తెలంగాణ ఉద్యమం పూర్తిస్థాయిలో బూర్జువా సమీకరణాలకే పరిమితమైపోయింది.

ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న పార్లమెంటరీ పార్టీలన్నీ కేంద్ర ప్రభుత్వం, నిర్దిష్టంగా సోనియాగాంధీ కటాక్షవీక్షణాలు తమపై ఎప్పుడు ప్రసరిస్తాయా అని, ఆమె నోటి వెంబడి ప్రత్యేక తెలంగాణను ఆమోదిస్తున్నామన్న మాట ఎప్పుడు వెలువడుతుందా అని ఎదురు చూడడంలోనే గడచిపోయింది. పార్లమెంటరీ శక్తులు ఒక దాని నొకటి రాజకీయంగా దెబ్బతీసుకొనే రీతిలోనే పావులు కదిపాయే గాని ప్రజలలోనున్న అసంతృప్తికి, కోపానికి, కసికి సరైన దిశా నిర్దేశం చేయలేకపోయాయి. అలా చేయాలని వాటిని కోరుకోవడం వాటి వర్గ స్వభావాన్ని అర్థం చేసుకోకపోవడమే అవుతుంది.

నిజానికి ఈ బాధ్యత ప్రజాతంత్ర విప్లవ శక్తులది. తెలంగాణ జనసభ ఏర్పడ్డాక తెలంగాణ ప్రాంతీయ సమస్య ప్రబలంగా రంగం మీదికి వచ్చింది. దాని ప్రభావంతో పార్లమెంటరీ శక్తులు కూడా తెలంగాణ ప్రజా ఆకాంక్షను పట్టించుకోవలసి వచ్చింది. అలాంటి విప్లవ ప్రగతిశీల శక్తులు ఈ విడత ఉద్యమంలో చోదక శక్తిగా, ఒక నిర్ణయాత్మక శక్తిగా ఉండి ప్రజా జీవితానికి సంబంధించిన మౌలికమైన డిమాండ్లను, నిజమైన మిలిటెంట్ ప్రజా పోరాట రూపాలను బలంగా ప్రజల ముందుకు తీసుకవచ్చి ఉండాల్సింది. తమ ఎజెండాను ప్రజల ఎజెండాగా మార్చగలిగి, దారి తప్పుతున్న పార్లమెంటరీ రాజకీయ నాయకత్వం మీద అంకుశంలాగ ప్రజల్ని సిద్ధంచేసి ఉండాల్సింది. అయితే ఈ దశలో విప్లవ ప్రజాస్వామికశక్తులు ఒక ప్రాంతీయ ఆందోళనపై, ప్రజా ఆకాంక్షపై తమ అవగాహనను ప్రజల్లోకి తీసుకెళ్లి ఉద్యమ విస్తరణకు దోహదపడాల్సి ఉండింది. ఇదంతా ఆచరణలో ఎంత వరకు సాధ్యమవుతుందనే విషయం ప్రధానం కాదు. కాని ఆ దిశగా ప్రజాతంత్ర విప్లవ శక్తులు సంఘటితంగా, పటిష్టవంతంగా పనిచేయడమే ప్రధానం. అవి అలా ఉద్యమంలో ఒక విలక్షణమైన నూతన ఒరవడిని సృష్టించగలిగితే రాజకీయంగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తదనంతరం అందరూ కోరుకుంటూన్న ప్రజాస్వామిక లేదా సామాజిక తెలంగాణ డిమాండ్‌ను సుసాధ్యం చేసుకోవడానికి అవసరమైన భూమిక ఏర్పడుతుంది.

మార్క్సిజం లెనినిజం మావోయిజం

స్టడీ నోట్స్



వెల : రు. 50/-

న్యూ విస్టాస్ పబ్లికేషన్స్

ప్రతులకు :

మైత్రి బుక్ హౌజ్ విజయవాడ,
దిశ పుస్తక కేంద్రం, హైదరాబాద్, నవోదయ పబ్లిషింగ్ హౌస్,
కాచిగూడ, హైదరాబాద్, సహచర బుక్‌మార్క్, హైదరాబాద్,

కరపత్రం

(నాల్గవ కవర్ తరువాయి....)

మనది అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమని నిత్యం చెప్పుకొనే పాలకవర్గాలు ఒక పార్లమెంటరీ ప్రక్రియను అమలు చేయడానికి సిద్ధం కావడం లేదు. భౌగోళికంగా, పాలనాపరంగా తెలంగాణకు ఒక రాష్ట్ర హోదా కావాలనడం ఈ వ్యవస్థ పరిధిలోని అతి చిన్న కోరిక. ఆంధ్రప్రదేశ్‌లో భాగమైనప్పటి నుంచి కోస్తా దళారీ పెట్టుబడు దారుల నుంచి ఎదుర్కొంటున్న వివక్షకూ, అన్యాయానికీ, వనరుల దోపిడీకీ ప్రత్యేక రాష్ట్రమే పరిష్కారమని తెలంగాణ ప్రజల ఆకాంక్ష. అంతిమంగా ఇవాళ ఇది ఆత్మగౌరవ ఉద్యమంగా కూడా మారిపోయింది.

ఇంత ప్రజాస్వామిక ఆకాంక్షను రెండు ప్రాంతాల ప్రజల మధ్య సమస్యగా, తెలుగు జాతి సమస్యగా కోస్తా, రాయలసీమ దళారీ సంపన్నవర్గాలు దుష్ప్రచారం చేస్తున్నాయి. ఇది ఎంత మాత్రం రెండు ప్రాంతాల ప్రజల సమస్య కాదు. రెండు ప్రాంతాల పంపకాల సమస్య కాదు. తెలంగాణ ప్రాంతీయ రాజకీయ శక్తులు లేవదీసిన ఉద్యమంగా చూడటం వల్ల కోస్తా, రాయలసీమ ప్రాంతాల రాజకీయనాయకులను సంతృప్తిపరచాలని, వాళ్ల ప్రయోజనాలు కూడా నెరవేర్చాలనే దుగ్ధతో కేంద్రం వ్యవహరిస్తోంది. ఆ ప్రాంతాల సంపన్నవర్గాల వాదనలను, తెలంగాణ రాజకీయ శక్తులపై చేస్తున్న ఆరోపణలను పట్టించుకొని వారికీ న్యాయం చేయాలనుకోవడం వల్లే తెలంగాణపట్ల న్యాయభావనను ప్రదర్శించలేకపోతోంది. ఇంత పెద్ద ఉద్యమం జరుగుతున్నా మౌనంగా ఉండటమో, అన్యాయమైన పరిష్కారాలను వెతకడమో చేస్తోంది. తెలంగాణ రాష్ట్ర ఆందోళన ప్రజ్వరిల్లినప్పుడల్లా ఏదో ఒక బూర్జువా పార్టీ నేతృత్వం వహించినమాట వాస్తవమే కావచ్చు, తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రయోజనాలున్నట్లే ఆ ప్రాంత బూర్జువావర్గ ప్రయోజనాలు కూడా ఉండవచ్చు, ప్రత్యేక రాష్ట్ర డిమాండ్‌లోనే ఈ పరిమితులు-ప్రత్యేకతలు అంతర్నిహితం కూడా కావచ్చు. అయినా తెలంగాణ ఆకాంక్ష అత్యంత ప్రజాస్వామికమైనది. అందువల్లనే విప్లవోద్యమం, విప్లవ రచయితల సంఘం 1968-69, 1972ల నుంచే విప్లవంలో భాగంగానే ప్రత్యేక తెలంగాణ డిమాండ్‌ను బలపరుస్తూ, పోరాటంలో పాలుపంచుకుంటున్నాయి. న్యాయభావన ఉన్న ప్రజాస్వామిక వాదులు ఏ ప్రాంతీయులైనా తెలంగాణకు సంఘీభావం ప్రకటిస్తున్నారు.

ప్రత్యేక రాష్ట్రమంటేనే భౌగోళికంగా, పాలనాపరంగా రాష్ట్ర ప్రతిపత్తి కల్పించడం. ఇంత వరకు దేశంలో ఏర్పడ్డ రాష్ట్రాలన్నీ అట్లా ఏర్పడ్డవే. రాజ్యాంగ ప్రక్రియ ద్వారా మాత్రమే అది సాధ్యం. అయితే తెలంగాణకు ఉన్న ఉద్యమ సంప్రదాయం వల్ల కొత్తగా ఏర్పడే రాష్ట్రంలో అర్థవంతమైన, మానవీయమైన, ప్రజాస్వామిక సమాజం రూపొందాలనే ఆకాంక్షలు వ్యక్తమవుతున్నాయి. 1960లనాటి ఉద్యమంలో కూడా ఈ ఆలోచనలు ఉన్నాయి. మలి దశ ఉద్యమం ప్రారంభమయ్యేనాటికి తెలంగాణలో ఉజ్వలమైన నూతన ప్రజాస్వామిక ఉద్యమాలు నడుస్తున్నందు వల్ల, ఆ తర్వాత సామాజిక ఉద్యమాలు రంగం మీదికి రావడం వల్ల ప్రజాస్వామిక తెలంగాణ అనీ, సామాజిక తెలంగాణ అనే ఆకాంక్షలు ముందుకు వచ్చాయి. దేశంలో ఏ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో కూడా ఇలాంటి అత్యద్భుతమైన భావ సంఘర్షణ జరగలేదు. జార్ఖండ్ ఏర్పాటు వెనుక లాల్‌ఖండ్ అనే నినాదం ఉద్యమ ప్రాయంలో ఎదగడానికి కూడా అక్కడి విప్లవశక్తుల చైతన్యం, భవిష్యత్ సమాజ దర్శనమే పని చేశాయి. అయినా అక్కడ ఏర్పడింది భౌగోళిక ప్రత్యేక రాష్ట్రమే. దాన్ని లాల్‌ఖండ్‌గా మార్చే విప్లవ వ్యూహాన్ని పోరాట ప్రజలు నిజం చేసే ఆచరణలో నేటికీ కొనసాగు తున్నారు.

ఇలాంటి ప్రత్యేకతల వల్ల ముందుకు వచ్చిన ప్రజాస్వామిక, సామాజిక తెలంగాణ అనే ఆకాంక్షలు భవిష్యత్ నమూనాను ప్రతిబింబిస్తాయి. వాటి స్ఫూర్తిని నిలబెట్టుకుంటూ, ప్రత్యేక భౌగోళిక రాష్ట్రంలో అధికారంలోకి వచ్చే పాలకవర్గాలతో పోరాడి సాధించుకోవలసిన లక్ష్యాలవి. ఈ స్పృహలో కీలకమైన అంశం ప్రభుత్వాలపట్ల అవి సేవ చేస్తున్న కార్పోరేట్ శక్తుల పట్ల పోరాట దృక్పథం. తెలంగాణ రాష్ట్రంలో ప్రయోజనాలు ఈడేర్చుకోవాలని ఆశిస్తున్న పార్లమెంటరీ పార్టీలకు ఈ దృక్పథం ఉండదు. అయినా రాష్ట్ర సాధనలో వాటి పాత్ర గణనీయం. అందుకే తెలంగాణ ప్రజలు అన్ని రాజకీయ పార్టీలను పరిగెత్తిస్తున్నారు. తెలంగాణ గురించి మాట్లాకపోతే పుట్టగతులు ఉండవనే ఎరుక కలిగించడం ప్రజలు సాధించిన విజయం. ఆ వర్గంలోనే ఏదో ఒక పార్టీ రేపు అధికారంలోకి వస్తుంది కాబట్టి వాళ్లు ప్రభుత్వ వ్యతిరేకత వెల్లుబకకుండా సామ్రాజ్యవాద వ్యతిరేకత వెల్లువెత్తకుండా అప్పుడప్పుడూ కాస్త గట్టిగా అరిచి, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను ఇరకాటాన పెట్టి, బెదిరించి, ఒత్తిడి తెచ్చి; ప్రజలు, విద్యార్థులు మిలిటెంట్‌గా వీధుల్లోకి రాకుండా వీలైనంత జాగ్రత్త తీసుకొని ఉద్యమాన్ని నడిపిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ సరేసరి.. టీఆర్ఎస్ అధినాయకత్వమే దీనికి మంచి ఉదాహరణ. ఇదంతా చూస్తుంటే చరిత్ర తెలిసినవాళ్లకు వలసవాద వ్యతిరేక జాతీయోద్యమంలో ఆనాటి కాంగ్రెస్ పార్టీ వ్యవహారం గుర్తుకు రావచ్చు. సరిగ్గా ఆ వర్గానికి చెందిన నేటి తరం నాయకుల్లో ఒక ప్రాంతం వాళ్లు తెలంగాణను దోచుకుతింటూ, ప్రత్యేక రాష్ట్రాన్ని అడ్డుకుంటున్నారు. తెలంగాణ ప్రాంతంలోని వాళ్లు రాష్ట్రం సాధిస్తామని ముందుకొచ్చారు. అయినా సరే రాష్ట్ర డిమాండ్ స్వభావం రీత్యా తెలంగాణలోని పాలకవర్గ శక్తులపై ప్రజలు ఒత్తిడి తెస్తున్నారు. దాంతో వారికి రాజీనామాలు, ఢిల్లీ రాయబారాలు, అడపాదడపా బెదిరింపులు తప్పడం లేదు. తెలంగాణ సాధనలో తమ ప్రయోజనాలు కూడా ఉన్నందు వల్ల ఉద్యమాలకు దిగినా వారి వర్గ స్వభావం వల్ల పొరపాటున కూడా ప్రభుత్వ, సామ్రాజ్యవాద వ్యతిరేకతలను పెంచడం లేదు.

ప్రస్తుతం జరుగుతున్న సకల జనుల సమ్మెను మరింత ఉధృతం చేసి తెలంగాణ సాధించుకోవాలన్నా, దేశంలో మరే ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డప్పటికంటే చాలా భిన్నమైన ప్రస్తుత సందర్భాన్ని అర్థం చేసుకోవాలన్నా, రేపొద్దున ఏర్పడబోయే తెలంగాణ రాష్ట్రాన్ని అర్థవంతమైన సమాజంగా తీర్చిదిద్దుకోవాలన్నా తప్పక ప్రభుత్వ వ్యతిరేకత, సామ్రాజ్యవాద వ్యతిరేకత ఇనుమడించాల్సి ఉన్నది. ఈ సంగతిని తెలంగాణ ప్రాంతీయ పాలక శక్తులు గుర్తించగలవా?

సందేహమే. తెలంగాణ ఉద్యమంపై అమలువుతున్న నిర్బంధాన్ని అర్థం చేసుకోకుంటే ఈ విషయం సులభంగానే తెలుస్తుంది. కానీ ప్రజలను రెచ్చగొట్టే ప్రసంగాలకు, రేపోమాపో తెలంగాణ వచ్చేస్తోందని గడువులతో కూడిన ప్రకటనలకు, ప్రజాందోళన క్రియాశీలం కాకుండా ముందస్తు అతి జాగ్రత్తలకు పరిమితమైన తెలంగాణ రాజకీయ నాయకులు ప్రభుత్వం పట్ల కార్పోరేట్ శక్తుల పట్ల ప్రజా వ్యతిరేకతను చాటడానికి సిద్ధం కారు. ఈ పని ఎంత కష్టమైనా, నిష్ఠూరమైనా ప్రజాస్వామిక, సామాజిక శక్తులే చేయాల్సి ఉంది.

తెలంగాణ ఉద్యమంపై నిర్బంధాన్ని ప్రయోగిస్తూ, రాజ్యాంగబద్ధ ఆకాంక్ష కూడా సాకారం కాకుండా అడ్డుకుంటున్న భారత పాలకవర్గం దేశవ్యాప్తంగా ప్రజలపై అనేక రూపాల్లో నిర్బంధాన్ని ప్రయోగిస్తోంది. అణచివేత, దోపిడీ అనేవి గ్లోబల్ దృగ్విషయంగా మారిన ఈ తరుణంలో ఎక్కడికక్కడ స్థానిక ప్రజలపై హింసా రూపాలు పెచ్చరిల్లిపోయాయి. రాజ్యాంగబద్ధ ఆకాంక్షను సైతం వమ్ము చేస్తున్న పాలకవర్గం రాజ్యాంగం ఆధారంగానే ప్రజలను నేరస్తులను చేస్తోంది. ప్రజల తరపున నిలిచినవారిపై తీవ్రవాదులనే ముద్ర వేసి నిషిద్ధ మానవులుగా ప్రకటిస్తోంది. వారి కార్యకలాపాలను అతివాద చర్యలుగా, దేశ ఆంతరంగిక భద్రతకు ముప్పుగా ప్రచారం చేస్తోంది. ప్రజలపై యుద్ధం చేస్తున్న ప్రభుత్వమే తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను కూడా అడ్డుకుంటున్నదని తెలంగాణ వాదులు తెలుసుకోవలసి ఉన్నది. తెలంగాణ ఉద్యమం నడుస్తున్న ఈ ప్రస్తుత సందర్భాన్ని అర్థం చేసుకోలేకపోతే తెలంగాణ సాధన మరింత కష్టసాధ్యంగా మారిపోతుంది. పైగా ఇంత అద్భుతమైన ప్రజా సంచలనంలోని చైతన్యం అరగొరగానే విజయంలో ప్రతిఫలించే ప్రమాదం ఉంది.

అసమ సమాజంలో అధికారం కోసం అర్రులుసాచే వారెవరైనా అంతిమంగా అసమానతలను, దోపిడీని నిలిపి ఉంచుతారని, తెలంగాణ సాధించుకోవాలన్నా... రేప్పొద్దున ఏర్పడే తెలంగాణను మానవీయ సమాజంగా మార్చుకోవాలన్నా ప్రభుత్వ వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక చైతన్యాం పెంపొందించుకోక తప్పదు. తెలంగాణ వనరులపై కోస్తా, రాయలసీమ దళారీ పెట్టుబడుదారుల పెత్తనం పోవాలనే పోరాటానికి ప్రత్యేక రాష్ట్రం ఒక కచ్చితమైన షరతు మాత్రమే. కానీ తెలంగాణ రాష్ట్రంలో శ్రామిక ప్రజలకు, సామాజికంగా నలిగిపోతున్న సకల జనులకూ ఆ వనరులు దక్కాలని కోరుకునే చైతన్యం తెలంగాణ ప్రజల చారిత్రక సంపద. దాన్ని నిజం చేసుకోవాలంటే ఈ రోజూ, రేపూ ప్రభుత్వాలపట్ల కార్పోరేటు శక్తులపట్ల జాగరూకతతో ఉండాలి. తెలంగాణ సాధన అవసరం గురించి, దాని న్యాయం గురించి ఇప్పటికే తెలంగాణ ఆలోచనాపరులు అద్భుత విశ్లేషణలు ఇచ్చి ఉన్నారు. ప్రభుత్వ వ్యతిరేకత, సామ్రాజ్యవాద వ్యతిరేకత సంతరించుకోమని చెప్పడమొక్కటే విరసం, విప్లవోద్యమం వాటికి అందిస్తున్న చేర్పు. జాతీయోద్యమం కాలంలో పెల్లుబికిన వలసవాద వ్యతిరేకత ఇతర సామాజిక రాజకీయ సమస్యలపై గురిపెట్టే చైతన్యంగా ఎదగకుండా వాయిదా వేయడం వల్ల ఆధునిక భారతదేశ చరిత్రలో ఎంత పెద్ద నష్టం జరిగిందో మర్చిపోరాదు. సుమారు రెండు దశాబ్దాలపాటు జాతీయ జెండాను, భారత జాతీయతను పారవశ్యంగా పొగడటానికి, శృతి మించి వైభవీకరించడానికే సరిపోయింది. ఆ మత్తు నుంచి తేరుకొని చూశాకగాని దేశ వాస్తవ దృశ్యం కనిపించలేదు. వలసవాద వ్యతిరేకత కూడా తాను విధించిన పరిమితుల్లోనే వ్యక్తం కావడానికి జాతీయ కాంగ్రెస్ ఎన్ని ప్రయత్నాలు, కుట్రలు పన్నిందో తెలిసిందే. పైగా ఆ రోజుల్లో సమాంతరంగా టెర్రరిస్టు ఉద్యమాలుగా నింద మోసిన ఉద్యమ ప్రవంతి నుంచి అత్యద్భుతమైన ఆదివాసీ ఉద్యమాలు, సామాజిక ఉద్యమాలు కూడా నడిచాయి. గదర్‌పార్టీ, అనుశీలన్, యుగంతర్ మొదలు భగత్‌సింగ్ నాయకత్వం దాకా సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలు, జ్యోతిబాపూలే, అంబేద్కర్‌ల నాయకత్వంలో సామాజిక న్యాయపోరాటాలు చరిత్రలో నమోదు కావల్సినంతగా కాలేదు. కాంగ్రెస్ ఎత్తుగడలే ఫలించాయి.

ప్రభుత్వ వ్యతిరేకత అనగానే కొందరికి చిరాకు కలగవచ్చు. ఇదేదో విప్లవ కార్యక్రమం అని పొరబడవచ్చు. అదేమీ కాదు. తెలంగాణ సాధన కోసం సాయుధ పోరాటం చేయనవసరం లేదు కాబట్టే విప్లవోద్యమం కూడా పార్లమెంట్‌లో బిల్లు పెట్టాలనే డిమాండ్ చేస్తోంది. తెలంగాణ ఏర్పడ్డాక రాష్ట్రం ఎలా ఉండాలనే విషయంలో ఆ ప్రాంత పాలక వర్గాలకు ఏదో ఒక నమూనా ఉన్నట్లే విప్లవకారులకు కూడా ఒక నమూనా ఉంటుంది. ఆ వివరాలు ఇప్పుడు అవసరం లేకపోయినా తెలంగాణ సాధన అంటేనే కేంద్రంలో అధికారంలో ఉన్న పాలక శక్తుల వ్యతిరేక కార్యక్రమం. కోస్తా, రాయలసీమ పాలకవర్గాల వ్యతిరేక కార్యక్రమం. ఇంత అద్భుతమైన ప్రజా సంచలనానికి తెలంగాణ సాధనే పరమ లక్ష్యమైనా అది సజీవంగా నిలబడాలన్నా, ఈ రోజా రేపూ పోరాట ప్రజలకు స్ఫూర్తి ఇవ్వాలన్నా, కనీసం తెలంగాణ ప్రజల పరంపరాగత పోరాట తత్వం రగులుతూ ఉండాలన్నా, రేపటి తెలంగాణ గురించిన స్వప్నాలు పగటి కలలుగా ఆవిరైపోకుండా నిలబడాలన్నా ప్రభుత్వ వ్యతిరేకత, సామ్రాజ్యవాద వ్యతిరేకత మరింత ఇనుమడించాలి. ప్రస్తుత పోరాటం వరకే పరిమితమైనా... తెలంగాణ రాష్ట్ర సాధనలో ఎన్ని చిక్కుముళ్లను కేంద్రం వేయదల్చుకున్నదో చూచాయగా తెలుస్తూనే ఉన్నది. హైదరాబాదు కేంద్రపాలిత ప్రాంతమనీ, రాయల తెలంగాణ అనే ఆలోచనలు రేప్పొద్దున ప్రతిపాదనలుగా ముందుకు వస్తే తెలంగాణ కాంగ్రెస్, టీఆర్ఎస్ ఎక్కడో ఒక చోట రాజీపడే ప్రమాదం కూడా ఉంది. వచ్చినవరకే చాలనే వైఖరి తీసుకున్నా ఆశ్చర్యపోనక్కర లేదు. ఆ వర్గానికి మేలు జరిగే అవకాశం ఉంటే అక్కడితో ఉద్యమాన్ని ముగించవచ్చు. . కాబట హైదరాబాదు కేంద్రంగా తెలంగాణను సాధించుకోవాలంటే ప్రభుత్వ వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక చైతన్యంతో పోరాడాల్సి ఉంది. అది తెలంగాణ సాధనకేకాక, ఆ రాష్ట్రంలో రాజ్యాంగబద్ధ సంస్కరణలు సాధించి, కొంచెం మెరుగైన జీవితం దక్కాలన్నా ప్రభుత్వంపట్ల అప్రమత్తంగా ఉండక తప్పదు.

- విప్లవ రచయితల సంఘం

కరపత్రం

రాజకీయ ఖైదీల హక్కుల కోసం, వారి బేషరతు విడుదలను కోరుతూ ఐక్యంగా ఉద్యమిద్దాం!

మునుపెన్నటి కంటే కూడా మరింత సంఘటితంగాను, దీక్షతోనూ రాజకీయ ఖైదీలు ఉద్యమించాల్సిన పరిస్థితులు, అవసరాలు పెరుగుతున్నాయి. దేశంలో నానాటికీ బలపడుతున్న, విస్తరిస్తున్న విప్లవోద్యమం పైన, వివిధ సామాజిక ప్రజాఉద్యమాలపైన రాజ్యనిర్బంధం రోజురోజుకి పెరిగిపోతుండడమే ఇందుకు కారణం. విప్లవోద్యమ నాయకులు, కార్యకర్తలు, వివిధ ప్రజా ఉద్యమ కార్యకర్తలతో, ఉద్యమించే ప్రజాసమూహాలతో నేడు దేశంలోని వివిధ జైళ్లన్నీ నిండిపోతున్నాయనడం అతిశయోక్తి కాదు. ఈ నేపథ్యంలో ఖైదీల విషయమై దిద్దుబాటు సంస్థలుగానే పనిచేయాల్సిన జైళ్లు హెచ్చు పాళ్లు వారిపాలిట క్రూర నిర్బంధ శిబిరాలుగానే పనిచేస్తున్నాయి. దోపిడీ వర్గాల పాలక రాజకీయ వ్యవస్థ సర్వభ్రష్టత్వానికి లోనైపోయింది. ఈ ప్రజాకంటక రాజకీయ వ్యవస్థను రక్షించడమే ఏకైక లక్ష్యంగా పనిచేస్తున్న పోలీసు, సైనిక వ్యవస్థల గూర్చి చెప్పవలసిన పనే లేదు. కానీ, చట్టరక్షణ, రాజ్యాంగరక్షణ, న్యాయరక్షణలే తన కర్తవ్యంగా చాటుకునే న్యాయవ్యవస్థ సైతం ఈ దారుణ పరిస్థితులు, పరిణామాలలో చురుకుగా జోక్యం చేసుకుని, వాటిని కట్టడి చేసే విషయంలో పరమ ఉదాసీనంగాను, బాధ్యతారాహితంగాను ఉంటోంది.

దేశంలోని ఆదివాసీ నివాస ప్రాంతాలైన అడవులు, కొండలన్నీ అపార ఖనిజసంపదల నిలయాలుగా ఉన్నాయి. వాటిపై కన్నేసిన స్వదేశీ విదేశీ బహుళజాతి కంపెనీలు, వాటికి దాసోహమై పనిచేస్తున్న వివిధ పాలకవర్గ పార్టీలు ప్రభుత్వాలు అడవులు, కొండలనుండి ఆదివాసీ జనసమూహాలను బలప్రయోగంతో తరిమివేయడానికి బాహాటంగానే సిద్ధపడిపోతున్నాయి. 'గ్రీన్‌హంట్ ఆపరేషన్' పేరుతో వారిపై యుద్ధానికే తలపడిపోతున్నాయి. బాధిత ఆదివాసీ ప్రజలు సైతం తమపై సాగుతున్న ఈ అధర్మ యుద్ధాన్ని అంతే తీవ్రంగా ప్రతిఘటిస్తున్నారు. పర్యవసానంగానే బెంగాల్, బీహార్, జార్ఖండ్, చత్తీస్‌ఘడ్, ఒడిశా, మహారాష్ట్ర రాష్ట్రాల్లోని జైళ్లు ఆదివాసీ ప్రజాసమూహాలతో నిండిపోతున్నాయి. ఒడిశా రాష్ట్రంలోని మల్కన్‌గిరి, కొరాపుట్ జిల్లా జైళ్లలోనూ, వివిధ సబ్‌జైళ్లలోనూ 600 కి పైగా అమాయిక ఆదివాసీలు 'మావోయిస్టు' ముద్రలో మగ్గిపోతున్నారు.

ఏళ్లు గడుస్తున్నా కేసుల విచారణలు పూర్తిగాక, బెయిళ్లు సైతం మంజూరు గాక తీవ్ర మనస్తాపానికి గురవుతున్నారు. ఈ స్థితిలో వేలాది ఆదివాసీ కుటుంబాల బతుకులు చిన్నాభిన్నం అయిపోతున్నాయి. ఒడిశాలోని ఆదివాసీ, రాజకీయ ఖైదీల సమస్యల గూర్చి, వారి విడుదల గూర్చి చర్చించడానికి జూలై 17వ తేదీన రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లో సి.ఆర్.పి.పి. రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సదస్సుకు హాజరయ్యేందుకు బయలుదేరిన ఆదివాసీ ఖైదీల బంధువులు శ్రేయోభిలాషులు సుమారు 200 మందిని పార్వతీపురం రైల్వే స్టేషన్‌లో పోలీసులు బలవంతంగా రైలు నుండి దించేసి, క్రూరమైన లాటీచార్జ్‌తో చెదరగొట్టేసారు. వారిలో 12 మందిపై అక్రమ కేసులు బనాయించి కొరపుట్ జైలుకి తరలించారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఉద్యమ సంబంధీకులైన రాజకీయ ఖైదీల సమస్యలు, వేదనలు ఎన్నెన్నో ఉన్నాయి.

విప్లవోద్యమ అభిమానులుగా ఉంటూ బహిరంగ చట్టబద్ధ కళాబృందంగా ఏర్పడి తమ ఆటపాటలతో పీడిత ప్రజల్లో చైతన్యాన్ని రగిలిస్తూ వారికి ఎంతో ప్రేమపాత్రులుగా ఉంటున్న జార్ఖండ్ ఆదివాసీ, దళిత ప్రజాకళాకారులు జీతన్ మరాండీ, అనిల్‌రాం, మనోజ్‌రాజ్వర్, చత్రపతి మండల్‌లకు జార్ఖండ్ రాష్ట్రంలోని గిర్డి సెషన్స్‌కోర్టు మరణశిక్ష విధించడం అనేది అత్యంత దారుణమైన చర్య. పై కోర్టులలో ఈ శిక్షే గాని ఖరారైతే అది దేశన్యాయవ్యవస్థకే మాయని మచ్చగా నిలిచిపోతుంది. కనుక వారిపైన మరణశిక్ష రద్దుకే గాక, వారిని నిర్దోషులుగా విడుదల చేయాలని మనం ఉద్యమించాలి.

టెర్రరిజం బూచిని చూపుతూ, సెక్యులరిజం మేలిమసుగులో హిందూ ఫాసిజానికి అన్నిరకాలుగా అండగా నిలుస్తున్న భారతరాజ్యం దేశంలోని ముస్లిం మైనారిటీలను ఏనాడో ద్వితీయశ్రేణి పౌరులుగా దిగజార్చేసింది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని ముస్లిం మైనారిటీల పరిస్థితి మరింత దారుణం అని చెప్పాలి. దేశంలో ఏమూల ఏచిన్న హింసాత్మక ఘటన జరిగినా ఇక్కడ ముస్లింలు ఉలిక్కిపడే స్థితి కొట్టొచ్చినట్లుగా కనబడుతుంది. వందలాదిగా అమాయక ముస్లిం యువత తప్పుడు కేసుల్లో ఇరికించబడి సంవత్సరాలుగా జైళ్లలో మగ్గుతున్నారు. వారిని తక్షణం విడుదల చేయాలని నినదించాలి.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటును కోరుతూ తెలంగాణలోని పల్లెపల్లె గల్లిగల్లి ప్రజలు మొక్కవోని దీక్షతో చేస్తున్న పోరాటం అత్యంత ప్రజాస్వామికమైనది, న్యాయమైనది. ఈ పోరాటాన్ని విచ్ఛిన్నపరచి అణచివేసే దుర్లక్ష్యంతో వందలాది మంది విద్యార్థి పోరాటకారుల్ని, ఇతర ఉద్యమకార్యకర్తల్ని రకరకాల తప్పుడు కేసులతో, అరెస్టులతో వేధించడమనేది తీవ్ర గర్హనీయమైన విషయం. తెలంగాణ

విద్యార్థులు, ఇతర ఉద్యమ కారులపైన కేసులన్నింటిని బేషరతుగా ఉపసంహరించాలిని సి.ఆర్.పి.పి. డిమాండ్ చేస్తోంది.

అన్నింటికి మించి ప్రజల ప్రయోజనాలకోసం ఉన్నతాశయాలతో పోరాడుతున్న రాజకీయ ఖైదీల హక్కుల గూర్చి, వారి విడుదల గూర్చి పోరాడుతున్న సి.ఆర్.పి.పి. కార్యకర్తలు, నేతలపై యు.ఎ.పి.ఎ. లాంటి నల్లచట్టాలను ప్రయోగించి తప్పుడు కేసులు బనాయించడాన్ని నిరసిస్తూ వారిపైని కేసులన్నింటిని తక్షణం ఉపసంహరించాలని సి.ఆర్.పి.పి. డిమాండ్ చేస్తోంది.

అలాగే శ్రీలంకలో తమిళుల విముక్తి లక్ష్యంతో అసమాన త్యాగాలతో పోరాడుతూ ఆక్రమంలో నాటి ప్రధాని రాజీవ్‌గాంధీ నేతృత్వంలోని భారత ప్రభుత్వపు ఇండియన్ పీస్ కీపింగ్ ఫోర్స్ (ఐ.పి.కె.ఎఫ్.) తమిళపోరాటకారులపై జరిపిన మారణకాండను నిరసిస్తూ ఎల్.టి.టి.ఇ. పోరాటకారులు రాజీవ్‌గాంధీని హతమార్చారు. ఆ అభియోగంతో ముగ్గురు ఎల్.టి.టి.ఇ. పోరాటకారులకు భారత అత్యున్నత న్యాయస్థానం విధించిన ఉరిశిక్షను భారత రాష్ట్రపతి ఖరారు చేయడం జరిగింది. ప్రపంచ వ్యాప్తంగా ఉరిశిక్ష వ్యతిరేకోద్యమం బలపడుతున్న నేపథ్యంలో వారిపైన ఉరిశిక్షను రద్దు చేయాలని సి.ఆర్.పి.పి. డిమాండ్ చేస్తుంది.

ఈ అన్యాయాల్ని అణిచివేతను ప్రతిఘటిస్తూ రాజకీయఖైదీలు దీర్ఘకాలిక పోరాటాలకు తలపడాల్సిన అవసరం ఈనాడు ఎంతైనా ఉంది. జైళ్లల్లో ఉంటున్న రాజకీయ ఖైదీలు పోరాడితేనే సరిపోదు, బయట ఉండే వారి కుటుంబాల వారు, వారి మిత్రులు, శ్రేయోభిలాషులు, వివిధ హక్కుల సంఘాలు, ప్రజాసంఘాలు, ప్రజాస్వామికవాదులంతా ముక్తకంఠంతో నినదిస్తూ రాజకీయఖైదీల కోసం, వారి విడుదలకోసం పోరాడాల్సిన అవసరం ఉంది. ఈ అవగాహనతో, ఈ లక్ష్యంతో జరుగుతున్నవే సి.ఆర్.పి.పి. ఆధ్వర్యంలోని 13 సెప్టెంబర్, 2011 నాటి ధర్నా - సభాకార్యక్రమాలు.

తెలుగుగడ్డ మీద వీరోచితం, సంచలనాత్మకం, విజయవంతం అయిన పోరాటాలు నడిపిన చరిత్ర రాజకీయ ఖైదీలకుంది. మహత్తర శ్రీకాకుళ గిరిజన రైతాంగ సాయుధ పోరాట నేపథ్యంలో 1970-71 సంవత్సరాలలో విశాఖ సెంట్రల్ జైలులో నిర్బంధితులుగా ఉండిన నక్సలైట్ ఖైదీలు నాటి ఉద్యమనేతలు మామిడి అప్పలసూరి, కానూసన్యాల్, సొరెన్‌బోస్, చౌదరి తేజేశ్వరరావుల నేతృత్వంలో నిరవధిక నిరాహారదీక్షా కార్యక్రమాన్ని చేపట్టారు. దీక్ష 24 రోజులు ముగిసిన తరువాత ఒకపక్క చాలా కోర్కెలను అంగీకరిస్తూనే ప్రధానకోర్కెలను తిరస్కరిస్తూ రెండోపక్క దీక్షను బలప్రయోగంతో భగ్నంచేసే ప్రయత్నాలు ప్రారంభించింది జైలు యంత్రాంగం. జైలు యంత్రాంగం కుటిల యత్నాలను తిప్పికొడుతూ ఛూటే అప్పారావు, డబ్ల్యూ.ఎస్. రాజు (బూరగాం రాజు) అనే ఇద్దరు ఖైదీలు 63 రోజులు దీక్ష పూనడంతో చివరకు జైలు యంత్రాంగం కోర్కెలన్నింటినీ అంగీకరించడంతో దీక్ష విజయవంతం అయింది. ఇక 1994-95 సంవత్సరాలలో నాటికి చంచల్‌గూడ సెంట్రల్ జైలులో ఖైదీలుగా ఉండిన అప్పటి పీపుల్స్‌వార్ (ఇప్పటి మావోయిస్టు పార్టీ) అమరనేతలు పటేల్ సుధాకరరెడ్డి, శాఖమూరి అప్పారావులతో పాటు ఖైదీగా ఉన్న నేటి సి.పి.ఐ(మావోయిస్టు) కేంద్రకమిటీ సభ్యుడు మోడెం బాలకృష్ణల నేతృత్వంలో సాగిన సుదీర్ఘమైన ఖైదీల పోరాటం విలక్షణమైనది. ఈ పోరాట ప్రత్యేకత ఏమంటే సాధారణ ఖైదీల ముఖ్యమైన డిమాండ్లను సైతం తీసుకుని వాటిపై పోరాడడం. అంతకు మించిన ఈ పోరాటపు మరో ప్రత్యేకత ఏమంటే - ఖైదీల పోరాటానికి బాసటగా బయట నుండి ప్రజాస్వామిక శక్తులు, ప్రజాపక్షపాత మేధావులు, రచయితలు, కళాకారులు పెద్దయెత్తున సమీకరణ కావడం.

ఇలాంటి పోరాట సాంప్రదాయం, చరిత్ర కలిగి ఉంటున్న తెలుగుగడ్డ పైని వివిధ జైళ్లలోని రాజకీయ ఖైదీలంతా మరోసారి మరింత పెద్ద ఎత్తున కదిలి ఉద్యమించాలని, దానికి బాసటగా రాజకీయ ఖైదీల బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు, ప్రజాస్వామికవాదులు, ప్రజారచయితలు, కళాకారులు అంతా కదలిరావాలని, కలిసిరావాలని సి.ఆర్.పి.పి. విజ్ఞప్తి చేస్తోంది. ఈ నేపథ్యంలో తేది. 13-09-2011న జరుప తలపెట్టిన 'ధర్నా' సభా కార్యక్రమాలలో వేలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని సి.ఆర్.పి.పి. విజ్ఞప్తి చేస్తోంది.

డిమాండ్స్ :

1. రాజకీయ ఖైదీలను బేషరతుగా విడుదల చేయాలి. ఉరిశిక్షలను రద్దు చేయాలి.
2. రెమిషన్‌తో 10 సంవత్సరాలు పూర్తయిన జీవితఖైదీలను ఎటువంటి షరతులూ లేకుండా విడుదల చేయాలి.
3. వృద్ధులు, అనారోగ్యంతో ఉన్న రాజకీయ ఖైదీలను వెంటనే విడుదల చేయాలి.
4. జైళ్ళలో మెరుగైన పరిస్థితులు కల్పించాలి.

- కమిటీ ఫర్ ద రిలీజ్ ఆఫ్ పొలిటికల్ ప్రిజినర్స్ (సి.ఆర్.పి.పి.)

ఆంధ్రప్రదేశ్ కమిటీ

11-09-2011

హైదరాబాద్

నివేదిక

కమిటీ ఫర్ ది రిలీజ్ ఆఫ్ పొలిటికల్ ప్రిజనర్స్ ఆధ్వర్యంలో ధర్నా - సభ

భారత స్వాతంత్ర్యోద్యమ కాలంలో లాహోరు సెంట్రల్ జైలులో నిర్బంధించబడిన కామ్రేడ్ భగత్‌సింగ్, అతని సహచరులు తమలాంటి పోరాటకారులను రాజకీయ ఖైదీలుగా గుర్తించాలనీ, యూరోపియన్ జైళ్లలో రాజకీయ ఖైదీలకు కల్పించే సౌకర్యాలను కల్పించాలనీ డిమాండ్ చేస్తూ ఓ పెద్ద రాజకీయ పోరాటం చేసారు. ఆ పోరాటంలో 63 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి 1929, సెప్టెంబరు 13న కామ్రేడ్ జతిన్‌దాస్ అమరుడయ్యాడు. షహీద్ జతిన్‌దాస్ స్మృతిలో సెప్టెంబర్ 13ను 'రాజకీయ ఖైదీల హక్కుల దినం'గా జరుపుకుంటున్న నేపథ్యంలో కమిటీ ఫర్ ది రిలీజ్ ఆఫ్ పొలిటికల్ ప్రిజనర్స్ (సి.ఆర్.పి.పి.) ఆధ్వర్యంలో 13, సెప్టెంబరు 2011న ఇందిరాపార్కు ధర్నా చౌక్, హైదరాబాద్‌లో ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 6.30 గంటల వరకు ధర్నా విజయవంతంగా జరిగింది.

ఈ ధర్నా కార్యక్రమంలో రాజకీయ ఖైదీల కుటుంబ సభ్యులు, ప్రజలు, న్యాయవాదులు, ప్రజాస్వామికవాదులు, వివిధ ప్రజాసంఘాల కార్యకర్తలు - నాయకులు, కళాకారులు, మేధావులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కర్నూలు, అనంతపురం, విశాఖపట్నం, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు, ఆదిలాబాద్, కరీంనగర్, నల్గొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ వివిధ జిల్లాల నుండి రాజకీయ ఖైదీల కుటుంబ సభ్యులు, కమిటీ సభ్యులు 350 మంది హాజరైనారు. ఈ ధర్నా కార్యక్రమానికి సి.ఆర్.పి.పి. ప్రధాన కార్యదర్శి బల్ల రవీంద్రనాథ్ అధ్యక్షత వహించగా, ఖైదీల కుటుంబ సభ్యులు తమ పరిస్థితులు వివరించారు. వక్తలుగా బొజ్జాతారకం, గద్దర్, ఉ.సా., విమల, ప్రొ. హరగోపాల్, గంటి ప్రసాదం, పొత్తూరి వెంకటేశ్వరరావు, వరవరరావు, రత్నమాల, లతీఫ్ మహ్మద్‌ఖాన్, తెలంగాణ అడ్వకేట్స్ జాక్ చైర్మన్ రాజేందర్ రెడ్డి, సి.ఆర్.పి.పి. జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.ఎ.ఆర్. గిలానీలు ప్రసంగించారు. వివిధ ప్రజాసంఘాల నాయకులు రఘునాథ్, ప్రసాద్, పద్మకుమారి, దుడ్డు ప్రభాకర్, వెంకన్న తదితరులు తమ సంఘీభావం తెల్పుతూ సందేశమిచ్చారు. ప్రజాకళామండలి, అరుణోదయ, డప్పు సంస్థల కళాకారులు తమ పాటలతో ఖైదీల సమస్యలు, హక్కులు, పరిష్కారాల గురించి గళం వినిపించి ధర్నా - సభలను విజయవంతం చేసారు.

ధర్నాకు అధ్యక్షత వహించిన కమిటీ ప్రధాన కార్యదర్శి బల్ల రవీంద్రనాథ్ సెప్టెంబరు 13ను రాజకీయ ఖైదీల హక్కుల దినంగా ఎందుకు జరుపుకోవాలో వివరించారు. జతిన్‌దాస్ అమరుడై నేటికి 82 సంవత్సరాలు పూర్తైనా రాజకీయ ఖైదీలుగా గుర్తించాలనే డిమాండ్ అలానే కొనసాగుతోందని, ఇవ్వాళ ప్రభుత్వాలు, రాజకీయ యంత్రాంగాలు కావాలనే రాజకీయ ఖైదీల బేషరతు విడుదల మాట అటుంచి, పనిగట్టుకుని వారికి యావజ్జీవిత శిక్షలు, ఉరిశిక్షలు వేయిస్తున్నాయని, గణేష్ 20 సంవత్సరాల సుదీర్ఘ జీవిత ఖైదు శిక్ష అనుభవించినా, హైకోర్టు విడుదల చేయొచ్చనే ఆర్డరు ఉన్నా, ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా విడుదల కానివ్వడం లేదని, రాజకీయ ఖైదీల విడుదల కోసం ఇక్కడకు వచ్చిన అందరూ వివిధ ప్రజాసంఘాలు, ప్రజలందరూ కలిసికట్టుగా ఒక పెద్ద ప్రజా ఉద్యమం చేయాల్సిన అవసరం నేడు మనముందుందని అభిప్రాయపడ్డారు.

మొదటగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఖైదీల కుటుంబ సభ్యులు మాట్లాడారు. ఛత్తీస్‌గఢ్‌లో జగదల్‌పూర్ జైల్లోమగ్గుతున్న పద్మతల్లి సూర్యకాంతమ్మ మాట్లాడుతూ తన కూతురు ఏ తప్పూ చేయలేదని, ఆడవాళ్ళ సమస్యల గురించి, వాళ్ళ బాధలు పోవాలని పనిచేస్తుంటే అరెస్టు చేసి జైల్లోపెట్టి కేసు కొట్టేసి బయటకు వచ్చాక మళ్ళా జైలు బయటే అరెస్టు చేసి జైల్లోపెట్టి బాధపెడుతున్నారనీ, కోర్టుకు కూడా సరిగా తీసుకెళ్ళడం లేదని చెప్పారు. అక్కడ జైల్లోతన బిడ్డ కోర్టుకు తీసుకెళ్ళేదాకా అన్నం తిననని అన్నం మానేసిందని, ఆరోగ్యం పాడైపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తూ, ఇక్కడున్న పెద్దలందరూ పూనుకుని తన కూతుర్ని విడిపించండని కోరుకున్నారు.

తుంకూరు జైల్లో ఐదున్నర సంవత్సరాలు మైనర్‌గా ఉండి కూడా విడుదలకు నోచుకోకుండా జైల్లో మగ్గిపోతూ ఇటీవల కమిటీ చొరవతో మైనర్ కాజ్‌తో బెయిల్‌పై రిలీజైన అనిల్‌కుమార్ మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రంలోని జైళ్ళ పరిస్థితులు వివరించాడు. అరెస్టు తర్వాత పోలీసులు తమను హింసించి, ఎంత దారుణంగా కొట్టిందీ కోర్టులో మేజిస్ట్రేటుకు వివరించినా ఆ మేజిస్ట్రేటు ఏమాత్రం లెక్క చేయకుండా అదేమంత పెద్ద విషయం కాదులే అని నవ్వి ఊరుకోవడం, ఖైదీలకు న్యాయవ్యవస్థ మీద నమ్మకం పోతోందన్నాడు.

తుంకూరు జైల్లో విచారణగాని, బెయిల్‌గాని లేకుండా మగ్గిపోతున్న ఖైదీల కుటుంబ సభ్యులు జైలు లోపల ఖైదీల పరిస్థితి, బయట తమ కుటుంబాల దుర్భర పరిస్థితులు వివరించారు. ఖైదీ గురుమూర్తి భార్య నాగరత్నమ్మ, ఖైదీ వెంకటేశం తల్లి, కొన్నె ముత్యాలు భార్య ఈశ్వరమ్మ, నారాయణప్ప, నర్సింహులు, ముత్యాలప్ప, నాగభూషణం తదితరులు మాట్లాడారు. వీరందరిదీ

ఒక్కో గాథ. ఆంధ్ర - కర్ణాటక బోర్డర్‌లో శంకర మనహళ్లి రిజర్వ్ పోలీసు అవుట్‌పోస్టు మీద 2004 మావోయిస్టులు చేసిన దాడికి బాధ్యులను చేస్తూ బోర్డర్ గ్రామాల ప్రజల మీద కేసులు పెట్టి జైల్లోపెట్టారు. తుంకూరు - బెంగుళూరు - పావ్‌గఢ్ - చిత్రదుర్గం - బెంగుళూరు - మైసూరు ఇలా వివిధ ప్రాంతాల్లో తిప్పుతూ వారెక్కడున్నదీ కుటుంబ సభ్యులకు తెలీకుండా తీవ్ర మానసిక వేదనకు గురి చేసారు.

'కూలికెళ్తే గాని డబ్బులు రావు ఇంతింత దూరాలు ఎన్నెన్ని సార్లు తిరగాలి సారూ! కష్టపడి డబ్బులు చూసుకుని మేం పోతే కడ్డీల్లోంచి చూపిస్తారు, లేకపోతే, పంపించేస్తారు. 6 నెలల పసిపాపను పెట్టుకుని ఎన్నగచాట్లు పడ్డాను. పాపకిప్పుడు 7 సంవత్సరాలు జైలుకెళ్తే మా నాయన కాదంటాది' అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకుంది ఖైదీ గురుమూర్తి భార్య నాగరత్నమ్మ. కుటుంబాలు ఎలా వీధిన పడ్డాయో, విచ్ఛిన్నమై పోయాయో వింటుంటే చలించని హృదయముండదు. నారాయణప్పకు ముగ్గురు కొడుకులు. ముగ్గురు కొడుకులూ జైల్లో ఉన్నారు. కోడలిపైనా కేసు ఉంది. 'మాకు భూవుంది సామీ కానీ ఎవసాయం చేయాల్సినోడు జైల్లో ఉన్నాడు. నేను ముసలోడ్ని, చాతగాదు, ఏం చేయాలి? ఎవసాయం చేద్దామన్నా వానలు లేవు. నీళ్ళ చుక్కలేదు. చిన్న కొడుకుని పెళ్ళైన ఆర్నెల్లకే పోలీసోల్లు పట్టుకెళ్ళి జైల్లో ఏసారు. చిన్న కోడలు పాపం ఆయమ్మ మాత్రం ఏంచేస్తాది... ఎన్నాళ్ళని చూస్తది... చివరకు ఎళ్ళిపోయినాది. నేనామెని తప్పంట్లేదు...' అని బాధపడ్డాడు.

ఒకే ఇంట్లో ఇద్దరు, ముగ్గురు ఖైదీలున్నారు. నాగభూషణం తమ్ముడు, కొడుకు జైల్లో ఉన్నారు. ముత్యాలప్ప ఇద్దరు కొడుకులు, నాగభూషణం అన్న ఇలా చెప్పుకుంటూపోతే ఎన్నో కథలు. ముత్యాలప్ప మాట్లాడుతూ 'మాకే పాపం తెలీదు సామీ, ఇంటికొచ్చినోళ్ళకు బువ్వ పెట్టడం మాత్రమే తెల్సు. ఏదో నాకుంది ఆకలి గున్నోల్లకి అన్నం పెడతాము. అన్నం పెట్టినందుకు కూడా ఇలా నా కొడుకుని జైల్లో పెట్టి శిక్షించే వ్యవస్థ ఇదేం వ్యవస్థ. ఇటువంటి రాజ్యం నాశనమైపోద్ది' అంటూ రాజ్యం మీద తన కోపాన్ని వెల్లగక్కాడు.

శ్రీరాములు శ్రీనివాస్ తల్లి, పాండురంగారెడ్డి (సాగర్) సహచరి మాధవి, కొండలరెడ్డి సహచరి, రాయపూర్ జైల్లో మగ్గుతున్న మాలతి బిడ్డ స్నేహ, రవిశర్మ తండ్రి సుధాకర శర్మ మాట్లాడారు. సుధాకర శర్మ మాట్లాడుతూ వాళ్ళు వాళ్ళ రాజకీయాలకు అనుగుణంగా పనిచేస్తూ వెళ్ళినారు. రాజ్యానికి అది నచ్చలేదు. కేసులు మీద కేసులు పెడుతూ జైలు నుండి బయటకు రాకుండా అడ్డుపడుతున్నారంటూ రాజ్యం స్వభావం, సమాజ స్థితిగతులు, ఉద్యమాల ప్రభావం, తీరుతెన్నులు, వాటి అవసరం వివరించారు. తన పిల్లలు దూరంగున్నారనే బాధ తప్పించి వాళ్ళు ఒక మంచి పని కోసం, ఉన్నత సమాజ కోసం పనిచేస్తున్నందుకు గర్వపడుతున్నానని, తుంకూరు ఖైదీల బంధువుల ఆవేదన సహజమేనని అంటూ నిరుత్సాహపడవద్దని వారికి ధైర్యం చెప్పారు.

సీనియర్ న్యాయవాది బొజ్జాతారకం మాట్లాడుతూ కేసులు కొట్టేసేం వెళ్ళిపోండి అంటూ జైలు బయటే అరెస్టు చేసి మళ్ళీ కేసులు పెడుతున్నారు. పెట్టేవన్నీ తప్పుడు కేసులే. ప్రభుత్వాలు తాము చేసిన చట్టాలను గౌరవించినా చాలు. చట్టాలు చేస్తూ చట్ట విరుద్ధంగా ప్రవర్తిస్తారు. జడ్జీలను పెడతారు చట్టవిరుద్ధంగా తీర్పులు ఇప్పిస్తారు. అసలు ఈ రాజకీయ ఖైదీలనబడే వాళ్ళు జైలుకెందుకెళ్ళారు. ఏదైనా దొంగతనం చేసి వెళ్ళారా, ఎవరినైనా హత్యచేసి వెళ్ళారా, దారికాచి వెళ్ళారా, ఏం చేసి వెళ్ళారో ఏ ప్రభుత్వాన్నైనా చెప్పమనండి. అఫ్జల్‌గురు పార్లమెంటు మీద దాడి చేసాడంటానికి ఆధారం ఏదైనా ఉందా? సాక్ష్యాలు లేకపోయినా పార్లమెంటు మీద దాడి కాబట్టి ఖచ్చితంగా శిక్ష వేయాలని అఫ్జల్‌కు ఉరిశిక్ష వేసేసారు. అలాగే జార్ఖండ్‌లో ముఖ్యమంత్రి కొడుకును చంపినందుకు ఎవరికీ శిక్ష వేయకపోతే ఎలా? సాక్ష్యం, ఆధారం లేదు, గుర్తుపట్టే వాళ్ళు లేరు. అయినా జీతన్ పేరుతో జితేన్ మరాండి ఉన్నాడు పట్టుకోండి, శిక్షించండి అంటూ ఉరిశిక్ష వేసేసారు. ప్రజా ఉద్యమాల ద్వారా మాత్రమే రాజకీయ ఖైదీల విడుదల సాధ్యం అవుతుంది. రాజకీయ ఖైదీల విడుదల కోసం ఈ కమిటీ చేసే అన్ని కార్యక్రమాల్లో భాగమౌతానని తన సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

గద్దర్ మాట్లాడుతూ ఖైదీల గురించి ఎలాంటి ఉద్యమ రూపం తీసుకోవాలి. రాజకీయ ఖైదీలంటే ఎవరు, సాధారణ ఖైదీలంటే ఎవరు వివరిస్తూ, ఈ ప్రజలందరూ విముక్తి కావాలి అని కోరుకునే వాళ్ళు రాజకీయ ఖైదీలుగా జైల్లో ఉన్నారు. ఈ ప్రజలందర్నీ పీడించుకుతినే వాళ్ళు బయట ఉన్నారు. కాబట్టి ఎవరు జైల్లో ఉండాల్నో వాళ్ళు బయట ఉన్నారు. ఎవరు బయట ఉండాల్నో వాళ్ళు జైల్లో ఉన్నారు. ఏ ప్రజలకోసమైతే వాళ్ళు జైల్లోకెల్లిండ్రో, ఏ ప్రజా ఉద్యమాలు చేస్తూ వాళ్ళు జైల్లోకెల్లిండ్రో వాళ్ళను విడిపించు కోవాలంటే అంత పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు చేస్తే తప్ప వాళ్ళ విడుదల సాధ్యం కాదు. దీనికి అందరూ సంసిద్ధం కావాలి అంటూ, జైళ్ళలో ఉండే పరిస్థితులు, కేసులు, కోర్టులు, విచారణలు గురించి వివరించారు. ఎన్ని చేసినా ప్రజలందరూ రోడ్లమీదికి రాకుండా, కలిసికట్టుగా ఉద్యమించకుండా రాజకీయ ఖైదీల విడుదల సాధ్యం కాదని దీనికోసం వెంటనే అంతా నడుం కట్టాలని పిలుపునిచ్చారు.

ఉ.సా. మాట్లాడుతూ రాజకీయ ఖైదీల బేషరతు విడుదల అనేది రాజకీయంగా సహకారం కావల్సినటువంటిది. రాజకీయంగా ఈ వ్యవస్థను మార్చి మరొక వ్యవస్థను నిర్మించే వరకు ఇలాంటివి జరుగుతూనే ఉంటాయి. ఈ దోపిడీ వర్గ, పాలకవర్గ రాజకీయ శక్తులు వాళ్ళ చేతుల్లో ఉండే కోర్టులు, చట్టాలు, జైళ్ళు వాటి పరిధిలో కూడా చేయదగ్గ ఒక ప్రజాస్వామిక కృషిని చేయడం అవసరం అని అన్నారు. ఒక కమిటీగా ఏర్పడి ఈ కృషి చేయడం అభినందిస్తున్నాను. నేను కూడా ఎమర్జెన్సీ కాలంలో కుట్రకేసులో ముద్దాయిగా జైలులో ఉన్నాను. రాజకీయ ఖైదీలుగా గుర్తించబడాలనే బేసిక్ హక్కే ప్రభుత్వాలు లేదంటున్నాయి.

కుటుంబ సభ్యులు ఏమన్నా ఇబ్బంది పడుతున్నా సామాజిక పరిస్థితులను అర్థం చేసుకుంటూ వారి విడుదల కోసం ప్రజాస్వామిక ఉద్యమంలో భాగమవ్వాలి అన్నారు. జైలు లోపలున్న వారికి బెయిల్స్, ష్యూరిటీల విషయంలో కుటుంబ సభ్యులకు ప్రజాస్వామికవాదులు సహకరించాలనీ, రాజకీయఖైదీల బేషరతు విడుదల కోసం పోరాడాలనీ అన్నారు.

విమల మాట్లాడుతూ పెద్ద పెద్ద నేరాలు చేసే వాళ్ళు బయట స్వేచ్ఛగా తిరుగుతున్నారు. అసలు జైలు పరిస్థితి మనం ఆలోచిస్తే, అణచబడ్డ మనుషుల గురించి ఎవరు మాట్లాడినా, పాట పాడినా, ఆట ఆడినా వాళ్ళందరినీ మూసేయాలని పనిగట్టుకుని ఎక్కడిక్కడ అణచివేయాలనే రాజ్యం కుట్ర స్పష్టంగా కనిపిస్తుంది. అవినీతి మీద దేశం మొత్తం కదిలి ఎలా ముందుకు వస్తుందో, ఆ రకంగా రాజకీయ ఖైదీల విడుదల గురించి సపోర్టు రావాల్సి ఉంది అన్నారు.

తెలంగాణ అడ్వకేట్ జె.ఎ.సి. చైర్మన్ ఎం. రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ అక్రమకేసులు ఎవరిపై పెట్టినా కూడా వాటిని ఖండిస్తూ, వారిని ప్రొటెక్ట్ చేసే బాధ్యత మా న్యాయవాదులపై ఉంది. భారత రాజ్యాంగంలో ఉన్న ఫండమెంటల్ రైట్స్‌ను, హ్యూమన్ రైట్స్‌ను కాపాడాల్సిన బాధ్యత న్యాయవ్యవస్థది. రాజకీయ ఖైదీలకు ఇంటెన్షన్ ఉండదు. క్రిమినల్ కాన్స్పిరసీ ఉండదు. ప్రజాస్వామ్యం కొరకు, ప్రజాస్వామ్య హక్కుల కొరకు కొట్లాడతారేగాని వారి స్వంత లాభానికి ఎక్కడా ఏం చేయరు కాబట్టి కాన్‌స్టిట్యూషనల్ కోర్టు ముందుకు వచ్చి రాజకీయఖైదీలను బేషరతుగా విడుదల చేయాలని ఒక చారిత్రకమైన జడ్జిమెంటు ఇవ్వాలని ఆశిస్తున్నానన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయ ఖైదీలను సంవత్సరాల తరబడి జైల్లో మగ్గిపోయేటట్టు చేస్తున్నాయన్నారు. వారి విడుదల కోసం రాజకీయ నాయకులు కూడా కృషి చేయాలన్నారు.

రత్నమాల మాట్లాడుతూ నిర్బంధానికి వేయి తలల విషనాగు రూపాలుంటాయి. నిర్బంధ రూపాలు కూడా చాలా రకాలు. రాజకీయ ఖైదీలు, ఎన్‌కౌంటర్లు, మిస్సింగులు, నిరంతర కుటుంబాల వేధింపులు... ఇంకా ఎన్నో రూపాలు. మొదట్లో అన్ని నిర్బంధాలకు ఒకే సంఘం ఉండేది. తర్వాత నిర్బంధ రూపాలని బట్టి వాటిని ఎదుర్కోవడానికి ఒక్కో సంఘం అవసరమొచ్చింది. ఆ క్రమంలోనే బూటకపు ఎన్‌కౌంటర్ల వ్యతిరేక కమిటీ, రాజ్య పోషిత హంతక ముఠాల వ్యతిరేక కమిటీ, ఉరిశిక్షల రద్దు కమిటీ... ఇవన్నీ రాజ్యం నిరంకుశమౌతున్న క్రమంలో నిర్బంధం అమలౌతున్న క్రమంలో ఏర్పడ్డాయి. బాధితులు సంఘటితం అవ్వడం, బాధితుల కోసం ఇతరులు పోరాడడం, బాధితులే సంఘటితమై పోరాడడం జరుగుతోంది. బాధితులకు సంబంధించిన విషయాలు ఎంత న్యాయమైనవి, సమంజసమైనవి, ఎంత హేతుబద్ధమైనవి అనేది బయట సమాజానికి తెలియజెప్పాలి. ఈ అంశాలు సమన్వయంతో జోడించుకుని చేయగల్గినప్పుడే మనం ప్రతీదీ, నిరంతరం కొనసాగించగల్గుతాం. ఉరిశిక్షల రద్దు కమిటీని మధ్యలోనే వదిలేసాం. ఆపద్ధర్మంగా మొదలుపెట్టిన దాన్ని ఆపద్ధర్మంగానే వదిలివేయకుండా ఒక పరస్పెక్టివ్‌గా, అవగాహనారీత్యా, రాజకీయ ఆర్థిక చైతన్యంతో ఆ సమస్యను అర్థం చేసుకుంటే నిరంతరం కొనసాగించాల్సిన అవసరాన్ని కూడా మనం బాధ్యతగా నిర్వర్తిస్తామన్నారు.

ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ నేనిక్కడికి వచ్చేముందు టి.వి.లో చూసాను. టెర్రరిస్టులకంటే మావోయిస్టులే ప్రమాదం అని చిదంబరం స్టేట్‌మెంట్ ఇచ్చాడు. అంటే దాన్ని బట్టే చిదంబరం బుర్ర ఎలా పనిచేస్తున్నదీ, రాజకీయ విశ్వాసాల పట్ల ప్రజా రాజకీయాల పట్ల ఒక సామ్రాజ్యవాద ఏజెంటు ఎలా మాట్లాడుతున్నాడో మనం స్పష్టంగా అర్థం చేసుకోవచ్చు. ఈ దేశంలో నలభై ఏళ్ళుగా నిరంతరంగా రాజీ లేకుండా జరుగుతున్న ఒక రాజకీయ పోరాటం, ఉద్యమం మావోయిస్టులది. మావోయిస్టులు 40 ఏళ్ళుగా ఈ దేశంలో ఏమడుగుతున్నారో, వాళ్ళు ప్రాణత్యాగాలు ఎందుకు చేస్తున్నారో అనే విషయం గురించి సమాజం ఆలోచించాల్సిన అవసరం ఉంది. రాజకీయ ఖైదీల గురించి మనం మాట్లాడుకుంటే బయట జరుగుతున్న రాజకీయాల గురించి కూడా మనం మాట్లాడుకోవాల్సి ఉంది. నూట నలభై లక్షల కోట్ల రూపాయల విలువ చేసే మైన్లు బహుళజాతి కంపెనీలు తవ్వుకుపోకుండా అడ్డుపడే మావోయిస్టులు టెర్రరిస్టులు. ఒక మనిషి ఆకలితో ఉండడం అన్యాయం, ఒక మనిషి అణచివేయ బడడం అన్యాయం. మనిషి మనిషిగా బతకాలనీ, ఈ సమాజం అలా లేదనీ అమానవీయంగా, అమానుషంగా ఉందనీ, అసమానతలున్నాయనీ దానికి వ్యతిరేకంగా, స్వేచ్ఛాపూరితమైన సమసమాజం రావాలని భారత భారత స్వాతంత్ర్యోద్యమం అందించిన ఒక విశ్వాసం. ధాని కొనసాగింపుగా భిన్న రాజకీయ ఉద్యమాలు జరుగుతున్నాయి. ఈ దేశంలో రాజకీయ ఖైదీలున్నంత కాలం అంటే, ఈ దేశంలో స్వేచ్ఛ, సమానత్వం, ఒక చైతన్యం ఉన్నట్టే లెక్క. వాళ్ళు జైల్లో ఉన్నా వారు దేన్ని రిప్రెజెంట్ చేస్తున్నారు. విశ్వాసాల కారణంగా మనిషిని జైల్లో పెట్టడం అనేది చరిత్రలో క్షమించరాని తప్పు. ఒక మంచి సమాజం కోసం ప్రాణాలిచ్చే వారిని దేశద్రోహులుగా చూడడం దుర్మార్గం. ఉరిశిక్షలను రద్దు చేయాలి. దీనికి ప్రజల్లో మద్దతు లేదు. ఇప్పుడు మనం రాజకీయ ఖైదీల విడుదల కోసం చేసే పోరాటం చరిత్ర కొనసాగింపు అన్నారు.

మహ్మద్ లతీఫ్ ఖాన్ మాట్లాడుతూ జైళ్ళలో ఉద్యమకారుల పట్ల, ముస్లింల పట్ల వివక్ష చూపిస్తున్నారని జైళ్ళలో ఎన్.ఎక్స్.ఎల్. బారక్ అనీ, ఐ.ఎస్.ఐ. బారక్ అని రాస్తున్నారని అన్నారు. ఖదీర్ అనే కానిస్టేబుల్ ఎ.సి.పి.ని చంపినందుకు 21 సంవత్సరాలుగా జైలులో మగ్గుతున్నాడనీ, రాజకీయ ఖైదీల బేషరతు విడుదల కోసం అన్ని సెక్షన్ల ప్రజలు కలిసి రావాలనీ పిలుపునిచ్చారు.

గంటి ప్రసాదం మాట్లాడుతూ రాజకీయ ఖైదీలంటే ఏంటని పెద్ద చర్చ అక్కర్లేదు. అయితే ఒక చర్చ అవసరం ఉంది. దానికి వేదిక ఇదే. సి.ఆర్.పి.పి.నే కాని సందర్భం ఇది కాదు. సవ్యమైన

అవగాహన అందించాల్సిన బాధ్యత వేదికదే. కొందరు ఆలోచనాపరులు - మేధావులు అసలు రాజకీయ ఖైదీలు, సాధారణ ఖైదీలు అనే వేర్పాటు ఎందుకు? ఖైదీలు - హక్కులు అంటే సరిపోదా అని ఒక చర్చ ఉంది. దీన్నందుకోవాలి. గడిచిన చరిత్ర సమాధానం చెప్పలేదా అంటే సవ్యమైన సమాధానం చెప్పిన చరిత్రతో మనమున్నాం. 1968-89 కాలంలో శ్రీకాకుళ పోరాట కాలంలోనే అంకురార్పణ జరిగింది. ఈ ప్రశ్నకు శోధన, సమాధానాలు అక్కడా ఉన్నాయి. ఇంకా మరింత వివరంగా, మరింత పరిణితితో 1994-95 చంచల్‌గుడ జైలులో జరిగిన రాజకీయ ఖైదీల ఉద్యమం, అందుకు బాసటగా బయటనుండి అందించినటువంటి స్పందన. వాస్తవానికి చట్టం - రాజ్యం పుట్టినప్పటి నుండి ఖైదీలున్నారు, రాజకీయ ఖైదీలున్నారు. 1969 కావచ్చు, 1994-95 కావచ్చు ఇప్పుడు సి.ఆర్.పి.పి. అనేది బలమైన వేదికగా, బలమైన ప్రజా ఉద్యమంగా రాజకీయ ఖైదీల బేషరతు విడుదల - ఖైదీల హక్కుల రక్షణ అన్నటువంటి విషయాల మీద ఉద్యమాన్ని నిర్మించాలి అనే తీరులో ఆలోచిస్తున్నది. అంటే కాంటెక్స్ట్‌తో అర్థం చేసుకోవాలి. సాగుతున్న వర్తమాన స్థితి డిమాండ్ చేస్తోంది అని మనం అర్థం చేసుకోవాలి. కోరాపుట్ జైల్లో సుమారు 576 మంది ఖైదీలలో కేవలం 86 మంది మాత్రమే సాధారణ ఖైదీలు. ప్రజా సమూహాలే జైళ్ళలో ఉంటున్నాయి. ఇటువంటి సందర్భంలో కేవలం జైలు లోపల వాళ్ళు మాత్రమే పోరాడితే సరిపోదు, బయటి సమాజం అందుకోవాలి. సమిష్టిగా ఒక ప్రభంజనంలా ఉద్యమం సాగాల్సిన అవసరం ఉంది. ఆ కర్తవ్యాన్ని మీదేసుకుని పుట్టిందే సి.ఆర్.పి.పి. స్పష్టమైన సమాధానాలు పరిస్థితులే అందిస్తాయి. ఛత్తీస్‌గఢ్, కోరాపుట్ జైళ్ళలో ఉన్న ఆదివాసిలే అందిస్తారు. ఈ కర్తవ్యాన్ని ముందుకు తీసుకెళ్ళాల్సిన బాధ్యత మనందరి మీద ఉంది. సమాజంలో జరుగుతున్న మహా ఉద్యమంలో, అంతర్భాగంలో ఓ లింకు మాత్రమే ఈ వేదిక అని, సమాజంలో మునుపెన్నడూ లేనంతగా ఈనాడు రాజకీయఖైదీల బేషరతు విడుదల కోసం ఉద్యమించాలని అన్నారు.

సి.ఆర్.పి.పి. జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.ఎ.ఆర్. గిలానీ మాట్లాడుతూ, గతంలో భారత ప్రజలు ఈస్టిండియా కంపెనీ దోపిడీ, అణచివేతలకు వ్యతిరేకంగా ఆంగ్లేయులతో పోరాడారు. నేటి మన దేశీయ ఆంగ్లేయులు భారత ప్రజల సంక్షేమం కొరకు కాకుండా బహుళజాతి సంస్థల ప్రయోజనాలకు అనుగుణంగా దేశ సంపదను కొల్లగొడుతున్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి పొలిటికల్ ప్రిజనర్స్ సంఖ్య తగ్గలేదు సరికదా నానాటికీ పెరుగుతోంది. కొత్త కొత్త క్రూర నిర్బంధ చట్టాలను (టాడా, పోటాలాంటివి) రూపొందిస్తూ ప్రజల నిరసన పోరాటాలకు తల ఒగ్గి వాటిని రద్దు చేస్తున్నామంటూ, వాటి స్థానంలో మరింత క్రూర చట్టాలను తెస్తున్నారు. యు.పి.ఎ.ని ప్రభుత్వంలో ఒక పక్క పార్లమెంటులో పోటా రద్దు బిల్లు పెడుతూనే, అదే రోజు అదే సభలో ఉపా అమెండ్‌మెంట్ తీసుకువచ్చారు. పోటా రద్దయినా అదే ఉపాగా కొనసాగుతోంది.

ప్రజల ప్రయోజనాల కోసం, ప్రజల హక్కుల కోసం వాళ్ళ ప్రాణాలను కూడా ఫణంగా పెట్టి పోరాడుతూ అరెస్టయిన వారే పొలిటికల్ ప్రిజనర్స్. జైళ్లలో ఉండే పరిస్థితుల గురించి ఉదయం నుండి అందరూ మాట్లాడుతున్నారు. నాకు తెలుగు భాష రాదు. కాని దుఃఖానికి ఒకటే భాష. నిర్బంధం భాష కూడా ఒకటే. భావోద్వేగాల భాషా ఒకటే. వాళ్ళేం చెప్పారో నేను విన్నాను. దళితులకు, మైనారిటీలకు, విద్య, ఉద్యోగ అవకాశాలలో రిజర్వేషన్స్ దొరకవు కాని జైలులో చోటు మాత్రం వంద శాతం దొరుకుద్ది. అలానే మరణశిక్షలలో కూడా వంద శాతం రిజర్వేషన్‌లుంటాయి. మరణశిక్షను చాలా దేశాలు రద్దు చేసాయి. అది అమానవీయం అని యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీలో తీర్మానం పెట్టి ఉరిశిక్షను రద్దు చేసారు. కాని మన భారత ప్రభుత్వం మాత్రం గుడ్డిగా ఉరిశిక్షలు వేయిస్తోంది. మన న్యాయవ్యవస్థ ఎంత దుర్మార్గంగా గుడ్డిగా ఉరిశిక్షలు వేస్తుందో 3 ఉదాహరణలు చూడొచ్చు.

1. దేవేందర్‌సింగ్ బుల్లార్

ఇతని కన్ఫెషన్ స్టేట్‌మెంట్ మీద ఆధారపడి టాడా కోర్టు ఉరిశిక్ష విధించింది. సుప్రీంకోర్టులో ముగ్గురు న్యాయమూర్తుల బెంచ్‌లో ఇద్దరు న్యాయమూర్తులు శిక్ష వేయగా, ఒకరు రిలీజ్ చేసారు. అంటే ఏ విధమైన సందేహానికి తావివ్వని విధంగా మాత్రమే ఉరిశిక్షవేయాలి అనే కండిషన్ పక్కనబెట్టి ఒకరు ఎటువంటి నేరం చేయలేదని తీర్పిచ్చినా ఉరిశిక్ష విధించారు.

2. పెరావివాలన్

రాజీవ్‌గాంధీ హత్యకేసులో 17 సంవత్సరాల ఇంజనీరింగ్ స్టూడెంట్ అయిన పెరావివాలన్ బ్యాటరీసెల్ కొన్నాడని ఉరిశిక్ష. ఓ 16, 17 సంవత్సరాల అమాయక యువకుడికి ఇటువంటి కారణానికి ఉరిశిక్ష వేస్తారా?

3. అఫ్జల్‌గురు

పార్లమెంటు మీద దాడి కేసులో పోలీసులు చూపెట్టిన సాక్ష్యాధారాలు తప్పుడువనీ, ఫోర్జరీ డాక్యుమెంట్లు అనీ ఢిల్లీ హైకోర్టు అభిప్రాయపడింది. ఢిల్లీ హైకోర్టు అదే కేసులో నేరస్తులుగా ఉన్న ఇతరులను విడుదల చేస్తే సుప్రీంకోర్టు అఫ్జల్‌కు ఉరిశిక్ష ఖరారు చేసింది.

మన మౌలిక ప్రజాస్వామిక హక్కులను రక్షించుకునేందుకు ఇవ్వాళ మనం పోరాడుతున్నాం. ఇది కేవలం రాజకీయ ఖైదీల యుద్ధం కాదు. నీళ్ళ కోసం, భూమి కోసం, అడవి కోసం (జల్ - జంగిల్ - జమీన్) యుద్ధం. మానవ హక్కుల కోసం యుద్ధం. అందరం కల్సి పోరాడాలి - రాజకీయ ఖైదీల విడుదల చేయాలి.

పొత్తూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాజకీయ ఖైదీల విడుదల అనేది నిజానికి ఇవ్వాళ పెద్ద రాజకీయ పక్షాలన్నీ పూనుకుని కృషిచేయవలసినటువంటి ముఖ్యమైన సమస్య. ఏ న్యాయవ్యవస్థ వల్ల ప్రజలకు మేలు జరగాల్సి ఉందో, న్యాయం జరగాల్సి ఉందో ఆ న్యాయవ్యవస్థను, అందుకు సంబంధించిన చట్టాలను రాజకీయ

ప్రయోజనాల కోసం ఎవరైనా వాడుకోవాలని ప్రయత్నం చేస్తే అంతకంటే ప్రజాస్వామ్యానికి మరొక ద్రోహం ఉండదు. రాజకీయ ఖైదీల విషయంలో, యావజ్జీవ ఖైదీల విషయంలో, మరణశిక్ష రద్దు విషయంలో మీరు చేస్తున్నటువంటి ఈ ప్రయత్నానికి ఒక వయోవృద్ధునిగా నా సహకారం అందిస్తానని, నైతికంగా బలపరుస్తానని అన్నారు.

చివరగా వరవరరావు మాట్లాడుతూ జైళ్ళలో ఎన్.ఎక్స్.ఎల్. బారక్, ఐ.ఎస్.ఐ. బారక్ అని పేర్లుంటాయి. ఎన్.ఎక్స్.ఎల్. బారక్ అంటే అది మావోయిస్టులకు, ఉద్యమకారులకు ప్రమాదమేమీ కాదు. వాళ్ళు నక్సలైట్లు అని పిలవడాన్ని ఇష్టపడతారు. ఎందుకంటే నక్సల్‌బరీ గ్రామంలో ఉద్యమం పుట్టింది కాబట్టి. కాని అతి ప్రమాదకరమైన విషయం ఐ.ఎస్.ఐ. ఐ.ఎస్.ఐ అంటే పాకిస్థాన్ గూఢచారి సంస్థకు చెందిన వారని వేరు చేసి ముద్రవేయడం. జైలులో ఉన్న ఖైదీని చూడడానికి అతని తల్లి వచ్చి ఐ.ఎస్.ఐ. ఖైదీ తల్లి అంటే, దేశద్రోహి ఖైదీ తల్లి అని భయంగా చూడడం దుర్మార్గం. చర్లపల్లి జైలులో ఈ బోర్డులను వెంటనే తీసివేయాలి, ఇది దుర్మార్గం, అమానవీయం, చట్ట విరుద్ధం అని మనం ఖండించాలి. నిజానికి సి.ఆర్.పి.పి. వాళ్లు ఈ విషయం మీద, దాని చట్టబద్ధత మీద కోర్టుకు వెళ్ళాలి. దీని కోసం పెద్ద ఉద్యమం నడవాలి. తుంకూరు ఖైదీల బాధలు వింటుంటే, ఇక్కడ ఒక విషయం చెప్పాలి - ఆ కేసులో నేను, గద్దర్ కూడా ముద్దాయిలమే. మమ్మల్ని ఎఫ్.ఐ.ఆర్‌లో పెట్టారు. ఛార్జిషీట్‌లోనూ పెట్టారు. కాని మమ్మల్ని ఇవ్వాళ వరకు అరెస్ట్ చేయలేదు. నేను కూడా ముద్దాయిగా ఉన్న కేసులో మిగతావారు 6 సంవత్సరాల నుండి కనీసం బెయిల్ లేకుండా మగ్గడాన్ని చూస్తుంటే నాకిప్పుడు అనిపిస్తోంది - బహుశా నన్ను అరెస్టు చేసి ఉంటే ఈ కేసు పరిస్థితి ఇలా ఉండేది కాదని. ఇప్పుడు ఆరేళ్ళ తర్వాత సి.ఆర్.పి.పి. చొరవతో కేసు ముందుకు నడుస్తోంది. ఉద్దేశ్యపూర్వకంగా వ్యవస్థ, రాజ్యం ఈ వివక్షను పాటిస్తోంది. సి.ఆర్.పి.పి.లాంటి సంస్థలు ముఖ్యంగా గుర్తుపెట్టుకోవాల్సిన విషయం ఏంటంటే మన న్యాయం అనేది నోరులేని వాడి దగ్గరకెళ్ళాలి. మన న్యాయ సహాయం అనేది చేతులే తప్ప కడుపు నింపుకునే ఆధారం లేని వాడి దగ్గరకెళ్ళాలి. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటకాలం నుంచి ఇవ్వాల్టి వరకు జైలులో ఉండే రాజకీయ ఖైదీల పోరాటం అనేది 80 సంవత్సరాల కమ్యూనిస్టు ఉద్యమం ఫలితంగా ఆంధ్రప్రదేశ్ జైళ్ళకు - వివిధ రాష్ట్రాల జైళ్ళకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని చూపెడుతోంది. 1994-95 పోరాటం ఒక శిఖరాగ్ర పోరాటం. ఇది రెండు సంప్రదాయాలను ముందుకు తెచ్చింది. నైజాం కాలంలో లైఫంటే 6 1/2 సంవత్సరాలకే సత్ప్రవర్తన కారణంగా రిలీజ్ చేసేవారు. 1930ల నుండి 1975 వరకు అలానే కొనసాగింది. కాని ఎమర్జెన్సీలో జలగం వెంగళరావు ప్రభుత్వం మాత్రం లైఫంటే లైఫే అని జీవితఖైదీల విడుదలను ఆపేసింది. 1994-95 సంవత్సరాలలో అమరులు కామ్రేడ్ అప్పారావు, సుధాకరరెడ్డి, ఇప్పుడు ఎ.ఓ.బి. సెక్రటరీగా ఉన్న మోడెం బాలకృష్ణల నేతృత్వంలో చేసిన మహత్తర పోరాటం ఫలితంగా 6 1/2 సంవత్సరాల తర్వాత సత్ప్రవర్తన ఆధారంగా రిలీజ్ చేయడం అనేది పునరుద్ధరించబడింది. అయినా ఇప్పటికీ 20, 21, సంవత్సరాల శిక్ష అనుభవిస్తున్న గణేష్, ఖదీర్‌లు మాత్రం విడుదల కావడం లేదు. వాళ్ళంత సత్ప్రవర్తన కల్గిన ఖైదీలు మరెవరూండరు. మీ రాష్ట్రంలో 7 సంవత్సరాలకు ఎలా రిలీజ్ అవుతున్నారు. అని హజరీబాగ్ జైలు నుండి, వివిధ రాష్ట్రాల నుండి ప్రజలు అడుగుతున్నారు. దీనికి సి.ఆర్.పి.పి. నాయకత్వం వహించాలి. అలాగే సి.ఆర్.పి.పి.యే ముందుండి నాయకత్వం వహించాల్సిన మరో ముఖ్యమైన విషయం ఉరిశిక్షల రద్దు. కోర్టులు తమ వ్యక్తిగత విశ్వాసాల తోటి, జడ్జీలు తమ వ్యక్తిగత అభిప్రాయాలు, ఇష్టాఇష్టాలతోటి తీర్పులిస్తున్నారు. ప్రాణం తీస్తే మళ్ళా ప్రాణం ఇవ్వలేం అని చాలా దేశాలు ఉరిశిక్ష రద్దు చేసాయి. ఇవ్వాళ దేశంలో ఉరిశిక్షలు పడి రద్దయి జైళ్ళలో ఉన్న వాళ్ళంతా దళితులు, అణగారివాళ్ళు, మైనారిటీ, పేద ప్రజలే. రాజ్య స్వభావం అర్థం చేసుకుని రాజకీయ ఖైదీల విడుదల కోసం, ఉరిశిక్షల రద్దు కోసం మనం పోరాడాలి. ఈ అసమాన సమాజంలో ఉరిశిక్షలు విధించే అధికారం ప్రభుత్వాలకు, న్యాయస్థానాలకు లేదని డిమాండ్ చేయాలి. చట్టాలు, కోర్టులు న్యాయం చేస్తాయనుకోవడం భ్రమనే. విశాలమైన ప్రజా ఉద్యమాల ద్వారానే రాజకీయ ఖైదీల విడుదల సాధ్యం అవుతుంది. దీనికి అందరూ కలిసి రావాలి అని పిలుపిచ్చారు.

చందాలు, బకాయిలు మనియార్డర్, డి.డి.ల రూపంలో మేనేజర్‌కు పంపించండి.
డి.డి.లను ఎస్. రవికుమార్, ప్రొద్దుటూరు పేర తీయండి.

అరుణతార చదవండి!
చదివించండి!
చందాదారులు కండి!

విడి సంచిక వెల	:	రు. 10
సంవత్సర చందా	:	రు. 100
జీవితచందా	:	రు. 1000

మేనేజర్ : ఎస్. రవికుమార్

5-1307, దొరసానిపల్లె రోడ్, ప్రొద్దుటూరు, కడప జిల్లా - 516360, సెల్ : 9866021257

సంస్మరణ

గురుశరణ్ సింగ్ స్మృతిలో

డౌన్ మెమొరీ లేన్

పోరాట రంగస్థలం

- వరవరరావు

పంజాబ్‌లో ఫిరోజ్‌పూర్ జిల్లాను 'షహీదోఁకా షహర్' (అమరుల పట్టణం) అంటారు. మనకు అట్లా ఆహ్వానం పలికే పెద్ద పెద్ద బోర్డులుంటాయి. అమృత్‌సర్‌ను అట్లాగే చెప్పవచ్చు. భారత్ పాకిస్తాన్ సరిహద్దు జిల్లాలనన్నిటినీ అట్లాగే చెప్పవచ్చు. ఎందుకంటే పంజాబ్ గుండెల్ని రెండుగా చీల్చి భారత్ పాకిస్తాన్‌లను ఏర్పాటు చేసారు. సరిహద్దు అంతా వేలాది మంది ప్రజల నెత్తుటితో తడిసిందే. ఆ తర్వాత ఏర్పడినవి ఇండియా - పాకిస్తాన్ అందామా భారత్ పాకిస్తాన్ అందామా - హిందీ, ఉర్దూ - ఆ భాషల ప్రభావంలో పిలిచే వాళ్ల వలె హిందుస్తాన్ - పాకిస్తాన్ అందామా - లౌకిక ప్రజాస్వామిక భారత ప్రభుత్వంలోని హిందుత్వ పాలకవర్గాల దృష్టిలో మాత్రం అది హిందుస్తాన్ - పాకిస్తాన్ సరిహద్దు. ఫిరోజ్‌పూర్‌కు పది కిలోమీటర్ల లోపే హుస్సేనీవాలా ఉంటుంది. విప్లవ స్వప్నాలు కనే వాళ్లకు ఇక్కడ సట్లెజ్ నదీ తీరాన మట్టిలో ఇప్పటికీ సుప్తాస్థికల మూలుగుల నుంచి ఇంక్విలాబ్ పుకార్ (పిలుపు) వినొస్తూనే ఉంటుంది - సరుగుడు చెట్ల మీంచి వీచే గాలి సట్లెజ్ నది అలలతో పెట్టే అలనాటి ముచ్చట్ల నుంచి. ఇపుడు కొంచెం సట్లెజ్ నదీ ప్రవాహ గతి మారినట్లున్నది గానీ ఇక్కడే ఒకరోజు ముందుగా మార్చ్ 23, 1933 సాయంత్రం లాహోర్ జైల్ వేదికగా ఉరితీసిన భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌ల మృతదేహాలను జైలు వెనుక గేటు నుంచి తెచ్చి విసిరేసారు బ్రిటిష్ పాలకులు. లాహోర్ జైలు ముందు లక్షలాది మంది గుమిగూడుతున్నారు - మర్నాడు తమ విప్లవ నేతల అమర పార్థివ దేహాలను తీసుకుంటామనే ఆశతో. ఆ స్థలంలో ఇప్పుడు ఈ ముగ్గురు విప్లవ వీరులతోపాటు బటుకేశ్వరదత్ (భగత్‌సింగ్‌తో పాటు పార్లమెంట్‌లో పొగబాంబు వేసి అరెస్టయి యావజ్జీవశిక్ష అనుభవించాడు. 1965లో మరణించాడు. భగత్‌సింగ్ సమాధి దగ్గరే తనను కూడ సమాధి చేయాలని వీలునామా రాసి పోయాడు) స్మారకాన్ని ఇక్కడ నిర్మించారు. ప్రజలు ఈ స్థలాన్ని అమరుల క్షేత్రంగా గుర్తించడం 24 మార్చ్ 1933 నుంచే మొదలయినా ఒక చేదు వాస్తవమేమంటే ఈ స్మారకాన్ని జాతికి అంకితం చేసిన శిలాఫలకాన్ని 1985లో రాజీవ్‌గాంధీ ఆవిష్కరించాడు. వేలాది సిక్కుల ఊచకోతల నెత్తురుటేర్ల చేతులతో, 'హింద్ కరేగా హిందూరాజ్' అనే నినాదంతో రక్తసిక్త పాదాలతో సింహాసనమధిష్ఠించిన ప్రధానిగా ఇక్కడే ఇందిరాగాంధీ పంజాబీ మాతగా పిలిచిన విద్యావతి (భగత్‌సింగ్ తల్లి) సమాధి కూడ ఉంది. ఆమె మాకు భగత్ సింగ్ తల్లియే అంటారు - పంజాబ్ ప్రజలు.

ఇంకొక క్రూర విషాదమేమిటంటే - అమృత్‌సర్ దగ్గర వాఘా సరిహద్దు వలెనే హుస్సేనీవాలా కూడా భారత - పాకిస్తాన్‌లకు సరిహద్దు. రోజూ సాయంత్రం సూర్యాస్తమయ సమయానికి ఈ రెండు చోట్లా ఒక తంతు జరుగుతుంది - అది రెండు దేశాల జాతీయ పతాకాలను దించేయడం - అపుడు మాత్రం ఇటు పోలీసు (సరిహద్దు భద్రతాదళం) అటు, అటు పోలీసు ఇటు వచ్చి సరిహద్దులు చెరిపేసే సూర్యాస్తమయానికి బిగుల్ ఊది సెల్యూట్ చేస్తారు. దీనిని 'సద్భావనా' చర్య అంటారు. ఈ లాంఛనం చూడడానికి ఇరువైపులా ఎదురెదురుగా రెండు దేశాల యాత్రికులు, ప్రజలు కూర్చొని ఉంటారు. రాజ్యం, ప్రభుత్వంగా ప్రజల్లో మాతృదేశం, దేశభక్తి పేరుతో ఎంత విద్వేషాలను రెచ్చగొట్టగలదో అక్కడ నినాదాల్లో పోల్చుకున్నప్పుడు చెవుల్లో విషగాలులు వీచినట్లుగా ఉంటుంది. కర్షక కార్మిక రాజ్యం కోసం సామ్రాజ్యవాద ఉరి కంబాలెక్కిన ఇన్‌ఖిలాబీల ఉరితాళ్లు మన నోట్లో విషవాగురలై వేలాడుతున్నట్లు పేగులు ఘూర్ణిల్లుతాయి. రెండువైపులా పంజాబ్ ప్రజలే. మనుషులే మతాలుగా తల్లిని పంచుకొని మాతృదేశభక్తి మత్తులో పోటీ పడుతుంటారు.

ఈ సంవత్సరం ఒక సహజ మరణం యాదృచ్ఛికంగా మళ్లీ భగత్‌సింగ్ ప్రాసంగికతను ఇనుమడింప చేసింది. దేశమంతా భగత్‌సింగ్ జయంతి జరుపుకునే సెప్టెంబర్ 27న గురుశరణ్ సింగ్ తన 82వ ఏట చండీఘడ్‌లో మరణించాడు. ఆయన చాలాకాలంగా అస్వస్థతతో ఉన్నాడు. ఢిల్లీలో కమిటీ ఫర్ రిలీజ్ ఆఫ్ పొలిటికల్ ప్రిజనర్స్ (సిఆర్‌పిపి - రాజకీయ ఖైదీల విడుదల కమిటీ) అక్టోబర్ 2010లో నిర్వహించిన కాశ్మీర్ ప్రజల స్వయం నిర్ణయాధికార హక్కు (ఆజాదీ - ఒకటే మార్గం) సదస్సుకు ఆ కమిటీ గౌరవాధ్యక్షుడుగా ఆయన తన కూతురు నవశరణ్ ద్వారా వివరమైన ఉత్తేజకరమైన సందేశాన్ని పంపాడు. (అరుంధతీరాయ్ కన్నా విస్పష్టంగా కుండ బద్దలు కొట్టినట్లుగా ఆయన కాశ్మీర్ ప్రజల ఆజాదీ ఆకాంక్షలను సమర్థించాడు. ఒక పంజాబీగా ఆయనకు కాశ్మీర్ స్వతంత్ర చరిత్ర కళ్లముందర కదలాడేదే కాదు, జీలమ్‌నదీ ప్రవాహమంతటి కాలజ్ఞానంతో తెలుసు - పైగా ఆయన గదర్ పార్టీ నుంచి నక్సల్బరీ దాకా తన చైతన్యంలో ఎర్ర జెండాను ఆవిష్కరించుకున్నాడు. తాను శ్రీనగర్‌కు వెళ్లి అక్కడ కాశ్మీర్ జమ్ము కాశ్మీర్ ప్రజలదే అని ప్రకటించే నాటకాన్ని ప్రదర్శిస్తానంటుండేవాడు.)

గురుశరణ్ సింగ్ సిఆర్‌పిపి గౌరవాధ్యక్షుడు మాత్రమేనా? దేశ వ్యాప్తంగా రాజకీయ ఖైదీలను వదలాలని ఏర్పడిన సంఘానికి,

ఉద్యమానికి గౌరవాన్ని, నైతిక రాజకీయ శక్తినిచ్చిన ఒక హక్కుల యోధుడేనా - ఆయనొక వైవిధ్యభరితమైన వ్యక్తిత్వం. నిండు మనిషి

దాదాపు ముప్పై ఏళ్ల వెనక్కు వెళ్తే 1983 అక్టోబర్ నెలలో ఢిల్లీలో ఆల్ ఇండియా లీగ్ ఫర్ రెవల్యూషనరీ కల్చర్ - ఎఐఎల్ఆర్‌సి - (అఖిల భారత విప్లవ సాంస్కృతిక సమితి) ఆవిర్భావ సభ - గురుశరణ్ సింగ్ ప్రారంభోపన్యాసం - కళ్లల్లో దృశ్యమానం అవుతుంది. రెండు గంటలకు పైగా ఒక నాటకం చూసినట్లుగానే. నిలువెత్తు మనిషి - అది ప్రసంగమా - ప్రవాహమా - సంభాషణా - గానమా - నటనా - అన్నీనా - అది అన్ని లలిత కళల సమాహారం. సామ్రాజ్యవాద వ్యతిరేక సాంస్కృతిక సందేశం. హిందీ - ఇంగ్లిష్ భాషల్లో అర్థం చేసుకోగలిగిన వాళ్లయితే ఈ నాటికీ మరిచిపోలేని ఒక ప్రేరణ. ఎంతో స్ఫూర్తిదాయి. సింహం చూపులు. ఎంతో గంభీరమైన స్వరం - మృదువైన పలకరింపు. చండీఘర్ పోయినా, సంగ్రూర్‌లో కలిసినా, ఢిల్లీలో కలిసినా - అదే కామ్రేడరీ - ముప్పై ఏళ్ల అనుబంధం.

గురుశరణ్‌ను ఇంకాస్త విప్పిచెప్పాలంటే 83లో ఢిల్లీలో ప్రారంభ సభకన్నా ముందే సభా స్థలంలో ప్రదర్శించిన - గెడ్డా - స్ట్రీట్ ప్లే కిషన్ చందర్ వ్యంగ్యరచన "తిరిగి వచ్చిన గాడిద"లో బ్రాకెట్ పిచ్చోళ్ల సన్నివేశం ప్రేరణతో యతీంద్ర బరాడా పంజాబీలో 'గెడ్డా' పేరుతో ఒక నాటకాన్ని రూపొందించారు. దీని హిందీ అనుసరణని నిశాంత నాట్యమంచ్ నుక్కడ్ నాటికగా ప్రదర్శించారు. అందాకా వెళ్లని వాళ్లకు 1984 అక్టోబర్‌లో ఆలకూరపాడులో ప్రారంభించి, ముఖ్యంగా ప్రకాశం, గుంటూరు, కృష్ణా జిల్లాల్లో విరసం, రాడికల్స్ ఎన్నోమార్లు ప్రదర్శించిన తెలుగు గెడ్డా, ఢిల్లీలో గెడ్డా చూసిన ఉత్సాహంతో డానీ ఆ రూపాన్ని 1983-89 మధ్యకాలపు తెలుగు సమాజ ఆటుపోట్లను అన్వయించి ఆలకూరపాడులో విరసం ప్రజాకళల వర్క్‌షాపులో రూపొందించి ప్రదర్శించిన స్ట్రీట్‌ప్లే, విరసం సభల్లోను, రాడికల్స్ సభల్లోను, నాగార్జున సాగర్‌లో అణువిద్యుత్ కేంద్రం అడ్డుకున్న ప్రదర్శనల్లో రాడికల్స్ ప్రదర్శించారు. అపుడు డానీ విరసం సభ్యుడు మాత్రమే కాదు - కృష్ణాజిల్లా రాడికల్ యువజన సంఘం కార్యదర్శి కూడా. రాడికల్ విద్యార్థిగా సుధ ఈ స్ట్రీట్‌ప్లేలో ఇందిరాగాంధీ పాత్ర నిర్వహించేది. అమరుడు దివాకర్ కూడా ఆలకూరపాడులో పాల్గొన్నాడు. గెడ్డా అంటే గొయ్యి - రోడ్డు నిర్మాణం చేసే ఆర్ & బి వాళ్లో, నల్లాలు వేసే వాటర్ వర్క్స్ వాళ్లో, విద్యుత్ తీగెలు లాగే ఎలక్ట్రిసిటీ వాళ్లో - ఏదో ఒక ప్రభుత్వ శాఖ అటువంటి 'ప్రజా' ప్రయోజన పనుల కోసం ప్రజలు తిరిగే బాటల్లో ఒక గొయ్యి తవ్వుతారు. ఏ హెచ్చరికలూ ఉండవు - ఏ జాగ్రత్తా చెప్పరు. అటువైపుగా నడిచే బాటసారి ఒకడు అందులో పడిపోయి సహాయం కోసం అరుస్తుంటాడు. ఇక్కడి దాకా ప్రభుత్వమైతే - ఇంక ఇక్కడి నుంచి మన అలసత్వ వ్యవస్థ - అవకాశవాద వ్యవస్థ - స్వార్థ వ్యవస్థ - వివిధ ప్రవృత్తుల వాళ్లు - ఆ గొయ్యి అంచున నిలబడి ఆ అరిచే వ్యక్తి ఎవరై ఉంటారా - అని తమ జ్ఞానం, చైతన్యం, ఊహ ప్రోది చేయగలిగినంత చేసి, తమ ప్రాపంచిక దృక్పథానికి అనుగుణంగా ఒక వ్యాఖ్య చేసి వెళ్లిపోతుంటారు. ప్రజల దగ్గరికి గ్రామాలకే తరలివెళ్లి ప్రజల సమస్యలు, పోరాటాలు పంచుకున్న రాడికల్స్ అట్లా ఉపేక్ష వహించలేరు గదా - చూస్తున్న వాళ్లనూ కూడగట్టి అతనికి చేయూత అందించి - తమ తమ రాజకీయ ప్రయోజనాల కోసం గెడ్డాలో పడిన మనిషి సమస్యను పొలిటికల్ లైజ్ చేస్తున్న ఎన్నికల పార్టీల నోళ్లలో గడ్డిపెట్టి, పాలకుల నడ్డి విరగ్గొట్టే పోరాటానికి ఆయత్తం చేస్తారు.

1978-88 మధ్యకాలంలో ఢిల్లీలో కూడా అశోక్ టంకశాల పూనికవల్ల బలమైన విరసం యూనిట్ పనిచేసింది. ముఖ్యంగా జెఎన్‌యు కేంద్రంగా. అశోక్, రాజు, తిలక్, భీం, సుధ, శారద మొదలయిన వాళ్లంతా జెఎన్‌యులో విద్యార్థులు. పరిశోధనా విద్యార్థులు. బయట ఉద్యోగంలో ఉన్న సుబ్రహ్మణ్యంగారు రావిశాస్త్రి ప్రభావంలో నాటకరంగంలో కృషి చేస్తూ 'బల్లచెక్క' వంటి కథలను స్ట్రీట్ ప్లేలుగా తయారుచేసి తెలుగు నేల మీద విరసం సభల్లో వీళ్లతో ప్రదర్శింపచేస్తుండేవాడు. ఢిల్లీ యూనివర్సిటీలో సురా వీళ్లందరికన్నా ఎక్కువకాలం విరసంతో కొనసాగినవాడు కాని విరసంగా ఆయన కార్యకలాపాలు తరచు ఎపికి రావడం వల్ల కొనసాగినవే. ఎమర్జెన్సీ ఎత్తివేసిన తర్వాత 'జలపాతం' కవితా సంకలనం, కుటుంబరావు గారు చనిపోయాక 1981లో 'భావ విప్లవకారుడు కొ.కు.' ప్రామాణిక విమర్శగా సాహిత్య వ్యాస సంకలనం అశోక్ ఆధ్వర్యంలోనే ఢిల్లీ నుంచి వెలువడినవి. (కొ.కు. శతజయంతి సందర్భంగా ఈ పుస్తకం మళ్లా వెలువడింది. కొ.కు. గురించి వెలువడిన ఏకైక పుస్తకమిదే.)

ఈ నేపథ్యం వల్లనే టంకశాల అశోక్ కన్వీనర్‌గా ఢిల్లీలో ఎఐఎల్ఆర్‌సి ఏర్పాటు సభ చేయాలని అనుకున్నాం. అనుకున్నదే ఆలస్యం విరసం ఏర్పాటులో కూడ కీలక పాత్ర నిర్వహించిన ఐ.వి. సాంబశివరావు, ఎఐఎల్ఆర్‌సి ఆవిర్భావ సభలు ఢిల్లీలో జరపాలన్న నిర్ణయం జరిగిన దగ్గర్నించీ అక్కడ ఉండి, సభల ఏర్పాట్లు, సాహిత్య ప్రచురణలు సమన్వయలో నడుం కట్టుకొని దిగి సభలు విజయవంతం చేయడం వెనుక ఎనలేని కృషి చేసాడు. ఆహ్వాన సంఘం అధ్యక్షుడుగా సర్వేశ్వర్ దయాల్ సక్సేనా పేరును సురా సూచించాడు. ఎమర్జెన్సీ నిర్బంధానికి వ్యతిరేకంగా పియుసిఎల్ అండ్ డిఆర్‌తో మొదట పియుడిఆర్‌తో తర్వాత కలిసి పనిచేసిన సుప్రసిద్ధ హిందీ కవి సర్వేశ్వర్ దయాల్ సక్సేనా. కాని విషాదమేమిటంటే అక్టోబర్ 83లో సభలు జరిగే నాటికే ఆయన మరణించాడు.

కాశ్మీర్‌లో అప్పటికే ఆనందపూర్ సాహెబ్ తీర్మానం అమలు గురించి ప్రారంభమైన మిలిటెంట్ ఉద్యమం, ఖలిస్తాన్ ఉద్యమాలను విస్తృతంగా అధ్యయనం చేసి పత్రికల్లో రాసిన అశోక్ విరసంకు గురుశరణ్‌ను పరిచయం చేసాడు. అట్లా గురుశరణ్‌ను ఎఐఎల్ఆర్‌సి ప్రారంభోపన్యాసానికి ఎంచుకున్నాం. అదొక సాంస్కృతిక పోరాట వాతావరణం. ఒకవైపు జెఎన్‌యులో

విద్యారంగంలో తలెత్తుతున్న నియంతృత్వ ధోరణులకు వ్యతిరేకంగా పోరాడుతున్న విద్యార్థులు రస్టికేట్ అయి ఉన్నారు తిలక్, రఘు మొదలైన వాళ్లు. మరొకవైపు విప్లవ సాహిత్యంపై నిషేధాలు, నిర్బంధాలు. ఆ సభలు 'గెడ్డా', స్ట్రీట్ ప్లే ప్రదర్శనలతో, నిషిద్ధ సాహిత్య ప్రదర్శనతో ప్రారంభమైనాయి.

బాదల్ సర్కార్ ఆధునీకరించిన వీధి నాటకానికి చేరుకోవడాని కన్నా ముందు గురుశరణ్‌సింగ్ చాలా ప్రయాణం చేశాడు. 1956 నాటికి ఆయన భాక్రానంగల్ కట్ట నిర్మాణంలో ఇంజినీరు. నంగల్ దగ్గర ఒక కొండ శిఖరం మీంచి మరొక కొండ శిఖరం మీదికి సట్లెజ్ నది మీదుగా సింహం దూకడాన్ని చూసి ఇక్కడ ఆనకట్ట నిర్మిస్తే - అని ఆలోచన వచ్చి భాక్రానంగల్ నిర్మాణం జరిగిందని చెప్తారు. అదెలా ఉన్నా - నంగల్ దగ్గర నదీ తీరాన - జలాల తరలింపును చూసిన గురుశరణ్ ప్రవాహం వంటి మానవ జీవితాన్ని కూడా ఇట్లా మలుపు తిప్పవచ్చు గదా - అని ఆలోచించాడట. ఇంజినీరు సామాజిక ఇంజినీరు అయ్యే తీరట్లా మొదలయింది. అందుకాయన సాంస్కృతిక మాధ్యమాన్ని ఎంచుకున్నాడు. అందులోనూ - అప్పటికే తనపై గదర్ పార్టీ మొదలు కమ్యూనిస్టు పార్టీ వరకు ప్రభావాలు ఉన్నాయి. ప్రొగ్రెసివ్ రైటర్స్, ఇప్టా (ఇండియన్ పీపుల్స్ థియేటర్ అండ్ ఆర్ట్స్)ల ప్రభావాలు ఉన్నాయి. ముఖ్యంగా బలరాజ్ సాహ్నీ ఆయన అభిమాన నటుడు - సాంస్కృతిక కార్యకర్త. అందుకే ఆ తర్వాత కాలంలో ఆయన బలరాజ్ సాహ్నీ యాద్‌గార్ ప్రకాశన్ - అని ప్రచురణ సంస్థను స్థాపించాడు. ఇపుడది పంజాబ్‌లో పేరెన్నికగన్న ప్రగతి సాహిత్య ప్రచురణ సంస్థ.

విప్లవకరవర్గాల దగ్గరికి విప్లవ సందేశాన్ని తీసుకపోవాలంటే దృశ్య, శ్రవ్య రూపాలను మించిన సాంస్కృతిక సాధనాలు లేవు. అందులోనూ నాటకం సర్వకళల సమాహారం. అందులో మనుషులు సమష్టిగా కేంద్ర స్థావరంలో ఉండి జీవితాన్ని, జీవిత పార్శ్వాలను, వెలుగు నీడలను, ఆశ నిరాశలను, ప్రవాహంలో కొట్టుకపోవడాన్ని, ఎదురీతను పునస్సృజన చేస్తుంటారు. సంస్కృతం, గ్రీకు భాషల్లో, ఆధునిక భాష ఇంగ్లీష్‌లోను క్లాసిక్స్ (కావ్యాల) తో పాటు పుట్టిన నాటకం - ఈ భాషలకున్నా అధికార అణచివేత సంబంధాల వల్ల కావచ్చు జాతీయ భాషలన్నింట్లో కూడా ఆధునిక కాలం వరకు కూడా ఒక సాహిత్య ప్రక్రియగా రూపొందలేదు. అన్ని భారతీయ భాషల్లోనూ కావ్యాలు వెయ్యి రెండు వేల ఏళ్ల క్రితమే లిఖిత రూపాన్ని పొందితే, నాటకం మాత్రం వలస పాలన, విశ్వ విద్యాలయాల ఏర్పాటు తర్వాతనే మొదలయింది. సామాజిక శాస్త్రాల అధ్యయనంలో ఒక సామాజిక ప్రయోజన మాధ్యమంగానే ఆధునిక కాలంలో దృశ్య ప్రదర్శన రూపాలు వచ్చాయి. వాస్తవానికి నాటకమైనా, మరే దృశ్య శ్రవ్య రూపమైనా మానవ జీవితమంత ప్రాచీన రూపాలు.

ఆదిమానవుని నాగరికత వేటలోకి ఎదిగి అడవి పందిని చంపి ఆహారం సాధించిన ఆనందాన్ని సమష్టిగా పంచుకునే సందర్భంలో సంగీతం, చిత్రకళ, శారీరక హావభావాల ఆనందహేలగా నాటకం ఆవిర్భవించాయి. భరతుని నాట్య శాస్త్రం కన్నా ముందే, తన నాట్య శాస్త్రానికి లక్ష్యంగా ఒక నాటకాన్ని రాసి ప్రదర్శించాడనే ప్రతీతి కన్నా ముందే ఆదివాసీ నాటకాలున్నాయి. ప్రదర్శనలున్నాయి. జీవిత చలన సూత్రంతో పాటే మానవుడు సూత్రధారిగా జీవిత ప్రతిఫలన నాటకం ఉంటుంది అని ఊహించడం కొత్త విషయం కాదు. ఉద్దేశపూర్వకంగానే అన్ని సాహిత్య కళా ప్రక్రియలను అణచివేసి లేదా రాజాస్థానాలకు పరిమితం చేసి, శిష్టుల ప్రయోజనాలకు పరిమితం చేసి ప్రజాకళల్ని దురాక్రమించిన భూస్వామ్యం, బ్రాహ్మణీయ భావజాలం నుంచి - భూమిని, వనర్లను, అధికారాన్ని స్వాధీనం చేసుకునే పోరాటం వలెనే భాషను, కళలను, సంస్కృతిని స్వాధీనం చేసుకునే పోరాటాన్ని సృష్టికర్తలు అయిన ప్రజలు చేపట్టాలనేది వేరువేరు రూపాల్లో వర్గపోరాటాలు, ప్రజాస్వామిక పోరాటాలు నిర్వహించబడినప్పుడల్లా ఆచరణలోకి వచ్చిన అవసరం. ముఖ్యంగా సామాజిక ఉద్యమాలు, సంఘ సంస్కరణోద్యమాలు - సంస్కృతిలోని వైవిధ్యాన్ని ఆవిష్కరించి సుసంపన్నం చేశాయి. తెలుగులో కందుకూరి వీరేశలింగం ప్రహసనాలతో ప్రారంభమై గురజాడ 'కన్యాశుల్కం' నాటకంతో ఈ కృషి పతాక స్థాయికి చేరుకున్నది. 1930 లలో ఫాసిస్టు వ్యతిరేక ప్రజాస్వామిక ఉద్యమం ముఖ్యంగా ప్రేంచంద్, సజ్జాద్ జహీర్‌లు ఏర్పాటు చేసిన ప్రగతిశీల రచయితల సంఘం, ఇప్టాలు నాటకం తదితర కళారూపాలను ప్రజల చేతుల్లో సాంస్కృతిక పోరాట రూపాలుగా పదునెక్కించాయి. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటకాలానికి ఇది కమ్యూనిస్టు పార్టీ నేతృత్వంలో ఒక సాయుధ సాంస్కృతిక ఆచరణగా ఎదిగింది. ఆ ఆచరణకు గీటురాయి 'మా భూమి' నాటక రచన, ప్రదర్శన.

విచిత్రంగా ఇప్టా ఇంగువగట్టిన గుడ్డవాసన ఏదయినా 51-55ల మధ్యన మిగిలి ఉంటే అదంతా 56లో కృశ్చెవ్ పుణ్యమా అని ఇగిరి పోయాక ఆ కొడిగట్టిన కాగడాను గురుశరణ్ 56లో అందుకున్నాడు. 'లే మషాలే లే చలేగీ' అని జగ్‌మోహన్ జోషీ రాసిన పాటలన్నీ తాను స్వయంగా పాడి ఆడియో క్యాసెట్ చేసిన గురుశరణ్ ఆ పని యాదృచ్ఛికంగా చేయలేదు. జగ్‌మోహన్ జోషీ పాటలన్నింటికీ విస్తృతమైన ప్రచారం తన స్వరంతో ఇచ్చినవాడు గురుశరణ్. 1956 నుంచి నక్సల్బరీ దాకా - నక్సల్బరీ నుంచి నేటి దాకా గదర్ పార్టీ మొదలు, భగత్‌సింగ్ నుంచి కొనసాగుతున్న విప్లవం దాకా - కార్మిక కర్షక శ్రామిక సంస్కృతిని ప్రదర్శించే ఒక ఉద్యమాన్ని ఒక సంస్థగా నిర్వహించిన వ్యక్తి గురుశరణ్.

56లో మొదట ఆయన కర్తార్‌సింగ్ దుగ్గల్ రాసిన నాటకాన్ని ప్రదర్శనకు ఎంచుకున్నాడు గానీ ఆ తర్వాత ఇంక తానే రాయడానికి పూనుకున్నాడు. పంజాబ్ ప్రజా జీవితంలో నిత్యమూ తాను మసలుతున్న, చూస్తున్న, వ్యవసాయ కూలీల, భూమిలేని నిరుపేదల, ఫ్యాక్టరీ కార్మికుల, పేద రైతుల, నిర్మాణ కార్మికుల, రైతుల, దళితుల, ముస్లింల, సిక్కుల, హిందువుల - అన్ని

సమస్యలూ, పోరాటాలూ ఆయన ప్రదర్శనా వస్తువులయ్యాయి. వాళ్లంతా ఆయన నాటకాల్లో పాత్రలయ్యారు.

భాక్రానంగల్‌లో ఇంజినీర్‌గా పనిచేస్తున్నపుడు ఆనకట్ట నిర్మాణానికి, స్తంభాల నిర్మాణానికి సిమెంట్‌తో గద్దెలు, దిమ్మెలు తయారు చేసి నెలరోజుల పాటు నీళ్లల్లో నాన్చి గట్టి పడినాక ఉపయోగించడం చేస్తూ చూస్తూ ఉండేవాడు. ఈ సిమెంట్ గద్దెనే వేదికగా చేసుకోవచ్చు కదా - ఈ గద్దెను నిర్మాణం చేసిన కార్మికులను ఇవి మోసేవాళ్లుగా మాత్రమే కాకుండా - దీనిని రంగస్థల వేదికగా చేసుకొని ప్రదర్శించే పాత్రలుగా మలచవచ్చు కదానని భావించాడు. అట్లా ఆయన 'తడా' (వేదికకు, గద్దెకు పంజాబీ మాట) అనే రంగస్థల వేదిక ప్రారంభించాడు.

1956 నుంచి నక్సల్బరీ దాకా ఆయనకు ప్రజా పోరాట నిర్దేశకత్వాన్ని ఇచ్చే ప్రాపంచిక దృక్పథం గల కార్మిక వర్గ పార్టీ లేదనేది మనం మరచిపోవద్దు.

అంతకు ముందూ, ఆ తర్వాత ప్రపంచ నాటకరంగ చరిత్రలో చాలా ప్రయోగాలు జరిగాయి. ఫాసిస్టు వ్యతిరేక ప్రజాయుద్ధ కాలంలో బ్రెక్ట్ 'ప్రొసీనియం' ప్రయోగం గురించి ప్రపంచానికంతా తెలుసు. ప్రేక్షకులను రంగ స్థలానికి ఎక్కించి నాటకంలో ప్రదర్శకులు, ప్రేక్షకులు లేదా శ్రోతల మధ్యన గీతను చెరపిన మొదటి ప్రయత్నమది. బళ్లారి రాఘవ అట్లా ప్రేక్షకుల మధ్య నుంచి వేదిక మీదికి రావడం తెలుగు నాటక రంగంలో ఒక సంచలనమే అయింది.

ఇటువంటి ప్రయోగాలు, ప్రక్రియలు, కళారూపాలు జానపద కళల్లో కొత్తకాదు. ఆధునిక కాలంలో ముఖ్యంగా సామ్రాజ్యవాద, భూస్వామ్యవాద భావజాలాన్ని ప్రతిఘటించడానికి వాటిని అన్వయించడం కొత్త. ఉదాహరణకు ఒగ్గు కథలో కొమురయ్యను కథకుడు 'మా కొమురయ్య ఏడ ఉన్నడో' అని అడిగితే 'ఈ గొర్లలో కనవడ్త లేడే' అని హాస్యగాడు అన్నప్పుడు - కొమురయ్య వేదిక మీదికి జనం మధ్య నుంచి రావడం - ఆ మాటకొస్తే జానపద కళారూపాల్ని వేదికలు లేకుండా గ్రామాల్లో పొలం మడికట్లలో, గ్రామ పొలిమేరల్లో, పనగళ్లలో ప్రదర్శించడమూ కొత్తకాదు. కొత్త ఎందువల్లనంటే - ఇపుడవి సామ్రాజ్యవాద విధ్వంసంలో అదృశ్యమై మరుగునపడి, విస్మరణకు గురవుతున్నందువల్ల కొత్త. జార్జ్ థాంప్సన్ చెప్పిన విప్లవ సందేశాన్ని విప్లవకర వర్గాల దగ్గరికి తీసుకపోవడానికి దృశ్య, శ్రవ్య కళారూపాలే సాధనమన్న శాస్త్రీయ అవగాహనను కమ్యూనిస్టు పార్టీ వర్గపోరాటంలో సాంస్కృతిక ఆచరణకు తెచ్చిన ప్రతిచోటా భూగోళంపై ఈ జానపద కళా రూపాల పునరావిష్కరణ జరిగింది. చైనాలో 'ఎర్ర రంగస్థలం' అట్లా విప్లవకాలంలో ఒక అవిభాజ్యమైన విప్లవ సాంస్కృతిక విజయాన్ని సాధించింది. మళ్లా సాంస్కృతిక విప్లవకాలంలోనూ ముందుకు వచ్చింది.

కెన్యాలో గూగీ వా థియాంగో 1921లో బ్రిటిష్ వలస పాలకులు నిషేధించిన ప్రజాకళా రూపాలను సామ్రాజ్యవాద ప్రతిఘటనా పోరాటంలో భాగంగా పునరుద్ధరించి ప్రజారంగ స్థలాన్ని నిర్మించి నిషేధానికి, నిర్బంధానికి, దేశ బహిష్కరణకు గురయ్యాడు. పంటల కాలంలో ప్రజలు, పొలాల్లో చెలకల్లో ఉత్పత్తిలో పాల్గొన్న క్రమం, అందులోని శ్రమ, ప్రేమ, స్నేహం, ద్వేషం, సమష్టి జీవనం, కృషి, చెమట, నెత్తురు, కన్నీళ్లు - అన్నీ ఆట విడుపు కాలంలో మళ్లీ ఆ పంటలు కోసిన, నూర్చిన బయళ్లలో ప్రదర్శించే ఒక సంప్రదాయం - అన్ని వ్యవసాయిక దేశాల్లోనూ ఉంటుంది. ఏ జానపద జీవితమూ అటువంటి ఎండకాలపు, వెన్నెల రాత్రులు లేకుండా గడపలేదు. ఇబ్సన్ మొదలు ఇవ్వాటి వరకు వీటి ప్రయోజనాన్ని గుర్తించి సాంస్కృతిక సాధనంగా ప్రయోగించిన వాళ్లెందరో. ముఖ్యంగా మార్పు ప్రాపంచిక దృక్పథం కల రాజకీయ శక్తులకు నాటకం ఒక ఆయుధం. అందుకే ఆప్టన్ సింక్లేర్ - పవర్ పర్ఫార్మ్స్ - పర్ఫార్మెన్స్ ఇజ్ పవర్ - అధికారం (అధికారాన్ని) ప్రదర్శిస్తుంది (చెలాయిస్తుంది) ప్రజల చేతుల్లో ఉన్నది - చేయగలిగింది - ప్రతిఘటనా ప్రదర్శనయే. గాత్రం అంటే కేవలం పాట కాదు. శరీర సాంస్కృతిక స్వరవ్యక్తీకరణ అన్నట్లే నాటకం అంటే ఒక మానవ సమూహ సాంస్కృతికాచరణ. ఇప్టా ద్వారా ఇది తమ చైతన్యంలో భాగమైన బలరాజ్ సాహ్నీ, హబీబ్ తన్వీర్, బాదల్ సర్కార్ వంటి వాళ్లు దీని శక్తి ఏమిటో నిరూపించారు. విజయ్ టెండూల్కర్, గిరీశ్ కర్నాడ్, కంబార్ వంటి వాళ్లు ఎన్నో ప్రయోగాలు చేసారు. బాదల్ సర్కార్ వీధి నాటకం ద్వారా వేదికను రద్దు చేసాడు. గిరీశ్ కర్నాడ్ 'వేదిక - పాత్రలు - ప్రేక్షకులు - అనే తెరలు, గీతలు చెరిగిన నాడే ప్రజా రంగస్థలం ఏర్పడుతుంద'న్నాడు.

నక్సల్బరీ పోరాటం ఈ ప్రయోగాలకు ఒక నిర్మాణ రూపాన్నిచ్చింది. ఉత్పల్‌దత్ స్వయంగా తీర్, కల్లోర్ నాటకాలు రాసి ప్రదర్శించాడు. ఈ ప్రయోగాలన్నింటి ఉన్నత రూపంగా సుబ్బారావు పాణిగ్రాహి 'అక్టోబర్ 31' జముకు కథ, జన నాట్యమండలి 'బీదల పాట్లు' నాటిక ఇతర కళారూపాలు వచ్చాయి. స్ట్రీట్‌ప్లేను ఆంధ్ర విశ్వవిద్యాలయం నాటక శాఖ 'ఊరేగింపు' పేరుతో మరింతగా ప్రచారంలోకి తేవడానికి అత్తిలి కృష్ణారావు గారికి రావిశాస్త్రి 'నిజం' నాటకంతో పాటు ఆయన సలహాలు, సూచనలు ఉపయోగపడినాయి. స్ట్రీట్ ప్లేను ఎఐఎల్ఆర్‌సిలో బెంగాల్‌కు చెందిన రెవల్యూషనరీ రైటర్స్ అండ్ ఇంటలెక్చువల్స్ అసోసియేషన్ (ఆర్‌డబ్ల్యుఎఐఎ), మహారాష్ట్రకు చెందిన ఆవాన్ నాట్యమంచ్ మరింత సార్థకంగా ప్రదర్శించాయి. ఆవాన్ నాట్యమంచ్ విలాస్ గోఘ్రే, అనురాధ గాంధీ, రాబర్ట్ నాయకత్వంలో కార్మిక రంగంలో సమ్మెలకు, పోరాటాలకు ఒక సాంస్కృతిక ఆయుధంగా ప్రయోగించింది. రాబర్ట్ పనిచేసిన ఫియట్ కార్ల కంపెనీల కార్మికుల సమ్మెలో, అంతకన్నా అపూర్వంగా బొంబాయి బట్టల మిల్లుల కార్మికుల సమ్మెలో నవ జవాన్ భారత్ సభకు అండగా ఆవాన్ నాట్యమంచ్ స్ట్రీట్‌ప్లేలు, కళారూపాలు ఎంతో శక్తిమంతంగా పనిచేసాయి. '97లో పంజాబ్‌లోని సంగ్రూర్‌లో ఎఐఎల్ఆర్‌సి కుల సమస్యపై సదస్సు నిర్వహించినప్పుడు గురుశరణ్ సింగ్ నాటకాలు

చూసే అవకాశం ఈ బృందాలకు వచ్చింది.

అట్లే ఈ బృందాలతో గురుశరణ్ సింగ్ వాళ్ల అనుభవాలను పంచుకున్నాడు. ఎఐఎల్ఆర్సి ఏర్పడిన కొద్దికాలానికి ఏర్పడిన జనవాదీ లేఖక్ సాంస్కృతిక మంచ్‌కు ఆయన అఖిల భారత స్థాయిలో అధ్యక్షుడుగా గోరఖ్‌పాండే ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ సంస్థ సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పూనిక, చొరవతో ఏర్పడింది. భోజపూర్ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో గోరఖ్‌పాండే భోజ్‌పురి భాషలోనూ, హిందీలోనూ అద్భుతమైన పాటలు, కవితలు రాశాడు. జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో జీన్‌పాల్ సార్త్ర్ అస్తిత్వవాదంపై డాక్టరేట్ చేసాడు. ఆ తర్వాత కాలంలో విలాస్ గోఘ్రే వలెనే, గోరఖ్‌పాండే కూడా తన కళ్లముందే కూలుతున్న కలల నుంచి నిస్పృహ చెంది ఉరివేసుకొని చనిపోయాడు. గురుశరణ్ సింగ్ ఎప్పుడూ నిర్దిష్టంగా ఒక ఎంఎల్ పార్టీ నిర్మాణంలో లేడు. ఒక విధంగా ఆయన తనలో గదర్ పార్టీ, భగత్‌సింగ్, నక్సల్బరీ పంథాల రాజకీయాలను సాంస్కృతికంగా స్వీకరించి ఇన్‌ఖిలాబీ సంస్కృతిని ప్రచారం చేయాలనుకున్నాడు. లౌకిక ప్రజాస్వామ్య భావాలు, తిరుగుబాటు ఆయన నాటక వస్తువులుగా ఉన్నాయి. భగత్‌సింగ్ వలెనే ఆయన కిసాన్ మజ్దూర్ సమస్యలపై కేంద్రీకరించాడు. పంజాబ్‌లో ముప్పై శాతంగా ఉన్న దళితుల నుంచి, వ్యవసాయ కూలీల నుంచి, అసంఘటిత రంగంలో ఉన్న కార్మికుల నుంచి ఉద్యమ నిర్మాణం చేయాలనేవాడు. పంజాబ్‌లోని ప్రతి మారుమూల పల్లెకు ఆయన నాటకాన్ని తీసుకువెళ్లాడు. ఒకసారి ఆలిండియా రేడియోలో ఆయన నాటకం ప్రసారమైనపుడు వాళ్లు ప్రత్యేకంగా పిలిచే ఆహ్వానితులను కాకుండా నాటకం చూడడానికి కార్మికులను పిలవమన్నాడు. కార్మికులు నాటకాలేం అర్థం చేసుకోగలరని స్టేషన్ డైరెక్టర్ అన్నపుడు - వాళ్లకోసమే, వాళ్ల సమస్యలతో రాసిన నాటకాలకు వాళ్లుకాక ఇతరులెట్లా ప్రేక్షకులవుతారని ప్రశ్నించాడు. తన అనుభవంలో అట్లా కార్మికుల ముందు ప్రదర్శించి ప్రసారం చేసిన నాటకం వలె రేడియోలో మరే నాటకమూ అంత విజయం సాధించలేదని ఆ డైరెక్టర్ తర్వాత అంగీకరించాడు. అందుకే ఒక నాటకకర్తగా గురుశరణ్ సింగ్ తన జీవిత కాలంలో ఒక వీరగాథ అయ్యాడు.

ఆయన చనిపోతే కేవలం నాటక రచయితలు, సాహిత్యవాదులు, కళాకారులు, నాటక విమర్శకులు మాత్రమే రాలేదు. చండీఘడ్‌లో, మరెన్నో చోట్ల వేలాది మంది కార్మికులు, వ్యవసాయ కూలీలు, రైతులు, దళితులు ఆయన సంస్మరణకు కదిలి వచ్చారు. ఆయన తన కుటుంబాన్నంతా తన నాటక బృందంలో పనిచేయించాడు. 1980లలో చండీఘడ్‌లో చండీఘడ్ స్కూల్ ఆఫ్ డ్రామా ఏర్పాటు చేసి ఆయన ఎందరో యువ దర్శకులను, నటులను, రంగస్థల కార్యకర్తలను తయారు చేసాడు. ఆయన నాటకరంగాన్ని, సాంస్కృతిక కార్యకలాపాలను ఎప్పుడూ ఒక ప్రత్యేకమైన అంశంగా చూడలేదు. ఆయన ఒక సామాజిక, రాజకీయ కార్యకర్తగా ఉన్నాడు. చీలికలు పేలికలయిన ఎంఎల్ పార్టీలను ఏకం చేయడానికి ఇన్‌ఖిలాబీ పసంద్ ఏక్తా మంచ్‌ను ఏర్పాటు చేసాడు. భూమయ్య, కిష్టాగౌడ్‌ల ఉరిశిక్షలకు వ్యతిరేకంగా పంజాబ్‌లో ఉద్యమాన్ని నిర్మించాడు. ఎమర్జెన్సీలో క్రియాశీల విప్లవ సాంస్కృతిక కార్యకర్తగా జైలు పాలయ్యాడు.

ఎమర్జెన్సీ ఎత్తివేసిన తర్వాత జయప్రకాశ్ నారాయణ్ ఎన్‌కౌంటర్ల గురించి నిజనిర్ధారణ చేయడానికి వేసిన తార్కుండే కమిటీ ఆంధ్రప్రదేశ్, పంజాబ్‌లలో నక్సలైట్ల ఎన్‌కౌంటర్ల విషయంలో విచారణ జరిపినపుడు పంజాబ్‌లో ఆయన సహకరించాడు. పంజాబ్‌లో మొదటి నుంచీ తరిమెల నాగిరెడ్డి నాయకత్వంలో ఉన్న విప్లవ పార్టీకి ప్రజాసంఘాల్లో తగినంత నిర్మాణం, ప్రాబల్యం ఉన్నవి. ఎమర్జెన్సీ ఎత్తివేసిన తర్వాత మోగా (జిల్లా కేంద్రం)లో ప్రీతిపాల్‌సింగ్ రణధవా అనే విద్యార్థి నాయకుడు అద్భుతమైన విద్యార్థి ఉద్యమాన్ని నిర్మాణం చేసి మతోన్మాదుల చేతుల్లో హత్యకు గురయ్యాడు. అపుడు అక్కడ పోలీసు అధికారిగా పనిచేసిన సమర్‌జిత్ సింగ్ మాన్ ఆ తర్వాత ఖలిస్థాన్ ఉద్యమంలో పాల్గొని చాలాకాలం జైలు పాలయ్యాడు. ఎనభైలలో వచ్చిన పంజాబ్ మిలిటెంట్ ఉద్యమాన్ని కానీ, ఖలిస్థాన్ ఉద్యమాన్ని గానీ కొన్ని ఎంఎల్ పార్టీల వలెనే గురుశరణ్ సింగ్ సమర్థించలేదు. వ్యతిరేకంగా నాటకాలు రాసి ప్రదర్శించాడు. కాని తన నాటకాలను ఎక్కడా మిలిటెంట్లు అడ్డుకోలేదని, పోలీసులు మాత్రం చాలా చోట్ల తన నాటకాలు ఆడకుండా అడ్డుకున్నారని గురుశరణ్ ఒక ఇంటర్వ్యూలో చెప్పాడు. ఆయన పంజాబీ లేఖక్ సభ్యాచార్ (పల్స్) మంచ్ అధ్యక్షుడుగా కూడా పనిచేసాడు. కళలను, సంస్కృతిని, ప్రజా జీవన రంగంలోకి, ప్రజా పోరాటాల్లోకి రాజకీయ దృక్పథంతో క్రియాశీలంగా తీసుకొని వచ్చి నినాదాన్ని నాదంగా, నాదాన్ని నినాదంగా రసాయనికంగా మలచిన ఇప్టా, నక్సల్బరీ సంప్రదాయానికి గురుశరణ్ వారధిగానూ, క్రియాశీల సాక్షిగానూ చివరిదాకా సజీవ చైతన్యంతో సహస్రమాసాలు జీవించాడు. బెంగాల్‌లో రాజకీయ ఖైదీల విడుదల కోసం ఐదు నెలలుగా కొనసాగుతున్న ఉద్యమానికి, జార్ఖండ్‌లో జీతన్ మరాండీ కళా బృందం ఉరిశిక్ష రద్దు ఉద్యమానికి ఆయన రాజకీయ ఖైదీల విడుదల కమిటీ గౌరవాధ్యక్షుడుగా మార్గ దర్శకత్వం వహిస్తాడని ఆశిస్తున్న కాలంలోనే అస్తమించడం ఒక్కటే లోటుగా మిగిలింది. ఏభై ఏళ్లు ప్రజల్లో అవిశ్రాంతంగా పనిచేసిన సాంస్కృతిక యోధుడు ఆయన. ఆయనను ప్రజలు ప్రేమగా భాజీ అని పిలుచుకుంటారు. పంజాబ్ విప్లవ సాహిత్య సాంస్కృతిక రంగాల్లో పాష్, లాల్‌ల కన్నా సాధారణ ప్రజానీకంలో గురుశరణ్‌కు సంత్‌రామ్ ఉదాస్‌కున్నంత ఆదరణ ఉన్నది. పాష్ వంటి నేపథ్యం నుంచే ఆయన ప్రజా పోరాట సాంస్కృతికరంగంలోకి వచ్చి అర్ధశతాబ్దం పాటు ఆ విప్లవ సాంస్కృతిక జెండాను ఎగుర వేసాడు. ఆయన నాటకరంగాన్ని ఎంచుకోవడం వల్ల అంతగా ప్రజల్లోకి పోగలిగాడు.

జ్ఞాపకాలు

జ్ఞాపకాల దొంతరలు

- చలసాని ప్రసాద్

కృష్ణాజిల్లా, చల్లపల్లి హైస్కూల్లో మా వాసన్నా (శ్రీనివాసరావు) తుమ్మల వేణు గోపాలరావుగారు క్లాసుమేట్సు. మా అన్నని మలబారు పోలీసులు పళనియప్పన్ క్యాంపులో 1950 మార్చి (తెలంగాణ సాయుధపోరాట సందర్భం)లో కాల్చి చంపారు. వాసన్న తమ్ముడిగా వేణుగారికి నా మీద అమితమైన ప్రేమ. వేణుగారూ, కృష్ణాబాయీ, నా సహచరి విజయా, నేను విశాఖలో ఉమ్మడి కుటుంబం. 30 ఏళ్ళపాటు ఏక భాండం, వాళ్ళకి ఇద్దరూ ఆడపిల్లలే - నళిని, పద్మిని, మాకూ ఇద్దరూ ఆడపిల్లలే నవత, మమత. "మగ పిల్లలు లేరా?" అని ఎవరైనా అంటే "మనం కోరుకున్నట్టు మంచి కొడుకుని కనలేమేమోగాని, మంచి అల్లుణ్ణి ఎంచుకోగలం గదా!" అనేవారు వేణుగారు ఛలోక్తిగా.

"కృష్ణా, మా నలుగురు పిల్లలూ నా పంచప్రాణాలు" అనడం ఆయనకి పరిపాటి. ఆధునిక తెలుగు సాహిత్య వ్యాప్తికి దోహదం చేసి, చలం, శరత్, సి.ఆర్. రెడ్డిలాంటి ఎందరివో జీవిత చరిత్రలు రచించిన గొర్రెపాటి వెంకట సుబ్బయ్య మా కుటుంబానికి అప్పుడు. కాళోజి సరేసరి. శ్రీశ్రీ, కుటుంబరావు, సంజీవ దేవ్, కె.వి.ఆర్., బంగోరే, రావిశాస్త్రి, కారా, రంగనాయకమ్మ, వసంతలక్ష్మి, బాలగోపాల్, చెరబండరాజు, వరవరరావు, వేణు, స్మైల్, యగళ్ళలాంటి మిత్రులు ఇంటిల్లిపాదికి ఆప్తులే. "వేణుగారు స్ప్రింగ్ లాంటి మనిషి. ఇంట్లో అయినా సరే, బయట అయినా సరే చర్చలు, వాదోపవాదాలు జరుగుతూంటే ఆయన వచ్చి ఠక్కున ఏదో ఒకటి తేల్చి చెప్పేవారు. ఇక అది మా అందరి ఏకాభిప్రాయమయ్యేది" అనేవాడు మా వరవరరావు. స్త్రీ, పురుషుల సమానత్వాన్ని ఆచరించేవారు.

ఒకసారి గుడివాడ మిత్రులు రాయిస్టులకీ, మార్క్సిస్టులకీ చర్చా కార్యక్రమం నిర్వహించారు. వక్తలు రావిపూడి వెంకటాద్రి, త్రిపురనేని మధుసూదనరావు, తీర్పరి వేణుగోపాలరావు. ఆ రోజు అనారోగ్యంతో ఉన్నా మఫ్లర్ తలకి చుట్టుకొని, మోడరేటర్‌గా వ్యవహరించారు.

ఆయన విద్యావేత్త, సాంకేతిక విద్యానిపుణుడు, కొఠారీ కమిషన్ సూచనలు పాటిస్తే విద్యా విధానం బాగుపడుతుందని చాలా ఆశపడేవారు. కొత్త ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజిలెన్నిటికో తొలి ప్రిన్సిపాల్‌గా అడుగులు నేర్పి మంచిపేరు తెచ్చుకున్నారు. అలాగే నేను తెలుగు సాహిత్యంలో అంతో ఇంతో కృషి చేసేందుకు ఆయన వత్తాసు, మద్దతు చాలా ఉపయోగపడ్డాయి. ఆయన మాత్రం నా సపోర్టు లేకుండానే ఎన్నో ఘనకార్యాలు సాధించారు. ఒక్కమాటలో చెప్పాలంటే నేను లేకుండానే ఆయన ఉండేవారు. కాని ఆయన లేకపోతే నేను లేను.

రావిశాస్త్రిగారు తన "మూడు కథల బంగారం" మా ఇద్దరికీ అంకితం ఇచ్చినందుకు కించిత్ గర్వపడిన మాట నిజం! శాస్త్రిగారు లేకపోవడం వల్ల మాకు కలిగిన శూన్యం, వెలితి ఎప్పటికీ తీరనివి.

కొడవటిగంటి కన్ను మూసినప్పుడు "ఒక మంచి గ్రంథాలయం తగులబడిపోయినట్లయింది"ని బాధ పడ్డారు.

రంగనాయకమ్మగారు "మహా ప్రస్థానం, సారాకథలు, స్త్రీ ఉన్నాయా?" అని అడిగితే "ఉన్నాయా ఏమిటి? ఎన్నేసి కాపీలున్నాయి? అని అడగండి" అనేవారు వేణుగారు నేను లెక్కలేకుండా కొంటానని!

ఆయన ఇంజనీరింగ్ చదువులకి సంబంధించి "నాలుగు నాటికలు రాసి, ప్రచురించి, ప్రదర్శించారు" కూడా.

విశాఖలో నాస్తికోద్యమం, పౌరహక్కుల కమిటీ లాంటి సంఘాలలో ప్రముఖ పాత్ర వహించారు.

పుట్టుకతో కులం, ఆస్తి ఉండగూడదనే వారు. "రిజర్వేషన్స్ ఇంకా ఎన్నాళ్ళు?" అని ఎవరన్నా విసుక్కుంటే "వేలాది ఏళ్ళనుంచీ కులం, అణచివేత ఉన్నాయి. కనక రిజర్వేషన్లూ అన్ని వేల ఏళ్ళుండాలి" అని వాదించేవారు.

రావుగారికి ఉప్పల లక్ష్మణరావుగారి "అతడు-ఆమె" నవల కంఠోపాఠం. "దాంపత్య జీవితంలో ప్రేమ ఎన్ని పాళ్ళో, రాజీ ఎన్ని పాళ్ళో... ఇవాళ చెప్పడం కష్టం" అని తరుచు కోట్ చేసేవారు. గోపీచంద్ దేవుని జీవితం ఆయనకి స్ఫూర్తి. బాబూ కొడుకులే నన్ను హేతువాదిని చేశారు అనేవారు. త్రిపురనేని రామస్వామి, గోపీచంద్‌ల్ని ఉద్దేశించి, హేతువాదంతో ఆగకుండా, అమెరికా చదువూ, ఇండియాలోని భూభాగస్వామ్య సమాజం ఆయన్ని మార్క్సిజం వేపు మళ్ళించాయి. 'కన్యాశుల్కం' కాపీ ఎప్పుడూ తనతో ఉండేది. రావిశాస్త్రిగారన్నా, ఆయన రచనలన్నా అమితమైన అభిమానం. సైన్సు చదివి, సాంకేతిక విద్యలో ప్రావీణ్యం గడించినా, సామాజిక, సాంస్కృతిక రంగాల మీదే ఎక్కువ దృష్టి ఆయనకి.

నా దస్తూరి ఘోరంగా ఉంటుందని డబుల్ రూల్డ్ బుక్‌లో చూచి రాత రాయమనేవారు. అయినా నా రాత ఇలాగే ఏడ్చింది. శ్రీశ్రీ సంపుటాలని బాగా ఏర్చికూరుస్తున్నానని మురుసుకునేవారు. మేమిద్దరం విరసం ఫౌండర్ మెంబర్స్‌గా పనిచేస్తుండడం ఆయనకి చాలా ఇష్టం. అయితే విరసంలో దుందుడుకు విధానాల్ని నిశితంగా విమర్శించేవారు. ఇతరులు ఎవరైనా విమర్శిస్తే మాత్రం ఒప్పేవారు కాదు. కమిట్‌మెంట్‌తో పనిచేసేది వాళ్ళేగా?" అంటూ మా ఇంట్లో డెమోక్రటిక్‌గా ఉంటూ ఎవరి పనులకీ అభ్యంతర పెట్టేవారు కాదు.

జార్ఖండ్ ప్రజాకళాకారులపై ఉరిశిక్షలకు వ్యతిరేకంగా

జార్ఖండ్ ప్రజాకళాకారులు జీతన్ మరాండీ, అనిల్‌రామ్, మనోజ్ రాజ్వార్, ఛత్రపతి మండల్‌లపై గిర్ది సెషన్స్ కోర్టు విధించిన ఉరిశిక్షలకు వ్యతిరేకంగా ఉద్యమించడానికి గుంటూరు జిల్లాలో "జీతన్ మరాండి కళాబృందం ఉరిశిక్ష రద్దు కమిటీ" ఏర్పడింది. ఈ కమిటీలో విరసంతో పాటు అరసం, ప్రజా కళామండలి, జనసాహితి, పి.డి.ఎం., కులనిర్మూలనా పోరాట సమితి, ప్రగతిశీల కార్మిక సమాఖ్య, డి.టి.ఎఫ్., ఎ.పి.సి.ఎల్.సి., సామాజిక చేతనా వేదిక, మానవ హక్కుల వేదిక, వి.కా.స.లు ఉన్నాయి. ఈ కమిటీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ ఉద్యమం జరిగింది. నగరంలోని ప్రముఖ రచయితలు, కళాకారులు, అధ్యాపకులు, న్యాయవాదులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు మొదలైనవారు 94 మంది సంతకాలు చేశారు.

ఈ ఉరిశిక్షలకు వ్యతిరేకంగా 10 అక్టోబరు 2011న గుంటూరులో ప్రజా ప్రదర్శన, ధర్నాలు జరిగాయి. స్థానిక అంబేద్కర్ విగ్రహం నుండి కలెక్టర్ కార్యాలయం వరకు జరిగిన ప్రదర్శనలోనూ, ధర్నాలోనూ 300 మందికి పైగా ప్రజలు పాల్గొన్నారు. విప్లవ కార్మిక సమాఖ్యకు చెందిన నలుగురు మహిళా కార్యకర్తలు ఉరిశిక్షను సూచించే విధంగా వేషధారణ చేసి ప్రదర్శనలో పాల్గొనడం ప్రజలను ఆకట్టుకొన్నది. ప్రజాకళామండలి బృందం పాడిన పాటలు ప్రజలను ఎంతగానో ఉత్తేజపరచాయి. తదనంతరం జిల్లా పరిషత్ ఆవరణలో కమిటీ కన్వీనర్ కా. సంగ్రామ్ ఆధ్వర్యంలో సభ జరిగింది. ప్రజలని చైతన్యవంతం చేసే సామాజిక బాధ్యతను నిజాయితీగా నిర్వర్తిస్తున్న ప్రజా కళాకారులకు ఉరిశిక్షలు వేయడం, దండకారణ్యంలోని ఆదివాసీ ప్రజానీకంపై గ్రీన్‌హంట్ యుద్ధాన్ని ప్రారంభించడం భారత పాలకవర్గాల ఫాసిస్టు ధోరణికి నిదర్శనమని సభ అభిప్రాయపడింది. ఈ హింస రచయితల, కళాకారుల, సాంస్కృతిక కార్యకర్తల ప్రజాస్వామిక విశ్వాసాలకు పరీక్షవంటిదని మరింత పదునెక్కిన చైతన్యంతో ఈ పరీక్షలో పాలకవర్గాలను ఓడించాలని సభ అభిప్రాయ పడింది. జీతన్ మరాండీ, ఆయన సహచరులపై ఉరిశిక్షలను రద్దు చేయడమేగాక, శిక్షాస్మృతి నుండి మరణ శిక్షను తొలగించాలని వక్తలు డిమాండ్ చేశారు. ఈ సభలో నల్లూరి రుక్మిణి (విరసం), నాగేశ్వరరావు (ప్రజాకళామండలి), విజయ భాస్కర్ (కె.ఎన్.పి.ఎస్.), కొడవలి రాజేంద్ర ప్రసాద్ (వికాస), వై.వి. (పి.డి.ఎం.); రామకృష్ణ (పి.కె.ఎస్.), చెన్నకేశవులు (ఎ.పి.సి.ఎల్.సి) మొదలయినవారు ప్రసంగించారు.

లేఖ : అరుణతార సంపాదకులకు

జీతన్‌మరాండీ తదితరుల గురించి వచ్చిన అరుణతార చదివాను. అందులో ప్రచురించిన విరసం కరపత్రంలో .. చిల్కారీ ఘటనలో చనిపోయిన 19 మంది బాబూలాల్ మరాండీ ఏర్పాటు చేసిన నాగరిక్ సురక్షా సమితి సభ్యులని రాశారు. ఇది పూర్తి నిజం కాదు. ఆ కాల్పులు ఫుట్‌బాల్ మేచ్ సందర్భంగా అనేక మంది ఉండగా జరగడం వల్ల కొంత విచక్షణారహితంగానే జరిగాయి. చనిపోయిన వాళ్లలో నలుగురు పార్టీకి బలమైన మద్దతుదారులు, సానుభూతిపరులు కూడా ఉన్నారు. ఒకాయన టీచర్. ఇది చాలా దు:ఖదాయకమైన విషయం. దీని గురించి పార్టీ తర్వాత బహిరంగ క్షమాపణలు చెప్పి కరపత్రాలు పంచింది. ఈ వివరాలు మీకు తెలిసి ఉండకపోవచ్చు. అందుకే కరపత్రంలో అలా రాశారు. కామ్రేడ్ అమృత రాసిన 'జార్ఖండ్ హరిత వనాల నుంచి తూర్పు కనుమలకు ఓ సాంస్కృతిక లేఖ'లో చాలా విలువైన సమాచారం ఉంది. తెలుగు పాఠకులకు అందాల్సిన మంచి వ్యాసం. అయితే అందులో నిర్బంధం గురించి రాసిన పేరాలో 'వాళ్ల మీద నిర్బంధం అంతగా మొదలు కాలేదనే చెప్పాలి' అని ఉంది. నలుగురు కళాకారులకు ఉరిశిక్ష వేసిన సందర్భంలో అచ్చయిన వ్యాసంలో ఇట్లా ఉండటం ఆశ్చర్యం. అయితే ఆ వ్యాసంలోని ఇతర సమాచారం చూస్తే జితేన్‌మరాండీ తదితరులకు ఉరిశిక్ష పడటానికి ముందు రాసినట్లనిపిస్తోంది. నిజానికి ఆ తర్వాత కళాకారులకు ఉరిశిక్ష పడడమే గాక జార్ఖండ్ సాంస్కృతికోద్యమంలో, విప్లవోద్యమంలో చాలా పరిణామాలు కూడా జరిగాయి. అందు వల్ల అమృత ఆ వ్యాసం అంతక ముందే రాసి ఉండవచ్చునిపిస్తోంది. ప్రచురించేటప్పుడు మీరు ఈ తేడా గమనించి ఒక నోట్ పెట్టినా సరిపోయేది. అయితే ఈ ఉరిశిక్షల సందర్భం రాసేటప్పటికి లేకపోయినా జార్ఖండ్‌లో ఒక సాంస్కృతిక సంస్థ ప్రదర్శనల మీద రాజ్యం దాడి చేయడం. అరెస్టులు చేయడం, వాయిద్య పరికరాలను విరగ్గొట్టడం చాలా జరిగాయి. జితేన్‌ను అరెస్టు చేశాక ఆయనను కలవడానికి వెళ్లిన ప్రతి అభేన్ సభ్యుడిని అరెస్టు చేశారు. వాళ్లు ఇప్పటికీ విడుదల కాలేదు. 14 ఏళ్ల అబ్బాయిని కూడా నెల రోజులు అక్రమ కస్టడీలోకి తీసుకున్నారు. దాదాపుగా అభేన్‌ను ఉనికిలో లేకుండా చేయడానికి శత్రువు చాలా ప్రయత్నాలు చేస్తున్నాడు. అట్లాగే రచయిత్రి చివర్లో 'సంథాలి' అని రాశారు. అయితే వ్యాసం లోపల ' వీళ్లు.. వీళ్లు' అని ఉంది. 'మేం..' అని ఉండాలి. ఆదివాసుల్లో భాగమై ఉద్యమం చేస్తున్న రచయిత ఇట్లా రాయకుండా ఉండాల్సింది. ఇది రచనలో దొర్లిన తప్పే అయి ఉంటుందనుకుంటున్నా.

అరుణతార చదవడం చాలా రిలీఫ్‌గా ఉంది. జెయిలు నిర్బంధంలో అరుణతార ఉత్తేజాన్నిస్తోంది. విప్లవాభివందనాలతో.... ఎ.ఆర్

కాని నేను అన్నంలో ఆవకాయపచ్చడి ఎర్రగా కలిపినా, వేళకి ఇంటికి రాకపోయినా అగ్గి మీద గుగ్గిలం అయ్యేవారు.

వేణుగారి పార్థివ శరీరంలోని భాగాలు ఆంధ్రా మెడికల్ కాలేజి అనాటమీ విద్యార్థులకి పాఠాలు నేర్పుతున్నాయి. అరుదయిన ఆల్జిమర్స్ వ్యాధికి గురి అయిన ఆయన మెదడు పిజి విద్యార్థుల పరిశోధనలకి ఉపయోగపడుతోంది. జీవించి మరణించి కూడ సమాజానికి తనని తాను సమర్పించుకున్న సార్థకజీవి వేణుగోపాల్‌రావుగారు 21 సెప్టెంబర్ 2011న విశాఖలో కన్నుమూశారు.

వ్యాసం

తెలుగు సాహిత్య విమర్శ - మార్క్సిస్టు సిద్ధాంత పరికరాలు

- కాత్యాయనీ విద్మహే

'తెలుగులో విప్లవవాద సాహిత్య విమర్శ' అన్నప్పుడు విప్లవవాదంతో రచించబడిన సాహిత్యంపై వచ్చిన విమర్శ అని మాత్రమే అర్థం చేసుకొంటే అది దాని పరిధిని సంకుచితం చేసినట్లే. విప్లవ వాదం ఒక విమర్శ పరికరం. తెలుగులో సాహిత్య విమర్శను అభివృద్ధి పరిచిన రీతిగా అర్థం చేసుకొంటే దాని పరిధి విస్తృతమై ప్రయోజనవంతంగా ఉంటుంది. సాహిత్య విమర్శలో విలువల నిర్ధారణకు ఉపకరిస్తుంది.

సంస్కరణ వాదం - విప్లవవాదం అన్న రెండు భావనలకు మధ్య ఉన్న తేడాను చెప్తూ రావిశాస్త్రి విప్లవ వాదాన్ని నిర్వచించాడు. విప్లవవాదం కన్నా ముందు విప్లవతత్వం ఉంటుందన్నాడు. సమస్యకు కారణాలేమిటో వెతకడం, ఆలోచించడం విప్లవతత్వం అయితే కారణాలను గుర్తించి వాటిని నిర్మూలించడం ద్వారా సమస్యను పరిష్కరించే కార్యాచరణ విప్లవవాదం అని ఆయన అన్నాడు[1]. సాహిత్యానికి అనువర్తించి ప్రస్తుతం ఉన్న వ్యవస్థను బలప్రయోగం ద్వారా మార్చాలనే రాజకీయ సిద్ధాంతానికి అనుకూలమైన సాహిత్య సిద్ధాంతంగా విప్లవవాదాన్ని పేర్కొన్నాడు చేరా[2].

అభ్యుదయవాదం కన్నా భిన్నమైనది, గుణాత్మకమైనది విప్లవవాదం. సాహిత్యంలో అభ్యుదయవాదం, స్వాతంత్ర్యోద్యమ పోరాటకాలంలో ఏర్పడిన కమ్యూనిస్టు పార్టీ రాజకీయాలకు అనుకూలమైన భావనగా ప్రవేశించింది. స్వాతంత్ర్యానంతర స్వదేశీ పాలనలోనూ మారని జన జీవన స్థితిగతుల గురించిన ఆందోళనతో పెరుగుతున్న ఆర్థిక అసమానతలకు వ్యతిరేకంగా అభివృద్ధి చెందిన విప్లవ రాజకీయాల వెలుగులో వచ్చింది విప్లవవాదం[3]. రెండింటికీ మూలంలో కమ్యూనిజమే ఉన్నా, అవగాహనలో, ఆచరణలో ఉన్న తేడాను బట్టి అభ్యుదయవాదం కన్నా విప్లవవాదం మెరుగైనది. అభివృద్ధికరమైనది. వర్గాల మూలతత్వం గురించి తెలియకపోయినా, వర్గరహిత సమాజ స్థాపనాలక్ష్యం లేకపోయినా పేద వర్గాల పట్ల, శ్రామిక వర్గం పట్ల సానుభూతి ఉంటే అది అభ్యుదయవాదమే అయింది. పేదల పట్ల, శ్రామిక వర్గం పట్ల సానుభూతికాదు కావలసింది. పేదరికానికి కారణాలు తెలిసి, శ్రమదోపిడి స్వభావాన్ని గుర్తించి శ్రామిక వర్గపోరాటాల పట్ల నిబద్ధత నుండి రూపొందింది విప్లవవాదం. అసమానతలకు కారణాలను గుర్తించడం అభ్యుదయవాదంలో జరిగినా కారణాలను నిర్మూలించే దిశగా ఉద్యమ కార్యాచరణను ముందుకు తీసుకువచ్చింది విప్లవవాదం. భూస్వామ్య దోపిడీకి కొమ్ముకాస్తున్న స్వతంత్ర భారత ప్రజాస్వామిక ప్రభుత్వంపై తిరుగుబాటుగా సాగుతున్న నక్సల్‌బరీ, శ్రీకాకుళ సాయుధ రైతాంగ పోరాటాల స్ఫూర్తి, వాటికి సంబంధించిన రాజకీయార్థిక తాత్త్వికతలతో సాహిత్యరంగాన్ని విప్లవీకరించే క్రమంలో 'విప్లవవాదం' ఒక ముందడుగు. విప్లవవాద సాహిత్య విమర్శ అందులో భాగమే.

1

శాస్త్రీయ దృక్పథం, సాంఘిక దృక్పథం, సమాజ-సాహిత్య సంబంధ దృక్పథం, అనే మాటలకు విప్లవవాద విమర్శకు సమాంతరంగా వినియోగంలో ఉన్నాయి. శాస్త్రీయ దృక్పథమంటే మార్క్సిస్టు దృక్పథమే[4]. సాహిత్య విమర్శలో భౌతికవాదతత్త్వానికి, వాస్తవ వాద వైఖరికి సంబంధించినదే సాంఘిక దృక్పథం అనీ దీన్నే చారిత్రక దృక్పథం అని కూడా అంటారనీ, అయితే ఈ రెండు పేర్లకంటే సూటి అయినది, సరి అయినది మార్క్సిస్టు దృక్పథం అని కె.వి. రమణారెడ్డి తేల్చి చెప్పాడు[5].

ఆ క్రమంలోనే సాహిత్యానికి మార్క్సిజంకు ఉన్న సంబంధాన్ని గురించిన చర్చ ఒక చారిత్రక సాహిత్య అవసరంగా ముందుకు వచ్చింది. ఆర్. ఎస్. సుదర్శనం 'మార్క్స్ దృష్టిలో సాహిత్యం' అనే వ్యాసం ఒక అనిశ్చిత అశాస్త్రీయ ఆలోచనలతో సాహిత్యరంగంలో తప్పుడు ధోరణులను ప్రవేశపెడుతూ వచ్చినప్పుడు (1979) దానిని ఖండించి అసలైన విప్లవవాద సాహిత్య దృక్పథాన్ని గురించిన అవగాహన ఇవ్వడానికి త్రిపురనేని మధుసూదనరావు పూనుకొన్నాడు. 'సాహిత్యం - మార్క్సిజం' (సృజన, 1979, ఆగస్టు / సెప్టెంబరు) అనే వ్యాసంలో గతితార్కిక భౌతికవాదాన్ని, చారిత్రక భౌతికవాదాన్ని విపులంగా పరిచయం చేస్తూ ఆ వెలుగులో సాహిత్యాన్ని మార్క్స్ ఏంగెల్స్ వంటివారు ఎలా చూశారో, మార్క్సిస్టు సిద్ధాంతవేత్తలు దానిని ఎలా వ్యాఖ్యానించారో చెప్పాడు. ఇందులోని ప్రతిపాదిత అంశాల ప్రాతిపదిక మీద విస్తృతంగా చర్చ జరిగింది. సురేంద్రరాజు, సి. రామచంద్రారెడ్డి, కె. బాలగోపాల్ ఇందులో పాల్గొన్నారు.

సరిగా ఆ సమయంలోనే మధుసూదనరావు వలె ఆర్.ఎస్. సుదర్శనం వ్యాసంపై స్పందించి కేతవరపు రామకోటిశాస్త్రి ఒక వ్యాసం రాశారు. రచయితలపై రాజకీయవాది ఆధిపత్యాన్ని వ్యతిరేకిస్తూ అలా రాజకీయవాదులు రచయితను నియంత్రించడం మార్క్సిజం ప్రకారం తప్పని చెప్పడానికి ఆర్.ఎస్. సుదర్శనం చేసిన ప్రయత్నం మార్క్సిస్టు రాజకీయాలపై వ్యతిరేకతను ప్రదర్శిస్తున్నదని ఆయన ఆ వ్యాసంలో అభిప్రాయపడ్డాడు. సుదర్శనంగారి వాదాన్ని పరాస్తం చేసే తర్కంతో, అన్వయంతో ఆ వ్యాస రచన జరిగింది[7]. సమకాలంలో చర్చలోకి రావలసిన ఈ వ్యాసం చాలా కాలం

అముద్రితంగా ఉండిపోయింది.

సాహిత్యానికి మార్క్సిజానికి ఉన్న సంబంధాన్ని చర్చించే ఈ క్రమంలోనే త్రిపురనేని మధుసూదనరావు 'గతితార్కిక సాహిత్య భౌతిక వాదం' అనే సిద్ధాంత ప్రతిపాదన చేశాడు. (సృజన 1980, జూన్, జూలై 5-16) గతితార్కిక భౌతికవాద ప్రాపంచిక దృక్పథం నుండి సాహిత్యాన్ని పరిశీలించడం గతితార్కిక సాహిత్య భౌతికవాదం అని నిర్వచించి, గతితార్కిక భౌతికవాదం ప్రకృతి పరిణామ సామాజిక పురోగమన సూత్రాల పరస్పర సంబంధంలో రూపొందింది అని వివరణనిచ్చాడు. గతితార్కిక భౌతికవాదం అన్నా మార్క్సిజం - లెనినిజం - మావో ఆలోచనా విధానం అన్నా ఒకటే అని స్పష్టం చేశాడు. ఆ రకంగా మార్క్సిజం లెనినిజం మావో ఆలోచనా విధానం వల్ల అభివృద్ధి చెందిన ప్రాపంచిక దృక్పథం నుండి సాహిత్యాన్ని పరిశీలించే పద్ధతిని స్థాపించాడు.

పునాది ఉపరితలాన్ని నిర్ణయిస్తుంది, ప్రభావితం చేస్తుంది, ఉపరితలం పునాదిని బట్టి దానికి అనుగుణంగా ఉంటుంది అనే ఏకైక నిర్ణాయక వాదాన్ని నిరాకరించి పునాది ఉపరితలాల మధ్య ఆంతర గతితర్కాన్ని నొక్కి చెప్పాడు త్రిపురనేని. ఆ ప్రాతిపదిక మీదనే సమాజం అంటే అన్యోన్యం, ఒకదానినొకటి ఆశ్రయించి పరిమాణాత్మక, గుణాత్మక మార్పులకు లోనయ్యే వ్యవస్థల మొత్తం అని నిర్ధారించి వాటిలో ఒకటిగా ఉన్న సాహిత్యాన్ని నిర్దిష్టంగా చారిత్రక దృష్టితో, గతితార్కిక దృష్టితో పరిశీలన చెయ్యాలన్నాడు. ఈ క్రమంలో సాహిత్యం సార్వకాలికం, సార్వజనీనం, విశ్వజనీనం అనే వాదాన్ని తోసిరాజన్నాడు.

ప్రజాహిత కార్యాచరణోన్ముఖతను ప్రేరేపించడం మార్క్సిస్టు దృక్పథంతో చేసే విమర్శలో ముఖ్యమైన విధి అని[8], ప్రజలంటే వర్గసమాజంలో దోపిడికి గురయ్యేవాళ్ళేనని, ప్రజలంటే ప్రధానంగా కార్మిక రైతాంగవర్గమేనని[9], ప్రజా విప్లవ వ్యతిరేకాలయిన రాజకీయ మత సాహిత్యాలను విప్లవ సిద్ధాంతంలో తీవ్రంగా ఎదుర్కొనే సాంస్కృతిక పోరాటమే విప్లవ విమర్శనం అని[10] కె.వి. రమణారెడ్డి నుండి సాగవలసిన విమర్శ లక్షణాలను ఈ కింది విధంగా క్రోడీకరించవచ్చు.

- రచయితను దేశకాల జాతి పరిసరాల సాపేక్షత నుండి పరిశీలించి విలువకట్టడం.
- కళా సాహిత్యాలు వ్యక్తి ఆశ్రయాలు అనుకొని వ్యక్తుల ప్రతిభా పాటవాల నిరూపణపై కాక, వ్యక్తులను సమిష్టిపరంగా అర్థం చేసుకొనడం, రచయితను రచన తోటి, రచనను సమస్త సామాజిక జీవితంతోటి అనుసంధానించి విమర్శించడం.
- మనిషి చైతన్యం సాంఘిక జీవనం నుంచి రూపొందుతుంది. సాంఘిక జీవనానికి మూలాధారం ఆర్థికం. భౌతికావసరాలకు అవసరమైన వస్తువుల ఉత్పత్తి విధానం సాంఘిక జీవనాన్ని నిర్ణయిస్తుంది. దానిని బట్టే రాజకీయబౌద్ధిక సాహిత్య సాంస్కృతిక కళాంశాలన్నీ రూపొందుతాయి. అందువల్ల సాహిత్యం సర్వ స్వతంత్రమైనదిగా ఉండనేరదు. సాహిత్యం స్వతంత్ర ప్రతిపత్తి కల అంశం అనుకొవడం అశాస్త్రీయం. సాహిత్యం కానీ, సాహిత్య విమర్శకానీ జీవిత వాస్తవం నుంచీ, వర్గపోరాటం నుంచీ, రాజకీయ సంఘర్షణ నుంచి స్వతంత్రించినవి కావు. సాహిత్యం నిర్దిష్ట సామాజిక వ్యవస్థకు చెందిందిగా ఉంటుంది. కాబట్టి సాహిత్య విమర్శ సహజ విమర్శగా ఉంటుంది.
- సాంఘిక ప్రాముఖ్యం కలిగిన ఏ గొప్ప సాహిత్య పదార్థాన్నైనా అంచనా వేసేటప్పుడు దాని చారిత్రక ప్రాతిపదికను ముందర నిరూపించాలి. వివిధ సాంఘిక శక్తుల సంబంధాన్నీ, భిన్న వర్గాల దృక్పథాలను తెలుసుకుని, ఘటనాక్రమంలో అత్యంత కీలకమైన లంకెను వెదికి పట్టుకోవాలి. రచయిత అభిప్రాయాలలోనూ రచన ధోరణులలోనూ ఇది ఎలా ప్రతిబింబించిదీ చూపెట్టాలి.
- రచయితలు పుట్టి పెరిగిన వర్గం తాలుకూ మనస్తత్వం వ్యక్తులుగా వారిలో ప్రత్యక్షమైనప్పటికీ, రచనలో ఆ మనస్తత్వాన్ని వదిలించుకొని, స్వవర్గ భావ పరిమితులను మీరి చారిత్రకంగా అభ్యుదయ వైఖరిని అవలంబిస్తున్నారా లేదా అనేది విమర్శలో ముఖ్యాంశం కావాలి.
- కవులను రచయితలను శాస్త్రీయమైన సామాజికమైన ఉన్నత ఆశయాలవైపు చైతన్యవంతం చేస్తూ, ప్రజా వ్యతిరేక మానవతా వ్యతిరేక సాహిత్యంలోని నీచాభిరుచుల్ని ఎత్తి చూపుతూ సాహిత్యాన్ని ప్రజాపరం చేసే కర్తవ్యాన్ని విమర్శ నిర్వహించాలి.

త్రిపురనేని మధుసూదనరావు ప్రతిపాదించిన గతితార్కిక సాహిత్య భౌతికవాదాన్ని ఖండిస్తూ ఏటుకూరి బలరామమూర్తి రాసినది, దానికి సమాధానంగా త్రిపురనేని రాసినది (సృజన 1981 జూలై) విప్లవ విమర్శ విధానాన్ని నిర్ధారించే క్రమంలో, నిరూపించే క్రమంలో, బలపరిచే క్రమంలో జరిగిన సైద్ధాంతిక భావ సంఘర్షణలు. ఈ సందర్భంలోనే త్రిపురనేని సంప్రదాయవాద, అనుభూతి లేదా హృదయవాద, అభ్యుదయవాద విమర్శ పరిమితులను, వాటిలోని వ్యక్తివాద అశాస్త్రీయ ధోరణులను విమర్శకు పెట్టి నిర్దిష్టకాలంలోని, నిర్దిష్ట సమాజంలోని కవిత్వాన్ని నిర్దిష్టంగా, చరిత్ర క్రమంలో భాగంగా పరిశీలించాలని, గతితార్కిక విమర్శన పద్ధతే శాస్త్రీయమైనదని మరొకసారి నొక్కిచెప్పాడు (సృజన 1981, ఫిబ్రవరి / మార్చి). అంతే కాదు, లెనిన్ పరావర్తన సిద్ధాంతాన్ని విప్లవ సాహిత్య విమర్శ సూత్రంగా కూడా ప్రతిపాదించాడు. (అరుణతార 1984)

ఈ కాలంలో సాహిత్య విమర్శరంగంలో రెండు పుస్తకాలు వచ్చాయి. ఒకటి - తెలుగులో కవితా విప్లవాల స్వరూపం, వేల్చేరు నారాయణ రావు రాసినది. రెండు - కవిసేన మానిఫెస్టో. గుంటూరు శేషేంద్ర శర్మ రచన. విప్లవ విమర్శ పద్ధతి రూపొందుతున్న కాలంలో వచ్చిన ఈ రెండు రచనలు విప్లవ దృక్పథం నుండి విమర్శించ బడ్డాయి. కవితా రంగంలోని అవసరాలు, మార్పులు కవితా విప్లవాలకు కారణం అవుతాయనడం గతి తార్కిక చారిత్రక సాహిత్య భౌతికవాదం ప్రకారం అశాస్త్రీయమే అయినా, కవితా విప్లవాలకు సామాజిక కారణాలను చూపలేకపోవడం వల్ల ఏర్పడిన

ఖాళీలు అనేకం ఉన్నా వేల్చేరు విమర్శ అనుకూల దృక్పథం నుండి చూడవలసిన విమర్శ అని, అది కొత్త ఆలోచనలకు ప్రేరణ అవుతున్నదని త్రిపురనేని వంటివారు వ్యాసాలు రాశారు (అరుణతార 1978 అక్టోబరు / 1979 జనవరి)

. సామాజిక చైతన్యం, సాహిత్యం సమాజానికి ప్రతిబింబం వంటి మార్క్సిస్టు భావనలను, మార్క్సిస్టు ముసుగులోనే నిరాకరించేందుకు పాండిత్య ప్రకర్షను అసంగతంగా, అశాస్త్రీయంగా వాడుకొన్నందుకు బాలగోపాల్ (సృజన 1981 సెప్టెంబర్) నమ్ముమవంటివారు కవి సేన మానిఫెస్టోను పూర్తిగా నిరాకరించారు. మార్క్సిస్టు విమర్శ అంటే ఎలా ఉండాలో, ఎలా ఉండకూడదో నిర్ధారించి సోదాహరణంగా చూపించి చెప్పడానికి ఈ సందర్భాలు ఉపకరించాయి.

సరిగా అదే సమయంలో వరవరరావు తెలంగాణ విమోచనోద్యమం - తెలుగు నవల, సమాజ, సాహిత్య సంబంధాలు అనే తన పిహెచ్‌డి సిద్ధాంత గ్రంథం ద్వారా మార్క్సిస్టు సాహిత్య విమర్శలోకి రాజకీయార్థిక భావనను బలంగా ప్రవేశపెట్టాడు. "రాజకీయ అర్థశాస్త్రమంటే చారిత్రక శాస్త్రం. అది చారిత్రక విషయాల గ్రహించి వివరిస్తుంది. అయితే నిరంతరం మారుతున్న చారిత్రక విషయాల గురించి వివరిస్తుంది. రాజకీయ అర్థశాస్త్రం దాని విస్తృత అర్థంలో మానవ సమాజ ఉనికికి అవసరమైన భౌతిక వనరులు ఉత్పత్తి కావడంలోను, వినిమయం కావడంలోను ఏ సూత్రాలు పనిచేస్తున్నాయో వివరించే శాస్త్రం" అని వివరించి ప్రజల ఆర్థిక మూలాలపై నిర్మాణమైన చరిత్రను, సంస్కృతిని ప్రతిబింబించినందువలన 'గంగు' నవల రాజకీయ ఆర్థిక ప్రాతిపదిక నవల అవుతుందని నిరూపించాడు వివి. (1983)[11] అప్పటి నుండి వివి సాహిత్య విమర్శలో అది అంతస్సూత్రంగా పని చేస్తూ రావడం గమనించవచ్చు. రాజకీయ అర్థశాస్త్ర భావనలతో సాహిత్య విమర్శను సుసంపన్నం చేసుకొనాలన్న ఆకాంక్ష సి.వి. సుబ్బారావు 'విభాత సంధ్యలు' పుస్తకానికి సంపాదకుడుగా రాసిన ముందుమాటలో (1986) కనిపిస్తుంది. తెలుగులో వస్తున్న సాహిత్య విమర్శ ధోరణులను ప్రస్తావిస్తూ, వాటికి భిన్నంగా ఉండే మార్క్సిస్టు విమర్శను గురించి ప్రస్తావించి నిర్దిష్ట స్థలకాలాలలో, నిర్దిష్ట సామాజిక ధోరణుల ప్రభావంతో సాహిత్యం తన అస్తిత్వాన్ని పొందడం మార్క్సిస్టు విమర్శలో అంశాలుగా పేర్కొన్నాడు సి.వి. విప్లవసాహిత్యాన్ని సానుభూతితో పరిశీలిస్తే అది విప్లవ విమర్శ కానేరదన్నాడు. సాహిత్యం సామాజిక చలన సూత్రాలకు అనుగుణంగానే ఉంటుంది. ఈ చలన సూత్రాలకు కేంద్రం ఆర్థిక పునాది. అయితే ఆర్థిక పునాది ఒక్కటే సాహిత్యానికి నిర్ణాయకాంశం కాదు. మతం, తత్వశాస్త్రం, రాజకీయాలు, న్యాయవిధానం, భాష, సంస్కృతి వగైరా ఉపరితల అంశాలు కూడా సాహిత్యంలో అనేక మార్పులను నిర్ణయిస్తాయి. సాహిత్యం మీద వీటి ప్రభావం ఏకపక్షంగా ఉండదు. అది అన్యోన్య ప్రక్రియలో భాగంగా ఉంటుంది' అన్న అవగాహన మాత్రమే ప్రస్తుత సాహిత్య విమర్శనా ధోరణులలోని పరిమితులను అధిగమించడానికి మార్గమని సుబ్బారావు ఈ ముందుమాటలో స్పష్టం చేశాడు.

సామాజిక చరిత్ర పరిధిలో సాహిత్యాన్ని పరిశీలించడం ఒక పద్ధతి అని దీనికి సమాజం గురించి ఒక విశ్లేషణాత్మక అవగాహన ఉండడం మొదటి షరతని, అలాగే రచయిత చైతన్యం, సంకల్పం మొదలైనవి గమనికలోకి తీసుకొనదగినవని సివి అభిప్రాయపడ్డాడు. ఈ నేపథ్యంలో సాహిత్యాన్ని సామాజిక శాస్త్రాల పరిజ్ఞానంతో పరిశీలించడం ఒక సూత్రంగా సాహిత్య విమర్శ చేయవచ్చునని ప్రతిపాదించాడు[12].

నిజానికి ఏ సాహిత్యాన్ని అంచనా వేయడానికైనా సమాజ సాహిత్య సంబంధాలపై పరిశీలన అవసరమని, విమర్శకులకు రచయితకున్న పాటి సమాజ పరిజ్ఞానం లేకపోవడం, సామాజిక శాస్త్రవేత్తలకు సాహిత్య పరిచయం లేకపోవడం ఈ రకమైన విమర్శకు అవరోధంగా ఉందని 1981లోనే సి.వి. గుర్తించాడు. 'సామాజికార్థిక రాజకీయ విజ్ఞాన పరిచయం లేకుండా సాహిత్యం అవగాహన కావడం కష్టం' అన్న అవగాహనతో కాత్యాయనీవిద్మహే, వి. శోభ కలిసి రాబందులు - రామచిలుకలు నవలపై రాసిన చిన్న పుస్తకానికి రాసిన సమీక్షలో ఇది కనబడుతుంది. వారి విమర్శ చాలావరకు సరి అయిందే అని చెప్తూ ఇది ఇప్పుడిప్పుడే వస్తున్న విమర్శధోరణి కనుక దీనికి పద్ధతులను నిర్దేశించుకొనడం ఇంకా జరగాల్సే ఉందని సివి అభిప్రాయపడ్డాడు. ఆ పద్ధతులను అన్వేషించే క్రమంలోనే కన్యాశుల్కం, చదువు, యజ్ఞం మొదలైన సాహిత్య రచనలలో సామాజిక పరిణామాలను చలన శీలతను గుర్తించి విశ్లేషించే పని సామాజిక శాస్త్రాలలో నిపుణులైన ఆర్.ఎస్.రావు, హరగోపాల్, వకుళాభరణం, రామకృష్ణ, డి. నరసింహారెడ్డి వంటి వాళ్ళ చేత చేయించి 1986లో 'విభాత సంధ్యలు' పుస్తకం ప్రచురించాడు సి.వి. అర్థశాస్త్ర అధ్యాపకురాలైన జ్యోతిరాణితో కలిసి కాత్యాయనీ విద్మహే 'మా భూమి నాటకంలో వ్యవసాయ సంబంధాలు' వ్యాసం ప్రచురించడం (సృజన 1985 ఫిబ్రవరి) ఈ విధమైన కొత్త అధ్యయన విధాన నిర్మాణంలో భాగమే. రాజకీయార్థిక దృక్పథాన్ని మొత్తం స్త్రీల సాహిత్య అధ్యయనానికి అవసరమైన ఒక పద్ధతిగా ప్రతిపాదించడం[13], ప్రత్యేకించి కొకు వంటి వారి రచనల విశ్లేషణకు రాజకీయార్థిక సూత్రాలు ఎలా పనికి వస్తాయో నిరూపించడం[14] - మొదలైనవి తెలుగు సాహిత్య అధ్యయనంలోకి రాజకీయార్థిక దృక్పథాన్ని ప్రవేశపెట్టడంలో జరిగిన చెప్పుకోదగిన ప్రయత్నాలు.

హరి పురుషోత్తమరావు, చలసాని ప్రసాద్, వి. చెంచయ్య, వల్లంపాటి వెంకట సుబ్బయ్య, కె.కె. రంగనాథాచార్యులు, రాచపాళెం చంద్రశేఖరరెడ్డి వంటివారు సమాజానికి సాహిత్యానికి ఉన్న సంబంధాన్ని గురించి, విమర్శ స్వభావం గురించి, మార్క్సిస్టు విమర్శ విధానాన్ని గురించి సరియైన ఆలోచనలను చర్చలోకి, ప్రచారంలోకి తీసుకొని రావడంలో విశేషంగా కృషి చేశారు. ప్రత్యేక సాహిత్య సందర్భాలను, సాహిత్య ప్రక్రియలను, రచనలను, రచయితలను ఆ కోణం నుండి వ్యాఖ్యానించి విలువ కట్టే ప్రయత్నం చేశారు.

2

ప్రత్యేకించి సాహిత్య విమర్శ రచనలను విమర్శకు పెట్టడం ద్వారా మార్క్సిస్టు విమర్శ / రాజకీయార్థిక దృక్పథ విమర్శ సూత్రాలను దేశీయ అనుభవం నుండి నిర్ధారించే పని కూడా తెలుగు సాహిత్య విమర్శలో విశేషంగానే జరిగింది. త్రిపురనేని మధుసూదనరావు ఈ దిశగా చేసిన కృషి చెప్పుకోదగినది. శ్రీశ్రీ, కొడవటిగంటి కుటుంబరావు ఈ ఇద్దరి సాహిత్య విమర్శ వ్యాసాలను విశ్లేషిస్తూ ఆయన రాసిన వ్యాసాలు (సృజన 1980 జనవరి, నవంబరు రాజకీయార్థిక దృక్పథంతో సాగవలసిన విమర్శకు మార్గదర్శక సూత్రాలను ఇస్తాయి. ఆధునిక భారతీయ సమాజంలో సంభవించిన సంకీర్ణమైన మార్పుల నుంచి అన్వయించి చూస్తే శ్రీశ్రీ కవిత్వ దశలలో వచ్చిన మార్పులన్నీ శ్రీశ్రీ సాహిత్య విమర్శలో కూడా కనిపెట్టవచ్చునంటాడు త్రిపురనేని. జీవిత దృష్టి నుంచి కవిత్వాన్ని గాక కవిత్వ దృష్టి నుంచి జీవితాన్ని చూడడం శ్రీశ్రీ వ్యక్తిత్వంలో మౌలిక లక్షణం అని చెప్పి శ్రీశ్రీ సాహిత్య విమర్శలో అదే ప్రధాన లక్షణం అని పేర్కొన్నాడు[15]. శ్రీశ్రీ విమర్శలో కాల్పనిక ఉద్రేకం, సౌందర్యవాద ప్రభావం ఉంటాయని గుర్తించి చెప్పాడు. వీటికి పూర్తి విరుద్ధమైన అభ్యుదయ విమర్శనా పద్ధతి కూడా శ్రీశ్రీలో ఉందని శ్రీశ్రీ అభ్యుదయ విమర్శ మార్క్సిస్టు విమర్శనమేనా అన్న కీలకమైన ప్రశ్నను లేవనెత్తాడు. గతితార్కిక భౌతికవాదం గురించిన అవగాహన ఉన్నా చారిత్రక భౌతికవాదంలోని అన్ని అంశాలు ఆయన విమర్శలోకి రాలేదని పేర్కొన్నాడు[16]. అభ్యుదయ విమర్శలో మార్క్సిస్టు దృక్పథం స్థూలంగా మాత్రమే ఉందని, మార్క్సిజానికి విరుద్ధమైన అంశం శ్రీశ్రీ అభ్యుదయ విమర్శలో చాలా ఉందని చెప్పి ముఖ్యంగా వేమన, తిక్కనల కవిత్వాన్ని థీసిస్, యాంటీథీసిస్, సింథసిస్ అనే త్రయంతో అన్వయించడం[17], చారిత్రకంగా, సామాజికంగా ఏ సంబంధం లేని తిక్కన, వేమన, గురజాడలను ప్రజా కవులని చెప్పడం[18] అశాస్త్రీయమని చెప్పడం గమనించదగింది. డాడాయిజమ్, సర్రియలిజం, స్ట్రీమ్ ఆఫ్ కాన్షస్‌నెస్ వంటి ఆధునిక సిద్ధాంతాల ప్రభావం మార్క్సిజంతో సహా శ్రీశ్రీ సాహిత్య విమర్శతో కనబడుతుంది కనుక శ్రీశ్రీని మార్క్సిస్టు విమర్శకుడు అనడం కంటే ఆధునిక విమర్శకుడు అనడం సమంజసమని త్రిపురనేని అభిప్రాయం. శ్రీశ్రీ విమర్శ విధానాన్ని విశ్లేషించడం ద్వారా మార్క్సిస్టు విమర్శలో పరిహరించాల్సినవేవో చెప్పినట్లయింది.

సాహిత్య కళారంగాలపై కొడవటిగంటి అభిప్రాయాలను ఉటంకిస్తూ వ్యాఖ్యానిస్తూ త్రిపురనేని మధుసూదనరావు రాసిన కుటుంబరావు సాహిత్య తత్వం వ్యాసం కూడా మార్క్సిస్టు విమర్శాసూత్రాలను క్రోడీకరించుకొనడానికి ఉపయోగపడుతుంది. 'మన బూర్జువా సంస్కృతి ఫ్యూడల్ సాంకర్యం కలిగినది, ఫ్యూడల్ సంస్కృతిని నిర్మూలించి పైకి వచ్చినది కాదు. దానితో చేతులు కలిపి రాజీపడినది'. అన్న కొకు వాక్యం సాహిత్య సాంస్కృతిక రంగాలను అర్థం చేసుకోవడానికి పనికి వచ్చే సూత్రీకరణ అంటాడు త్రిపురనేని[19]. ఆధునిక అభ్యుదయ రచనల్లోని భూస్వామ్య ఆలోచనలను పసికట్టి హెచ్చరించడానికి ఇది ఉపయోగపడుతుంది. కొకు జీవితానికి, సాహిత్యానికి ఉన్న శాస్త్రీయ సంబంధాన్ని గుర్తించాడని అది సాహిత్య విశ్లేషణకు, సాహిత్య విలువల నిర్ధారణకు పనికి వచ్చే అంశమని అన్నాడు[20]. సాహిత్యంలో సంఘర్షణలు సిద్ధాంత సంఘర్షణలేవని కొకు చెప్పినది కూడా సాహిత్య చరిత్ర అధ్యయనానికి పనికి వస్తుందని త్రిపురనేని భావించాడు. కొకు సాహిత్య విమర్శను 1970కి ముందూ తరువాత అని పరిశీలించి చూస్తే మార్పు కనబడుతుందని త్రిపురనేని అభిప్రాయం. విరసం దశాబ్దిలో కొకు సాహిత్య విమర్శ మార్క్సిస్టు విమర్శగా స్పష్టతతో ఉందని కూడా చెప్పాడు.

1937 నుంచి 1980 వరకు కుటుంబరావు రాసిన సాహిత్య వ్యాసాలలో ఆధునిక సాహిత్యానికి సరిపోయే విమర్శాశాస్త్రం గోచరమవుతుందంటాడు వి. చెంచయ్య. మార్క్సిస్టు దృక్పథం, జీవితానుభవం, సామాజికతత్వం, రాజకీయ జ్ఞానం సాహిత్య విమర్శకు మౌలిక అంగాలుగా కొకు ప్రతిపాదించాడని, ఆలోచనలు రేకెత్తించడం సాహిత్య ప్రయోజనంగా కొకు భావించాడని, సాహిత్య ఉద్యమ స్వభావం, సాహిత్య సమిష్టితత్వం మొదలైనవి కొకు విమర్శలో ప్రతిపాదిత అంశాలని విమర్శకు వర్గ స్వభావం ఉండాలని కొకు భావించాడని చెంచయ్య ఈ వ్యాసంలో సూచించాడు. 'బాలగోపాల్ సాహిత్య విమర్శ' వ్యాసంలో చెంచయ్య (అరుణతార అక్టోబరు - డిసెంబరు 2009) రూపానికి సారానికి ఉండే సంబంధం, వైరుధ్యం ప్రాతిపదికలుగా సాహిత్య విమర్శకు నమూనాలు ఇచ్చిన విమర్శకుడు బాలగోపాల్ అన్నాడు.

కొకు సాహిత్య వ్యాసాలు ఆధారంగా ఆయన మొత్తంగా తెలుగు సాహిత్య విమర్శకు మార్క్సిస్టు దృక్పథాన్ని, ప్రత్యేకించి ఒక్కొక్క ప్రక్రియకు నిర్దిష్ట సూత్రాలను నిర్ధారించి చెప్పిన తీరును చూపుతూ రాయబడిన వ్యాసం తెలుగు సాహిత్య విమర్శకు కొకు అందించిన సూత్రాలు - దృక్పథం (2008). ప్రాచీన సాహిత్య విమర్శకు చారిత్రక సామాజిక దృష్టి కోణం ఉండాలన్నాడు కొకు. కథ భిన్న జీవిత క్రియా చైతన్యాలను వాటిని ప్రత్యక్షంగానో పరోక్షంగానో ప్రభావితం చేసే సాంఘిక రాజకీయ పరిస్థితుల కోణం నుండి, వ్యక్తివాదం, వ్యక్తి స్వాతంత్ర్యం మొదలైన భావనల నేపథ్యం నుండి, వర్ణ, వర్గ, ప్రాంత లింగ వర్గీకరణలకు గురి అయిన మనుషుల ప్రత్యేక జీవితానుభవాల, దృక్పథాల కోణం నుండి విమర్శకు పెట్టబడాలని సూచించినట్లు ఈ వ్యాసం పేర్కొన్నది. నవల విషయంలో కొకు విస్తృత జీవితానుభవం కీలకాంశంగా పేర్కొన్నాడు. ఉద్యమావసరాలను నిరూపిస్తూనో ఉద్యమక్రమాన్ని సమకాలంలోనే ప్రతిఫలిస్తూనో నవల రావడం ప్రయోజనవంతంగా ఉంటుందన్నాడు. రచన, ప్రయోగం, అది చిత్రించిన జీవితం, అందులోని వాస్తవికత నాటక రచయితలకు, నటులకు, నాటకానికి ప్రజా జీవితంతో ఉండవలసిన దగ్గర తనం అనే అంశాలు నాటక విమర్శకు కొకు అందించిన సూత్రాలుగా ఈ వ్యాసంలో వివరించబడింది[23].

శ్రీశ్రీ సాహిత్య వ్యాసాలు, ఉపన్యాసాలు మాత్రమే కాక

అనంతం, ప్రజ, వ్యూలు - రివ్యూలు వంటి రచనలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని సాహిత్యానికి సమాజానికి, సాహిత్యానికి రాజకీయాలకు ఉండే సంబంధం, రచయితలకు ప్రజల పట్ల, ప్రజలతో ఉండవలసిన సంబంధం వాస్తవికత, నిబద్ధత అనే అంశాలు సాహిత్య విమర్శకు కీలక సూత్రాలుగా ఆయన ప్రతిపాదించిన తీరును నిరూపిస్తూ వచ్చిన వ్యాసం 'శ్రీశ్రీ సాహిత్య విమర్శ దృక్పథం'[24].

తాపీధర్మారావు, రాచమల్లురామచంద్రారెడ్డి, త్రిపురనేని మధుసూదనరావు, వి. చెంచయ్య వంటి సాహిత్య విమర్శకుల విమర్శ రీతులను సమీక్షిస్తూ రాచపాళెం చంద్ర శేఖరరెడ్డి రాసిన వ్యాసాలు ఈ కోవలో చెప్పుకోదగినవి. ధర్మారావు సాహిత్య విమర్శ సామాజిక జీవిత కోణం నుండి సాగిందని, సామాజిక శాస్త్రాల నేపథ్యంలో ప్రాచీన సాహిత్యాన్ని అధ్యయనం చేయవలసిన అవసరాన్ని గుర్తుచేసిందని[25] వర్గ దృక్పథం; సాహిత్యానికి సమాజంతో, రాజకీయాలతో ఉండే సంబంధం ప్రాతిపదికగా సాహిత్య విమర్శ సాగాలని రారా భావించాడని,[26] అయితే ఆయన ప్రతిపాదించిన హృదయవాదం వివాదాస్పదమైందని రాచపాళెం ఈ వ్యాసాలలో పేర్కొన్నాడు. సాహిత్య విమర్శను విప్లవీకరించిన వాడుగా త్రిపురనేని మధుసూదనరావును పేర్కొని విమర్శ ఆయుధంగా ఆయన సాగించిన సాహితీ పోరాటాలను నాలుగు రకాలుగా గుర్తించి చూపాడు రాచపాళెం. అవి 1. సనాతనవాదులు ఆధునిక పంక్తిలోకి రకరకాల వాదాలతో జొరబడుతుంటే ప్రతిఘటించడం. 2. ఆధునికులుగా కనిపిస్తూ సనాతనత్వాన్ని గర్భీకరించుకున్న వాళ్ళ గుట్టును రట్టు చేయడం. 3. ఆధునికులుగా ఉంటూ అలవాటు ప్రకారమో మరే కారణం చేతనో అప్పుడప్పుడు సంప్రదాయ లక్షణం ప్రదర్శించే వాళ్ళను హెచ్చరించడం. 4. సంప్రదాయవాదులుగానే ఉండేవాళ్ళ సంప్రదాయవాద అశాస్త్రీయతను ఎండగట్టడం[27]. త్రిపురనేని మధుసూదనరావు సాహిత్య విమర్శ వ్యాసంగాన్నంతా ఒకచోటికి తెచ్చి రాచపాళెం చేసిన ఈ నాలుగు సూత్రీకరణలు ప్రాతిపదికగా విశ్లేషించగలిగితే అది సాహిత్యరంగంలో మార్క్సిస్టు విమర్శ నిర్వహించిన పాత్రను ప్రయోజనకరంగా బయట పెట్టగలుగుతుంది. అదే విధంగా రాచపాళెం సాహిత్య విమర్శకు దృక్పథం, సమాజ చరిత్రలో భాగంగా సాహిత్య చరిత్రను చూడడం. సామాజిక స్పృహ, సామాజిక చైతన్యం అనే భావనలను వి. చెంచయ్య బలంగా ప్రతిపాదించి చెప్పాడని[28] నిర్ధారించడం జరిగింది. వీటన్నిటిని క్రోడీకరించుకొంటే మార్క్సిస్టు విమర్శ సూత్రాలు విస్పష్టమవుతాయి.

రాచపాళెం సాహిత్య విమర్శ పద్ధతి కూడా మార్క్సిస్టు విమర్శలో భాగంగానే సాగింది. రాచపాళెం కథా సాహిత్యం మీద రాసిన వ్యాసాలను గమనిస్తే కథా విమర్శకు ఆయన కథకు జీవితంతో ఉండే సంబంధం, కథలకు రాజకీయాలతో ఉండే సంబంధం, కథలో కనబడే సాంఘిక చైతన్యం అనే మూడు సూత్రాలను నిర్ధారించి చెప్పినట్లు కనబడుతుంది.[29]

సాహిత్య విమర్శపై వచ్చిన వ్యాసాలకు ప్రతిస్పందించడం. విమర్శ గ్రంథాలను సమీక్షించడం మొదలైన ప్రక్రియల ద్వారా విప్లవ విమర్శ విధానాలను నిరూపిస్తున్న మరొక రచయిత 'ధరణి', 'జగతి' అన్న కలం పేర్లతో రాస్తున్న పాణి. ఆంధ్రజ్యోతిలో తిరుపతిరావు రాసిన 'విమర్శ శిల్పం' పుస్తక సమీక్షకు, వార్తలో పెన్నా శివరామకృష్ణ సాహిత్య విమర్శ స్థితిగతులపై రాసిన వ్యాసానికి ప్రతిస్పందిస్తూ రాసిన వ్యాసాలు (అరుణతార, అక్టోబరు 2003, అరుణతార జనవరి - ఫిబ్రవరి, 2005), విమర్శకుడిగా కె.వి. రమణారెడ్డి, మైదానం లోతుల్లోకి అనే రెండు సాహిత్య విమర్శ గ్రంథాలపైన విడివిడిగా రాసిన వ్యాసాలు (అరుణతార, జనవరి 2006, అరుణతార, డిసెంబరు 2006) సాహిత్య విమర్శ విషయంలో ధరణి చూపిస్తున్న శ్రద్ధను సూచిస్తాయి. ముఖ్యంగా విమర్శకులు ఒక్కొక్కరుగా చేసిన కృషిని అంచనా వేసేటప్పుడు ఆ విమర్శకులు ఎన్ని పుస్తకాలు రాశారని కాక మొత్తం కృషిలో వాళ్ళు ఏ పద్ధతిని పాటించారు? అందులో వచ్చిన పరిణామ క్రమం ఏమిటి? దానికి ప్రామాణికత ఎంత అనే ప్రశ్నలతో ఆలోచిస్తే సరియైన ఫలితాలు వస్తాయన్నది పాణి అభిప్రాయం.

అడ్లూరి రఘురామరాజు రాసిన మైదానంలోతుల్లోకి అనే పుస్తకాన్ని సమీక్షిస్తూ వాచక కేంద్రక విమర్శ గురించి ఆసక్తికరమైన అంశాలు ప్రస్తావించాడు పాణి. వచన ప్రక్రియల అధ్యయనానికి వాచక విశ్లేషణ ఒక మంచి పరికరం అని అంగీకరిస్తూనే వాచకం లోపలి పొరల్లోకి దృష్టి సారించడం - రచనలోని శక్తిని, రచయిత దృక్పథాన్ని బయటకు తీయడానికి ఉపయోగపడాలంటాడు. పాత్రల మానసిక ప్రపంచం నుండి అక్కడి ఘర్షణ నుండి వాచకాన్ని పరిశీలించడం, వాచకంలో నుండి పాత్రల మనస్తత్వాన్నీ, దాని కారణాలను వెతకడం - అన్న రెండు కోణాల నుండి వాచక విమర్శ చేయడం రచన లోతులను అర్థం చేసుకోవడానికి ఉపయోగపడుతుందని సూత్రీకరించాడు. సామాజిక సాహిత్య దృక్పథం లేకపోతే వాచక కేంద్ర విమర్శ సాహిత్యానికి, వాచకానికి స్వతంత్ర్య ప్రతిపత్తిని ఆపాదించే ప్రమాదముందని కూడా ధరణి ఈ వ్యాసంలో హెచ్చరించాడు.

ఇదంతా సాహిత్య విమర్శా అన్న మరొక వ్యాసంలో (అరుణతార, జూలై-సెప్టంబరు 2009) విమర్శ భావజాల ప్రభావం నుండి కాక శాస్త్రీయ పద్ధతిలో సాగాలని అప్పుడే దానికి శాస్త్రీయ ప్రతిపత్తి సమకూడుతుందని అంటాడు పాణి. శాస్త్రీయ పద్ధతి అంటే నిర్దిష్ట సిద్ధాంతంతో విషయాన్ని నిరూపించే పద్ధతి. ఆ సిద్ధాంతానికి భావజాలంతో సంబంధం ఉంటుంది. అయితే విమర్శ భావజాలానికి సిద్ధాంతానికి మధ్య ఉండే సన్నని గీత సరిహద్దులలో జరగడం అభిలషణీయం అని పాణి అభిప్రాయం[30].

'భూమితో మాట్లాడు - కల్పనా సాహిత్యం' వివి సాహిత్య విమర్శ వ్యాసాల సంకలనం. దీనిని సమీక్షిస్తూ రాసిన వ్యాసంలో (అరుణతార, ఫిబ్రవరి, మార్చి 2006) వివి విమర్శ చరిత్రను, తత్వశాస్త్రాన్ని, రాజకీయ అర్థశాస్త్రాన్ని విప్లవోద్యమ చరిత్ర, ప్రజా ఆచరణల ప్రాతిపదిక మీద సమ్మేళనం చేసుకొన్న సిద్ధాంతంతో సాగుతుందని ధరణి సూత్రీకరించాడు. కథా వస్తువును, పాత్రలను

సంఘటనలను వాటి గమనం, విస్తరణ, ముగింపుల దృష్ట్యా కాకుండా అవి లొకేట్ అయ్యే సందర్భం వివి విమర్శలో ముఖ్యాంశమని గుర్తించి చెప్పాడు. నందిగం కృష్ణారావు కథల విమర్శ సందర్భంలో వివి చేసిన సూత్రీకరణ - 'రాజ్య వ్యవస్థకు, ధర్మానికి ఉన్న తాత్త్విక సామాజిక సంబంధం ఆస్తిపర వర్గాల ప్రయోజనాలను కాపాడడమే' అన్నది రావిశాస్త్రి, పతంజలి, జింబో వంటి వాళ్ళ కథల విశ్లేషణకు కూడా పనికి వస్తుందంటాడు ధరణి. ఈ విధంగా విమర్శకుల సాహిత్య విమర్శకృషిని అంచనా వేస్తూ చేసే విమర్శ మార్క్సిస్టు విమర్శకు అవసరమైన సూత్రాలను నిగ్గు తేల్చుకోవడానికి సహాయకారి అవుతుంది.

శ్రీశ్రీ, కొకు, కె.వి. రమణారెడ్డి, త్రిపురనేని మధుసూదనరావు, చలసాని ప్రసాద్, వరవరరావు, కాకరాల, కళ్యాణరావు, సి.ఎస్.రావు, చెంచయ్య, హెచ్చార్కే, బాలగోపాల్, సి.వి. సుబ్బారావు, పి.జె. వర్ధనరావు, రామ్మోహనరాజు, హరి, రహీ, భూమన్, పదరా, పాణి, శివారెడ్డి, నందిని సిధారెడ్డి, నాగరాజు, నాగేశ్వరాచారి, జుగాష్విలి, ఉషా ఎస్. డానీ, జగన్మోహనాచారి (జె.సి.), వేణుగోపాల్, వెంకట కృష్ణ, కాశీం, ఉదయ్, ప్రశాంత్, ఎం. రవీందర్, నమ్ము సంగ్రామ్, ఛాయారాజ్, నటరాజ్, సురేందర్ రాజు, రంగనాయకమ్మ, కృష్ణాబాయి, ఓల్గా, అరుణ, ముదునూరి భారతి, నల్లూరి రుక్మిణి, లక్ష్మీ సుహాసిని, డా. నళిని, జ్యోతి, కాత్యాయని, పి. వరలక్ష్మి, పి. మోహన్, అవిశెట్టి ప్రభాకర్, అల్లం రాజయ్య, తుమ్మేటి రఘోత్తమరెడ్డి, బి.ఎస్. రాములు, పాపినేని శివశంకర్, రవిబాబు, దివి కుమార్, నిర్మలానంద - వంటి వారెందరో మార్క్సిస్టు సాహిత్య విమర్శను అభివృద్ధి చేసే పనిలో నిమగ్నులు. విప్లవ దృక్పథంతో తెలుగు సాహిత్య విమర్శను అభివృద్ధి పరచడంలో కె.కె. రంగనాథాచార్యులు, కె.వి. రామకోటిశాస్త్రి, చేకూరి రామారావు, వల్లంపాటి వెంకటసుబ్బయ్య, నోముల సత్యనారాయణ, రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, కాత్యాయనీ విద్మహే వంటివారు పనిచేస్తున్నారు. ఇలా ఎంత చెప్పినా ఈ జాబితాలో చేరనివాళ్ళు ఇంకా ఎందరో ఉంటారు. విప్లవ సాహిత్య విమర్శకుల, విప్లవ దృక్పథంతో సాహిత్య విమర్శ చేసిన విమర్శకుల వాఙ్మయ సూచిక తయారు చేస్తే కానీ విప్లవ దృక్పథ విమర్శ పని కొరకు ఉన్న బలగం ఎంతో తెలిసిరాదు. అది తెలిసి వచ్చే కొద్దీ విప్లవవాద విమర్శబలం కూడా తెలిసివస్తుంది.

అంతేకాదు, మార్క్సిస్టు పద్ధతిలో కవిత్వం, కథ, నవల, నాటకం మొదలైన ప్రక్రియలలోని ప్రత్యేక రచనల మీద వచ్చిన విమర్శలు - సమీక్షలు, ముందు మాటలు మొదలైన వాటితో సహా సేకరించి వాఙ్మయ సూచికలను తయారు చేయడం అధ్యయనం చేసి ఆయా ప్రక్రియలకు సంబంధించిన విమర్శ సూత్రాలను గుర్తించి క్రోడీకరించడం మార్క్సిస్టు విమర్శ సిద్ధాంతాన్ని దేశీయ మూలల నుండి నిర్దిష్టంగా రూపొందించుకోవడానికి ఉపయోగపడతాయి.

3

ఈ విధంగా మార్క్సిస్టు రాజకీయార్థిక సిద్ధాంతపు వెలుగులో సాహిత్య విమర్శ విధానాన్ని రూపొందించుకొనే క్రమం, సాహిత్య రచనలను విశ్లేషించే ప్రయత్నం నలభై ఏళ్ళుగా నడుస్తున్న చరిత్ర. మార్క్సిస్టు సాహిత్య సిద్ధాంతాలపైన, ఆ సిద్ధాంతాల అవగాహనతో సాగుతున్న విమర్శ ప్రయోగాల మీద బయటి నుండి వ్యతిరేకత, లోపల నుండి అసంతృప్తులు కూడా ఈ చరిత్రలో భాగమే. మార్క్సిస్టు సాహిత్య విమర్శ మార్క్సిస్టు సూత్రాల వల్లింపుగా ఉంటుందనో, అది వస్తువుకు ప్రాధాన్యతనిచ్చి శిల్పాన్ని పూర్తిగా విస్మరించిందనో, కళా సౌందర్య దృక్పథం కొరవడిందనో మార్క్సిస్టు సాహిత్య విమర్శ విధానాన్ని నిరసించేవారున్నారు. మౌలికంగా మార్క్సిస్టు సిద్ధాంతంలోని రాజకీయార్థిక దృక్పథం, అది ఆశించే ఆచరణ, దానికి ఆదర్శమైన అంతిమ లక్ష్యం - మొదలైన వాటిపట్ల ఉన్న వ్యతిరేకత అందుకు ప్రధాన కారణం.

కాగా ప్రారంభం నుండి మార్క్సిస్టు విమర్శ విధానాన్ని నిర్దిష్టంగా నిరూపించే పనిలో నిమగ్నమై ఉన్న కె.వి. రమణారెడ్డి వంటివారు కూడా మార్క్సిస్టు విమర్శ వికసిస్తున్న తీరును గమనిస్తూ మార్క్సిస్టు విమర్శకులు సౌందర్య దర్శనం వైపు దృష్టి మళ్ళించాల్సిన అవసరాన్ని గురించి హెచ్చరించడం[31] జరిగింది. గతితర్కాన్ని ఆమోదించిన వాళ్ళు కూడా సాహిత్య విమర్శను గతితార్కిక పద్ధతిలో సక్రమంగా చేయలేకపోతున్నారని త్రిపురనేని విచారాన్ని వ్యక్తం చేశాడు.[32] మార్క్సిస్టు విమర్శకు నమూనాగా గ్రహించదగిన గ్రంథ విమర్శగానీ, ప్రక్రియా విమర్శకానీ ఇంకా రావలసే ఉంది అని చేరా అభిప్రాయపడ్డాడు[33]. ఈ మధ్యకాలంలో అంటే గత దశాబ్దిలో మళ్ళీ మార్క్సిస్టు సాహిత్య విమర్శ గురించిన పునరాలోచనలు ప్రారంభమయ్యాయి. ఎన్. వేణుగోపాల్ మార్క్సిస్టు సాహిత్య విమర్శకు ఐదంశాలను ప్రాతిపదికగా చెప్పి అవి ఎంత వరకు పరిగణనలోకి తీసుకొనబడుతున్నాయన్న ప్రశ్నను ముందుకు తెచ్చాడు. తెలుగులో మార్క్సిస్టు సాహిత్య విమర్శను అభివృద్ధి చేయడానికి తగినంత కృషి జరగలేదని, ఇతర భాషల నుండి తెచ్చుకోవలసిన జ్ఞానం, ముఖ్యంగా మార్క్స్, ఏంగెల్స్ వంటివారు వివిధ సందర్భాలలో చేసిన సాహిత్య సిద్ధాంతాలు తెలుగులోకి రాలేదని, రూపం, సారం, నిర్దిష్టత, సాధారణీకరణ, చారిత్రక దృష్టి, వైరుధ్యాలు వంటి ప్రమేయాలతో సాహిత్య విమర్శ సమగ్రంగా జరగలేదని, పరిశీలన, వివరణ తప్ప విమర్శ, విశ్లేషణ, భవిష్యత్ సూచన మార్క్సిస్టు విమర్శలో కనబడవని, మార్క్సిస్టు సాహిత్య విమర్శకు కీలకమైన సమాజ సాహిత్య సంబంధాల మీద శ్రద్ధ, వస్తు శిల్పాల ఐక్యత గురించిన చింతన నిర్లక్ష్యానికి గురి అయ్యాయని అభిప్రాయపడ్డాడు.[34]

మార్క్సిస్టు సాహిత్య విమర్శకు దృక్పథం ఉన్నంతగా పద్ధతి లేకపోవడమే సమస్య అన్న ప్రతిపాదనతో పద్ధతిని అన్వేషించడానికి ఒక ప్రయత్నం 'చర్చ' పత్రిక చేసింది. 'సాహిత్యం-సామాజికత' అనే అంశంపై ప్రత్యేక వ్యాసాలతో 2009 జూలై సంచికను తీసుకొని వచ్చారు సంపాదకులు జి. భార్గవ. ఈ సంచికలో భార్గవ రాసిన 'సాహిత్య సిద్ధాంతం : మార్క్సిజం - సాధకబాధకాలు', పాణి రాసిన 'తెలుగులో మార్క్సిస్టు సాహిత్య సిద్ధాంతం - సమీక్ష' ఈ

సందర్భంలో ప్రస్తావించవలసినవి. భార్గవ త్రిపురనేని సిద్ధాంత వ్యాసాలను, పాణి 1940ల నుండి జి.వి. కృష్ణారావు, చంద్రం, సాములపర్తి సదాశివరావు మొదలైన వాళ్ళతో ప్రారంభించి కె.వి. రమణారెడ్డి, త్రిపురనేని మొదలైన వాళ్ళ మార్క్సిస్టు సాహిత్య సిద్ధాంత వ్యాసాలను ప్రస్తావిస్తూ రాశారు. ఇద్దరూ కూడా మధుసూదనరావు కృషి ప్రత్యేకమైనదిగా గుర్తిస్తూనే ఆయన అంత చేసి కూడా చారిత్రక భౌతికవాదాన్నే సరాసరి సాహిత్య సిద్ధాంతం అవుతుందన్న అభిప్రాయాన్ని కలిగించాడు తప్ప, దాని ఆధారంగా సాహిత్య సిద్ధాంతాన్ని నిర్దిష్టంగా నిరూపించలేకపోయాడని అభిప్రాయపడ్డారు.

సాహిత్యం ఒక సాంఘిక కలాపం కనుక సాహిత్య సిద్ధాంతం కూడా ఒక సామాజిక సిద్ధాంతమేనని, సామాజిక సిద్ధాంతాలు సామాజిక కార్యకలాపాల వెనుక పనిచేస్తున్న కారణాలను వివరించేవి, సామాజిక కార్యకలాపాల అర్థాలను, ఉద్దేశాలను గురించిన అవగాహన కలిగించేవి. అవి రెండు రకాలని ఈ వివరణాత్మక వ్యాఖ్యానాత్మక సిద్ధాంతాలు రెండూ సాహిత్య విమర్శ సిద్ధాంతంలో సమ్మిళితం కావాలనే వ్యాఖ్యానం దగ్గర ప్రారంభమై వివరణల దగ్గరకు ప్రయాణం విమర్శ లక్ష్యం కావాలని భార్గవ చెప్పాడు.[35] మార్క్సిస్టు సాహిత్య విమర్శకు ఆ నిర్దిష్ట రచనలోని భావజాల విమర్శ లక్ష్యమే కానీ దానికి సిద్ధాంతం, పద్ధతి ఒకటి ఉండాలని పాణి అంటాడు.[36]

ఆ దిశగా జరగవలసిన పని గురించిన పూనికే ఇప్పుడు కావలసింది. ఆ పనిని ఎంత సక్రమంగా సమర్థవంతంగా చేయగలిగతే అంతగా సమస్త కాలాల సమస్త ప్రక్రియల సాహిత్యాన్ని వ్యాఖ్యానించడానికి, వివరించడానికి, అవసరమైన సూత్రీకరణలను పరికరాలను అందించేదిగా మార్క్సిస్టు సాహిత్య విమర్శ సిద్ధాంతం బలోపేతం అవుతుంది.

పాదసూచికలు

1. రావి శాస్త్రీయం (కూర్పు: చలసాని ప్రసాద్) రాచకొండ ప్రచురణలు, విశాఖ పట్నం, మూడవ ముద్రణ, నవంబరు 1998, పు. 229.
2. చేరా - విప్లవవాదం (వ్యా) ఆధునిక తెలుగు సాహిత్యంలో భిన్న ధోరణులు (సం : కె.కె. రంగనాథాచార్యులు) ఆంధ్ర సారస్వత పరిషత్తు, తిలక్‌రోడ్డు, హైదరాబాద్, 1982, పు. 190.
3. పైదే, పు. XIV, 84
4. లక్ష్మీపతి - సాహిత్య విమర్శ - శాస్త్రీయ దృక్పథం, విరసం, మూడవ మహాసభల ప్రత్యేక సంచిక - 3, 1973, పు. 54.
5. కె.వి. రమణారెడ్డి - సాహిత్య విమర్శ - సాంఘిక దృక్పథం, పైదే, పు. 58.
6. కేతవరపు రామకోటిశాస్త్రి - సంఘర్షణ - సంవాదం, (సం. కాత్యాయనీ విద్మహే) జిజ్ఞాస ప్రచురణలు, అక్టోబరు 2004, పు. 8-20.
7. చలసాని ప్రసాద్, పైదే, పు. VI.
8. లక్ష్మీపతి - సాహిత్య విమర్శ - శాస్త్రీయ దృక్పథం, విరసం మూడవ మహాసభల ప్రత్యేక సంచిక, పు. 56.
9. భూమన్ - సాహిత్య విమర్శ - ప్రజలు, పైదే, పు. 68.
10. జ్యోతి - ఇటీవలి విమర్శనాధోరణులు, పైదే, పు. 73.
11. వరవరరావు - భూమితో మాట్లాడు... కల్పనా సాహిత్యం - వస్తు వివేచన, యుగ ప్రచురణలు జనవరి, 2005, పు. 15-21.
12. సి.వి. సుబ్బారావు - సాహిత్యంలో సమాజం - అనిశ్చిత అన్వేషణ, విభాత సంధ్యలు, సౌత్ ఇండియా పబ్లికేషన్స్, హైదరాబాద్, మార్చి 1986, పు. V-XIV.
13. కాత్యాయనీ విద్మహే, 20వ శతాబ్ది రాజకీయార్థిక పరిణామాలు - స్త్రీల సాహిత్యం - అవగాహన పత్రం (2000) చూడు: సాహిత్యాకాశంలో సగం, స్త్రీ జనాభ్యుదయ అధ్యయన సంస్థ, వరంగల్లు, ఫిబ్రవరి 2010, పు. 1-20
14. ఎన్. వేణుగోపాల్ -కొడవటిగంటి కుటుంబరావు తాత్విక రాజకీయార్థిక దృక్పథం - కొ.కు. సమకాలీనత, విరసం ప్రచురణలు 2010, పు. 62-66.
15. త్రిపురనేని మధుసూదనరావు - శ్రీశ్రీ ఆధునిక విమర్శకుడు, సృజన, జనవరి 1980, పు. 84.
16. పైదే, పు. 91
17. పైదే, పు. 92
18. పైదే, పు. 101
19. త్రిపురనేని మధుసూదనరావు - కుటుంబరావు సాహిత్యతత్త్వం, సృజన, నవంబరు 1980, పు. 21, 22.
20. పైదే, పు. 23.
21. పైదే, పు. 27.
22. వి. చెంచయ్య - విమర్శా శాస్త్ర శస్త్రకారుడు, భావవిప్లవకారుడు కొకు 1983, చూడు. సాహిత్య దృక్పథం, విరసం నెల్లూరు జిల్లా యూనిట్, 2001, పు. 1-8.
23. కాత్యాయనీ విద్మహే - తెలుగు సాహిత్య విమర్శకు కొకు అందించిన సూత్రాలు - దృక్పథం - ఆధునిక సాహిత్య విమర్శకులు - ప్రస్థానాలు (సం: సి.ఎచ్. లక్ష్మణ చక్రవర్తి, పి. వారిజారాణి, జి. విజయకుమార్) ఆంధ్ర విద్యాలయ స్నాతకోత్తర శాఖ, హైదరాబాదు, 2008, పు. 147-171.
24. కాత్యాయనీ విద్మహే - శ్రీశ్రీ సాహిత్య విమర్శ దృక్పథం, ప్రజాసాహితి, జూన్ 2010, పు. 21-26.
25. రాచపాళెం చంద్రశేఖరరెడ్డి - సాహిత్య విమర్శకుడుగా తాపీ ధర్మారావు, చర్చ, జనవరి 2006, పు. 6, 7.
26. పైదే, పు. 87-92
27. పైదే, పు. 178
28. పైదే, పు. 107, 108.
29. కాత్యాయనీ విద్మహే -
30. పాణి - తెలుగులో మార్క్సిస్టు సాహిత్య సిద్ధాంతం - సమీక్ష,

పాట/కవిత్వం

పాట పల్లవిస్తది.. ఆట తాండవిస్తది

- ఉప్పెన

పాటపైన ప్రభుత్వం కుట్ర పన్నిన
ఆటపైన ఈ రాజ్యం కక్ష కట్టిన
పాట బెదిరిపోదు... ఆట అదిరిపోదు
పాట ఆగిపోదు... ఆట ఓడిపోదు ||పాట||

సుబ్బారావు పాణిగ్రాహిణిని కాల్చేసిన
తామాడ చినబాబును హత్యచేసిన
పాట చావలేదు... ఆట ఆగలేదు
పాటను చంపలేరు... ఆటను ఆపలేరు ||పాట||

గద్దరన్న గుండెల్లో గుండ్లు దించిన
గాయకులనెందరినో హింస పెట్టిన
పాట మూగపోలే... ఆట ఆగిపోలే
పాట మారుమోగే... ఆట ధూంధామాయే ||పాట||

పోరు పాట పాడి జనం ఆటలాడిన
మరాండీ బృందానికి ఉరిని వేసిన
పాట చావబోదు... ఆట ఆగిపోదు
పాట పరుగుతీస్తది... ఆట ఉరకలేస్తది ||పాట||

డప్పులపై దరువులును నిషేధించిన
గజ్జెల మోతలపైన ఆంక్షపెట్టిన
మా చేతులు డప్పు కొడ్తయి... కాళ్ళు అడుగులేస్తయి
డప్పుల దరువులాగవు... గజ్జెల మోతలాగవు ||పాట||

పాటగాళ్ల గొంతులకు ఉరిని వేసిన
ఆటగాళ్ల కాళ్ళకు సంకెళ్ళు వేసిన
పాట మూగపోదు... ఆట ఆగిపోదు
పాట పల్లవిస్తది... ఆట తాండవిస్తది ||పాట||

(మరాండీ బృందానికి వేసిన ఉరిశిక్షను నిరశిస్తూ...)

మాకొద్దీ సీమాంధ్రుల పాలనా...

- స్వర్ణమ్మ

మా కొద్దీ సీమాంధ్రుల పాలనా
అమ్మో మనకొద్దీ దగాకోరు పాలనా ||మాకొద్దీ||
విద్యార్థి యువకులారా
కార్మిక రైతులారా - శ్రామిక జీవులారా
ఈ ఆంధ్ర వలస పాలనలో...
అనాదిగా కన్నీళ్ళే ||మాకొద్దీ||

పొట్టకూటి కోసమొచ్చి
మన పొట్టలు గొట్టిండ్రూ
ఆశ్రయము పొంది మన
ఆస్తులన్నీ దోచుకుండ్రు ||ఆస్తు||
హైదరబాదు సంస్థానము
ఆక్రమిత ప్రాంతమనీ
భాష యాస చరిత్రను
బందిఖాన చేసిండ్రూ ||బంది||
ఈ పాలెగాళ్ళే మన పాలిట..
పరిపాలకులయ్యిండ్రూ ||మాకొద్దీ||

భాషోద్యమ పేరు చెప్పి
బలిమి తోటి కలిసిండ్రూ
విశాలాంధ్ర పేరు చెప్పి
బతుకులిసం పోసిండ్రూ ||బతుకు||
తెలంగాణా గుండెచప్పు
డినిపించిన ఎస్.ఆర్.సి. ని

చర్చ, జూలై 2009, పు. 19.

31. కె.వి. రమణారెడ్డి - సాహిత్య విమర్శ - సాంఘిక దృక్పథం, విరసం మూడవ మహాసభల ప్రత్యేక సంచిక, పు. 59.
32. త్రిపురనేని మధుసూదనరావు - కవిత్వం - శాస్త్రీయ విమర్శ, సృజన, ఫిబ్రవరి, మార్చి 1981, పు. 66.
33. చేరా - విప్లవవాదం - ఆధునిక తెలుగు సాహిత్యంలో భిన్న ధోరణులు, పు. 201, 202.
34. ఎన్. వేణుగోపాల్ - తెలుగులో మార్క్సిస్టు సాహిత్య విమర్శ - పునరాలోచనలు, అరుణతార, డిసెంబరు 2006, పు. 52-55.
35. భార్గవ - సాహిత్య సిద్ధాంతం; మార్క్సిజం సాధక బాధకాలు, చర్చ, జూలై 2009, పు. 5, 7.
36. పాణి - తెలుగులో మార్క్సిస్టు సాహిత్య - సిద్ధాంతం - సమీక్ష, చర్చ, జూలై 2009, పు. 17, 19.

యోగివేమన విశ్వవిద్యాలయం తెలుగు శాఖ 2011 జూలై 26, 27 తేదీలలో 'తెలుగు సాహిత్య విమర్శ - చారిత్రక భావజాల (దృక్పథ) అధ్యయనం' అనే అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సులో సమర్పించిన 'తెలుగులో విప్లవవాద సాహిత్య విమర్శ' అన్న ప్రసంగ పత్రానికి అభివృద్ధి రూపం.

గొంతు నులిమి వేసిండ్రు
పంతము చెల్లించుకుండ్రు ॥పం॥
పెద్ద మనుషులొప్పందం...
అది చారిత్రక తప్పిదం ॥మాకొద్దీ॥

ఒప్పందం పేరు తోటి
ఒరిగింది ఏమి లేదు
నీళ్ళు నిధులు ఉద్యోగాలే
నీటి రాతలయిపాయే ॥నీటి॥
గోదావరి క్రిష్ణమ్మలు
తలాపున పారుతున్న
గొంతు తడుపు నీరు లేదు
తాగు సాగు నీరు లేదు ॥తాగు॥
పచ్చదనం వారికాయే...
మన భూములు ఎడారాయే ॥మాకొద్దీ॥

శక్కర కోసం చీమలు
బారులుగా చేరినట్లు
రాజధాని సాకుతోటి
రాబందుల వలె వస్తిరి ॥రాబం॥
మీ బతుకు మీరు బతకకుండ
మా బతుకుల్లో మన్నుబోసి
ఉన్న మా ఉద్యోగాలను
ఆక్రమించి ఆర్జిస్తిరి ॥ఆక్రమించి॥
ఉన్నత కొలువులు పాయే...
ఉప్పరి పని కరువాయే ॥మాకొద్దీ॥

దొంగ ముల్కి పత్రాలతో
దోచుకుండ్రు మన కొలువులు
నీళ్ళు నిధులు మల్లించి
నిండ ముంచినారు మనల ॥నిండ॥
ఆరొందల పది జీవో
అమలు చేయలేనోళ్ళు
హక్కులకై ఉద్యమిస్తే
బొక్కలల్లో దోస్తుండ్రూ ॥బొక్క॥
ఆ పార్లమెంటు సాక్షిగా...
ఈ పరిపాలన నియంతలదే ॥మాకొద్దీ॥

మా తెలంగాణ చరితనంత
చెత్తబుట్ట పాల్జేస్తిరి
సీమాంధ్రుల కథలు వెతలు
వీరగాథలను చేస్తిరి ॥వీర॥
సాయుధ రైతాంగ పోరు
ఉద్యమము మొదలుకునీ
సకల జనుల సమ్మెవరకు
మా చరితను గుర్తించరు ॥మా॥
మా ఆత్మగౌరవాన్ని సదా...
అవమానం పాల్జేస్తిరి ॥మాకొద్దీ॥

సమైక్యంధ్ర భావనంటే
సహనముతో మెలగాలనే
కనీస జ్ఞానము లేనీ
కసాయి ఖద్దరు దొరలు ॥కసా॥
లగడపాటి, రాయపాటి
చంద్రబాబు, కిరణ్‌కుమార్
రాజీర్కం ముసుగేసిన
రాజకీయ దళారులే ॥రాజ॥
పేరుకేమొ ప్రజల జపం...
పెట్టుబడుల వ్యాపారం ॥మాకొద్దీ॥

వేరు పడితే ద్రోహమంటు
వెటకారపు మాటలతో
సమైక్యంధ్ర జపం చేస్తూ
సకలం దోచేస్తువుండ్రు ॥సక॥
కన్న తల్లి కడుపు నుండి
కనిపెరిగిన బిడ్డలెవరు
వేరుపడని వాడు మనకు
కానరాడు ఈ జగతిలో ॥కాన॥
అగ్రిమెంటు అణచినోడా..
నీకు అడ్డుకునే హక్కులేదు ॥మాకొద్దీ॥

నాటి నుండి నేటి వరకు
తెలంగాణ సాధనకై
ప్రజాస్వామ్య పరిధిలోనే
ప్రతి ఒక్కరు పోరాడినా ॥ప్రతి॥
అడ్డంకులు అరెస్టులతో
ఉద్యమాన్ని అణిచేస్తిరి
ఆరొందల బిడ్డలనూ
ఆత్మహత్య పాల్జేస్తిరి ॥ఆత్మ॥
రాష్ట్ర సాధనాకాంక్షనూ...
రావణ కాష్టం జేస్తిరి ॥మాకొద్దీ॥

తెలంగాణ రాష్ట్రమొస్తే
అన్నల పరమౌతదనీ
తెలంగాణ వ్యతిరేకులు
తెగవాగుడు వాగుతుండ్రు ॥తెగ॥
ఆకలి అసమానతలు

సమాజంలో ఎక్కడున్న
తిరుగుబాటు పోరాటం
ఉదయించును నగ్న నిజం ॥ఉద॥
అసమానత పెంచెటోళ్ళే...
అన్నల పేరెత్తుతుంట్రు ॥మాకొద్దీ॥

తెలంగాణ ప్రజల రక్త
చెమటతోటి నిర్మించిన
హైదరబాదు అనాదిగా
వెలుగుతోంది ప్రసిద్ధిగా ॥వెలు॥
అద్దెకున్న వాడు ఇల్లు
నా సొంతం అన్నట్టుగ
అహంకార మదంతోటి
హైదరబాదు మాదంట్రూ ॥హైద॥
ఒరేయ్ - తెలంగాణా దేహానికీ...
మా హైదరాబాదు గుండెకాయ ॥మాకొద్దీ॥

ప్రజాస్వామికుద్యమాల
పాశవికం గణచినోళ్ళు
ప్రజాగ్రహ జ్వాలల్లో
మాడి బూడిదయ్యింట్రూ ॥మాడి॥
చరిత్రలు హిట్లరు
గతి మీకు పట్టే రోజు
ఎంతో దూరము లేదు
పంతము ఇక ఆపండి ॥పం॥
అమరవీరుల సాక్షిగా...
అంతిమ విజయం మాదే ॥మాకొద్దీ॥

బడా పెట్టుబడిదారుల
బాటలోన నడుస్తున్న
సీమాంధ్ర విద్యార్థి
యువకులారా, యువతులారా ॥యువ॥
అనాదిగా అసమానత
వివక్షలకు గురౌతున్న
తెలంగాణా కన్నీటి
చరిత మీరు చదవండి ॥చరి॥
ఈ స్వార్థపరుల కుట్రలకూ....
సమిధలు మీరు గాకండీ ॥మాకొద్దీ॥

రెక్కాడితెగాని డొక్కాడని
సకల జనులు ఉద్యోగులు
సర్కారు మెడలు వంచ
సమ్మెపోరు జేస్తుంటే ॥స॥

ప్రజలకండ గుండాల్సిన
మన మంత్రులెమ్మెల్యేలు
పదవులను వదలకుండ
ప్రజాద్రోహులవుతుండ్రు ॥ప్రజా॥
మనలో మనకు చిచ్చుబెట్టీ...
పోరుకుచ్చు బిగిస్తుండ్రు ॥మాకొద్దీ॥

తల్లిపాలు తాగి తల్లి
రొమ్ము గోసె తీరుగ
దానం, ముఖేష్ గాళ్ళు
రేణుక, తలసాని గాళ్ళు ॥రేణు॥
రౌడి రాజకీయాలకు
సీమాంధ్ర పాలకులకు
నమ్మిన బంటులు వీళ్ళు
అమ్ముడుపోయిన దొంగలు ॥అమ్ము॥
మీ తప్పులు మానకపోతే...
తిప్పలు తప్పవు మీకు ॥మాకొద్దీ॥

కుందేలు పడకముందే
కుప్పల తగువన్నట్టు
తెలంగాణ రాకముందే
ఫలం మాకు మాకంటూ ॥ఫలం॥
ఉద్యమ సారథ్యము
మన బహుజనులు వహిస్తేనే
సామాజిక తెలంగాణా
స్వప్నము సాకారమౌను ॥స్వ॥
పీడితులా నాయకులమంటూ...
దగా పనులు చెయ్యొద్దూ ॥మాకొద్దీ॥

తెలంగాణ సాధనకై
తెగించి పోరాడుతున్న
ఉద్యమ వీరుల్లారా
పోరుతల్లి బిడ్డల్లారా ॥పోరు॥
ఆశయ సాధన కోసం
అందరమొకటవ్వాలి
సీమాంధ్రలో శ్రమజీవుల
దీవెనలను పొందాలి ॥దీవె॥

ఆత్మహత్యలూ లేనీ...
ఐక్యపోరు నడపాలి
లేవర చల్ తెలంగాణ వీరుడా
అరె ఐక్యమై పోరాటంతో
సాధిద్దాం తెలంగాణా ॥లేవర॥ లే॥

మూగ వేణు(వు)

- పి. రామకృష్ణ

వేణువు మళ్ళీ వెదురు కొయ్యగా మారి
తన గానాన్ని తనలోనే కలుపుకోవడం దారుణం కదా!
ఎదుటి దృశ్యాలను గుర్తించని వెదురు
తన లోపలి దృశ్యాలను కళ్ళు మూసుకుని కంటోందా?
వేణువుగా ఉన్నప్పటి తన సంగీతాన్ని తనే తన్మయతతో
వింటోందా?
ఎదుటి మనిషికీ తెలీదు, వెదురు మనకేమీ చెప్పదు

చూడకపోవడంలో బాధలేదు
చూడలేకపోవడంలో బాధ ఉంది
మాట్లాడకుండా ఉండడంలో బాధ లేదు
మాట్లాడలేకపోవడంలో బాధ ఉంది
బాధించే జ్ఞాపకాలైనా బాధించవు
జ్ఞాపకాలు కళ్ళలోకి రాకపోవడం అసలు బాధ

సాహిత్య, సామాజిక ప్రపంచాలను
రోజూ రివాజుగా చుట్టి వచ్చే మనిషి
కదలకుండా తనను తాను కట్టిపడేసుకోవడం ఎంత కష్టం!
చరిత్ర తన చరిత్రను మరచిపోవడం ఎంత అచారిత్రకం!

పిడికిలంత మెదడు నుంచీ పృథ్వి వ్యాప్తంగా ఎదిగే మనిషి
మళ్ళీ ఆ పిడికిలంత మెదడులోనే ఒదిగిపోవడం
విషాదాత్మక విషాదం, దారుణాతి దారుణం

(తుమ్మల వేణుగోపాలరావుగారు ఇకలేరనే దుఃఖంతో)

[illegible]

గర్వకారణం

వేకువ జామున పూసిన వెలుగు రేఖ
తన సాయం సంధ్యలో అస్తమించాడు
తన అస్తమయం రేపటి ఉదయానికి హామీ
అతనెవరంటే ఏమని చెప్పాలి?
తనో శ్రమ జీవి
శ్రమ జీవుల చేతి పనిముట్టు
శ్రామిక ప్రజలకు తనో తీపి గుర్తు
చెట్లకొమ్మల ఆకులన్నీ తమలోని
ఔషధ జ్ఞానంను జనులందరికీ విప్పిచెప్పి
తమ పుట్టుకకు సార్థకతనిచ్చే జ్ఞాని ప్రసాదన్న
కళ్ళముందు గల గల కదలాడి తలలు వంచి
తమ ఉనికిని చాటుకుంటున్నట్లుండేవి
పెద్దపులి కాలిముద్రలు చూపి
కంచె పక్కల బాటలు తీసి
అడవి జంతువులకే కాదు
మానవ మృగాలకూ చిక్కనోడు
తమ వంట్లో ఇంట్లో ఈతి బాధలు
ఉద్యమాకాశంలో క్షణకాలపు ఉరుములేనన్నోడు
కారంపూడి నుండి మంగాపురం తండా దాకా
కాకిరాల కొండల నుండి నెహ్రూనగర్ తండా దాకా
గుత్తికొండ నుండి పమిడిపాడు మేళ్ళవాగుదాకా
బొల్లాపల్లి నుండి జూలకల్లు దాకా
అతని పాదాల స్పర్శతో నేలతల్లి పులకరించేది
అతనికి తెలియని కాలిబాటలేవీ
తను గెరిల్లా దళానికి దారి తప్పని పైలట్
వీపుపై పనిముట్ల బరువులే కాదు
పేద రైతు బతుకు బరువుల్ని
గుండెలో మోసి అలసటనేదే తెలియని
స్వచ్ఛమైన పాల నవ్వుల నిండు చందమామ
అతని వంటి చెమట చిత్తడి
అడవి తల్లి కంటి చెమ్మయ్యేది
పేద బ్రతుకుల్లో చిచ్చుపెట్టిన సారా
గోడవున్న పెల్చివేత సారా దుకాణాల కాల్చివేతై
సర్కారు సింహం జూలుపట్టిలాగినోడు
సారాపోరును కట్టడి చేయవచ్చి
డీలాపడ్డ డీఎస్పీని చూసి
పెదవులపై వెల్లివిరిసిన చిరునవ్వుల
మౌన భాషలో వినిపించిన ఊసులెన్నో
అడవి భూముల సాగు (పోడు)కై
వేసిన మొదటి గొడ్డలి వేటుతనే
వడ్డీ వ్యాపారుల చొక్కా పట్టిగుంజిన
చేతివేళ్ళల్లో బొటన వేలు తానే
కల్తీపురుగుమందుల బేరగాళ్ళ గోచీపీకి
జనాల ముందు గుంజీలు తీయించినోడు
రైతులు ఎరువుల గోడవున్నను లూటీ చేస్తే
రైతన్నల చేలల్లో మొలకలకు చేవయ్యినోడు
ఎర్ర ముసుగేసిన గుంటనక్కలు
అన్నల పేరు చెప్పి అందిరించి బెదిరించి
ఖండసారి భూములు చాపచుడితె
ఈ నక్కల తోకలు కోయడమే కాదు
ఆ గుంట నక్కలు పీకలు కోరకాలన్నోడు
ఆ జిత్తులమారి నక్కలు పలనాడు పల్లెలనుండి
జిల్లా అంతటా ఊళ లేసి ఊరేగుతుంటే
కసితో పళ్ళు పటపట కొరికి రవరవలాడినోడు

కూలినాలి పేదల ప్రేమించడమే కాదు
పీతిరి గద్దల్ని ద్వేషించడమూ తెలియాలన్నోడు
జనపదాల్లో సంచరించే ప్రత్యేక ఆర్జిత మండలాల
రక్తపింజరుల్లో ఒక్కదాన్ని కూడా వదలక
కోరలు పీకి పీల్చిందంతా కక్కించాలన్నోడు
తన జీవిత కాలపు వర్గకసి
తీరకనే అస్తమించడం ఎంతటి విషాదం
చిన్నన్న జీవితాశయాలను
కొనసాగించవలసి రావడం
ఎంత గర్వకారణం

(పీడిత ప్రజల ప్రియతమ నేస్తం పరస చిన వెంకటేశ్వర్లు సంస్మరణలో)

సూర్యంగారూ... మీరు లేరూ?

సూర్యంగారూ... మీరు లేరూ?
లేరని అంటున్నాడు వాడు
ఎక్కడా లేకుండా చేశానని
చంకలు కొట్టుకున్నాడు వాడు
తము సృష్టించి వదిలిన
దోపిడీ పీడనల చిత్రహింసల కొలిమిలో
చిక్కి మాడి కుమిలే జనాలపై
వాడు విసిరే క్రూర పరిహాసాలు
తోకలు ముడిచే కాలంలో
కనిపించేవి మీ కదలికలే
సూర్యంగారూ మీరు మాలో లేరూ
మీరు మాలో ఎప్పుడు లేరు
మీరు ఎప్పుడూ మాలో ఉన్నారు
పల్లెలు మన పాఠశాలలన్నారు
ప్రజలు మన గురువులన్నారు
విద్యార్థి యువజనులను
గ్రామాలకు తరలించారు
ప్రజల ముందు విధేయులుగా మార్చి
బతుకు పాఠాలు చదివించారు
దున్నేవానికే భూములు పంచి
వ్యవసాయ విప్లవాన్ని నాటారు
ప్రజలు అజేయులు
ప్రజలు తమను తామే
విముక్తి చేసుకుంటారని బోధించి
ప్రజలను ప్రేమించే రీతులు నేర్పారు
సూర్యంగారూ మీరు మాలో లేరూ?
చిరకాలం తమ తలపుల్లో మీరుండాలని
పిల్లలకు మీ పేరు పెట్టుకుని
పీడిత ప్రజ మీ జ్ఞాపకాల తలపోస్తుంది
దళితవాడల్లో మీరు కూడగట్టిన
యువతరం కులనిర్మూలనా
పోరాటతరంగాలై అగ్రకుల భూస్వామ్య
లోగిళ్ళలో ప్రతిఘటనా దరువులేసి
గంగవేర్రులెత్తిస్తోంది
సర్కారు పాఠశాలల్లో మీరు మేల్కొలిపిన
విద్యార్థి సంఘాలు విప్లవ కెరటాలై
పెద్ది శంకరన్న బాటల్లో మార్చింగ్ చేస్తున్నాయి
పలనాట మీరు వెన్నుతట్టిన
రైతుకూలీలు సెజ్ వ్యతిరేక పోరాటాల్లో
రణభేరీలై మోగుతున్నారు
నల్లమలలో విముక్తి పథం వైపు
మీరు నడిపించిన ఆదివాసీ
చత్తీస్‌గఢ్‌లో దోపిడీ పాలకవర్గాలు
నిద్రపాపల్ని చంపేస్తున్నాడు
పేద గుడిసెల్లో మగత నిద్రల్లో
మీరు కన్న కలలు లాల్‌ఘడ్‌లై
జంగల్ మహల్‌లై పుష్పిస్తున్నాయి
సూర్యంగారూ మీరు మాలోలేరూ
మీరు మాలోనే ఉన్నారు
మీరు విత్తిన త్యాగాల పంట
మా నాగేటి చాళ్ళల్లో రక్తపుటేరులై
మీ సహచరి శిష్యగణాలు
పోటెత్తిస్తున్నారు
రైతుల రక్తం జుర్రే భూస్వామ్యం
సెజ్‌లూ కోస్టల్ కారిడార్‌ల
సరికొత్త రూపాలెత్తితే
శ్రీకాకుళంలో వ్యవసాయ విప్లవాంశ
నయా భూస్వామ్యపు గొంతు పట్టింది
సూర్యంగారూ మీరు ఎక్కడలేరూ
ప్రజల నుండి ప్రజల వద్దకంటూ
ప్రజాపంథాను ఎత్తిపట్టి
ప్రజా యుద్ధ నావికులయ్యారు
దళారీ నిరంకుశ పాలకులను
మట్టికరిపించే గెరిల్లా రైతాంగ దళమై
మా ముంగిళ్ళలో మీ వెచ్చని నెత్తురు
ధారపోసి ఎర్రని జండాలయ్యారు
ప్రపంచ ప్రజల ఉమ్మడి శత్రువు
సామ్రాజ్యవాదపు విషనాగుల పుట్టల
కార్మిక కర్షకులతో దున్నించి
సామ్రాజ్యవాదపు అంతజూసి
వాని చితికి నిప్పు పెట్టే
ప్రజా విముక్తి సైన్యమయ్యారు
రేపటి శ్రామిక రాజ్య సాధనలో

మా విముక్తి పతాకాల గుండెలపై
సుత్తీ కొడవలి ముద్దరలై
సదా మీరు వెలుగుతుంటారు
మీరు మాకు అడుగు జాడలు
మాకు మీరే ఆదర్శమూర్తులు
మమ్మల్ని ధన్యచరితుల చేసే
మా గురువులు మీరు

అస్వతంత్ర కుహనా స్వతంత్రులం

- భూ సాంబశివరాజు

దేశమే అమ్మకపు సరుకయి నప్పుడు
పూసే పూవులు, కాసే కాయలు
చల్లె విత్తులు, పండే పంటలు, పారే నీరు,
మట్టి, మణులు, గనులు నీ కేమౌతాయ్ ?

పుట్టే బిడ్డలు, పుట్టిన పిల్లలు
తాకట్టులో ఉన్నపుడు
నీవు నేను
ఆమె అతడు పరులకు
బానిసలు కాకేమౌతారు ?

సరుకుల మాయలో
వాణిజ్య విపణి రంగుల వలలో
వస్తు వినియోగ సంస్కృతిలో
ద్రవ్య పెట్టుబడి విష కౌగిలిలో
ప్రపంచీకరణ గానుగలో
చిక్కుకున్న అస్వతంత్ర
కుహనా స్వతంత్రులం మనం

గుప్పెడు ఘనులకు
గంపెడు జనులను
బలిచేసే నకిలీ ప్రజాస్వామ్య మిది
బుద్ధిలేని వృద్ధి రేటు
అవినీతి గడ్డి తిని
అమ్మనాలి నమ్ముకునే
నాయకుల నెన్నుకునే
వెనుకబాటు వదిలిపెట్టి

కళ్ళు తెరిస్తే, పిడికిలి బిగిస్తే, సూర్యోదయం
లేకుంటే, కాళరాత్రి కారు చీకటి అయోమయం

[illegible]

అబూజ్మాడ్

తెలుసుకోవడం మనిషి సహజాతం
నేర్చుకోవడం మనిషి జీవనసారం
అగాథ తలాలపైకి చూపు సారించి
ఆత్మికావలోకనానికి చిత్రిక పట్టడం
మనిషి మాత్రమే చేయగల పని
విధ్వంసం, నిర్మాణం
రెండు చేతులకు మాత్రమే సాధ్యం

అబూజ్మాడ్ అంటే తెలియనిది
ఇపుడది తెలుసుకొని తీరవలసినది
తెలుసుకోవడం ఆదివాసీకి విలక్షణ దినచర్య
దగ్గరగా చూసి
పదేపదే చూసి
ప్రకృతి చలనానికి
తన సున్నితమైన మునివేళ్లను తోడిస్తాడు
మొరటుగా నేర్చుకున్నట్లున్నా
సుతిమెత్తగా వ్యక్తమవుతాడు

తెలియనిది తెలుసుకోవడం
ఆదివాసీకి అవధి
అటూ ఇటూ సాగే జీవన సంచారానికి
అదే తొలి తుది బిందువు
మనకేమీ తెలియని దండకారణ్య ఆదివాసీ
మన గురించీ తెలుసుకుంటున్నాడు
మనందరమూ తెలుసుకోవలసిన దాన్ని నిర్మిస్తున్నాడు

తెలియకపోవడం మనకొక సందిగ్ధత
తెలుసుకోవడం తనకొక చిరంతన

మనమొక కలగంటూ ఉంటాం
అబూజ్మాడ్ శిఖర తలాల్లో అతనూ, ఆమే కలసి
దాన్ని నిజం చేస్తుంటారు
కలవలె మనకు
తెలుసుకోవలసింది మిగిలే ఉంటుంది
తెలుసుకున్నాక యుద్ధం వాళ్ల ముంగిలిలోకి వచ్చింది

తెలియజేయడమంటే
వాళ్లకు ఇప్పుడు యుద్ధం చేయడమే
యుద్ధమంటే విధ్వంసమనే
నిఘంటు రూఢ్యర్థం తెలియదుగాని

తెలుసుకోవడమంటేనే నిర్మాణమైనవాళ్లకు
యుద్ధమూ నిర్మాణమే

భూగోళంలోఅబూజ్‌మాడ్ ఎక్కడున్నదోగాని
ఇప్పుడది నిర్మాణమూ, యుద్ధమూ సరిహద్దుల్లోకి వచ్చింది
అబూజ్‌మాడ్ భూ కక్షకు కేంద్రం శ్రమ
కాళ్లూ చేతుల నుంచి
సకల మేధో వికసనల పరంపరను తెలుసుకోవాలంటే
చరిత్ర తొలి పేజీల్లోకి పోవాల్సిందే
దాని ఉన్నత రూపం చూడాలంటే అబూజ్‌మాడ్ వెళ్లాల్సిందే

అబూజ్‌మాడ్ పూర్వ చారిత్రకమూ
మనకాలంలోని నిజ చారిత్రకమూ

నిజమైన చరిత్ర మొదలు కావడమంటే ఇదే

విశ్వాసాల నుంచి హేతువు దిశగా సాగుతున్న ప్రయాణం ఇది

అబూజ్‌మాడ్ దిశగా సైన్యం సాగుతూ ఉంటే
అబూజ్‌మాడ్ ప్రపంచం నలు దిశలా విస్తరిస్తోంది

నాగలి పట్టడం పాపం అనుకున్న మానవి
తుపాకీ పట్టడమే హేతు చింతన
రాజ్యమంటే పరాయిదని మాత్రమే తెలిసిన మానవుడు
ఆధునిక రాజ్యాన్ని స్థాపించాలనుకోవడమే హేతుబద్ధత
పూర్వ మానవుడు కుబుసం విడుస్తూ
ఆధునిక జగత్తుపై కాలూడమే విభాత సంధ్య

ఢిల్లీ ఎక్కడుందో తెలిసినట్టుగా
అబూజ్‌మాడ్ ఎక్కడుందో తెలియదు
చీమల బారుల్లా సైన్యం -
రాజ్యపు పద ఘట్టనల్లాంటి శకటాలు -
ఢిల్లీ నుంచి అబూజ్‌మాడ్‌కు దారులు వెతుక్కుంటున్నాయి
ఇదీ.. తెలియనిది తెలుసుకోవడమే

దేశానికి ఒకే కేంద్రం ఉండాలనే
పాలనాశాస్త్ర పాఠాలు తలకిందులయ్యాక
జరుగుతున్న యుద్ధం ఇది
సరిగ్గా దండకారణ్యం ఇప్పుడు పోటీ కేంద్రం
రెండు కేంద్రాలు
రెండు రాజకీయాలు
రెండు సైనిక వ్యూహాలు
రెండు జీవన విధానాలు
యుద్ధాలు- ఎల్లవేళలా రాజకీయాల కొనసాగింపే

అబూజ్‌మాడ్ రాజకీయమంటే -
తెలియనిది తెలియడమే
శత సహస్ర యుద్ధ రంగాల్లో తలపడిన ఆదివాసీకి
నక్సల్బరీతోనే తన యుద్ధం రాజకీయమని తెలిసింది
పోటీ రాజకీయమనీ తెలిసింది
అప్పటి నుంచే దండకారణ్యం
లోకమంతా తెలుసుకోవాల్సిన ప్రయోగమైంది

మృత్యువాక గతితర్కం

అంతా అయిపోయిందనుకున్నాక చేస్తున్న సంభాషణ ఇది
ఇక ఏమీ మిగల్లేదని ఇంటి దారి పడుతున్నప్పుడు
తిరిగి చూడమనే గానోద్దీపన ఇది

నిజంగానే ఏమీ లేదా?
ఇంతకూ ఉండటమంటే ఏమిటి?
మనోకాంక్షకు - స్థితీగతికి మధ్య
విశ్వాసం ఆసులా తిరుగాడుతున్నప్పటి క్షోభ ఇది

నిజమే ... దీర్ఘ విషాదం కూడా ఇది
తెప్పరిల్లడానికి కూసింత విరామం కావాల్సిందే
నేర్చుకున్నవన్నీ విస్మృతిపథాన జారిపోతున్న తరుణమిది
నీడలూ.. జాడలూ కలగలసిపోయాక
మరోసారి... మరోసారి...మరోసారి
పెగలుతున్న ఉచ్ఛ్వాసమిది

అవును.. కష్టమే
సుఖంగా ఆలోచించలేం
బరబరా రాసేయలేం
అలవోకగా ప్రసంగించేయలేం
అడుగడుగునా మృత్యు సాక్షాత్కారమే
ఒక్కోసారి పక్కన అడుగుల సవ్వడి కూడా
వినిపించని నిశ్శబ్దం
ఎప్పటిలా ఉద్యమమే జీవితమనడానికి వీల్లేని జీవితం
నిన్ను చుట్టుముట్టేసింది

బతుకు విశాలమూ.. ఉక్కిరిబిక్కిరి...

ఇంటికీ ఆఫీసుకూ మధ్య
వందల వేల మానవ ముఖాలన్నీ అపరిచితమే
అదనంగా భాషా సమస్య

అయినా ... పూర్తి కాలేదు

విశ్వాసాలను ఈ గడ్డుకాలమే తట్టి లేపుతోంది
అలకలు.. సాకులూ
అకారణ కారణాలు
తాత్విక ప్రల్లదనాలు..
ఏవీ పిసరంత భరోసానివ్వలేవు

అతి వినయాలు, ఆక్రోశాలు డాలుగా పుచ్చుకొని
ఏ మాయా యుద్ధాలూ చేయలేవు
అంతా అయిపోయిందంటే -
ఎప్పుడు... ఎక్కడ..ఏం మొదలైందో ఏమీ తెలియనట్టే

ఈ దీపం ఇక్కడ వెలిగి
ఇక్కడే ఆరిపోయేదా?
వెలుగూ నీడా తత్కాలమేనా?

ఈ మరణం ఇప్పటిది కానట్టే
ఈ జీవితమూ ఈనాటిది కాదు

ఇంటికి పోయే ముందు
నాలుగు వీధులు తిరిగేసి వెళ్లు
ఎందుకైనా మంచిది...
ఉదయమూ, మధ్యాన్నమూ, నిశిరాత్రీ
ఒక్కో పేటకూ ఎంచుకొని వెళ్లు
అంతా అయిపోయిందని నీవనుకున్నాక కూడా
నా చేయి నీ భుజమ్మీద వాలే కువకువల పావురం

ఇంటికి వెళ్తే వెళ్లు..
విశ్రాంతి కోసమే అయితే ఫర్వాలేదు
కిటికీ తలుపైనా ఓరగా తెరిచి ఉంచు
అంతా అయిపోయిందనుకున్న చోటి నుంచే
నీ పడగ్గదిలోకి
సైనిక కవాతు సవ్వడి వినిపించవచ్చు
ఈ ప్రహరీ మీది నుండే
సన్నగా, పీలగా, నల్లగా
తేజో వర్చసుగల పదాతి దళం ఎర్రజెండాలతో దూసుకొని పోవచ్చు
మానవరహిత విమానాలు
నీ ఇంటి మీది నుంచే ఉత్తరం వైపుకు రెక్కలు సాచవచ్చు

రవ్వంత విశ్రాంతి అవసరమైతే తీసుకో

నీలోకి నీవు చూసుకోడానికీ
ఇప్పుడు నీవే ఒక మాధ్యమాన్ని అల్లుకోవలసి రావచ్చు
లోకం ఇప్పుడు నీకే ఆసరా ఇవ్వలేదు

నీవు నీలోకి, నాలోకి, పరిసరాల్లోకి ప్రసరించడానికి
సరికొత్త భాష, తాజా వ్యాకరణమూ
ఇప్పుడు నీకు అవసరమే కావచ్చు

అంతా అయిపోయిందనుకున్నచోటి నుంచే
నీవు తప్పక పునఃప్రయాణిస్తావు

అలవాటుకొద్దీ...

కొండ శిఖరాల వైపు చూస్తుంటే
కాళ్ల కింది నేల జరజర జారిపోతోంది
గంభీర స్వరాన్ని సవరించుకున్న ప్రతిసారీ
పిల్లి కూతలు వికృతంగా వినిపిస్తుంటాయి

ఔన్నత్యానికి - అథఃపాతాళానికి మధ్య
అనుక్షణ సంచారంలో
నాకు నేనెట్లా అర్థమవుతున్నానో
ఇతరులకు ఎట్లా కనిపిస్తున్నానో
అంతా చలనమే... చలనమే...

గాంభీర్యం, అల్పత్వం ఒరుసుకొని ప్రయాణిస్తూ
ఎప్పుడు దేన్ని ఏది సంలీనం చేసుకుంటుందో
నిత్యం మందుపాతరలా అభద్రత పొంచే ఉంటుంది

దేన్నయినా కావాలనుకుంటున్నానా?
వద్దనుకుంటున్నానా?
తీసేసుకుంటున్నానా?
వదిలేస్తున్నానా?
అడుగడుగునాన తెలియనిదనం

అటు నుంచి ఇటు
ఇటు నుంచి అటూ
ఎప్పుడూ ఏదో ఒక చివరన...
అడుగడుగునా యాతన
రాత్రింబవళ్లు రాపిడి
అలవికాని నొప్పి భరించీ
ఇంతకు ఏం నేర్చుకున్నాను?

అచరణ నుంచి జ్ఞానం అనే మాట
భౌతిక షరతేగాని
నేర్చుకోవడం - నేర్పించడం చుట్టూ
అనేకానేక పొరలూ
అల్లిబిల్లి మాధ్యమాలు

దృశ్యా దృశ్య వలయాలు

ఎక్కడో చిక్కుకపోయాను
సరిగ్గా తెలియదు
తెలివిడి కలిగేనాటికి
ఏదో చివరన నిర్భావ వల్లాపనలు

ఒకోసారి ఆబగా కన్నీరు కారుస్తాను
కన్నీటికి అగ్నిగుణం ఉంటుందంటారు గాని
ఏదీ దగ్ధం కాదు
ధ్వంసం కావల్సినవి ఇనుప గోడల్లా చుట్టూ ఆవరిస్తాయి
అన్నిటినీ దూసుకొని వచ్చేది వాదనా సామర్ధ్యమొక్కటే
అలవాటుకొద్దీ జీవించడానికి కొన్ని ఊత పదాలు అవసరమే
ఏ పూట ఏ వాదన పెడతానో
ఎవరి గొంతుపై ఏ కత్తివాదర అవుతానో
ఎల్లవేళలా ఏ తీర్పరి స్థానం కోసం పాకులాడుతానో...

తీరా నిలబడటానికి బెత్తెడు నేల దొరకదు.

లోకభాషణం

ఎలా ఉన్నావు?
కాళ్ల జెర్రిలా నాలుగు దిక్కులా పరిగెత్తేవాడివి
ఇప్పుడిలా నాలుగ్గోడల మధ్య ఎలా కూర్చుండిపోయావు
అంతులేని ప్రపంచం నుంచి
అరచేతిలోకి ఎలా కుదించుకుపోయావు?

క్షేమమే కదా?
లోకంతో నిరంతర సంభాషణను అర్థాంతరంగా ముగించి
పెళ్లాం బిడ్డలతో పొద్దునా, మధ్యాన్నం, రాత్రీ
ఒకే విషయంపై సాగించే బాధ్యతాయుత భాషణలో
ఎలా పునర్జీవితమవుతున్నావు?

ఫర్వాలేదా?
అక్కడేదో అయిందనీ
ఇక్కడేదో కాలేదనీ
ఆబగా, ఆర్తిగా ఉరుకురికి తిరిగేవాడివి గదా?
ఇప్పుడిలా సాయంకాలానికి ముడుచుకు పోయిన
పొద్దుతిరుగుడు పువ్వులా ఎలా ఉన్నావు?

ఏం కాలేదా?
అర్ధరాత్రి దాకా అలసిన కన్నులతో
ఎడతెరపి లేని సంవాదంలో మునిగి తేలడం
నీ అనుభవైక ఆనందమనేవాడివి కదా?
ఇప్పటి నీ సంస్పందనలు రోజూ ఎలా తెల్లారుతున్నాయి ?

ఎప్పటికి తీరేను

నేర్చుకోవడం కన్నా మర్చిపోవడం అవశ్యం
అడ్డదిడ్డంగా నేర్చుకున్న పాఠాల శిలువపైకి
రోజూ ఎక్కడం దేనికి?

రక్తం ధారాపాతమైనా
నొప్పి ఏమిటో తెలియడం లేదు
వంటరి గదుల్లో ఎన్నటికీ
వెతుకులాట పూర్తి కావడం లేదు

వెతకడమొక దిన చర్య

ఏం పోగొట్టుకున్నామో
మరేం కావాలో ఎన్నటికీ తెలియదు
ఒక్కోసారి వెతుకుతున్నామనే స్పృహ కూడా లేని
బుడుకులాట

నేర్చుకున్న వాటిలో దొరకని సమాధానం కోసం
ఇక ఆవలికి వెళ్లక తప్పదని ఎప్పటికి తెలిసేను
కొత్త పాఠం రాయాలంటే
ఎన్నడో సిద్ధం చేసుకున్న ప్రసంగ ప్రత్యక్షరాన్నీ మర్చిపోవాలి

నేర్చుకోవడం కన్నా
మర్చిపోవడం ఎంత యాతన!

అరబ్ కవి నిజార్ ఖబ్బానీ కవితలు

1

మిత్రులారా
పాత ప్రపంచం మరణించింది
పాత పుస్తకాలు చనిపోయాయి
చిరిగిన జోళ్లలాగ చిల్లులు నిండిన మన ఉపన్యాసం చనిపోయింది
ఓటమికి దారితీసిన మనసూ చనిపోయింది

2

మన కవిత్వం చేదెక్కింది
స్త్రీల కురులూ రాత్రులూ తెరలూ ఆసనాలూ
అన్నీ చేదెక్కాయి ప్రతి ఒక్కటీ చేదెక్కింది

3

నా దుఃఖమయ దేశమా
ఒకానొక లిప్తలో
నువు నన్ను ప్రేమ కవిత్వాలు రాసుకునే కవినుంచి
కత్తితో రాసే కవిగా మార్చేశావు

4

మనం అనుభవిస్తున్నది మాటలకందనిది
మన కవిత్వాలు చూసి మనం సిగ్గుపడాలి

5

ప్రాచ్య ఆభిజాత్యంతో ప్రేరణ పొంది
ఎన్నడూ ఈగ నైనా చంపని అతిశయంతో
ఫిడేలూ మృదంగమూ పట్టుకుని
మనం యుద్ధానికి బయల్దేరాం
ఓడిపోయాం.

6

మన నినాదాలు మన చేతల కన్న బిగ్గరయినవి
మన కరవాలాలు మనకన్న ఎత్తయినవి
అదే మన విషాదం

7

ఒక్క మాటలో
మనం నాగరికతా వస్త్రాలు ధరిస్తాం
కాని మన ఆత్మలు ఇంకా రాతి యుగంలో జీవిస్తున్నాయి

8

ఒక కొమ్ముబూరా ఒక పిల్లనగోవీ
పట్టుకుని యుద్ధంలో గెలవలేవు

9

మన అసహనం
యాభైవేల కొత్త గుడారాలను పోగొట్టింది

10

నిన్ను వదిలేసిందని
స్వర్గాన్ని నిందించకు
పరిస్థితులను తప్పుపట్టకు
భగవంతుడు తలచుకున్నవారిదే విజయం
భగవంతుడు కత్తులు తయారుచేసే కమ్మరి కాదు

11

తెల్లవారుజామున వార్తలు వినడం అత్యంత బాధాకరం
కుక్కలు మొరుగుతుంటే వినడం అత్యంత బాధాకరం

12

మన శత్రువులు మన సరిహద్దులు దాటి రాలేదు
వాళ్ళు మన బలహీనతల్లోనుంచి చీమల్లా పాకి వచ్చారు

13

ఐదువేల సంవత్సరాలు
గడ్డాలు పెంచుకుంటూ
మన గుహల్లో మనం
మన నాణాలు ఎవరికీ తెలియవు
మన కళ్లు పురుగుల గుట్టలు
మిత్రులారా,
తలుపులు బద్దలు కొట్టండి
మీ మెదళ్లు శుభ్రం చేసుకోండి
మీ దుస్తులు ఉతుక్కోండి
మిత్రులారా
ఒక పుస్తకం చదవండి
ఒక పుస్తకం రాయండి
పదాలనూ దానిమ్మలనూ ద్రాక్షలనూ పండించండి
పొగమంచుల దేశానికి మంచుకురిసే దేశానికి
పయనించండి మీరు గుహల్లో ఉన్నారని ఎవరికీ తెలియదు
లోకం మిమ్మల్ని ఒక జాతి జంతువులుగా భావిస్తోంది

14

మన చర్మం దళసరి
మన ఆత్మలు ఖాళీ
మనం రోజంతా చేతబడి నేర్చుకుంటూ
చదరంగం ఆడుతూ, బద్దకపు నిద్రపోతూ గడిపేస్తాం
"భగవంతుడు ఆశీర్వదించిన జాతి" మనదేనా?

15

మన ఎడారి చమురు
మంటల, వెలుగుల చురకత్తులుగా మారి ఉండేది
గొప్ప పూర్వీకులను మనం అవమానించాం
మన చమురంతా వేశ్యల కాలి బొటనవేళ్లమీదుగా
జారిపోనిచ్చాం

16

తాళ్లతో మనుషుల్ని కట్టి లాగుతూ
కిటికీలనూ తాళాలనూ బద్దలుగొడుతూ
మనం వీథుల్లో పిచ్చి పరుగులు పెడతాం
కప్పల్లాగ ప్రార్థనలు చేస్తాం
మరుగుజ్జులను మహావీరులుగా
మహావీరులను చెత్తకుప్పగా మార్చేస్తాం
మనమెప్పుడూ ఆగి ఆలోచించం
మసీదులలో
సోమరిగా గొంతుక్కూచుంటాం
కవిత్వాలు రాస్తాం
సామెతలు అల్లుతాం
శత్రువు మీద విజయం ప్రసాదించమని
భగవంతుడిని వేడుకుంటాం

17

అలా మాట్లాడినందుకు హాని జరగదని హామీ ఉంటే
సుల్తాన్ ను చూడగలిగే అవకాశమే వస్తే

నేనేమంటానంటే:
సుల్తాన్, నీ పిచ్చి కుక్కలు నా దుస్తులు చించేశాయి
నీ బంట్లు నన్ను వెంటాడుతున్నారు
వారి కళ్లు నన్ను తరుముతున్నాయి
వారి ముక్కులు నన్ను పసిగడుతున్నాయి
వారి కాళ్లు నా అడుగుల్లో అడుగులు వేస్తున్నాయి
వాళ్లు నన్ను నీడలా వెన్నాడుతున్నారు
నా భార్యను వేధిస్తున్నారు
నా స్నేహితుల వివరాలు సేకరిస్తున్నారు
సుల్తాన్
నేను నీ రాజప్రాసాదపు గోడల దగ్గరికి చేరి
నా ఇబ్బందులు నీకు చెప్పదలచినప్పుడు
నీ సైనికులు నన్ను తన్నారు చితకబాదారు
నా చెప్పులు నాచేత తినిపించారు
సుల్తాన్
నువ్వు రెండు యుద్ధాలలో ఓడిపోయావు
సుల్తాన్
మన జనంలో సగం మందికి నోట్లో నాలుక లేదు
మాట్లాడే నాలుక లేని మనుషులు ఉండి ఏం ఉపయోగం?
మన జనంలో సగం మంది
గోడల మధ్య ఇరుక్కు పోయిన చీమల్లా, ఎలుకల్లా ఉన్నారు"
అలా మాట్లాడినందుకు హాని జరగదని హామీ ఉంటే
సుల్తాన్ ను చూడగలిగే అవకాశమే వస్తే
నేనతనితో ఇలా చెపుతాను:
"నువు రెండు యుద్ధాలలో ఓడిపోయావు
నీకు మన పిల్లలతో సంబంధం తెగిపోయింది"

18

మనం గనుక మన ఐక్యతను పాతిపెట్టి ఉండకపోతే
మనం ఆ యువదేహాన్ని మన తుపాకులతో చీల్చి
ఉండకపోతే
ఆ ఐక్యత మన కళ్లలో నిలిచి ఉన్నట్టయితే
ఈ కుక్కలు మన మాంస ఖండాల్ని ఇలా చీల్చి ఉండేవి
కావు

19

ఆకాశాన్ని దున్నడానికి
చరిత్రను ధ్వంసించడానికి
మన ఆలోచనలను బద్దలు గొట్టడానికి
ఒక కోపోద్రిక్త యువతరం అవసరమేమీ లేదు
కావలసిందల్లా ఒక కొత్త తరం
తప్పులను క్షమించని తరం
ఎవరికీ లొంగని తరం
తలెత్తి నిలిచే మహా వ్యక్తుల తరం

21

అరబ్ పిల్లలారా,
భవిష్యత్తు బీజాల్లారా
మా సంకెళ్లను తెగ్గొట్టేది మీరే
మా మెదళ్లలో నల్లమందును తుదముట్టించేది మీరే
భ్రమలను పటాపంచలు చేసేది మీరే.
అరబ్ పిల్లల్లారా,
ఊపిరిసలపని మా తరం గురించి చదవకండి
మాదొక నిరాశామయ వ్యవహారం.
మేం పారేసే పుచ్చముక్కల తొక్క కన్న ఎక్కువకాదు
మా గురించి చదవకండి
మమ్మల్ని అనుకరించకండి
మమ్మల్ని ఆమోదించకండి
మా ఆలోచనలను ఆమోదించకండి
మేమొక మోసగాళ్ల, గారడీగాళ్ల జాతి.
అరబ్ పిల్లల్లారా,
వసంతకాల వర్షమా
భవిష్యత్తు బీజమా
ఓటమిని అధిగమించే తరం మీది.

(సిరియాకు చెందిన కవి, ప్రచురణకర్త నిజార్ తౌఫిఖ్ ఖబ్బానీ (1923 - 1998) కవిత్వ రచనలో సరళత్వాన్నీ గాంభీర్యాన్నీ కలగలిపారు. ప్రేమ, శృంగారం, స్త్రీవాదం, మతం, అరబ్ జాతీయవాదం, నియంతృత్వం పట్ల వ్యతిరేకత నిండిన ఖబ్బానీ కవిత్వ సంపుటాలు రెండు డజన్లకు పైగా వెలువడ్డాయి. అరబ్ ప్రపంచంలో అత్యంత గౌరవనీయమైన కవిగా గుర్తింపు పొందారు.)

జీతన్

- జూలూరు గౌరీశంకర్

మాటలు, పలుకులు, బాటలు, బాధల గాథలు, తండ్లాటలు అన్నీ పాటలే. బుడి బుడి బుడి అడుగుల నడకల నడతలు, నిలబడి పడడాలు .... అప్పటికప్పుడు చెప్పక చెప్పని విరబూస్తున్న బోసి బోసి పసినవ్వుల తోటల పూతలన్నీ పాటలే. పదం పదం ఉరికి, దూకి, దుమికి నీళ్ళల్లో కేరింతలు, గిల్లింతలు. వేస్తున్న నీళ్ల చేపల కెలకలన్నీ పాటలే. ఎక్కడికంటే అక్కడకు ఎంత దూరమైనా ఆగకుండా, తెగకుండా దేదీప్యమానంగా సాగుతున్న తెగని చూపులు పాటలు.
పాటంటే బిడ్డ ఏడుపు.
పాటంటే బోలెండంత దుఃఖం.
పాటంటే ఎంత చేదినా ఆగని కన్నీళ్ల జల.
కన్నీటి గోళాలు పగులుతున్నప్పుడు దాన్ని చూడగలిగిన దృశ్యం పాట. అర్థం కాని అర్థ పదార్థాలన్నీ పగిలి అర్థద్వారాలను తెరిచేది

పాటే. అమ్మ ఒడి ఎంత మరువలేనిదో అంత విడువలేనిది పాటల బడి. మనలనందరినీ ఈ సకల చరాచర ప్రకృతినీ పెంచి పెద్దచేసింది పాటే. పాటల తోటలు లేని నేల ఈ జగమున లేదు.
పొందినవన్నీ పొందేది పాటల్లోనే.
పొందలేనివన్నీ పొదిగేది పాటల పొదుగుల్లోనే.
పాట పాలపొంగు, పాట పైరగాలి.
ఉద్వేగంతో ఊగిపోతున్న విప్లవ స్థలం పాట
పాట ఒక ఆకర్షణను వెంటేసుకొని ఎగరేసుకొని పోయే హృదయ వైశాల్యం. అంతంలేనిది పాట. అనంతమైనది ఆట.
వినగా, వినగా పాటలు జీవితమగును.
పాడగా, పాడగా పాటలు పోరాటమగును.
అడుగులు వేయగా, వేయగా అధికారం అలజడి చెందును.
కాలం సరిగ్గా పాటమీదనే నిలబడి కాలం వెళ్లబుచ్చుతుంది.
కలలకు గర్భం పాట. అసలు పాట పెద్దమనిషయ్యాకే పరిణామక్రమం పురుడు పోసుకుంది. కలలకే కాదు కల్లోలాలకు కేంద్రం పాట. పేదవాని పెదవి, ఆకలి దప్పుల సంరంభపు నాదం పాట. బతుకు కేంద్రాలన్నింటిని కలిపే ఏకైక కేంద్రం పాట. నేను, మనము, మనందరము పాటైనందుకు, పాటల పల్లవులమై పల్లవిస్తున్నందుకు, కలలను పంచుకునే కేంద్రాల దగ్గర సమపంపిణీ చేసే చేతులు మనంగావడం పాటలిచ్చిన ఒక మలుపు. ప్రతి పదం పురుడు పోసుకుంటున్నప్పుడు పదాలన్నీ పరుగు పరుగున పాటల దండలవుతాయి.
దీనికి కూత ఎవడు నేర్పాడో,
పలుకులెవరు పలికించారో,
దీనికి పాలు పట్టి ఎవరు పెంచారో
ఎవరికీ తెలియదు కాక తెలియదు.
మాటలకు మాట ఉన్నట్లుగానే పాటలకు పాటల పుట్టలు.
పాటలకు పాటలు కలిసిపోయి, కరిగిపోయి, మరిగిపోయి అవన్నీ మహా కావ్య సముద్రాలవుతాయి.
కాలాలు కేలండర్‌లా మారుకుంటూ గతాలు కదిలిపోయిన కాలం క్షణాలుగా మిగిలిపోతూ భవిష్యత్‌కు స్వగతాన్ని అద్దుకుంటూ అట్లా జ్ఞానరేఖల్ని పంచుకుంటూ ఓ పరుగులు తీస్తున్న ప్రవాహం. నురగలు కక్కుకుంటూ అలలను దరులకు పంపుతున్న జ్ఞాన ప్రవాహం. ఈ పరుగులు, నురగలు, కలల మరుగులు, ఆకాంక్షల అరుపులు పటపటమని అలలు దరులకు తగిలి పగిలి మళ్లీ ప్రాణం పోసుకుంటున్న కలల రూపాలు.
నీళ్లు నాగరికత కాళ్లు కడుక్కుంటూ సంస్కృతికి పాలిచ్చుకుంటూ పరవశించి నీటి పడగలు బుసలు కొడుతూ నేలకు ప్రసవం చేస్తూ ప్రవాహాల పరుగులు, ఈ ప్రవాహాల వెంటనే జ్ఞానం పారుతూ ఉంటుంది. ఈ ప్రవాహాలే మానవ వికాస పరిణామాలు.
కాలానికి లోలకులుగా కంటి పాపలాగా ఎవరున్నారో,
కాలం ఇచ్చిన సకల చరాచర సంపదల్ని ఎవరు కావలి కాశారో
ఎవరెవరికీ తెలియదు.

ఈ కాపలాదారులు చరిత్ర పుస్తకాలు ఎంత వెతికినా ఏ కమ్మలోను కనిపించరు. ఏ తాళపత్ర గ్రంథాలలో ప్రాకృతాక్షరం కాలేకపోయారు. దట్టమైన ఆ దండకారణ్యాన్ని ఎవరు తమగుండెలకత్తుకొని తమలో దాచుకున్నారో, ఎవరు ఇంత గొప్ప సంపదను ఇన్ని తరాలు కాచుకుంటూ తమ కళ్లను భవిష్యత్తుకు యిచ్చారో కదా!
తనను తాను ఇతరులకు అర్పించుకొనడం కంటే గొప్పది ఇంకేదైనా ఉందా? తనకోసం కాక ఇతరుల కోసం తనువులు చాలించడం కంటే మించింది లేదు.
ఈ ప్రకృతి పుక్కిలించి విసిరేసిన అక్షరాలను
అన్నిటిని ఏరుకుంటే చాలు ఆ కాలానికి
ఓ వాగ్గేయకారుడై తమ కంఠాన్ని పగలకొట్టుకోవచ్చు.
ప్రకృతీ! నువ్వెంత మందికి
ప్రాణం పోసి కవులను చేశావు.
నువ్వెంత మందికి ప్రాణదానం చేసి
మహా కావ్యాలనందించావు
నీ ఒడిలోకి వస్తే పాటే
నిన్ను అలింగనం చేసుకున్న స్పర్శ పాట
రివ్వున దూసుకొస్తున్న గాలి పాటలను మోసుకొస్తుంది. తొలకరి వర్షం పడుతున్నప్పుడు మట్టి వాసనంతా పాటే. ఉసిళ్ల పుట్టల్లా కమ్ముకొస్తున్న అక్షరాలన్నీ కోటానుకోట్ల పాటలు. ఆ పాట కంటి చూపులనుంచి చూస్తే గానీ మనకు అసలు దారులు అర్థం కావు.
పాట నోరు విప్పిన రాగంలోనే ప్రపంచం
పాట గుక్కపట్టిన రాగంలోనే జీవనమంతా
పాట ఎద ఎదల మూలుగుల నుంచే బతుకు గీతాలు
అందుకే పాట ముందు నేను మూర్ఛపోయాను
అందుకే పాట కాళ్లకు మొక్కాను
ఆ పాట చనుబాలతోనే అక్షర శక్తివంతు నయ్యాను
పాట నన్ను ఎక్కడికి తీసుకుపోయిందో? ఎక్కడ పాటను నేను వదిలేశానో? ఎక్కడ పాట మళ్లీ ధైర్యం చెప్పి నడిపించిందో? ఎక్కడ పాట బతుకు బాటకు బాట వేసిందో? కానరాని దారుల దృశ్యరూపమది. నా తాతల తండ్రుల తరతరాల ఆర్తి రూపం పాట. పాటా పాటా నువ్వు మా దగ్గరే వుండి, మా దగ్గరే పెరిగి, మా దగ్గరే నిలిచి, కానరాని దారులు చూపుతూ దుర్భేధ్యమైన దారులలో నడుచుకుంటూ, అరుచుకుంటూ, అగ్గి రవ్వల్ని అంటించుకుంటూ, అక్షర పంటలు పండించుకుంటూ నడుస్తున్న నీ దారి అనంతం.
సంపదంటే సమాజమేగా. మరి వ్యక్తుల చేతుల్లోకి సమస్తం పోతే సమాజం ఎట్లైద్ది? ఈ నేలను ఎవడో తన చేతులతో అబ్రకదబ్రలా సృష్టించలేదు. ఎవడో కనికట్టు చేస్తే కాలం నడటం లేదు. నేల మీద చెమటా, నెత్తురూ ధారపోయందే పొద్దటికి పొద్దుపొడవదు. తమ కోటానుకోట్ల చేతులతో దాస్తేనేగా ఈ సంపద బతికి బట్టకట్టింది. ఆ కాచిన చేతుల్ని కాపాడుకోవడమే అందరి కర్తవ్యం.అలా తరాల సంపదను దాచిన చేతులు పాట. సంపదను

సామూహికం చేసి పంచిన చేతులు పాట. సామూహికత్వంపై ఎవడు చేయివేసినా యుద్ధం చేసేది పాటే. పాట నువ్వు మా కంటిముందు కనిపించే నిజానివి. నువ్వు మా సకల సంపదల సంరక్షిణివి.

2

నీఊరు "సుదూర్"
మారుమూలకు మూల
గిరులు పర్వతాలు పెనవేసుకునే
దట్టమైన ఆకుపచ్చ ప్రపంచం
గిరిధి జిల్లా మట్టి ముద్ర
సుదూర్ అన్నింటికి దూరమే
ఆకుపచ్చ ప్రపంచమే తప్ప
అభివృద్ధి పటం కన్పించదు
వానపడ్డప్పుడు వానపాములు
వానకు తలలు పోసుకుంటున్న చెట్లు
మట్టితో తడిసి ముద్దకావడం
చినుకులు వంటి మీద పెట్టే ముద్దులు
మొలకలతో మొలిచి
పందిరిలాగా పారి
చినుకులతో నదులు పెరిగినట్లు
పెరిగిన సహజ స్వరమునీది
కోటాను కోట్ల మంది పేదరికాన్ని
పంచుకుని పుట్టిన పాట పుట్టుక నీది
ప్రకృతే ప్రేమగా పెంచుకున్న పాటరూపం నువ్వు
పాట కన్న తల్లి పేగువయ్యావు
ప్రకృతి పురిటి నొప్పుల అనుభూతివయ్యావు
నీది మంద చదువు, మంది చదువు
మందబుద్ధులను తన్ని తరిమే చదువు
విశాలత నీ సిలబస్
ఈ విశ్వం నీ పాఠం
గోడలు లేని తరగతి గది
కన్నీళ్లలో మరిగి
తేటతెల్లంగా పరవశించే నది నవ్వు నీది
ద్రోహంలేని కరికులమ్
పశువులను ప్రేమించి, పూజించి
వాటిని మల్లేస్తూ
జనంమదిని తట్టిన
జన పోతులూరివి
పశువుల కాసిన కాపరులంతా పోతులూరి వీరబ్రహ్మేలు కారు
గొర్రెల నల్లించిన వారంతా క్రీస్తులు కారు
అందులో కొందరే అంద్రెశీలు, గద్దర్లు, గోరటి వెంకన్నలు
వీళ్లంతా అక్షరాలను పండించిన పల్లె గోరింటాకులు
ఆ కొందరిలో ఏ ఒక్కరో
జీతన్ మరాండే అవుతాడు

జీవిత పాఠం తెలిసిన
జీతన్‌లవుతారు.
తత్వాన్ని విప్పిజెప్పిన జన తత్వకారులవుతారు
ప్రకృతి పాఠశాలలలో పెరిగితే
మరాండీ లౌతారంటే
ఆధునిక ముఖమేసుకున్న వాళ్లనంతా
జీతన్‌ల జీవమున్నపాట కమ్మని శపిస్తున్నా

చిన్నప్పటి నుంచి మాకు
భూగోళం చూపిన సారు
బాల్యం నుంచి ఎక్కాలు చెప్పిన
మా మముదీసను సారు
ఎన్నో పాఠ్యాంశాలు మర్ధన చేసి
మాకు విప్పి చెప్పిన సార్లు
ఎన్ని చెప్పినా మేము వినలేనిదాన్ని
ఎన్ని విన్నా మేము కాంచలేని దాన్ని
చీమలు పెట్టిన పాముల పుట్టను చూసి
తేనెపట్టును చూసి
ఇప్పపూల వాసన చూసి
అడవిలోని సమస్త నిస్వార్ధాన్ని చూసి
మేకల మల్లింపు నుంచి
దోపిడీ తోడేళ్ల ఎరుక పెట్టిన మరాండీ

రాజ్యాన్ని, అందని సామాజిక న్యాయాన్ని
పంటను నోటికాణ్ణుంచి గుంజుకు పోతున్న చేతుల్ని
రూపం కనిపించకుండా చేస్తున్న దాడుల్ని
ప్రపంచ కుగ్రామం పేరున
నెర్రలు బాస్తున్న తన కాళ్ల కింద నేలను
"సూదూర్ నుంచి కనిపెట్టిన మరాండీ

3

పశువులను మేతకు తోలుకపోయిన బాలుడు
అడవులను మేసేవారిని గుర్తుపట్టడం చిత్రం
అడవి తల్లి సిరిసంపదలపై కన్నేసిన
ఆర్థిక మదాంధుల్ని తన కేకలతో
ఉరికించి ఉరికించి ఉక్కపోసుకోకుండా చేసి
తన నేలను కాసుకునే పాట కావడం మరింత చిత్రం.

మేకల గుంపును లెక్కకట్టడానికి
వాడిన గులకరాళ్లే లెక్కలకు పునాది
పలకా, బలపం పట్టని నీ చేతులు
మానవీయ తత్వాన్ని అర్ధం చేసుకున్న కావ్యాలయ్యాయి
ఆ లెక్కల రెక్కలకు పల్లవులల్లి పాటలతో పరిమళించావు.
జీవన తత్త్వంగా పరిడమిల్లావు
చీరేస్తున్న పేదరికం నుంచి చదివిన మూడో తరగతి

నిజంగానే నువు చెప్పుకున్నట్లుగానే
జీతన్-జీతన్-అదే విజ్ఞాన సర్వసంపద
జీతన్ జన విజ్ఞాన సంపదల గుమ్మి
ఆకాంక్షలు నెరవేర్చే జ్ఞానము సుమ్మీ-
నీది నిర్బంధ ప్రాథమిక విద్య కాదు
నీది స్వచ్ఛంద జనవిద్య
విశ్వ విద్యాలయాల మెట్లు
చూడలేని చదువు
పెద్ద పెద్ద ప్రొఫెసర్లకు
కనిపించని చాప్టర్లు
ఆక్స్‌ఫర్డ్‌లు, స్టాన్‌ఫర్డ్‌లు
తెరవని జ్ఞాన పేజీలు జీతన్‌వీ
సహజసంపదను రక్షించే జ్ఞాన సంపదను
తరతరాలకు అందించిన పాట మారండీ
పశువుల నల్లించిన ఆ చేతులతో
నువ్వు మోగించిన నగారాకు
రాజ్యాంగం గుండెలదిరాయ్.
న్యాయస్థానం మతులు పోయాయ్
అధికారం పేనిన ఉరితాళ్లు
పోరు పాటలయ్యాయ్
ఉరితాటి పాటలు కవుల కావ్యాలౌతున్నాయ్
ప్రజల పాట మెడకు ఎవరూ ఉరితాటిని బిగించలేరని
అక్షరాలు అరుస్తున్నాయ్

ముసలోళ్ల మాట ముద్దయిన మాట
మందిని తలపోసిన పాట
మా మరాండీ పాట

4

చెడు వినకు, కనకు, చూడకు అన్న బాపూజీ మాటలు చెప్పుకుంటూ ఊరూరా కాళ్లరగా తిరిగి ఆ బోధనలకు అంబేద్కర్, పూలేలను అద్ది వాటికి గొంగళి వేసి, గజ్జెలు గట్టి ఆడీ పాడిన మా విఠల్ లాగానే విశ్వం గురించి చింతించావు. సరిగ్గా మంది కోసం తన కంఠాన్ని పలగొట్టుకున్న గద్దర్ లాగే నువ్వూ తొలి అడుగులు వేశావు. ఆశయాలు ఎవరివైతేనేమి అవి సమాజాన్ని మార్చితే చాలన్నదేగా మా గద్దరైనా, మరాండీ అయిన అడిగింది. గద్దర్ యుద్ధనౌకగా మారేముందు జరిగిందేమిటి? గద్దర్ పాటల పడవ నేసుకుని ఏ తీరం నుంచి ఏ తీరానికి వెళ్లాడు? గద్దర్ గొంగళి, గజ్జెలమోతకు చిత్రహింసలు, బుల్లెట్లు.
మరాండీ మా గద్దరే,
కాదు కాదు గద్దరే మరాండీ అయి మళ్లీ పాటగా పుట్టాడు.
పాటగా పుట్టడం, పెరగడం సరే.
పాటగానే జీవితాంతం జీవించడం, ఆ పాట జీతన్‌గా, గద్దర్‌గా నిలవడం, ఆ పాటకు బతుకునద్ది తాము కూడా అందుకోసం తనువు చాలిస్తామని తెగించడమే పాటంటే. పాట అందుకే తూటా అయ్యింది.
అందుకు కదా పాట నెత్తురైంది.
అందుకు కదా పాట చీకటిలో వెన్నెలైంది.
వెన్నెల చూడని రాత్రులకు ఓదార్పు అయ్యింది.
పాటకు పాటేసరి-గద్దర్‌ను గురిపెట్టి కాల్చినంక, ఆ పాటకు కోరసిచ్చిన ముప్పది రెండు మంది పిట్టల్లా రాలిపోయినంక, ఇప్పటికిక పాట పావురమై ఎక్కడ ఎగిరినా, గురిచూసే తుపాకులున్న దగ్గర మళ్లీ జీతన్‌ల జననం. జీవన్మరణ పోరు వాకిలి దగ్గర కొలుపు పాట మరాండీ.
పాటంటే పైకెక్కించటమే కాదు అడవుల పొత్తిళ్ల కింద దాయబడ్డ సంస్కృతి, సాంప్రదాయాల సుఖదుఃఖాలు, అందచందాలు, చావుపుట్టుకలను దాచిన సందూక. సహజమైన అడవి మల్లె ఒంటికి సృజన శీలత అంటుకుంటే అది మరాండీ అవుతుంది.

ప్రపంచ కుగ్రామం
అసలు రూపం చూసి
నా సంస్కృతిని పరిరక్షిస్తున్న
ఓ రక్షకుడా!
సమాజ సహజ సంపదల ఒంటిపై
పరాయి చేయిపడకుండా చూస్తున్న
ఓ కాపలాదారుడా!
నేలను తవ్వుతుంటే బాక్సైట్‌కు
బదులు "నక్సలైట్" బయటపడ్తున్నదేందన్న కె.ఎస్.
జిందాల్ తవ్వకాలలో మరాండీల పాటలు
మొలుచుకొస్తున్నాయేంది
అడ్డుకున్న పాట మెడకు ఉరితాళ్లు ఎన్నెన్నో
నిజంగా మరాండీ మేమంతా
సౌహార్ద్ర ప్రతినిధుల సందేశాలమైనాం
మా కోసం, మన కోసం
సకల సమాజం కోసం
ఉరితాటిని ముద్దుపెట్టుకుని
ప్రపంచీకరణను పలగ్గొట్టి చూపుతున్నారు
మీ రుణం తీర్చుకోలేనిది
పాటల సంతానాలం
మీ త్యాగాన్ని మాత్రం
అక్షరాల కవిత్వగానం చేస్తున్నాం
మాకు కాసిన్ని పోరు ఉగ్గు పాలను పోసి
ఈ కవిత్వానికి జీవన జీతన్‌లవుతున్నారు
మళ్లీ ఓ కొత్తపాటకు పానమౌతున్నారు
తాను అంతర్ధానమౌతూ
ఎందరెందరినో కదిలించటమేగా పాటంటే

ఎన్జీవోలకు, సామాజిక కార్యకర్తలకు
రాజ్యబంట్లకు, ప్రజల సేవకులకు
అర్థాలు మారుతున్న అంతరార్థాలలో
కాలం మారుతూ తెచ్చే మార్పులతో
ఒదిగిపోయిన అక్షరాలు
మంది ఆలోచన నుంచి మందిని చీరేస్తున్న
తరుణంలో మళ్లీ సమూహానికి
ఓ సామూహిక గీత మందించిన మరాండీ
అందుకే రాజ్యానికి
నగారా, ఢోలక్, హార్మోనియమ్ పెట్టెలు
ఆయుధాగారాల్లా
పంచె, గంజీ, కాలిగజ్జెలు
అధికారానికి ఆలీవ్‌గ్రీన్ దుస్తుల్లో నక్సలైట్‌లలా...
పాటలపైన నిఘాలే కాదు ఉరితాళ్లూ విసిరాయి
దిక్కుమొక్కులేని జనం సింహాకంఠ నాదంతో ఎగుస్తున్నందుకు
పాణిగ్రాహి పాటను నెత్తురు చేశారు. అరుణోదయ పాటకు
అక్షరాలు సమకూరుస్తున్న జంపాల ములుగు అడవుల్లోని చెట్ల
ఆకులపై వెదచల్లబడిన నెత్తురయ్యాడు. వీధినాటకమైనందుకు
సఫ్దార్‌హష్మీ పాటను నడిరోడ్డున నరికారు.
బండెనుక బండిగట్టిన బండి యాదగిరి తెలంగాణ వడిసెల
రాయి
ఈ నేలపై తొలి బాలకార్మిక గీతమైన సుద్దాల
నూతన్ పాటను వెన్నెలపై నడిపించిన అజ్ఞాత సూరీడు
తుపాకి తూటాల గాయపడ్డ గద్దర్‌పాట
కటకటాలకు గానం నేర్పుతున్న మిత్రపాట
తమ గొంతుల్లోంచి అరుణోదయాలిచ్చిన
రామన్న, నాగన్న, విమలక్క
సాహస తెలంగాణ మట్టి పాటల పౌరుషం
ఇవన్నీ మా మదిల్లో నింపుకున్న మాకు
గాయమైనా దుఃఖమైనా, కన్నీళ్లైనా, కష్టాలైనా
కష్టసుఖాల కలత చెందడాల్లో ఉలికి పాట్లలో
తొట్రుపాట్లలో, తుళ్లింతలలో, తొందర తొందరల్లో
అలికిడి, ఆందోళనల్లో అక్షరాలమై ఎగిసిపడే మాకు
నా స్వరమూ, నా సంస్కృతియే నా ఆయుధాలన్న
మరాండీ-ఎనెన్ని బతుకు కావ్యాలకు మళ్లీ జన్మనిచ్చావ
మళ్లొక్కసారి విశ్వనరునికి అర్థం చెప్పి
నీ దారులవైపుకు మళ్లీ ఒక్కసారి
కదిలించావ్
అక్షరాలను విడిచి దాక్కున్నవాడు
ఎప్పటికీ అక్షర విల్లును ఎక్కుపెట్టలేడు
ప్రజా సంస్కృతిని ప్రచారం చేయడం కంటే
మించిన కర్తవ్యం మరొకటి ఉంటుందా?

5

పాటను ఉరెయ్యలేరు
కాల్చలేరు
బూడిద చేయలేరు
కటకటాల్లో కట్టేయలేరు
తుది విజయం పాటదే
తుది సమరం పాటదే!
మరాండీకి, ముగ్గురు సహచరులకే వేస్తున్న ఉరిశిక్ష కాదిది.
అడవితల్లికి ఉరివేయడమే. రాజ్యం చేస్తున్న దీర్ఘకాల తప్పిదం.
పాటకు మాటకు అడుగుకు ఉరివేయడమేంది? ఉరి అనాగరిక
చర్య. రాజ్యం నాగరిక రాక్షసి. రాజ్యం ప్రపంచీకరణ ముఖం
తొడుక్కున్న రక్తపింజిర. రాజ్యం ప్రశ్నను హత్య చేస్తున్న హంతకి.
భూమిని చీల్చుకుపోతున్న మాఫియా కేడీలకు రాజ్యం రక్షణ
కవచంగా మారితే అక్కడ ఉరితాటికి మరాండీ పాట నేర్పుతాడు.
సాంప్రదాయాల్ని, సహజ సంపదల్ని దాచిన వాడే దేశభక్తుడు.
మూల సంస్కృతి వారసులే ఈ దేశానికి పురాగామి శక్తులు.
ఆదివాసీలే నాగరికతకు అవతార పురుషులు. బాధలను
అనుభవిస్తూ ఉరితాళ్లను పలకరిస్తున్నవాడు మరాండీ.
ప్రపంచీకరణ శిరస్సును పాటల ఖడ్గంతో ముక్కలు చేస్తున్న జన
వాగ్గేయకారుడు మరాండీ.
సామాజిక న్యాయం కోసం ఉరితాటికి వేలాడుతున్నవాడు
మరాండీ.
బక్కోళ్లందరం బతికించుకోవాల్సింది
బతికేహక్కును ప్రశ్నగా ఎక్కుపెట్టినవాణ్ణి.
ఉరిశిక్షల్లేకుండా చేసే రాజ్యం కోసం రాగమవ్వుదాం.
న్యాయం పేరు మీద ప్రాణం తీయడం నేరం
నేరం అధికారమౌతున్నప్పుడు మట్టిని చీల్చుకొస్తున్నపాట
న్యాయం.
అధికారం నేరస్తుడిగా
కొనసాగుతున్నంత కాలం పాటది పోరాట పక్షమే
మూల మూలాల నుంచి పొంగుకొచ్చిన
మూలవాసీల జీవ కవిత్వం జీతన్‌మరాండే

పంట బువ్వ కావటం మరాండీ పాట
బువ్వల మట్టిపోయటం రాజ్యం వికృత ఆట
పాటల పాదాలు జన హృదయాలుగా చేసిన
మరాండీల అడుగులే చరిత్ర పాఠాలు.

6

"హంతకుడి" అర్థం మారింది
రూపం మారింది
ఏ రూపంలోనైనా రావొచ్చును
ప్రపంచమే ఒక గ్రామమయ్యాక
వాడు మనవొంట్లోకి ఇంట్లోకి పొయ్యిలోకి
పొయ్యికింద మంటలోకి
మన పంటల్లోకి విత్తనం మొలకల్లోకి
ఎక్కడికైనా ఎక్కడెక్కడికైనా సర్వాంతర్యామిగా హంతకుడు

ఈ హంతకుడు ఒక వూరివాడో
ఒక ప్రాంతమో, దేశమోనన్న ముద్రున్నవాడు కాదు
ఈ నేలను మొత్తాన్ని మింగే హంతకుడు వాడు
అది ఏ హంట్ అయినా, చివరకు గ్రీన్‌హంటైనా
హంటర్ చేతిలో కొరడా ఎక్కడో ఉంటే
నా వీపు మీది తాటలు వూడి పడటమే చిత్రాచిత్రవిచిత్రం
కానరాని దారుల్లో నడుచుకుంటూ
కంటికి కునుకులేకుండా
ఈ నేలంతా తన పాటను ఆరేసి
బతుకు అర్థాల్ని విప్పుతున్న పాటను
ఉరి తీస్తానన్నప్పుడు కదా ఈ అక్షరాల చీమలు పుట్టలు
కదిలినయ్
అడవులు పేర్చుకున్న జనపట్టులోకి
ప్రవేశించిన హంతకుడి రూపం ఏమిటి?
మాకు ఎవ్వరితో సంబంధం లేదు
మాది అక్షరాల సంబంధం
అక్షరాలా బతుకును కుట్టేసిన పాట సంబంధం
మాది తరతరాల పాటానుబంధం
మాది యుగయుగాలు మరువలేని రాగం
ఏ ఆయుధాలతో సంబంధం లేదు
ఏ అడవుల దరిదాపుల్లోకి పోలే
కానీ అక్షరం మీద రణం ప్రకటించాక
అక్షరం మీద నిఘా నీడలు పడుతుంటే
నా కోసం పాడుతున్న మంది పాట మెడకు తాళ్లు బిగిస్తుంటే
తల్లడిల్లుతున్న అక్షరాల్లోంచి ఒక పాటగా జనిస్తున్నా
అర్థం కానీ విషయాన్ని అర్థమైనట్లు చెప్పి
అస్పష్టాన్ని స్పష్టం చేసేదే పాట
కోడికూతే జ్ఞానం
బాయికాడి గిలక అలకిడి పొద్దు పొడుపు
చెట్లులేవు, చెట్ల ఆకులు లేవు, ఉసిళ్లు, కసిళ్లు,
రకరకాల చెట్లు, పండ్లు, ఫలాలు ఇవేవీ ఇంకేమీ ఎవరికి ఎవరూ
పట్టించుకోరని, ఎవర్ని ఎవరుగా కాకుండా, మనిషిని
ముక్కముక్కలుగా చీరేసినంక ఇంక ఎదురేముంది. హంతకుడు
యథేచ్ఛగా వచ్చి నేల పొత్తిళ్లలోకి కత్తిదించాడు.
హంతకుడి రూపాన్ని గుర్తించి గొంతెత్తిన తక్షణ రక్షకుడు పాట.
అందుకే హంతకుడు పాటపై కన్నేశాడు. కంట్లో నలుసు లాగా
హంతక చూపులకు అడ్డుపడుతున్న పాటపైకి తెగపడ్డాడు.
ఇప్పుడిక హంతకుడి పని ఒకటే. పాటను హతం చేస్తేనే తన
మనుగడని తేలింది. ఇపుడు హంతకుడు పాటను చంపాలి.
అడవితల్లిని కాపాడే ఆ గొంతును కొరికేయాలి. పాట రెండు
చేతుల్ని నరికేయాలి. అడవి కోసం శబ్దం చేస్తున్న దప్పు గొంతు
పిసికేయాలి. హంతకుడు గురిపెట్టి కాల్చేస్తున్నాడు. ఉరితాళ్లను
పాటపైకి విసిరేస్తున్నాడు.

7

పండు పైనుంచి కిందకే ఎందుకు పడుద్ది?
పడడం గురించి పరిపరివిధాలా పరవశిస్తేనే గదా, ఆ
పరవశంలోకి పరకాయ ప్రవేశం చేస్తేనే గదా గురుత్వాకర్షణ
గుట్టు విప్పగలిగాడు న్యూటన్. న్యూటన్ గురుత్వాకర్షణ, మార్క్స్
కమ్యూనిజం, లింకన్ నల్లజాతి సంతకం, దక్కలి జాంబపురాణం
నా ఆది సంస్కృతి, పూలే అంబేద్కర్‌లు మనువు ముఖంపై
అడ్డంగా గీసిన గీతలు, శంభూకులు, ఛండాలులు రాబోయే
చరిత్ర రథచక్రాలు.
ఎవడో ఒకడు ఈ నేలకోసం ఎంతో కొంత తపించిన తపస్సులే.
ఆ తపస్సుల ఆలోచనల తపస్సుల తమస్సుల ఫలితం కదా ఈ
వెల్లివిరుస్తున్న సృజన పంటలు.
అడవి అక్షరాల కారడవి.
అడవి సర్వజ్ఞాని.
అదే మన సంపద, జన సంపద.
అడవి సర్వ లక్షణ కవచం.
వర్షం, వాన, ఎండ, నీడ, చలి, వేడి, నీరు, నిప్పు అంతా అడవే.
అడవి సర్వసుందరి, అంత అందమైనదీ ప్రపంచమున లేదు.
అసలు అడవే అందాన్నంతా పోతపోసి పెంచింది. అడవి కళ్ళు
చూసినా, కాళ్ళు చూసినా, సుతారమైన ఆ చిటికిన వేళ్ళు
చూసినా, అడవిలోని ఏ సోయగం చూసినా అన్నీ సొంపులే.
అన్నీ మరువలేని వొంపులే. ఆ సౌందర్యాన్ని ఒక్కసారి
మోహించినాక ఈ ప్రపంచం ఎటువైపుకి తోలుకెళ్ళినా మళ్ళీ
మైమరిచిన ఆ అడవి అందం వైపుకే అడుగులు... అడుగులు...
ఇది పోతపోసిన అందమో, పూతపోసిన అందమో కాదు, ఈ
భూగోళంలోని చిత్రకారులంతా చేతులు కలుపుకున్నా ఈ
అందాన్ని తమ చేతులతో గీయగలరా?
ఏ మొక్క చూసినా, ఏ మొలక చూసినా, ఏ చెట్టు ఆకు చూసినా,
ఏ కొమ్మ రెమ్మల్ని చూసినా, చెట్టుమీద పండిన ఏ పండును
పంటికి తగిలించినా నాలుక రుచుల మత్తుల్లోకే. తరతరాల
యుగయుగాల దిగని అందగత్తె మత్తు ఈ అడవి. ఈ అవనిపైన
అడవిని మించిన అందగత్తె లేదు. వీచే గాలికి ఆ హొయలు
చూడాలి. పూచే పూలపై ఆ తెమ్మెరలను చూడాలి. తూనీగల
గుంపునుంచి దానందాన్ని చూడాలి. తనే తనపైన
కురిపించుకుంటున్న వర్షపు జల్లుకు నీళ్ళు పోసుకుంటున్నప్పుడు
ఆ సహజ సౌందర్యం చూడాలి. రెండు కళ్ళను ఎంత సారించి
చూసినా తనివి తీరదు. దప్పిక ఆగదు. ఎప్పటికి వొడవని
తపనల తపస్వి ఆ సుందరి. దాని చెంతనే ఈ ప్రపంచం
చిరునామా. అదే ఈ ప్రపంచం అడ్రసు. రెండు దేహాల
కలయికతో సృష్టి నిప్పు రాజేసిన జ్ఞానం అడవి. అడవి కొత్త
కట్టడాల వంతెన. అసలు అభివృద్ధి నెట్‌వర్కంతా అడవిదే. సకల
చరాచర సమాచార విప్లవాలు ఆ తల్లి గర్భం నుంచే. ఆ తల్లి
రుణం తీర్చుకుని అడవిని కాపాడడమే సమాజ కర్తవ్యం.
అడవిని కాపాడినవాడే దేశభక్తుడు.

అడవి సంస్కృతిని నిలబెట్టినవాడే ఈ నేలబిడ్డ
ఏది పోయినా దొరుకుతుంది, మూలాలు పోతే మనం
మిగలమన్న మరాండీ ఈ నేల ముద్దుబిడ్డ.
మన సంస్కృతి రక్షకుడు మరాండీ
మరాండీకి శిక్షంటే నాగరికతకు ఉరితాడు
'సుధూర్' నుంచి సుదూరానికి ఎక్కుపెట్టిన విల్లు మరాండీ
గిరులు గుక్కపట్టిన పాటకు గ్లోబల్ రక్కసి విలవిల
మరాండీ శిలువెందుకెక్కుతున్నాడో తెలిసినాక మౌనం నేరం
మనమిక మాట్లాడకపోతే మాటా హత్యే
మన అడుగులపై కనిపించని క్రీనీడలు
పాటను ఉరితీసిన రాజ్యం బతికిందా ఈ లోకంలో
మాటను చంపేయాలన్న దుర్నీతి నిలిచిందా ఈ ఇలలో

ఈ మౌనం కచ్చితంగా యుద్ధనేరమే!

- అనామధేయుడు

అంతా చిట్లిపోయినట్లు
అందరూ ఇక ఇళ్లకెళ్ళిపోయినట్లు
ఓ కన్నీటి బొట్టేదో ఘనీభవించినట్లు
ఓ నెత్తుటి చారికేదో చరిత్రకు మొఖం చాటేసినట్లు
ముగింపు వాక్యం రాసేలోగా ఒక్కసారిగా బతుకు కావ్యం ధ్వంసమైనట్లు
దశాబ్దాల కలల్ని, ఆకాంక్షల్ని నడిబజార్లో బద్దలుకొట్టేసి
ఓ విజయోత్సాహపు పతాకాన్ని ఎగరేసినట్లు
చమురు దాహంతో బతుకు బంకర్లను ఆక్రమించినట్లు

ఒక వియోగానంతర భ్రాంతి
ఒక యుద్ధ విరామ నిశబ్దం!
నిజంగా - సాయంకాలమంటే ఇదేనా?
నిజంగా - దీన్ని యుద్ధ విరమణ అనే పిలవాలా?

శిథిలమైన చర్చి చుట్టూ తిరుగుతున్న అనాథ శిశువులాగో
అంధకారంలో ఆగిపోయిన దారితప్పిన ప్రయాణీకుల్లానో
సుదీర్ఘకాలపు ఎదురుచూపుల తర్వాత ఎదురొచ్చిన శూన్యంలాగో
అడవుల్ని ఊపేస్తోన్న పాటని ఉరికంబంపైకి ఎక్కించడంలాగో
ఇరవైయేళ్ళుగా ఉరికొయ్యల్ని చెక్కుతున్న తలారి వడ్రంగిలాగో
ఏదో పదునుగా పక్కటెముకుల్లోకి దిగుతూనే ఉంటుంది
ఏ నొప్పీ ఉండదు, ఏ స్పందనా తెలియదు
ఇదంతా యుద్ధమే అయితే -
కచ్చితంగా ఇక్కడ నేను యుద్ధనేరస్తుడిగానే జన్మించాను
పక్కనే ఊగుతోన్న ఊయలపైన మృత్యువులా వాలిన డేగ
నా గాయాల్లో వర్షిస్తూ సంకెళ్ళ చప్పుళ్ళ ప్రవాహం
నా పయనం పొడవున సాగుతున్న వలసల గానం!

ఓ అన్నం మెతుకు కోసం దేబిరించడం
దూడ పాల కోసం గింగిర్లెత్తిపోవడం
మేక పులి కోసం ఎదురుచూడడం
దశాబ్దాల తరబడి ఇదే దృశ్యం
ఈ పురిటిగృహం ఎప్పటికీ తడియారదు

కేవలం ఓ ప్రాంతం గురించో
అనివార్యంగా పీలికలయ్యే జాతి ఆత్మల గురించో
వ్యూహాత్మకంగా చీల్చబడే ఉద్యమాల గురించో
కలవడాలూ - విడిపోవడాలూ
ప్రేమలూ - విరహాలూ

ఎడారి పాలైపోయిన గుక్కెడు నీళ్ళూ
పాలకోసం గుక్కపట్టిన పసిబిడ్డ ఏడుపు
నడిరోడ్డుపై ఎండిన నెత్తుటి మడుగు
ఇలా - అనేకనేక వైఫల్యాల గురించి
ఇంకా - చెప్పడానికేమైనా మిగిలుందా?

బహుశా - చేజార్చుకున్న ఆమె చివరి వస్త్రం
నడిరోడ్డుపైన నిరసనగా ఎగరేసిన నగ్నత్వం
ఏమైనా చెబుతుందేమో?

రెక్కలు రాలిపోయిన నేపథ్యమూ
గూట్లోని చిన్నిపిట్టలు మాయమైపోయిన వైనమూ
దుఃఖ భారాన్ని మోస్తోన్న భగ్నగృహాల గానమూ
ఉరికొయ్యల తయారీదారుల కలకలమూ
మల్లెల సౌరభం మీద కమ్ముకున్న చమురు మేఘమూ
తెగిపోని ఇనుపకంచెల మీద ఎగుర్తూ తెల్లని జెండా పీలికా
ఇప్పటికి - ఇదే మిగుల్తుందా?

నేను మాత్రం ఆమె పూర్వ వైభవాన్నే ఊహిస్తున్నాను
విముక్తి కోసం ఎలుగెత్తిన ఆమె ఆకాంక్షనే వినగలుగుతున్నాను
లోలోపలే మళ్ళీ రగుల్కొంటోన్న ఆమె నెత్తుటిపాటనే గానం చేస్తున్నాను

ఇది వట్టి దేహగీతం కాదు
ఎల్లలు చెరుగుతున్న దేశగీతం కూడా!

ఇక్కడే కాదు
చరిత్ర పొడవునా ఎక్కడైనా
యోధుల్ని గురించి కలగనడం
ప్రేమికుల గురించి గాయపడడం ఆమెకు కొత్త కాదు

నెత్తుటి గాయాల్ని కడగడం, తన వస్త్రాన్ని చించి కట్టుకట్టడం
సైనిక దాడుల్లో ప్రవిస్తూనే ఉన్న రక్తాన్నీ
ఆకలి డొల్లని కప్పేసే దైనత్యాన్నీ
మౌనంగా తనలోనే దాచుకోవడం
ఆమెకు ఎప్పుడూ కొత్తకాదు

గాలి మోసుకొచ్చే పాత కబుర్లలాగా
ప్రవాహాల్ని చేజార్చుకున్న నదుల్లో
పడవల తెరచాపల పాత రెపరెపల్లాగా
ఓ వలసపక్షి ఇటుగా ఎగిరివచ్చి ముళ్ళకంపల్లో
చిక్కుకొని పాడుతున్న ఆర్తగీతంలాగా
కోట్లాది దేహాల్లోకి దిగబడుతున్న చమురు గొట్టాల్లాగా
శిలువల్తో, సంకెళ్ళతో, ఇనుప తీగల సరిహద్దులతో
నిండిపోయిన పచ్చిక బయళ్ళ రోదనలాగా
ఇప్పటికి - దీన్ని ఓటమనే పిలవాలా?

ఒక్కో గాయాన్నే పరిగలాగా ఏరుకుంటున్న
ఎండిన వాగుల ఆవులింతల గురించి
పరమ మామూలై పోయిన రోజుల్లోకి
నెత్తురు చిందించిన చరిత్ర తిరిగి ముడుచుకు పోవడం గురించి
పుట్టుక నుంచి అవిరామంగా సాగుతున్న
యుద్ధం మధ్యలో హఠాత్తుగా ఆయుధ స్పృహ కోల్పోవడం గురించి
ఇది కేవలం ఓటమి కాదని -
దీన్నంతా -
గాయవస్త్రాన్ని ధరించిన
ఆమె శరీరమే తిరిగి ఇంత గొప్పగా
ప్రకటిస్తుందా?

కొంచెం దేహంలాగా ఉండటం
అనేకనేక అసందర్భ అవయవ సమూహాల్లాగా ఉండడం
పూర్తిగా తవ్విపారేసిన ఖనిజాల గుట్టల్లాగా మిగిలుండడం
ఎడారుల్ని చీల్చగలిగిన మంచినీటి గొట్టాల అద్భుతాల మీదో
ఎర్రగా మడుగు కడుతోన్న చమురు సరస్సుల వడ్డునో
వాలిన డేగగోళ్ళ మధ్య చిక్కిన కళేబరాల్లాగా ఛిద్రమవడం
అడవి నుంచి పాటని లాక్కొచ్చి నల్లని ఉరికొయ్యల మీద నిలబెట్టడం
ఇరవై ఏళ్ళుగా ఉరితాళ్ళయి బిగుసుకొనే ఉదయాల కోసం ఎదురుచూడటం
ఆరొందల ఆత్మహనన గానాల మధ్య
ఓ విరామ చిహ్నమై నిలబడాల్సి రావడం
అనివార్యంగా నెట్టుకుపోవడం
అసంకల్పితంగా నెట్టబడటం
మరణపు చివరి అంకంలా బిగుసుకుపోవడం
అంటే ఇదేనని

నెత్తురోడుతోన్న
ఆమె నగ్నదేహం స్పష్టం చేస్తుందా?

ఎటుపోవాలనేదే
ఎప్పటికప్పుడు ఎదురవుతున్న ప్రశ్న -
కొంచెం ప్రేమని దొంగిలించాలనే ప్రయత్నం
ముసలి చర్చి పాదర్లా శిశువునెత్తుకోవడం
అడవిలో గాయపడిన ఆదివాసీ గానమవ్వడం
చమురు గొట్టాల మీద చిందిన నెత్తుటి మరకవ్వడం
అలాగే - ఓ యుద్ధ శకలంగా మిగిలిపోవడం కూడా
ఓ అద్భుత దేహ సౌందర్యంగానే భావిస్తున్నాను
అసంఖ్యాక మృతశిశువులతో
నడిరోడ్డున నగ్నంగా నిలబడిన ధిక్కారమే
ఇప్పుడు ఆమె తిరిగి ఎక్కుపెట్టిన యుద్ధం!

ఎడారుల మీద సుడులు తిరుగుతున్న
ఎడతెరిపిలేని గ్రీష్మగానానికి అతడు
ఓ నీటి పరిమళాన్ని జతచేసి వెళ్లాడు,
ఎంతకీ కనిపించని కారుమబ్బుల కొసన మెరిసే
వర్షగానానికి అతడు
ఓ తడి పవనాన్ని తగిలించి వెళ్ళాడు,
డేగల గుంపుల దాడుల మధ్యే
పచ్చని పంటభూముల కలకలాన్ని అతడు
దశాబ్దాలుగా కలగన్నాడు,
పీలకలైపోయిన జాతుల
ఆదిమగానాల్ని ఒక్కటిగా పేని
ఆయుధంగా ఎక్కుపెట్టాలనుకున్నాడు
తలవొంచని ధిక్కారమే
అతడ్ని నియంతని చేసింది
యుద్ధ నేరస్తుడ్ని చేసింది
ఆటవికంగా వేటాడింది

అతడి కలలన్న ఇప్పుడో చిత్రిత చరిత్ర
అతడి కలలని ఇప్పుడో ఆదిమజాతుల ఆకాంక్ష

పగిలిన నీటి గొట్టాల మీదో
పిగిలిన నెత్తుటి నరాల్లోనో
అదే ధిక్కారం ప్రతిధ్వనిస్తోంది
తలల్ని తుంచినంత సులభంగా
కలల్ని ఎవడు తుంచగలడు?

ఇదంతా కూడా ఆమె గొడవే
ఎండిపోయిన స్తన్యంతో
ఎముకులు దేరిన దేహంతో

నగ్నంగా నిలబడ్డ ఆమె గురించే
నేను మాట్లాడుతున్నాను

వాళ్ళ నలుగురినీ నేనెప్పుడూ చూడలేదు
వాళ్ళని అసలు నేనెప్పుడూ కలవలేదు
కనీసం ఎలుగెత్తిన వాళ్ళ గానాల్ని సైతం వినలేదు
కానీ ఆ కంఠాలు మాత్రం సుపరిచితమే
ఇప్పుడు ఉరికొయ్యలపైన నిలబడిన ఆ కంఠాలు
వెంటాడుతున్నాయి
గొంతెత్తక - ప్రశ్నించక
తప్పని పరిస్థితిని నెట్టేస్తున్నాయి

సమస్తాన్నీ సుపరిచితం చేసేస్తున్నాయి
వాళ్ళ కంఠాలు ఊపేసిన విశాల జన బాహుళ్యాల్ని,
వాళ్ళ కంఠాలు ప్రకటిస్తున్న అవిరామ యుద్ధాన్ని
వాళ్ళ కంఠాలు విస్తరింపచేస్తోన్న అరణ్యపరిమళాల్ని
సుపరిచితం చేస్తున్నాయి
ఉరికొయ్యలపైన నిలబడ్డ వాళ్ళ నిర్నిద్రగానం
నిద్రపోనీయకుండా వెంటాడుతోంది
అడుగు కదిపితే వాళ్ళ సంకెళ్ళ మోతే,
సంధ్య వాలితే వాళ్ళ ఉరికొయ్యల నీడే!

వాళ్ళ పాటల్లో ధ్వనిస్తోన్న
ఆమె నగ్నత్వాన్నీ, ఆమె దీనత్వాన్నీ
నేను స్పష్టంగా వింటున్నాను

అలాగే - వాళ్లముగ్గురిని కూడా నేనెప్పుడూ చూడలేదు
అయినా - ఇరవైఏళ్ళుగా కనిపించని ఉరితాడేదో
నా కంఠం చుట్టూ పెనవేసుకుంటూనే ఉంది
సముద్రాలవతల నుంచో
సుదీర్ఘయోజనాల నుంచో
విమానాల దాడుల్లో ధ్వంసమైపోయిన ఆనవాలులేని పల్లెనుంచో
సైనిక శిబిరాల ముళ్ళకంచెల మధ్యనుంచో
చొచ్చుకొస్తోన్న ఏ కన్నతల్లి గర్భశోకమో
ఇరవై ఏళ్ళుగా గుండెల్లో గుచ్చుకుంటూనే ఉంది
ఊపిరి సల్పనీయడం లేదు

నాలాగే - నిర్వికారంగా,
నగ్నంగా నిలబడ్డ
ఆమె కూడా ఏమీ మాట్లాడదు
గర్జించిన వసంత మేఘం గ్రీష్మంలోకి ఒరిగిపోయాక
నెత్తుటి బీళ్ళుగా చీలిన ఈ నేలా ఏమీ మాట్లాడదు
శతాబ్దాల అనాగరికతల్ని గర్భంలోనే దాచుకొని
నర్మగర్భంగా సాగే మృత్యునదీ ఏమీ మాట్లాడదు

పీలికలైపోతున్న బిడ్డల శోకాన్నీ, ఆక్రోశాల్నీ
పచ్చని గుబుర్ల గుండెల్లోనే దాచుకున్న
అడవితల్లీ ఏమీ మాట్లాడదు
కొత్తజెండాలు, ఎజెండాలు రూపొందుతున్న
కర్కశ నిశబ్దంలో అసలు ఇప్పుడు ఎవరూ మాట్లాడడం లేదు
మాట ఇప్పుడు నిషేధిత పదం అయిపోయింది
మాట ఇప్పుడు యుద్ధనేరమై పోయింది

నడి యుద్ధం మధ్య శిలువలా నాటబడ్డ
విరామ చిహ్నానికే చిక్కుకొని
పీలికలైన చివరి వస్త్రంతో నిలబడ్డ
ఆమె నగ్నత్వం గురించి నేను మాత్రం
మాట్లాడుతూనేవున్నాను!
పుట్టుక నుంచి యుద్ధనేరస్తుడుగానే వేటాడబడుతున్నాను.

ఒక సుదీర్ఘ ఘడియ
ఒక అస్థిర విరామం
నల్లబడిన కాగితంలాగే
శ్మశానమూ చల్లారిపోతుంది
రాలిపోతున్న ఆకుల అవిరామ
సంభాషణం ఆగిపోతుంది
వెన్నుపొట్లమీద ప్రతిబింబించే
మురికి గోతుల్లోని నిలవనీటికుట్రలు,
కన్పించే, స్మరించే, హఠాత్తుగా రూపుమార్చే
ఎవర్నించి వారిని మాయం చేస్తూ
ఇదంతా - యుద్ధమే కదా!

యుద్ధరూపం ఎప్పుడో మారిపోయింది
డేగముక్కే ఉరికొయ్య
డేగగోళ్ళే ఉక్కుకంచె!

ఇప్పుడు -
హంతకుడే యుద్ధాన్ని రూపొందిస్తాడు
హంతకుడే ఉద్యమాల్ని నిర్ణయిస్తాడు
హంతకుడే యుద్ధనేరస్తుల జాబితాల్ని ప్రకటిస్తాడు
హంతకుడే తీర్పుల్నీ, శిక్షల్నీ నిర్ధారిస్తాడు
హంతకుడే తలలకు సరికొత్త వెలల్ని కడతాడు
హంతకుడే ప్రవక్త, ప్రయోక్త, ప్రణాళికవేత్త కూడా!

అవును - ఇదంతా యుద్ధమే
ఇదంతా కాందిశీక శిబిరమే
యుద్ధం నరాల్లోకి, నట్టింటిలోకి చొచ్చుకొచ్చి
తలమీద ఆయుధాన్ని ఎక్కుపెట్టినపుడు
మౌనంగా మోకరిల్లిన ప్రతివాడూ యుద్ధనేరస్తుడే!

యుద్ధం మనస్సులోకి, మస్తిష్కంలోకి చొచ్చుకొచ్చి
రంగురంగుల భ్రమల వలయాల్లోకి నెట్టినపుడు
కలల్ని అమ్మకానికి పెట్టిన ప్రతీవాడు యుద్ధనేరస్తుడే!

ఒకానొక ప్రయాణం ప్రారంభమైనచోటో
లేదూ తాత్కాలికంగా ఆగిపోయినచోటో
ఒకానొక నెగడు భగ్గున మండిన వేళో
లేదూ శైతల్యానికి చల్లబడిపోయిన వేళో
ఒకోనొక సీతాకోక చిలుక ఒంటిరెక్కతో ఎగురుతున్న చప్పుడో
లేదూ ఇక ఎగరలేక ఒరిగిపోతున్న విషాదమో

ఒకానొక వీరుడు పట్టుబడిన సమయానో
లేదూ లొంగిపోక అమరత్వాన్నే ఆలింగనం చేసుకున్న సమయానో
ఇది కలల నిషేధిత రుతువని
జ్ఞాపకాల పూలు ఇక పూయవని
విరిసే ఇంద్రధనస్సుల్లో ఏ రంగులూ ఉండవని
అడవిలో ఏ వెదురూ ఇక బిరుసెక్కదని
ఇక సమాధుల్ని ప్రేమించడమొక్కటే నేర్చుకోవాలని
ఓ పక్క కూలిపోతూ కూడా ఆ హంతక డేగ శాసిస్తుంది!

నేనింకా ఆమె దేహ సౌందర్యం గురించే
వలసల గొంతుతో గానం చేస్తున్నాను
అలాగే ఆమె తాత్కాలికంగా జారవిడ్చుకున్న ఖడ్గం గురించి కూడా
అలాగే ఆమె గాయాలు ఎలుగెత్తుతున్న సమస్త కుట్రల గురించి కూడా
అలాగే ఓ సౌందర్యవంతమైన శకలంగా విడిపోవడం గురించి కూడా
ఇది కేవలం దేహ సౌందర్యమోహమే కాదు
తెంచుకోక తప్పని పేగు గురించి ఎడతెగక
చెమర్చుతున్న నెత్తుటి పాట గురించిన వేదన కూడా!

ప్రతీ గడప ముందు
అసంఖ్యాక మృతశిశువులతో
నగ్నంగా నిలబడి కనిపిస్తోన్న ఆమె
ప్రతీఒక్కరూ మాట్లాడి తీరాల్సిన అవసరాన్ని ఎత్తిచూపుతోంది
ప్రతి ఒక్కరి గుండె గొంత్తై ఎలుగెత్తేలాజేస్తోంది
మాట్లాడకపోవడమే ఓ యుద్ధనేరంగా ప్రకటిస్తోంది

తప్పదిక
సన్నగా రాలడం ప్రారంభమైన చినుకులు స్వరానికి
మట్టిరేణువులు కట్టే మొలకల బాణీలను బిగ్గరగా ఎత్తిపట్టాలి
అసలైన చరిత్రను చెక్కుతున్న విల్లంబుల భాషను
ఉక్కు కంచెల్ని తెంచే యుద్ధభేరీల్లాగా ఎక్కుపెట్టాలి
అడవిలో రాలిన పండుటాకులు తమ గుండెలమాటున
దాచుకున్న ధిక్కారశబ్దంతో ఉరికొయ్యల్ని బద్దలుకొట్టాలి
విరిగపండిన పంటచేల మధ్య నిలబడి
జలజలా కంకులు రాలేలా, డేగలు నేలకూలేలా
పెనుతుఫానుల భాషతో మాట్లాడి తీరాలి
కాలం అంచున నిలబడి అనామక మరణాల తాలూకు
కన్నతల్లుల గర్భశోకాన్ని గగనం చీలేలా
ఎలుగెత్తి అరిచి తీరాలి
డేగల దాడి నుంచి మన నేలను మనం దక్కించుకొనేందుకు
మరఫిరంగుల గొంతులతోనే మాట్లాడి తీరాలి
అసలైన యుద్ధనేరస్తుడెవడో
నిర్భయంగా ప్రకటించి తీరాలి!

కాలం దిక్సూచి
చారిత్రక చలనాన్ని
సరిగ్గానే సూచిస్తోంది,
పరిణామక్రమం
గతితార్కిక గమనాన్ని
నిశితంగానే నిర్దేశిస్తోంది

మొదలు కావాల్సినచోటే మొదలైంది
కేంద్రస్థానాల విధ్వంసం ప్రారంభమైంది
డేగల్ని వేటాడే చారిత్రక క్రమం ఆరంభమైంది
రాలుతోన్న డేగల రెక్కల చప్పుడు స్పష్టంగానే వినిపిస్తోంది

ఈ నేల గురించి,
మరోసారి నగ్నంగా నిలబడ్డ ఆమె గురించి
మీ కలలేమిటో
మాకు చెప్పండి - నేర్చుకుంటాం
ఈ యుద్ధం గురించి,
మరోసారి అప్రతిత విరామం గురించి
మీ వ్యూహమేమిటో
మాకు తెలపండి - అనుసరిస్తాం
ఈ గానాల గురించి,
మరోసారి బరువెక్కనున్న ఉరికొయ్యల గురించి
మీ ధిక్కారమేమిటో
మాకు నేర్పండి - ఎలుగెత్తుతాం

రావాల్సిన వాళ్ళంతా రండి
ఓ గుంపుగానో
ఓ బృందగానంగానో
ఓ అణువాక్య శకలంగానో
పదేపదే చేజార్చుకుంటున్న
పదును కలల కోసం వారపోసిన నెత్తుటిధారలుగానో
ఎక్కుపెట్టిన ఉక్కు పిడికిళ్ళతోనో
రండి!

యుద్ధ భీతావహం ఉన్నచోట
ఊపిరిని నాట్లుగా వేసి
ప్రేమని ప్రకటిద్దాం!

ఉరి కొయ్యల మీద దేహాల్ని
గాలులు ఊయలలూపే చోట
ప్రాణాలని వేలాడదీసి
స్వేచ్ఛని ప్రకటిద్దాం!

ఉద్దేశపూర్వకంగా
ఆయుధాలు జారవిడుస్తున్నచోట
దేహాలనే ఆయుధాలుగా ఎక్కుపెట్టి
విముక్తిని ప్రకటిద్దాం!

రండి!
మొదలుకావాల్సినచోటే అసలైన యుద్ధం
సరైన అంకానికి తెరతీసింది గదా
వాల్‌స్ట్రీట్ ఆక్రమణ నినాదం
పెంటగాన్ విధ్వంసం దాకా కొనసాగితీరుతుంది
మనమూ - మన తిరుగుబాట్లనూ, ధిక్కారాలనూ
మహాయుద్ధాలుగా మలుద్దాం,
విముక్తి గీతాలుగా ఎలుగెత్తుదాం!

(తోటి యుద్ధనేరస్తుడు 'గఢాఫీ'కి)

దాడి

- ఎం. రాఘవాచారి

కోసి ముందరేసిన
తల చూసి
పుచ్చకాయ అంటున్నావు
ఏం చెప్పగలను?
ఆకలీ ఆకలీ అని అరిచి
మూసిన నోట
మళ్ళీ ఆకలి మాట పలుకొద్దంటున్నావు
ఏం మాట్లాడగలను?

కాలుష్యపు దాడి జరుగుతోంది
విత్తిన గింజ కాలుష్యం
చల్లిన ఎరువు కాలుష్యం
పిచ్‌కారీ చేసిన మందు కాలుష్యం
కాలుష్యం రాజ్యమేలుతోంది
మొక్క మీద దాడి
మొక్కను పెంచే పురుగు మీద దాడి
గొంతెత్తి పాడే పిట్ట మీద దాడి
నేల ఒంట్లోకి నీరింకనీయని దాడి
నేల సారాన్ని పీల్చి పిప్పి చేసి దహించే దాడి
అయ్యో!
ఇక్కడ ప్రకృతి దీనంగా మిగిలింది

మనిషిని చేసిన నేల
మనిషికి కాకుండా పోతోంది
మనిషికీ మనిషికీ మధ్య
వంతెన కూలిపోతోంది
రేణువుకి రేణువుకీ మధ్య
తేమ ఆరిపోయి
దిబ్బ రాజ్యం చేస్తోంది
నువు రాజ్యమైనావు
అతడు రాజ్యమైనాడు
మనం రాజ్యమెందుకైనాం?

అవతల
నేలను పాటలో పలికినవాణ్ణి
రాజ్యం మింగేస్తోంది
ఉరితాళ్ళ మీద సంగీతం పాడుకుంటోంది

గుండెలను కమ్మేసిన దీనత్వం
మాట పెగలనీయటం లేదు
గొంతు చించుక అరిచే ప్రయత్నం
పెదవి దాటకముందే
దాడి జరుగుతోంది...

సవరణలు

జులై - ఆగస్టు 2011 అరుణతారలో వచ్చిన 'మా ఇంట్లో పతంజలి - బజరా' వ్యాసంలో అక్షర దోషాలు దొర్లాయి. ఆయన మాండలికంలో రాసినవి మార్పుకు గురైయ్యాయి. ఈ పొరపాటుకు చింతిస్తున్నాం. అలాగే అదే సంచికలో వడ్డెబోయిన శ్రీనివాస్ కవితలలో చోటు చేసుకున్న 'ఇంటికి తిరిగి వెళ్లాలని....' కవిత శ్రీనివాస్‌ది కాదు. ఒరిజనల్ కాపీలో రచయిత పేరు లేదు.

వ్యాసం

థర్మల్ వెలుగులో శలభాలవుతున్న జనం

- నల్లూరి రుక్మిణి

పాత గుడి - కొత్తగా రంగులు వేస్తున్నారు... గుడి ఆవరణలో కొద్దిమేర బండలు పరిచి ఉన్నాయి. ఆ బండలు పరిచిన గచ్చు మీద కూడా దేవుడికి సంబంధించిన మరేదో మంటపం ఉన్నది. ఆ గచ్చు మీద ఐదారుగురు పెద్దవాళ్ళు నేలకొరిగి కూర్చొని రికామీగా ఉన్నారు. ఆ గుడి ముందు ఖాళీ స్థలంలో కొంతమంది నడికారు కుర్రవాళ్ళు నెట్ కట్టుకొని వాలీబాల్ ఆడుకుంటున్నారు. అయితే ఆ కుర్రాళ్ళు వేసవి సెలవులు ఎంజాయ్ చేయడంలో భాగంగా ఆడుకొంటున్న విద్యార్థులు కారు.

వాళ్ళు మత్స్యకారులు. అది మత్స్యకారుల గ్రామం. పట్టపుపాలెం, నెల్లూరు దగ్గర సముద్రపు ఒడ్డు.

ఇంకొక గ్రామం - ప్లాస్టిక్ పట్టాలు కలిపి కుట్టిన పెద్ద పరదా పరుచుకొని నడివయస్సు ఆడవాళ్ళు కొంత మంది గుండీలాట ఆడుతుంటే చుట్టూ చేరి మరి కొంతమంది నిలబడి చూస్తున్నారు. అంతమంది ఆడవాళ్ళు ఒక్కచోట దొరికారనే ఉత్సాహంతోనూ, ఆసక్తితోనూ వాళ్ళ దగ్గరికి వెళ్ళాం. అయితే ఆ ఆడవాళ్ళు మా వైపు అట్లా ఓ సారి చూసారు. అంతే! తిరిగి ఆటలో పడిపోయారు. మేం కూడా అట్లానే మౌనంగా ఓ ఇరవై నిమిషాలు పాటు నిలుచుండిపోయి వాళ్ళు ఆడే ఆట చూడసాగాం. ఆ ఆట మాకు కొత్తే. చురుకుగానే సాగుతుంది. అక్కడ ఉన్నవాళ్ళు ఎవరైనా మమ్మల్ని పలకరించకపోతారా అని ఆశపడుతున్నాం. కానీ వాళ్ళు మా ఉనికినే గుర్తించలేదు. కనీసం మర్యాదపూర్వకమైన నవ్వు, పలకరింపు కూడా లేవు.

చివరకు నేనే ఆపుకోలేక నవ్వుతూ 'మేం కొత్తవాళ్ళం కదా! పైగా ఆడవాళ్ళం. మీరు కనీసం ఎవరు? ఎందుకు వచ్చారు అనైనా అడగలేదేమిటి? ఎంత ఆటలాడుతున్నా' అన్నాను వాళ్ళను ఉద్దేశించి. ఆ మాటలకు వాళ్ళలో ఒకరిద్దరు అట్లా మా వైపు చూసారు, అంతే. అప్పుడు కూడా మమ్మల్ని పలకరించలేదు... వాళ్ళ ఆట గొడవేదో వాళ్ళల్లో వాళ్ళే విరామం లేకుండా మాట్లాడుకుంటున్నారు.

చివరకు నేను ఆ ఆట ఎట్లా ఆడతారు అని వివరం కోసం అడిగినట్లుగా అడిగితే - ఎవరో ఒక పెద్ద ఆమె మా మీద జాలితో పాపం అన్నట్లుగా ఆట వివరాలు చెప్పింది. అప్పుడు కూడా ఆ నడికారు ఆడపిల్లలకు ఆ ఆట గురించి అయినా మాతో మాట్లాడాలనిపించలేదు. మేము ఏదన్నా ఇంకా పొడిగిద్దామంటే వినిపించుకునే మూడ్ లో కూడా లేరు. నిట్టూర్చుకుంటూ ఇవతలికి వచ్చాం.

ఇది కూడా మత్స్యకారుల గ్రామమే. క్రిష్ణపట్టణం రేవుకి అవతల వైపు నేలటూరు గ్రామం.

అట్లాంటి స్థితి మాకు కోపం కలిగించలేదు. ఓ క్షణం ఏదోలా అనిపించినా ఆలోచిస్తుంటే చాలా బాధ మిగిలింది. అది మమ్మల్ని పట్టించుకోనందుకు కాదు. ప్రజలు ఎలాంటి స్థితిలోకి ప్రయాణిస్తున్నారనే మా విచారం.

వాళ్ళకు మేం ఏమీ హాని చేసిన వాళ్ళం కాదు. వాళ్ళు కూడా డబ్బుతోనూ, కులంతోనూ, వర్గంతోనూ, కండ ముదిరిన వాళ్ళు కాదు. కేవలం నిరాశ, నిస్సహాయత అన్నింటికి అతీతంగా మారిపోయి దుఃఖాన్ని కూడా జయించిన భావరహిత స్థితి. అందుకే ఇప్పటికీ వాళ్ళను తలుచుకుంటే బాధగానే ఉంది.

అట్లా ఆ రెండు రోజులు ఇలాంటి విభిన్నమైన ముత్తుకూరు, నేలటూరు, చిల్లపూరు, గుమ్మెళ్ళదిబ్బ వంటి ఏడెనిమిది గ్రామాలు థర్మల్ విద్యుత్ పరిశ్రమల వివరాల కోసం తిరిగాం. ఇవి నెల్లూరుకి పాతిక కిలో మీటర్ల దూరంలో, మ్యాప్‌లో సముద్ర గర్భంలో కనిపించే గ్రామాలు. అన్ని ఊళ్ళల్లో ఏదో ఒక అనుభవం ఇలాంటిదే.

మరి వీళ్ళెందుకు ఇంత నిర్లిప్తంగా ఉన్నారు? ప్రపంచమంతా ఆ ప్రాంతంలో పాతిక రాబోతున్న పైగా థర్మల్ విద్యుత్ పరిశ్రమల వల్ల జరగబోయే అపార నష్టాన్ని గూర్చి గగ్గోలు పెడుతోంది కదా!.... ఆ తీర ప్రాంత వాసుల గురించి ఆవేదన చెందుతోంది కదా! అయినపుడు అసలు బాధితులైన వీళ్ళే ఎందుకు ఇట్లా ఉన్నారన్న జిజ్ఞాసలో పడ్డాం.

అక్కడే కాదు మిగిలిన గ్రామాలలో కూడా భూమి పోయిందన్న బాధ ఉందిగాని - అది తమ తప్పువల్లే జరిగిందని అనుకుంటున్నారు. అందుకే నిరాశతో ఉన్నారుతప్ప... అన్యాయంగా పోగొట్టుకున్నామన్న కోపం కసిలేదు. 'పోయిన భూమి పోనేపోయింది మా అమ్మా! కనీసం దానికైనా న్యాయంగా మాకు రావాల్సిన డబ్బు వస్తే చాలు. వాటి గురించి రాయండి తల్లీ...' 'చాలు! అంటున్నారు ఆ స్త్రీలు.

ప్రతి చోట ఇదే చర్విత చరణం - పాతదగా - కొత్త రూపాలు! అంతే. అది పోలవరం ముంపు గ్రామాలే కావచ్చు. క్రిష్ణపట్టణం ఓడరేవు చుట్టు పక్కల గ్రామాలే కావచ్చు.

'మాదేముంది తల్లీ! పాతికా, పరకా వాళ్ళం! ముందు ముందు పెద్ద పెద్ద రెడ్డోరు - మా భూములిచ్చేసాం... మీరు ఉంచుకొని ఏమి చేసుకుంటారు అని అన్నారమ్మా - మాకు చదువా, సంధ్యా! మా తరపున గవర్నమెంట్ తో చెప్పే, పెద్దలా! ఎవరూ

లేరు తల్లీ - పైగా మీకు వచ్చే ఆ పైసలు కూడా రావు రేపటి రోజు! అన్నారమ్మా! ఇంకేం చేస్తాం - ఇచ్చేసినాం మా భూముల్ని కూడా'.

నాది అరవై సెంట్లు, నాకు ముప్పై సెంట్లుకే డబ్బు లిచ్చినారమ్మా... మిగిలిన ముప్పై సెంట్లు ఎస్.ఎస్ (యక్సస్) పట్టా నంటానమ్మా! 'అది మాదే భూమి. మా భూమి మేమే తీసుకుంటున్నాం' అన్నాదండీ! ఆ ఆర్.డి.ఒ. ముం..... అది ఆ ఆర్.డి.ఓ మా కొంపల్ని కూల్చిందమ్మా - అది వచ్చి మా భూములన్నీ వాళ్ళకి చూపించి తప్పుడు లెక్కలు కొలిపించిందమ్మా ఆ మాయదారి లం.....' ఇది ఓ వయస్సు మళ్ళిన వృద్ధురాలి కోపం ఆమెకు ఆ ఊరు వదిలిపోవాల్సి వస్తుందన్న ఆవేదన.

'నీవు ఊరుకోవే. నోరు పారేసుకుంటావు. ఈ ఊళ్ళ పైన విమానాలు వచ్చి తిరుగుతుంటే... అబ్బ మన ఊళ్ళలో విమానాలు తిరుగుతున్నాయని సంబరపడ్డాంకాని ఇదంతా తిరిగి ఇట్టా చూసుకునిపోయి... మనల్ని నాశనం చేస్తారనుకున్నామా?... వాళ్ళు చేసినదానికి ఆ ఆర్.డి.ఒ. ఏం చేసిందీ?

అది సరేనే నువ్వన్నట్టు. 'అది కాలిపించినయ్యాన్నా న్యాయంగా కొలిపించాలి కదా!... ఈ భూమి నాది అంటే... కాగితాలు తెమ్మంటదా?... మనకి కాగితాలు పట్టాదారు పుస్తకాలు ఎక్కడ వత్తాయి?... మన ఊరు వచ్చి - భూమి మీద నిలబడి ఇది నాదీ అన్నప్పుడు - "కాదు ఇది నా భూమి అని ఇంకొకరు వస్తే! - అప్పుడు కానీ... భూమి మీద నిలబడి సొంతదారో! కాదో చూడాలి గానీ! కాగితాలు ఏడ తెస్తాం".

ఆ చవిటి నేలల్లో వ్యవసాయం చేసుకుంటూ సరుగుడు చెట్లు పెంచుకోవడమే గాని దానికి కాగితాలు పుట్టించుకోవాలనీ, అవి తప్పనిసరి అని తెలియని తీరప్రాంత ప్రజలు వాళ్ళు.

"అదేనమ్మా! మా పెద్దల నాటినుండి చేసుకుంటున్న భూములేమో - మాయి- కాదన్నారు! ఆ పెద్ద పెద్ద రెడ్డోరులేరూ, వాళ్ళు పట్టాకి యాభై ఎకరాలుంటే - చవిటి నేలలు మరో యాభై రాయించుకొని - వంద ఎకరాలకి డబ్బులు దొబ్బేరు. వాళ్ళకేమమ్మా పెద్దోళ్ళు ఏవైనా చేయించుకుంటారు".

అట్టా ఓ ఊళ్ళో కోటిరూపాయలపైన నొక్కేసిన ఓ బడాపెద్దమనిషేకాక ఆ గ్రామాలలో అంతకాక పోయినా కొద్దిగా అటు ఇటు ఎక్కువ తక్కువ మోతాదులల్లో నొక్కేసిన రాజకీయ ప్రాబల్యం కలిగిన వాళ్ళు ప్రతి ఊరికీ ఇద్దరు ముగ్గురు ఉన్నారు.

కానీ ప్రజల కోపం వాళ్ళ మీద లేదు. కొలతలకు వచ్చిన ఆర్.డి.ఒ. మీద, ప్రభుత్వ అధికారుల మీద ఉంది. ఆ అధికారులు పెద్దల చేతుల్లో ఇరుక్కున్న మనుషులే అని వాళ్ళకి తెలిసినా ప్రభుత్వ ప్రతినిధి కనుక తమకూ సంబంధించిన మనిషేనని తమ మేలు కూడా చూడాలి కదా! కానీ పెద్దోళ్ళ పక్షాన ఉన్నారని వాళ్ళ వాదన. ఇట్టాంటివే ప్రతిఊళ్ళో విచారకరమైన అనుభవాలు. ఈ విచారం నుండి వాళ్ళల్లో ఓ నిరాశా, నిస్పృహల వల్ల బాధను కూడా ఓ తాత్విక చింతనలో భాగం చేసుకున్నారేమో అనిపించింది.

అందుకే మేము ఒకరం వాళ్ళ కోసం వచ్చామని, మేమేదైన పూచికపుల్ల వాసి సహాయం చేయగలమేమోనని ఆసక్తి కలగలేదు. మాలాంటి వాళ్ళు ఎందరో ఎన్నోసార్లు వచ్చిపోయుండవచ్చు. వాళ్ళందరికి చెప్పి చెప్పి 'సాలొచ్చి' కూడా ఉండవచ్చు. 'ఆ ఏముందీ కాగితాల మీద రాసుకుంటారు...: ఏదో చేస్తామంటారు... పోతారు! - తిరిగి చూడరు! అంటున్నారు బాధితులు.

అందుకే మేం మీకు మేలు చేయబోతున్నామని, చేస్తామని చెప్పడానికి రాలేదని స్పష్టంగానే చెప్పాం. మేము చేయగలిగేది మీ బాధని, అన్యాయాన్ని రాసి ప్రపంచానికి తెలియజెప్పి మీ వైపు ఆలోచింపచేయడానికి చిత్తశుద్ధిగా ప్రయత్నం చేస్తాం అని మాత్రమే చెప్పాం. మా మాటల వల్లగాని మేము వారితో ప్రవర్తించిన తీరువల్లగాని మమ్మల్ని నమ్మకంలోకి తీసుకొని కడుపులో బాధను పంచుకున్నవాళ్ళలో ఆ ఆర్.డి.ఒ. ను నిందించిన గ్రామంలో జనం ఒకళ్ళు.

నిజానికి ఆ గ్రామానికి వెళ్ళేటప్పటికే సాయంత్రం ఆరుగంటలైంది. ఊరు సెంటర్లో మాట్లాడుతుండగానే చీకటి పడిపోయింది. అయినా వాళ్ళు ఒదిలిపెట్టనేలేదు. ఒక్కొక్కరు తమకు ఎంత అన్యాయం జరిగిందో లెక్కల వివరాలు చెపుతూనే ఉన్నారు. వాళ్ళంతా అరెకరా, ఎకరాలోపు రైతులు. కోర్టుకు కూడా వెళ్ళారు. కానీ చట్టాలకి కావలసిన రుజువులు వాళ్ళు ఇవ్వలేకపోయారు.

'మా అమ్మా! ఇంత మాత్రం నిలబడి మా గోడు వింటే మాకు అన్యాయం జరక్కపోను తల్లీ! అని అంది ఆ పెద్దామే. అసలు మా మాటలే నింపాదిగా వినలేదని వారి ఆవేదన, కోపం. వైద్యుడు రోగం నయం చేయలేకపోవచ్చు. కానీ రోగి బాధను పట్టించుకునేవాడంటే ఎంత ధైర్యం వాళ్ళకు. కానీ ఆ పాటి ధర్మం పాటించే ప్రభుత్వ అధికారులైతే ప్రజలకు ఇంత అన్యాయం చేయాలనిపిస్తుందా! అధికారుల చేతుల్లోనూ లేకపోవచ్చు. కానీ దౌర్జన్యంగా, మోసకారితనంగా బెదిరించి జనం దగ్గర భూములు లాగి బడాపెద్దలకు కట్టబెట్టే పనులు ఎందుకు చేయాలి.

అది సరే! రైతులే 'తమది కూడా తప్పుఉందని' అనుకుంటున్నట్టుగా మనం కూడా అవుననే, అను కుందాం. అయినా అది నిజంగానే వాళ్ళ తప్పా?..'మా పొలాలు ఎకరా లక్ష, లేదంటే లక్షా పాతికవేలు - మాకు ఎకరాకు ఏడు లక్షలిచ్చారండీ'.

'మాది చవిటి నేల. మహా అమ్మితే ముప్పైవేలు. ఎక్కువలో ఎక్కువ నలభై... ఒక్కసారి లక్ష రూపాయలంటే మాకు ఎక్కడ లేని ఆశ కలిగింది... మా బతుకుల్లో లక్షరూపాయలు ఒక్కసారి ఎప్పుడు చూస్తాం తల్లీ!... అందుకే ఎగబడి అమ్మేశినాం. ఇప్పుడేమో వట్టి చేతులు ముందు పెట్టుకున్నాం'.

నిజమే రైతులు ముఖ్యంగా పేదరైతులు ఎంత ఆశబోతులూ?... జీవితంలో లక్షరూపాయలు ఒక్కసారి చూడడం ఓ కల. ఆ కలలను హైజాక్ చేసారు. ఆ కల కోసం భూమిని అమ్ముకున్నారు రైతులు. మనుషుల బలహీనతలను సొమ్ము చేసుకొనే మహానుభావులు

ఉంటారని, అది ఈ వ్యవస్థ లక్షణం అని వాళ్ళకు తెలియదు. అందుకే అట్లా ఆశపడడం వాళ్ల తప్పే! అని అనుకుంటున్నారు.

ఆ ఊళ్ళోనే చాలా పొద్దు పోయింది. మేం తొమ్మిదిన్నర లాస్ట్ బస్‌కు బయలుదేరాం. ఆ చీకటిలో వాళ్ళతో మాట్లాడుతూ ఆ సెంటర్‌లో నుంచుని ఆకాశంలోకి చూస్తే అద్భుతంలాగా అనిపించింది ఆ దృశ్యం. అది జెన్‌కోవాళ్ళ థర్మల్ ప్లాంట్. దాదాపు నిర్మాణం పూర్తి కావస్తుంది. చివరిభాగంలో పని జరుగుతోంది. అక్కడ అంత ఎత్తున చుట్టూ, లైట్లు దేదీవ్యమానంగా వెలుగుతున్నాయి. గ్రామంలోనూ చుట్టూఉన్న మైదానంలోను అంతా చీకటిమయమే. ఆ ప్లాంట్ కింద భాగం అంతా చీకటిలో కలిసిపోగా పైభాగం వికసించిన ఆకాశ పుష్పంలా మెరుపులు మెరుస్తోంది. ఆ దృశ్యం ఎంత కన్నుల పండుగగా ఉన్నదో! నిజమైన రసహృదయులైతే ఎంత కవిత్వం రాసునో దానిమీద. కాని మరుక్షణంలో తేరుకున్నట్లుగా ఈ విద్యుత్ కాంతులు రేపటి రోజు అక్కడ అత్యధిక ఉష్ణోగ్రతను, బూడిదను, కార్బన్‌డయాక్సైడ్, సీసం, ఆర్సినిక్ వంటి విషవాయువులు వెదజల్లి కాన్సర్, ఊపిరితిత్తులు వంటి ప్రమాదకరమైన విషవాయువులు వ్యాపింప చేస్తాయి కదా! అనిపించి కళ్ళు తిప్పేసుకున్నాను. ఈ అభివృద్ధి వెలుగులో రేపటి చీకటిలో మునిగి పోబోతున్నది నా కళ్ళముందు నిల్చున్న వీళ్ళే కదా! అనిపించింది.

ఆ ఊరికి అతి దగ్గరగా మీనాక్షి పవర్‌ప్లాంట్, నెలకాస్ట్ ఎనర్జీ కార్పోరేషన్, మరోవైపు జెన్‌కోఇంకోవైపు రిలయన్స్ వాళ్ళది నాలుగు థర్మల్ ప్లాంట్‌ల మధ్య ఆ ఊరి జనం బతకాలి. అది సాధ్యమైనదేనా? ఆ వేడి, బూడిద తట్టుకోగలిగేదేనా! ఆ ఊళ్ళో దాదాపు ఐదువందల కుటుంబాలు ఉన్నాయి. సుమారుగా రెండువేలపైచిలుకు జనం వారంతా ఏమికావాలి. అట్లా పది గ్రామాల ప్రజలు ఎట్టి పరిస్థితులలోను ఈ థర్మల్ ప్లాంట్‌ల వల్ల ఉండలేని స్థితి. ఇంకా మిగిలిన కట్టబోయే ప్లాంట్‌లు పుట్టించే వేడికి ఆ జనం నల్లుల్లా మాడి మసై పోవలసిందే.

ఇంత బాధను, నష్టాన్ని భరించి అక్కడ నుండి వెళ్ళిపోయి కూలీలుగా మారిపోయి బతుకులు ధ్వంసం చేసుకునేది సామాన్యులు. కానీ లాభాలు సింహపురి ఎనర్జీ, మీనాక్షి, ల్యాంకో, క్రిష్ణపట్నం పవర్‌ప్లాంట్, రిలయన్స్ ఇట్లాంటి పాతిక కంపెనీలు. ఇవన్నీ రాజకీయాలలోఉన్న బడా పెట్టుబడిదారులవి. వీళ్ళు అపుడే తమ విద్యుత్‌ను అమ్ముకోవడానికి మార్కెట్‌ను అన్వేషించుకుంటున్నారు.

పరిశ్రమలు రావడంతో ఉద్యోగాలు వస్తాయని, డబ్బంతా ఆంధ్రప్రదేశ్‌లోనే ఉంటుందని, అభివృద్ధి ఆకాశానికి ఎగురుతుంది అని ఇలా చాలా చాలా ప్రభుత్వం చెబుతుంది. కాని ఓప్లాంట్‌లో పనిచేస్తున్న ఉద్యోగులని మాట్లాడిస్తే వాళ్ళంతా రాజస్థాన్ నుండి, మధ్యప్రదేశ్ నుండి వచ్చారని చెప్పారు. మనకు గార్డు ఉద్యోగాలు తప్ప ఏమీ ఇవ్వరు. మనం ఆ వేడిలో పనిచేయలేమంట! లేబరుగా కూడా పెట్టుకోవడం లేదు. ఇవి ఆ గ్రామాల యువకుల అనుభవాలు. ఇప్పటికైనా ఊరుకు నలుగురైదుగురిని గార్డులుగా పెట్టుకున్నారు. ఇవే మనకు వచ్చే ఉద్యోగాలు.

'ఉద్యోగాలు లేవు, సముద్రం లేదు, వ్యవసాయం లేదు. చివరకు ఈ ఊరిలో కూడా ఉండలేము. ఈ వేడికి తట్టుకోలేక, బతుకు తెరువులేక మా అంతట మేమే లేచిపోవాలని అధికారులు చూస్తున్నారండీ!!... మేం ధర్నాలు చేస్తే చూస్తామని అనడం లేదు... పోనీ మాకు ఫలానా చోట ఇళ్ళు కట్టిస్తామని అనడం లేదు... పోయినవేవో పోయినాయి... ఇళ్ళన్నా కట్టిస్తే తలదాచుకుందుము గాని అది గతిలేనట్టుగానే ఉన్నదని వాళ్ళ బాధ. వాళ్ళిపుడు ఊరువదిలి పెట్టి పోవడానికి సిద్ధమైనారు - ఈ పెద్ద పెద్దోళ్ళను మనమేమన్న ఆపగలమా ఈ గొట్టాలు పెట్టకుండా?... అందుకే మా కింత చోటు చూపించమంటున్నాము' అన్నది వాళ్ళ 'గొంతెమ్మకోర్కె' అది కూడా జరగదేమోనని వాళ్ళ భయం.

అక్కరలేని కడపలాంటి చోట్ల కోటానుకోట్లు ఖర్చు పెట్టి రాజీవ్ గృహకల్ప. ఇందిరా ఆవాస గృహాలు కట్టించకపోతే ఈ నిర్భాగ్యుల కోసం ఆ మాత్రం ఖర్చు చేయకూడదా!

'ఇప్పటికే క్రిష్ణపట్నం డ్రిల్లింగ్ వల్ల చేపలు దగ్గరలో దొరకడం లేదు. పైగా రేపు ఇరవై నాలుగు ప్లాట్ ఫారాలు వస్తే ఐదు కిలోమీటర్లదాకా సముద్రంలో గుడ్డు కూడ బ్రతకదండీ!' చిట్టిపోయిమీద పెట్టి కాలవకుపోయి చేపలు దేవుకొచ్చుకొనే వాళ్ళం. తిండి కరువు ఎరగం. ఇప్పుడు కూరకు కూడా ఎదుకులాడు కుంటున్నాం. ఇదీ ఆ గ్రామాల మత్స్యకారుల ఆవేదన. వాళ్ళకు హృదయం ద్రవింపచేయగల కవిత్వం రాదు. మంచి బిగుతు కలిగిన భాషా పాండిత్యం లేదు. వాళ్ళు వాస్తవాన్ని, బాధను ఒక్క మాటలో చెప్పి ముగించారు. మనకు ఆ ఒక్కమాటలో ఎంత అర్థమైతే అంతే! దాని విలువా బరువూనూ. ఆ చెప్పేటప్పుడు కూడా వాళ్ళ కళ్ళల్లో కన్నీరు కారిపోలేదు. అదొక మాటర్ ఆఫ్ ఫ్యాక్ట్ అన్నట్లుగా చెప్పారు... 'నాలుగు అడుగులు తవ్వితే కొబ్బరి పాలసుంటి నీళ్ళుండీమావి. ఇప్పుడు నీళ్ళన్నీ పచ్చగా విషపు జలాలయ్యాయి'. ఆ గ్రామాలలో బావుల నీళ్ళన్నీ మారిపోయి తాగడానికి, వాడుకోవడానికి కూడా లేకుండా పోయినా నీరే మారిపోతే గాలీ, నేలామారిపోవూ? ఇదీ వాళ్ళ బాధ.

ఇంతగా సామాన్య జనాన్ని ఎందుకు నాశనం చేస్తున్నట్టు. ఎవరి బాగు కోసం. ఇరవైఅయిదు థర్మల్ ప్లాంట్‌ల కింద పోయే భూమేగాక ఆ విద్యుత్‌ని మోసుకెళ్ళడానికి ఏర్పాటు చేసే భారీ స్తంభాల కోసం వాడుకొనే పొలాలు కలిపి ఎంత భూమి ధ్వంసం అయిపోతుంది? ఆ భూమి మీద బతికే వాళ్ళ మాట అట్లా ఉంచి ఆ ప్రాంతపు పర్యావరణం మాటేమిటి? ఈ ప్రాజెక్టుల వల్ల ఆ పదిగ్రామాలే కాక నెల్లూరుదాకా కోట్లాది మంది ఆరోగ్యాల మాటేమిటి? ఇవన్నీ ప్రభుత్వం ఆలోచించడం లేదు.

అయితే మధ్యతరగతి బుద్ధిజీవులు కూడా ఈ ప్రశ్నలు వేసుకోవడం లేదు. ఎంతసేపు అభివృద్ధి పేరుతో తిని, తాగి ఏ.సి.లలో దొర్లే పుచ్చిపోయే బతుకు కోసం - సుఖ భోగాల కోసం

తాపత్రయ పడుతున్నారు. మనం ఈ ప్రకృతిలో భాగమని ఈ భూమిపై నివసించే జీవరాశులలో మనమూ ఒకరమని ప్రకృతిలో కలిసి బతకడమే భూమికి మనిషికి ఆయుః ప్రమాణం పెరుగుతుందని ధ్యాసే లేకుండా పోయింది. ఆ మాట అన్నవాళ్ళను శుద్ధ అనాగరికుల కింద చూస్తున్నారు.

నిజమే నాగరికత మనిషికి అవసరమే. అయితే అది నాగరికతా? సుఖభోగతా? అన్న తేడా తెలియడం లేదు. శుభ్రత కోసం సబ్బు అవసరమే. కానీ దానికోసం రకరకాల సబ్బులు, ఆ సబ్బుల కంపెనీలలో పోటీలు, లాభాల వేట అపరిమితమైన ఆకర్షించే ప్రకటనలతో లెక్కను మించిన పరిశ్రమలు అవసరమా? అది ఇచ్చే నాగరికత కంటే ఆ పరిశ్రమ సృష్టించే వాతావరణ కాలుష్యం ప్రకృతిని ఎంత ధ్వంసం చేస్తుంది. అట్లా బట్టల పరిశ్రమలు కానీ ఏదైనా తీసుకోవచ్చు. మనిషికి బట్ట అవసరమే కానీ బీరువాల కొద్దీ బట్టలు ఎవరికి లాభం చేకూర్చడానికి.

లాభాల కోసం పెట్టుబడిని పెంచుకోవడం కోసం ఓ అమెరికావాడో జపానువాడో రకరకాల మోటారు సైకిళ్ళ కోసం, కార్ల కోసం ఫ్యాక్టరీలను పెట్టి - మీకు అన్నీ ఉద్యోగాలనే టీ.వీల ద్వారా ప్రకటనలు గుప్పించవచ్చు. అయితే ఫారిన్ టెక్నాలజీతో అతి వేగంగా దూసుకుపోవడానికి కావలసిన రోడ్లు ప్రజల డబ్బుతో మనమే వేసుకోవాలి. దానికి కాంట్రాక్టర్లు రెడీగా తయారై లాభాలను గుంజుకోవడంలో ముందు వరుసలో ఉంటారు. అంటే కొంత మంది సుఖంగా ఉల్లాసంగా వేగంగా ప్రయాణం చేయడం కోసం కోట్ల కొద్ది డబ్బు కొల్లగొట్టి రోడ్లు వేసి కాంట్రాక్టర్లు, రాజకీయ నాయకులు లాభపడతారు. ప్రజలు పన్నులు, ధరల రూపంలో నష్టం మీద వేసుకుంటారు. నిర్వాశితులై చివరకు ఆలనా పాలనా లేక ఉండడానికి తావు లేక చచ్చిపోతారు.

వీళ్ళంతా మెక్సికో రెడ్ ఇండియన్స్ లాగాను, ఆఫ్రికన్ తెగల లాగాను ఎక్కడో రాలి పోవచ్చు. ఫ్రాన్స్, ఇటలీ, బ్రిటన్‌ల నుండి ప్రారంభమైన పెట్టుబడి వలస ఆఫ్రికా, అమెరికా మార్కెట్లను స్వాధీనం చేసుకొని ఇక భరించలేని స్థితిలో ఆ సమాజాలు మిగిలిపోగా... ఆక్టోపస్ సర్ప అవయవాలతో వేట లక్ష్యాన్ని వెతికినట్లు పెట్టుబడి ఇప్పుడు ఆసియా వైపు సాగింది. ఎంత దూరదృష్టితోనో ఆసియా నడిబొడ్డున ఇజ్రాయిల్ ముద్దు బిడ్డను స్థాపించడం గమనిస్తే పెట్టుబడికి ఎంత సునిశితమైన, సుదీర్ఘమైన ముందు చూపు ఉంటుందో ఆశ్చర్యం కొలుపుతోంది. ఇజ్రాయిల్ ఈ రోజు పాలస్తీనాకే కాదు ప్రపంచ ప్రజలందరి ఆకాంక్షలకు వ్యతిరేకంగా రక్తపింజరి లాగా మారింది. ఉగ్రవాదుల, తిరుగుబాటుదారుల అనచివేత పేరుతో ఆసియా నడిబొడ్డున అమెరికన్ పెట్టుబడి పర్యవేక్షణలో స్పెషల్ యాక్షన్ టీములకు ట్రైనింగ్ సెంటర్ అయింది. అందుకే క్యాపిటల్‌ని అంకెలు, లెక్కలుగా చూడడమే కాదు - క్యాపిటల్ చరిత్ర పుటలు కూడా చూడడం ఎంత అవసరమో అనిపిస్తుంది.

అట్లా ఈ పెట్టుబడిదారులు థర్మల్ విద్యుత్ ప్లాంట్‌లలో విద్యుత్‌ను అమ్ముకొని లాభపడుతున్నారు. ఆ విద్యుత్‌ను వాడుకొని బడా పరిశ్రమలు లాభపడుతున్నాయి. నిజానికి మన విద్యుత్ వాడకంలో సామాన్య జనం వాడుకునేది అతి తక్కువ. సగం మంది దిగువ మధ్యతరగతి జనం ఒక గుడ్డి బల్బు, ఒక టి.వి., ఒక ఫ్యాన్ అంతకంటే వాడేది ఏముంటుంది? మధ్య తరగతి, ఎగువ మధ్యతరగతి - ఏ.సి.లు, ఫ్రిజ్‌లు, గీజర్‌లు, మోటార్లు ఒకటేమిటి అన్ని సౌకర్యాలకు మూలం కరంటే. నిజానికి ఉత్పత్తిలో సింహభాగం వాడుకొంటున్న పరిశ్రమలు విద్యుత్ చౌర్యం చేస్తున్నారు. ఆ విద్యుత్ చౌర్యం ఆపగలిగితే ఇప్పుడు ఉన్న విద్యుత్ ఉత్పత్తే సరిపోతుంది. ఇన్ని థర్మల్ ప్లాంట్‌లు కట్టవలసిన పనిలేదు. కాని ఆ పని ఎవరి వల్ల అవుతుంది. పరిశ్రమాధిపతులకు అన్ని అధికారాలున్నట్లే విద్యుత్ చౌర్యపు అధికారం కూడా ఉన్నట్లే ప్రవర్తిస్తారు. ప్రభుత్వం మౌనంగా అంగీకరిస్తుంది.

ఇంత విధ్వంసం - అభివృద్దే. అభివృద్ధి అంటే కొందరి వ్యక్తుల సొంత లాభం కోసం మరికొందరు సుఖపడడం కోసం మిగిలిన అందరూ నష్టపడడం. కానీ ప్రకృతిని విధ్వంసం చేసి భూమికి భవిష్యత్ లేకుండా చేయడం క్షమార్హం కాని నేరం. ఈ సుఖ భోగాల కోసం భూమి విధ్వంసం అయిపోవడం మానవ జాతి సహించదు.

కానీ ఆ మనిషిని వీటి గురించి ఆలోచించనీయడం లేదు. నిర్వీర్యుడుగా, నిరాశాపరుడుగా, అచేతనుడుగా మార్చి వేస్తోంది. భూమి అంతమవుతుందని దేవుడి రాకడ షురు అయిందని జనం మీద మత్తును జల్లించి - దేవుడి రేపటి రాకడ కోసం ఎదురు తెన్నులు చూస్తూ - ఈ రోజు పోతున్న 'పోకడ' ను గమనించని స్థితిలోకి సామాన్యుడ్ని - మరల్చి వేస్తోంది. ఇది డబ్బు సామ్రాజ్యపు మాయావినోదం. అందుకే 'గుండీల ఆట' మీద ఉన్న దృష్టి - వాళ్ళ జీవితాలను బాగుచేసుకోవాలన్న ఆలోచన మీద లేదు. 'పోయిందేదో పోయింది' - 'పోతే అందరం పోతాంగా' అన్న నిరాశా దృష్టి వాళ్ళల్లో బాగా పాకి పోయింది.

తుపాన్ రాకడకు ముందు మబ్బులు కమ్మి జల్లు ప్రారంభమైనట్లు - పెట్టుబడి రాకడకు ముందే దాన్ని ఆహ్వానించే మానసిక స్థితిని తయారు చేస్తుంది. చదువులు, మతం, కుహనా సంక్షేమ సంఘాలు, సంక్షేమ పథకాలు ఏపేరుతోనైనా! అవి సర్వం దాని అధీనమే. పెట్టుబడి ఎంత బలీయమైనదో ఇట్లా అర్థం చేసుకుంటే గానీ సమస్యలు మనకు తేటతెల్లం కావు. దీన్ని ప్రజలు ఎప్పటికి అర్థం చేసుకుంటారో?

మనిషికే కాదు సమస్త జీవులకు భవిషత్‌పట్ల ఆశా, విశ్వాసం ఉండడం ప్రాథమిక విషయం. నిజానికి భగవంతుడిని నమ్మే వాళ్లయిన దేవుడ్చిన ఈ భూమిని కాపాడుకోవడం వాళ్ళ బాధ్యత అనుకోవడంలేదు. దేవుడి పేరుతో విధ్వంసాన్నే సృష్టిస్తున్నారు.

ప్రతిస్పందన

మో కవిత్వాన్ని ఎలా చూడాలి?

- పాణి

గత సంచిక అరుణతారలో చెంచయ్యగారు వేగుంట మోహన ప్రసాద్ మీద రాసిన సుదీర్ఘ వ్యాసం చదివి ఈ ప్రతిస్పందన రాస్తున్నాను. మో కవిత్వమంతా మరోసారి చదివి, సమగ్రమైన విశ్లేషణ ఇవ్వడానికవసరమైన ప్రణాళికను తయారు చేసుకొని చెంచయ్యగారు ఆ వ్యాసం రాశారని అర్థమవుతోంది.. మో చనిపోయాక చాలా మంది నివాళి వ్యాసాలు రాశారు. వాటిలో కొంత కవిత్వ విశ్లేషణ కూడా ఉంది. అయితే చెంచయ్యగారిది కంప్లీట్ వ్యాసం. ఆయన ఏది రాసినా కంప్లీట్ వ్యాసమే రాస్తారు. దానికి అవసరమైన అధ్యయనం చేసి ఒక పథకం ప్రకారం రాస్తారు. బహుశా దినపత్రికల ప్రభావం ఆయన మీద పడకపోవడం వల్ల, వాటి ద్వారా తక్షణం చెప్పాల్సిన విషయాలను ఆయన ఎంచుకోకపోవడం వల్ల ఆయన రచనా శైలి నిండుగా ఉంటుంది. ఒక వ్యక్తి మరణించినప్పుడు సానుకూల అంచనా మాత్రమే అందివ్వాలనే ఆచారం ఉన్నది. అందులోని మానవీయాంశం గౌరవనీయమే అయినా, అట్లాగే రాయనవసరం లేదు. ఆ సందర్భంలో కూడా నిర్మొహమాటంగా, శాస్త్రీయంగా నిర్దిష్ట అంచనా ఇవ్వవచ్చు. చెంచయ్యగారు అలాంటి దృష్టితోనే ఈ వ్యాసం రాసినట్టనిపిస్తుంది. దానికి తోడు ఏ మాత్రం ఉద్వేగ స్వరం లేకుండా నిబ్బరంగా రాస్తారు కాబట్టి ఆయన అభిప్రాయాలతో పేచీ ఉన్నా హాయిగా మాట్లాడుకోవచ్చు.

ఈ నాలుగు మాటలు చెప్పాక, మో గురించి చెంచయ్యగారి పరిశీలనా పద్ధతిలో ఉన్న లోపాల గురించి రాస్తాను. ఆధునిక కవి ఏకాకి అనడం ఎంత వరకు సమంజసం? అనే ప్రశ్న వేశారు. ధనస్వామ్య వ్యవస్థకు కవుల్ని ఏకాకుల్ని చేసే లక్షణం ఉంటుందని కూడా అన్నారు. కవిత్వానికి ఉండే సామాజిక ప్రయోజనాన్ని చెప్పడానికి ఈ మాటలు అన్నారని సులభంగానే గుర్తించవచ్చు. ఆ భావనలను అంగీకరిస్తూనే ఆయన వ్యాఖ్యను లోతుగా పరిశీలించాల్సి ఉంది.

ఆధునిక కవికి మాత్రమే ఏకాకితనం అనే సమస్య ఎదురవుతుంది. అసలు ఏకాకితనం, ఒంటరితనం అనే సమస్యలు ఆధునిక మానవుడికి సంబంధించినవి. వ్యక్తిని గుర్తించడమనేది ఆధునికత సుగుణాలలో ప్రధానం. పెట్టుబడిదారీ విధానం అవలక్షణాల వల్ల ఈ సుగుణంలోంచి వ్యక్తివాదం పుట్టుకొచ్చింది. ఆధునిక పూర్వవాదులు, ఆధునికానంతరవాదులు దన్ని ఆధునికతకు ఆపాదిస్తుంటారు. పెట్టుబడిదారీ విధానాన్ని, దానిలోని ఇలాంటి అవలక్షణాలను వ్యతిరేకిస్తూ మార్క్స్ సోషలిస్టు సమష్టి జీవనాన్ని ప్రతిపాదించాడు. అది స్వేచ్ఛా మానవుల ఇచ్ఛాపూర్వక కలయిక. ఇదంతా పూర్తిగా వేరే చర్చ. అయితే ఆధునికత గురించి చెంచయ్యగారు ఇట్లా ఆలోచించకపోవడం వల్ల మో కవిత్వాన్ని అర్థం చేసుకోవడంలో కొన్ని చిక్కుల్లో పడిపోయారు. అందులో ముఖ్యమైనది కవిత్వం అర్థం కావడం, కాకపోవడం.

సమాజం - రచన - పాఠకులు అనే సంబంధంలో అర్థం కావడం, కాకపోవడం అనే చర్చ ఉండేదే. ఎవరు ఏది రాసినా పాఠకులకు అర్థమైనప్పుడే ప్రయోజనం ఉంటుందనే విలువ పట్ల అభ్యంతరం ఉండనవసరం లేదు. అయితే మనం రాస్తున్న ప్రక్రియను బట్టి ఈ చర్చ ఉంటుంది. కవిత్వం ఎక్కాల పట్టీలా ఉండనవసరం లేదని చెంచయ్యగారు కూడా అన్నారు. అంత వరకు ఆయన చాలా సరిగా ఆలోచించారు. అదే సమయంలో చెరబండరాజు పాటల గురించి రెండు మూడుసార్లు ప్రస్తావించారు. కవిత్వం అర్థమయ్యేలా ఉండాలనేదానికి ఉదాహరణగా తీసుకొచ్చారు. ఇక్కడనేకాదు - మొత్తంగానే సాహిత్య విమర్శకుడిగా చెంచయ్యగారికి ఈ అభిప్రాయం ఉందని సర్వత్రా తెలుస్తూ ఉంటుంది. చెరబండరాజు పాటలు, గద్దర్ పాటల పోలిక తేవడంలో ఉన్న ఇబ్బంది ఏమంటే - వారి కవిత్వ రూపాలు ఆధునికపూర్వ సమాజానికి చెందినవి. ఆధునిక పూర్వ ఉత్పత్తి విధానం వలెనే ఆ సమాజంలోని కవిత్వ వ్యక్తీకరణలు కూడా చాలా సరళంగా ఉంటాయి. అందువల్లే ఆధునిక పూర్వ సామాజిక అవశేషాల్లో ఉన్న ప్రజలను ఉద్యమాలవైపు ఆకర్షించడానికి ఆ సామాజిక దశకు చెందిన కళా సంప్రదాయాలను వాడుకుంటాం. అయితే అందులోని కంటెంట్ మాత్రం మనం నిర్మించుకోవలసిన ఆధునిక సోషలిస్టు సందేశానికి సంబంధించిందే.

దీన్ని గమనంలో ఉంచుకోకపోతే పాత కళా సంప్రదాయాలపట్ల - 'అర్థం కావడం' అనే కోణంలోగాని, ఉద్యమ ప్రయోజనాలు ఈడేరుతున్నాయి కాబట్టి ఆ కోణంలో గాని ఆరాధన పెరుగుతుంది. దానంతకు అది ఇబ్బంది కాకపోయినా కవిత్వంలోని 'ప్రయోగాలను ఆ ప్రమాణంతోనే చూడడంలో ఇబ్బందులు ఎదురవుతాయి. ఇతర ప్రక్రియలను 'అర్థం కావడం' అనే కోణంలో చూడవచ్చుగాని కవిత్వాన్ని కూడా అట్లాగే చూడడం కష్టం. చెంచయ్యగారి కవిత్వ అంచనాల్లో ఆధునికపూర్వ నొక్కు ఉంటుంది. మార్క్సిస్టు సాహిత్య విమర్శకుల్లో ఈ వైఖరి ఉండడం ఆశ్చర్యమే. ఎందుకంటే- మార్క్సిజం ఆధునిక సామాజిక సిద్ధాంతం. అర్థవంతమైన, మానవీయమైన ఆధునిక పారిశ్రామిక వ్యవస్థగా సోషలిజాన్ని నిర్మించడం కమ్యూనిస్టుల లక్ష్యం. కాబట్టి సామాజిక వ్యవస్థల్లో మిగిలి ఉన్న ఆధునిక పూర్వ జాడ్యాన్నీ,

పెట్టుబడిదారీ విధానం ఆధునికతకు ఆపాదించిన సకల కల్మషాలను పదునైన విమర్శతో ఎదుర్కొని, అర్థవంతమైన ఆధునికతా వైఖరి తీసుకోవాల్సి ఉంటుంది. ఈ వైఖరి ఎంత కచ్చితంగా ఉంటే అంత సవ్యమైన విశ్లేషణ ఇవ్వడానికి వీలవుతుంది.

కానీ చెంచయ్యగారికి దీనికి సంబంధించిన సమస్యలున్నాయని ఈ వ్యాసంలో తెలుస్తోంది. మో కవిత్వాన్ని విశ్లేషించేటప్పుడు ఆయనలోని ఆధునిక పూర్వ నొక్కు బాగా పని చేసింది. అర్థం కావడం అనే సామాజిక ప్రయోజన కాంక్ష వల్ల కలిగిన రూప సంబంధమైన వైఖరిగా అది కనిపిస్తుంది. అయితే రూపం దాని మానాన అది వేరుగా ఉండదు కదా. రూపం ద్వారానే సాహిత్యం అయ్యే కవిత్వంలో అది సారానికి సంబంధించిన విషయంగా కూడ మారుతుంది. దాంతో చెంచయ్యగారి విశ్లేషణ మో కవిత్వ సారానికి కూడా వర్తించేదైపోయింది. నేరుగా మో కవిత్వ సారాన్ని కూడా ఆయన ఇట్లాగే పరిశీలించారు. అందువల్ల కొన్ని ఇబ్బందులు వచ్చాయి.

చెంచయ్యగారు తన విశ్లేషణలో- మో తనకు తానే చెప్పుకున్నవాటినీ, చేకూరి రామారావు, పాపినేని శివశంకర్, కె.వి.ఆర్ లాంటి వాళ్ల అంచనాలనూ పరిగణలోకి తీసుకున్నారు. ఒక కవి తన గురించి తానే చెప్పుకొనే వాటికి విలువ ఇవ్వాల్సిందేగాని, మార్క్సిస్టు విమర్శకులు వాటి మీదే ఆధారపడడానికి కూడా లేదు. మార్క్సిస్టు పద్ధతిలో ఆ తరహా కవిత్వాన్ని చూడడానికి అవసరమైన గంభీరమైన సంవిధానాన్ని ఆశ్రయించాల్సి ఉంటుంది. కవిత్వంలో ఉండే అర్థం కాకపోవడం అనే లక్షణంతోపాటు, జనరల్‌గానే అస్పష్టత గురించి ఏమైనా ఇంకా ఆలోచించవచ్చా అనే ప్రశ్న కూడా వేసుకోవడం బాగుంటుంది.

చెంచయ్యగారు ఒక చోట ఇలా రాశారు. 'స్పష్టత గురించి చాలా మందిలో అస్పష్టమైన అభిప్రాయాలున్నాయి. స్పష్టత అనగానే అదేదో పనికిమాలిందనీ, కవిత్వానికి అసలు పనికి రాదనీ, అందులో సృజనాత్మకత అసలుండదనీ - ఇలా ఏవేవో అభిప్రాయాలుంటాయి. వాచ్యంలోనే స్పష్టత ఉంటుందనుకోవడం పొరబాటు' అన్నారు. బహుశా మో 'సాంధ్యభాష' కవిత్వ సంపుటికి ముందుమాటలో తిరుపతిరావు ఇలాంటి చర్చ చేసినట్టుంది. ఆయన అభిప్రాయం మీద చెంచయ్యగారి స్పందన కావచ్చు. ఆధునికానంతరవాదులకు సమాధానం కోసమైనా సరే ఈ వాదన వల్ల సాధించే ప్రయోజనం ఏమీ ఉండదు. స్పష్టతకు, సృజనాత్మకతకు మధ్య మార్క్సిస్టులు పోటీ పెట్టనవసరం లేదు. సృజనాత్మకతను కొలవడానికి స్పష్టత ఒక్కటే ప్రమాణం కాదు. అదే నిజమైతే ప్రపంచవ్యాప్తంగా ఆధునిక సాహిత్య కళా సాంప్రదాయాల మంచి చెడ్డలను, ప్రయోజనాలను ఎన్నటికీ తేల్చలేం. పైగా నానాటికీ మనిషి సాధించే సృజనాత్మక వికాసాన్ని వివరించగల పరికరాలు మార్క్సిస్టు విమర్శకుల దగ్గర లేవని పరోక్షంగా ఒప్పుకున్నట్టవుతుంది. ఇది ఎక్కడికి దారి తీస్తుందంటే స్పష్టతలో కవిత్వం ఉండదని వాళ్లంటే, అస్పష్టతలో కవిత్వం ఉండదని మనం వాదించినట్టవుతుంది. కానీ అస్పష్టతలో కూడా కవిత్వం ఉంటుందని చెప్పడానికి మోహనప్రసాదే మంచి ఉదాహరణ.. మో కవిత్వ విశ్లేషణకు స్పష్టత- అస్పష్టత అనే చట్రం మాత్రమే సరిపోదు. అస్పష్టతకు సాధారణీకరించబడిన ప్రమాణాలుంటాయా? సందేహమే. చెంచయ్యగారు అస్పష్టంగా ఉందన్న కవిత, లేదా భావన మరొకరికి స్పష్టం కావచ్చు. పాఠక సామాన్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ చర్చ చేసినా అందునా తరతమ భేదాలుంటాయి. బహుశా కవిత్వానికేగాక, అన్ని సృజనాత్మక రూపాల్లో, అంతకు మించి అన్ని జీవన వ్యక్తీకరణల్లోనే ఈ సమస్య ఉంటుంది. చెంచయ్యగారు దాన్ని మాత్రమే ఆసరా చేసుకున్నారు. అస్పష్టత అనేది ఒకానొక కవిత్వ లక్షణమేగాని, అది ఉన్నంత మాత్రాన కవిత్వం కాకుండా పోదు. అలాంటి కవిత్వాన్ని పాఠకులకు అర్థం కావడం, కాకపోవడం అనే కోణంలోనే చర్చించడం వల్ల కవిత్వ ప్రక్రియకున్న ప్రత్యేకతలను విస్మరించినట్లవుతుంది. 'భావ తీవ్రతకు సంక్లిష్ట వాక్య నిర్మాణమే ఏకైక మార్గం అని వేగుంట భావించడం సరైనది కాదు' అని కూడా చెంచయ్యగారు అన్నారు. ఏకైక మార్గం కాదని భావ తీవ్రతను అనేక రకాలుగా వ్యక్తీకరించిన కవులే నిరూపించారు. అయితే అది మో మార్గం. దాన్ని దానిగా చూచి అంచనా వేయాల్సిందే. పాఠకులందరికీ అర్థమయితేనే ప్రయోజనం సిద్ధిస్తుందనే చట్రం కవిత్వంలోని ప్రయోగాలను, వైవిధ్యాన్ని, ఏ ఏ అనుభూతి తలాల నుంచి కవిత్వం ఉత్పత్తి అవుతుందనే విషయాలను చర్చించడానికి సరిపోదు. ఒక్కో అనుభూతి తలం నుంచి ఒక్కో కవి వ్యక్తం కావచ్చు. అది చెరబండరాజుకు ఒకలాగా ఉంటే, మోకు మరోలా ఉంటుంది. కవిత్వాన్ని రాజకీయ, సాంస్కృతిక సాధనం చేసుకున్న కవుల్లోనే ఈ తేడా చూడవచ్చు. తెలుగు కవిత్వానికి సంబంధించినంత వరకు వేమన, గురజాడ, శ్రీశ్రీలాంటి వాళ్ల ఒరవడి 1960లు, 70లకు ఒక స్పష్టమైన రూపం తీసుకున్నది. దీనికి బైరాగి, తిలక్, అజంతా, ఇస్మాయిల్, ఇంద్రకంటి శ్రీకాంతశర్మ, మో లాంటి వాళ్లు ఆ కాలంలో మినహాయింపు.

ఈ తేడాలను చెంచయ్యగారు గుర్తించడానికి ప్రయత్నించి ఉంటే బాగుండేది. అసలు మో కవిత్వానికి ఉన్న సోషియాలజీ ఏమిటీ అని ఆలోచించడం ఆసక్తిదాయకం. మో కవిగా రూపొందిన స్థలకాలాల్లో కొన్ని ప్రత్యేకతలున్నాయి. మో చితి-చింత కాలం 1960ల ఉత్తరార్థం. అప్పటికి దిగంబర కవుల, తిరగబడు కవుల సంచలనాలతోపాటు మరి కొన్ని ప్రత్యేకతలు కూడా తెలుగు కవిత్వంలో ఉన్నాయి. వాటిని కొంచెం అటూ ఇటూగా స్థూలంగా ఇలా చెప్పుకోవచ్చు. గురజాడ మీదుగా శ్రీశ్రీ ప్రాతినిధ్యం వహించిన మార్గం ఒకటి. (అయితే అది చాలదని అప్పుడప్పుడే దిగంబర కవులు వస్తున్నారు) . తిలక్‌లాంటి వాళ్ల మానవతావాద ధోరణి మరొకటి. ఈ రెండూ కాకుండా అనుభూతివాద ధోరణి కూడ ఉన్నది. సుమారుగా ఇవన్నీ కోస్తా ప్రాంత సాహిత్య ప్రపంచానికి సంబంధించినవి. ఆ ప్రాంతానికి చెందిన మో దిగంబర కవుల అలజడితో సహా ఈ మూడు మార్గాల్లో దేనికీ చెందకుండా తనదైన కొత్తదారి వెతుక్కున్నారు. తన జీవిత కాలంలో అనేక సామాజిక,

సాహిత్య సంచలనాలు-ఉద్యమాలు తోసుకొని వచ్చినా మో తన మార్గంలో చెక్కుచెదరకుండా నిలబడి ముందుకు వెళ్లారు. శ్రీశ్రీ లేదా తదనంతర విప్లవ కవిత్వ మార్గానికి మో ఎందుకు రాలేదనే ప్రశ్నతోపాటు, ఆ ప్రాంత కవిత్వంలో ఉన్న మానవతావాద, అనుభూతివాద మార్గాల్లోకి కూడా ఆయన ఎందుకు వెళ్లలేదనే సందేహం కలుగుతుంది.

మో కవిత్వంలో ఒంటరితనం, దుఃఖం, అంతర్ముఖత్వం, పురాస్మృతిలాంటివి ఉన్నాయి. ఆధునికతకు పెట్టుబడిదారీ విధానం ఆపాదించిన వికృతత్వానికి కవిత్వ ప్రతిఫలనమిది. శ్రీశ్రీ మానవుడా...! అని సంబోధించినది పెట్టుబడిదారీ వికృతత్వాన్ని, దుర్మార్గాన్నీ, అమానుషత్వాన్నీ ధ్వంసం చేసి ఇచ్ఛాపూర్వక కలయికను అర్థవంతం చేసే స్వేచ్ఛాజీవి కోసం. అయితే మో ప్రధానంగా ఒంటరితనంలో, పురాస్మృతిలో ఉన్నా సమాజానికి ప్రతిస్పందించకుండా పోలేదు. అసలు ఏ మనిషి అయినా ఆలోచిస్తూ, భాషను వినియోగిస్తూ, భౌతిక ఉత్పత్తి నుంచి తనకు కావాల్సినవి తీసుకుంటూ ఉన్నాడంటే సామాజికుడైనట్టే. కాబట్టి ఒంటరితనం అనేదానికి కూడా సామాజిక పార్శ్వం ఉంటుంది. అందువల్లే మో ఒంటరితనపు పలవరింతలో లేదా తానే అన్నట్లు ప్రేలాపనలో కూడా సామాజిక సంవేదన ధ్వనిస్తూ ఉంటుంది. అనేక దుర్లక్షణాలతో బొగిలిపోయి, ఎటూ కాకుండా, ఏ ఆశనూ ఇవ్వలేని వర్తమాన ఆధునిక వ్యవస్థల మీద విసుగూ, నిర్లిప్తత, కోపం అందులో ఉంటాయి. అది పాఠకులకు అందీ అందకుండా ఉంటుంది. ఒక్కోసారి మో తన ఒంటరితనం నుంచి, పురాస్మృతి నుంచి బైటికి తొంగి చూసి సామాజికుడిగా రాసిన కవిత్వం కూడా ఉంది. అట్లని వాటి నుంచి బైటికి రావాలని అనుకున్నట్లు కూడా ఆయన కవిత్వంలో కనిపించదు. మన కాలంలో మన చుట్టూ ఉన్న అవకతవకల సామాజిక వ్యవస్థకు ఆయన తన పద్ధతిలో ప్రతిస్పందిస్తూ వచ్చారు - ఆ వ్యవస్థ వికృత లక్షణాలైన వొంటరితనంలాంటి వాటిలో కూరుకపోయి ఉంటూనే.

ఈ దృష్టితో మోను పరిశీలించడం బాగుంటుందని నా అభిప్రాయం. లేకపోతే మార్క్సిస్టు సాహిత్య విమర్శ కేవలం అర్థమయ్యే కవిత్వాన్ని, సామాజిక, రాజకీయ ప్రయోజనం నేరుగా ఈడేర్చే కవిత్వాన్ని మాత్రమే విశ్లేషించగలుగుతుందనే పరిమితిని మనమే విధించినట్టవుతుంది. మార్క్సిస్టు సాహిత్య విమర్శలో మనం ఎక్కువగా వర్ణనాత్మక పద్ధతికి ప్రాధాన్యత ఇచ్చాం కాబట్టే ఈ సమస్యలు ఎదురవుతున్నాయా? మార్క్సిస్టు పద్ధతి విశ్లేషణాత్మకమైనదే పట్టింపు పెంచుకుంటే ఈ సమస్యను అధిగమించగలమేమో? అనే ప్రశ్నలు, ఆలోచనలూ చెంచయ్యగారి రచన చూశాక కలుగుతున్నాయి.

అయితే పైన చెప్పిన తరహా కవులను కె.వి.ఆర్ మార్క్సిస్టు పద్ధతిలో చాలా వరకు సవ్యంగా పరిశీలించారనవచ్చు. అయితే ఆయన కూడా వాచకంలోకి వెళ్లలేదు. నిజానికి ఆయన చేసిన ఈ తరహా కృషి అంతా సుమారుగా విప్లవోద్యమం ప్రారంభం కావడానికి ముందు కాలంలోనే. ఆ తర్వాత పెద్దగా ఈ పని చేయలేకపోయారు. దీనికి కారణం ఆ తర్వాత ఆయన వేరే పనిలో పడిపోవడమా? లేక విప్లవోద్యమం తీసుకొచ్చిన కొత్త ఒరవడుల వల్ల ఈ పని చేయలేకపోయారా? అనే సందేహం కలుగుతుంది. మో 'చితి-చింత' ముందుమాటలో అప్పటికి మో గురించి ప్రచారంలో ఉన్న వైఖరులకు భిన్నంగా అంచనా వేసిన కె.వి.ఆర్ ఆ తర్వాత మో కవిత్వపంథాకు బాగా ప్రాచుర్యం దొరికి, ఆయన తెలుగులో పేరెన్నికగన్న కవి అయ్యాక ఎందుకు రాయలేదు? విప్లవోద్యమం తీసుకొచ్చిన సామాజిక, సాహిత్య పరిశీలనాచట్రంలో కె.వి.ఆర్ ఆ పని చేయలేకపోయారని కూడా ఊహించవచ్చేమో. అప్పుడు విప్లవోద్యమం తెచ్చిన పరిశీలనా చట్రమే చర్చనీయాంశం కావాల్సి ఉంటుంది.

మార్క్సిస్టు సాహిత్య పరిశీనాల పద్ధతిలో ఉన్న వైశాల్యం గురించి, అందులోని పరికరాల గురించి, సంవిధాన బలం గురించి చెంచయ్యగారు పునరాలోచించి, దాన్ని మరింత శక్తివంతం చేయాల్సి ఉందనుకొని ఈ వ్యాసం రాసి ఉంటే మో గురించి ఇంకొంచెం భిన్నమైన పరిశీలనలు చేసి ఉండేవారు.

పాశ్చాత్య సాహిత్యంలో వచ్చిన అనేక సిద్ధాంతాల ప్రభావం మో మీద ఉన్నదనే విషయాన్ని చెంచయ్యగారు బాగా గుర్తించారు. ఆ తరహా సాహిత్య, సామాజిక సిద్ధాంతాలు ఏ నేపథ్యంలో వచ్చిందీ, వాటి లోపాలేమిటీ అనే చర్చ తప్పక చేయాల్సిందే. అయితే వాటి సారాంశాన్నంతా మోకు ఆపాదించనవసరం లేదు. మార్క్సిజం మీద ఉండే సిద్ధాంత, ఉద్యమ సంబంధమైన వ్యతిరేకతనంతా శ్రీశ్రీకో, మరో కవికో ఆపాదించడం ఎంత అసమంజసమో ఇదీ అంతే. వీళ్లెవరైనా కవులు మాత్రమే. ఆయా సిద్ధాంతకారులతో కఠినంగా మాట్లాడవచ్చుగాని మోలాంటి కవులతో అట్లా వ్యవహరించనవసరం లేదు. ప్రయోజనం లేకపోగా కవిత్వాన్ని విశ్లేషించలేక దాడికి పాల్పడ్డారనే నింద మోయాల్సి వస్తుంది. పైగా మార్క్సిస్టు సాహిత్య విమర్శలో ఇంతకంటే మరేమీ ఉండదనే అపవాదును నిజం చేసినట్టవుతుంది.

తర్వాత కవి 'అంతర్ముఖత్వం' అనే దాని మీద కూడా చెంచయ్యగారు తీవ్రంగానే రాశారు. జీవితంలో అంతర్ముఖత్వం ఉన్నదే. దాన్ని వైభవీకరించే, సిద్ధాంతీకరించేవాళ్లతో తలపడడం వేరే సంగతి. సామాజిక బృందాల్లో, వాటి లోపల ఉండే సంబంధాల్లో తప్ప విడిగా మానవుడికి అస్తిత్వమేలేని కాలాన్ని అధిగమించి ఆధునికత ప్రవేశించాక ఒంటరితనం అనే అనుభవం మనిషికి కలిగింది. బహుశా ఏకాంతం అనే పాజిటివ్ భావనకు కూడా పాత సమాజాల్లో చాలా తక్కువ చోటే ఉండి ఉంటుంది. వ్యక్తి అనే భావనే లేని రోజుల్లో మానవ జీవితంలోని ఒకటి, రెండు సందర్భాల్లో మినహా ఏకాంతం ఉండే అవకాశం లేదు. ఆ మేరకు ఒంటరితనం కూడా అంతే. ఆధునిక జీవన సంవేదనకు సామాజిక ప్రపంచంలోని అవస్థలు ఎంత ప్రేరణ ఇచ్చాయో, వ్యక్తి అనుభవంలోకి వచ్చిన ఏకాంతం లేదా ఒంటరితనం కూడా అంతగా దోహదపడ్డాయి. కవిత్వం, సాహిత్యం విషయానికి వస్తే ఇక చెప్పనవసరం లేదు. ఆధునిక జీవితంలోని ఒక వాస్తవ కోణం అది. దాన్ని ఆ వాస్తవ

పునాది నుంచి విశ్లేషించాల్సిందేగాని, వెటకారం చేస్తే ఒక పెద్ద చిక్కు సమస్య వస్తుంది. సమసమాజంలో మనిషికి ఏకాంతం కూడా ఉండదా? అనే అనుబంధ ప్రశ్న అవతలి నుంచి వస్తుంది.. పెట్టుబడిదారీ వ్యవస్థ తీసుకొచ్చిన ఒంటరితనం అనే సమస్య నుంచి సోషలిజం విముక్తి కలిగిస్తుందని, తప్పక వ్యక్తి స్వేచ్ఛకు, ఏకాంతానికి గౌరవనీయ స్థానం ఉంటుందని చెప్పాలంటే కవిత్వంలో వ్యక్తమయ్యే ఒంటరితనం గురించి కూడా చాలా జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుంది. సమాజం నుంచి వ్యక్తిని, కవిత్వాన్ని వేరు చేయలేం.. అనే సూత్రానికి మాత్రమే కట్టుబడి మిగతా విషయాలు మాట్లాడకపోతే.. ముఖ్యంగా కవిత్వంలో ఈ తరహా ధోరణులను సరిగా అంచనా వేయలేం. అసలు జీవితం పట్లనే అదొక అసమగ్ర వైఖరిగా మిగిలిపోయే ప్రమాదం ఉంది.

ఈ ఎరుక లేకపోతే మో అన్నట్లు 'మానవుడికి మరొక సగభాగమైన మానసిక ప్రపంచమంటూ లేకుండా కమ్యూనిస్టులు చేశార'నే దుష్ప్రచారాలు నిజం చేసినట్టువుతుంది. సామాజిక వర్గాల సంఘర్షణతోపాటు; కవికి... సమాజంతో జరిగే సంఘర్షణకు కూడా కవిత్వంలో చోటు ఉంటుందని చెంచయ్యగారు కూడా అంగీకరిస్తారు. అప్పుడు ఈ కింది ఆలోచనలు చేయవచ్చు. ఆధునిక కవి రకరకాల సృజనతలాల నుంచి సమాజంతో ఘర్షణ పడుతుంటాడు. కవి ప్రతిభ, విలక్షణ వ్యక్తిత్వం...మొదలైనవాటి వల్ల కవిత్వంలో అనేక ధోరణులు వస్తుంటాయి. వాటి ఉనికిలో ఉన్న వ్యవస్థపట్ల విసుగు, కోపం, అసమ్మతి ఏదో ఒక రూపంలో కనిపిస్తుంటాయి. అయితే అవి చాలా విచిత్రంగా, మార్మికంగా, అయోమయంగా, తల్లకిందులుగా కూడా ఉండొచ్చు. కానీ వ్యవస్థ పట్ల అసహనానికి అవి గుర్తు. ఆ మేరకు వాటికి సామాజిక పాత్ర ఉంటుంది. దాని గురించి ఆ కవులకు ఏమీ తెలియకపోవచ్చు. ఉదాహరణకు మో తన కవిత్వంలోని అర్థం కాని గుణం గురించి రాసినట్లు -అర్థమయ్యేలా, సామాజిక దౌష్ట్యాలపట్ల నిరసనగా రాసిన కవిత్వం గురించి బహుశా ఎక్కడా ఏమీ చెప్పి ఉండకపోవచ్చు. కానీ 'అస్పష్ట' కవిత్వంలోని సామాజిక పార్శ్వాన్ని కూడా మార్క్సిస్టులు తప్పక గుర్తించాల్సి ఉంటుంది. ' ఏవియో అర్థమ్ముగాని భావగీతములివి..' అని రాసుకున్న భావ కవిత్వంలో కూడా ఆ యుగావధికి లోబడిన స్వేచ్ఛాభావన ఉన్నదని చాలా సార్లు చెంచయ్యగారే చెప్పి ఉన్నారు.

ఈ దృష్టితో చూస్తే - ' వేగుంట పైకి 'నాన్ మార్క్సిస్టు, లోపల యాంటీ మార్క్సిస్టు..' అని తాను చేసిన సూత్రీకరణను ఆయనే పునరాలోచించగలరు. అయితే చెంచయ్యగారు ఒకచోట 'మార్క్సిస్టు విమర్శకులు సైతం ఇతని గురించి అటూ ఇటూ కాకుండా మాట్లాడడం బాధాకరం' అన్నారు. మార్క్సిస్టు సంవిధాన బలం లేనప్పుడు, వ్యక్తితో ఉన్న సంబంధాల్లో ఉద్వేగానికి లోనైప్పుడు, కేవల కవిత్వపరమైన పులకింతకు గురైనప్పుడు ఇలాంటి సమస్యలు రావచ్చు. కవిత్వం గురించి రాసేటప్పుడు పలవరింతే విమర్శగా చెలామణీ అవుతున్న మాట నిజమే. మరణించినప్పుడు రాస్తే తప్పక జ్ఞాపకాల తలపోతలో విశ్లేషణ, కచ్చితత్వం తగ్గిపోయే ప్రమాదం ఎప్పుడూ ఉండేదే. చెంచయ్యగారి వ్యాసంలో పైన ప్రస్తావించినవే గాక మరికొన్ని లోపాలు ఉండవచ్చేమోగాని నేను ఇంతవరకే పరిమితం. అయితే చెంచయ్యగారు కచ్చితత్వం పాటించాలను కున్నారని ఈ వ్యాసంలో తెలుస్తూనే ఉంది. అయితే పైన చెప్పిన లోటుపాట్ల వల్ల ఒక వైపుకు మొగ్గారు. దానికి కారణం మార్క్సిస్టు పద్ధతి అని ఆయన అలవాటు చేసుకున్న పద్ధతి తెలుసే ఉన్నది. అది ఆయన ఒక్కరిది కాదు. మన మార్క్సిస్టు, సిద్ధాంత, అధ్యయన, అభ్యసనాలకు, దాన్నుంచి తయారై కొనసాగుతున్న విమర్శా పద్ధతికీ సంబంధించినది. మార్క్సిస్టు వ్యతిరేకి అని పిలవదగ్గ బలం మోకు లేదు. అస్పష్ట ముద్ర ఉన్న కవి మాత్రమే. ఆలోచనాపరుడిగా, అధ్యయనశీలిగా ఆయన మార్క్సిస్టు వ్యతిరేక సాహిత్యాన్ని, దానికి సంబంధించిన వాదాలను చదివి ఉండవచ్చు. వాటి ప్రభావం ఆయన కవిత్వంలో, ఆలోచనల్లో ఉండొచ్చు. అయితే అంతా అదే కాదు. మార్క్సిజాన్ని కాదన్న సాహిత్యకారులందరినీ యాంటీ మార్క్సిస్టు అనవలసిన పని లేదు. సామాజిక సిద్ధాంత రంగంలో కూడా మార్క్సిస్టు వ్యతిరేక సిద్ధాంతాలను - నాన్ మార్క్సిస్టు సిద్ధాంతకారుల పరిశోధనలను, ఆవిష్కరణలను వేరుగా చూడాల్సి ఉంటుంది. సాహిత్యరంగంలో ఈ అప్రమత్తత మరింత అవసరం. అయితే అది ఉదారవాదం నుంచో, వ్యక్తిగత ప్రత్యేకత నుంచో, వ్యక్తి పొందే శిక్షణ నుంచో వచ్చేది కాదు. మార్క్సిస్టు సాహిత్య సిద్ధాంతం నుంచి, దాని నుంచి రూపొందే సాహిత్యవిమర్శ నుంచి మనకు పట్టుబడవలసిన వ్యవహారం. దాని గురించి మరోసారి కొన్ని విషయాలు తాజాగా ఆలోచించడానికి చెంచయ్యగారి వ్యాసం ప్రేరేపిస్తుందనే నమ్మకం నాకు ఉంది.

రచయితలకు విజ్ఞప్తి !

అరుణతారకు రచనలు పంపండి. కథలు, కవిత్వం, పుస్తక సమీక్షలు, విమర్శా వ్యాసాలు, సామాజిక రాజకీయ సిద్ధాంత వ్యాసాలు, యితర భాషల్లోనుండి తెలుగు పాఠకులకు అవసరమైన అనువాదాలు పంపించండి. అరుణతారలో అచ్చవుతున్న రచనలపై ఉత్తరాలు రాయండి. రచనలను మెచ్చుకునే ఉత్తరాలకంటే గుణదోషచర్చలు చేయగల ఉత్తరాలు పత్రిక ప్రమాణాలు పెంచుతాయి. పాఠకుల విమర్శనాత్మక ఉత్తరాలు పత్రికా నిర్వహణకూ తోడ్పడుతాయి. మీ రచనలు అరుణతార సాహిత్య, సిద్ధాంత స్థాయిని పెంచుతాయని నమ్ముతూ -

- సం

కథ

కూట్లో రాళ్ళు తీసేటందుకు

- వీరబ్రహ్మాచారి

'టక్ టక్'

...! ...! మనసులో మనాది బయట చలి. తొందరగా మంచం మీద ముడుచుకుందామనుకున్న నారాయణ తలుపు చప్పుడుతో కనుబొమ్మలు చిట్లించి దర్వాజ వైపు చూశాడు.

'టక్ టక్ టక్'

'ఎవరాళ్ళు?' మొదటి చప్పుడు భ్రమకాదని రెండోసారి గొళ్ళెం చప్పుడుతో నిర్ధారించుకొని మంచం మీదనుంచి లేవకుండానే బిగ్గరగా అడిగాడు.

'టక్ టక్' చప్పుడే జవాబు.

దుప్పటి తొలగించి లేచాడు 'ఎవ్వరాళ్ళంటే పలకరేం' చిరాకుపడుతూ దర్వాజా పక్కనున్న బయటి లైట్ స్విచ్ వేశాడు. బయట ఉరికిన అడుగుల చప్పుడు. గుబులు గుబులుగా మెల్లగా తలుపులు తెరిచి, గడపదాటకుండానే బయటకు తొంగి చూశాడు. ఎవ్వరూ కనపడలేదు. గడపదాటాడు. 'ఎవరు' ఇంకా బిగ్గరగా.

'సార్ ప్లీజ్ లైట్ బంజేయిండి' తగ్గుస్వరంతో వాకిట్లో చివరునున్న స్నానాల గది వైపు నుండి గుసగుసగా అభ్యర్థన. గుబులు తగ్గి ఆసక్తి మొదలైంది.

'ఎవరూ!' తను స్వరం బాగా తగ్గించాడు.

'సార్ ప్లీజ్ లైట్ బంజెయిండి' గొణుగుడు విన్నపంతో సహా గోడచాటు నీడలో మనిషీ కదిలాడు.

ఎటూ తోచలేదు. ధైర్యం కూడగట్టుకొని లోపలకు అడుగువేసి బయటి లైట్ స్విచ్ బంద్ చేసి లోపలి ట్యూబ్ స్విచ్ వేశాడు. అంతలోనే 'నమస్తే సార్' అంటున్న గడప వద్ద మనిషిని చూసి విస్మయంతో ప్రతి నమస్కారం చేయడం మరిచి గుర్తుబట్టే ప్రయత్నం ఛేస్తున్నాడు.

'సార్ నేను ప్రకాశ్‌ను సామినేని రంగయ్యగారి చిన్న కొడుకును. లోపల్కి రానా సార్' మరోసారి దిగ్భ్రాంతికి లోనయి ఔననిగాని కాదనిగాని అనకుండా మూతకడ్డం తొలిగాడు రమ్మన్నట్లుగా. గోడవారగా నిలబడ్డాడు. వచ్చిన మనిషి లోపలికి వచ్చి తానే తలుపు వేస్తుండగా 'ఆగండాగండి' వారించాడు నారాయణ. మళ్ళీ బయట లైట్ వేసి బైటకు పోయి అన్ని వైపులా పరిశీలనగా చూశాడు.

జనవరి మొదటి వారం. తొమ్మిది గంటలయినా కాకముందే ఊరంతా ఇండ్లన్నీ తలుపులు బిడాయించుకొని నిద్రలోనికి జారుకునే ప్రయత్నంలో ఉంది. నిద్రపట్టని వాళ్ళు పగటిపూట వత్తిళ్ళను, ఆందోళనలను టీవీ సీరియళ్ళ వేడి వేడి ఘుమఘుమలను చప్పరిస్తూ పీలుస్తూ ఆ కొంత సేపూ మరిచిపోయినట్లున్నారు. తనకు కావలసిన నిర్ధారణకు వచ్చినాక లోపలకు వచ్చి తలుపు వేసి గొళ్ళెం పెట్టాడు.

'కూర్చోండి' అతిథికి కుర్చీ చూపించాడు.

'నేనీడ కూసుంట మీరు కూసోండి' అంటూ గోడవారగ కింద కూర్చుని 'నన్ను మీ ప్రకాశ్‌గాడి లాగనే పిలవండి' అన్నాడు.

'సరేగాని నేనిక్కడ మంచం మీద కూకుంట నీవా కుర్చీల కూకోవయ్యా' అంటూ పక్కవరిచిన తన మంచం మీద కూచున్నాడు నారాయణ.

'సార్ దూపైతుంది జెరమంచినీల్లిస్తరా' అంటూ పెదవులను నాలుకతో తడుముకున్నాడు.

'ఎప్పుడు తిన్నవు' మొఖం పీక్కపోయింది.

'నిన్న పొద్దుగూకినపుడు.'

'సరే ఇంటెన్కికి పోయి కాల్లు సేతులు మొకం కడ్కో.'

'ముందు జెర నీల్లీయిండి.'

నారాయణ పక్కగదిలోనికి వెళ్ళాడు. 'ఇగో ఎవరొచ్చిండ్రో సూడు' గొణుగుతూ భార్యను నిద్రలేపాడు.

'ఊ... ఎవ్వరొచ్చిండ్రు' కునుకు చెడిపోవడంతో గట్టిగా విసుక్కున్నది.

'మెల్లెగ మెల్లెగ ప్రకాశే వాడు మన ప్రకాశ్‌గాడొచ్చిండు' గుసగుసగానే అయినా ముందు గదిలో కూచున్న ప్రకాశ్‌కు వినపడడంతో సంతోషమైంది. 'సార్‌కు నామీదింకా వెనకటి ప్రేమే ఉంది' అనుకున్నాడు.

నీళ్ళతో వచ్చిన పంతులమ్మను చూసి 'అమ్మగారు బాగుండరా' లేచాడు గ్లాసు అందుకున్నాడు.

'కూచో కూచో మాకేమైంది బాగుండక మొదలు నీళ్ళుదాగు'

గ్లాసెత్తి ఒకేసారి పోసుకోవడంతో పొరబోయినిది దగ్గుతుండగా 'మెల్లెగ నాయినా మెల్లెగ. ఎన్నేండ్లాయె నీవు గన్పడక. ఇంటర్మీడియట్లైనంక ఇంజినీరింగుల జేర్నవన్నరు. గని ఆ తర్వాత నీవు గన్పడలే.'

'ఔ ఫస్టియర్ పరీక్షలు రాసి పోయిన.'

'అమ్మ బాగలేదు సూసొచ్చినవా.'

లేదమ్మా మొదలు మీయింటికే ఒచ్చిన.

'ఇగో జేబుల చిల్లర దీసినవా' నడిమింట్లో నుంచి నారాయణ.

'లేదు. నీవే యాడవెట్టి మర్సిపోయినవో. గాడ పోపుల డబ్బుల ఆర్రూపాలున్నయి జూడు.'

'సార్ గిప్పుడాడ్కిపోతాడు!' ఏదో కొనుక్కువచ్చే ప్రయత్నంలో ఉన్నారని గ్రహించి అడిగాడు ప్రకాశ్.

'యాడ్కెలే అన్నముంది గాని కూరలేదు. దుకాణాన్కివోయి రెండు గుడ్లు దెస్తడు.'

'ఒద్దొద్దు. పచ్చడేమన్నుంటే సాలు అదీ లేకుంటే కారంపొడి నూనె ఉన్నా చాలు.'

'శానరాత్రేంగాలె' అంటూ గోడవంక చూడమన్నట్లుగా తనూ చూస్తూ 'తొమ్మిదింబావే సావుకారేం నిద్రవోడు. తెస్తడులే.'

'అది గాదవ్మా నావూటినుండి 'దానివల్ల కొత్త ఇబ్బందులొచ్చే అవకాశముంది' ప్రకాశ్ మాటలు విన్పించుకోలేదు. నారాయణ వెళ్ళాడు. బాట వెంబడి కీచురాళ్ళు కిర్‌కిర్‌మంటూ జాగ్రత్తలు చెప్పినట్లన్పించింది... 'గింతరాత్రి చలిల ఎవరొచ్చింద్రు యాలగాని యాల్ల', 'యాల్లగాని యాల్ల సెప్పకుండొచ్చెటోల్లనే అతిథులంటరు సేటూ మా ఆవిడ దూరపు సుట్టం, బస్సు లేటయ్యిందట సేటు ప్రశ్నలను అంచనా వేస్తూ జవాబులను రిహార్సల్ చేసికున్నాడు దారి వెంబడి నారాయణ.

- - -

'స్థానికంగా ఎన్నో సమస్యలున్నాయి. బలవంతుల పెత్తందార్ల దాష్టీకానికి నలుగుతున్న పేద, మధ్య తరగతి వాళ్ళకున్న సమస్యలున్నాయి. వాటిని ఇక్కడే బయట ఉండి ఎదిరించి పరిష్కరించొచ్చు మీవంటి సాహసికులు. ఎందుకింత ప్రాణాలను రిస్క్‌లో పెట్టే కూడు గూడు వేళకు నిద్రా లేని పోరాటం.'

'జనమందరికీ ముఖ్యంగా కష్టజీవులకు అంటే జాషువా అన్న ప్రపంచానికి భోజనం పెట్టేవారికి వేళకు భుక్తి లభించడానికే.' కొద్దిసేపాగాడు ఇంకేమైనా ప్రశ్న వస్తుందేమోనని. ఏమీరాకపోవడంతో 'బయటే ఉండి ప్రజాస్వామ్య పద్ధతిలో పరిష్కరించడమంటిరి. రెండు నెలలుగా వందలమంది రైతులు మామ శ్రీనివాస్ మీద పోరాడుతున్నరు. ఎవరు ఆయున్ను ఒప్పించగలుగుతున్నారు. పత్రికలూ రాసినయ్ ఎవడికి వినపడింది.'

'బేర్ బేర్ బెహెక్ బెహెక్' కప్పల అరుపులు. సంకేతం విని 'మామ ఒచ్చినట్లుండడు ఒస్త సార్' అన్నాడు. భోజనం తర్వాత గురుశిష్యులు మాటల్లో పడ్డారు. 'అమ్మనాయినను కల్వవా'

ఇప్పుడొద్దమ్మా ఇన్‌ఫార్మర్ల నిఘా ఉంటది.

'నేను పిల్సుకొస్త'

'ఒద్దు సార్. మల్లెపుడన్న ఒస్తెగన్క గలుస్త. అమ్మకు మీరే జెప్పాలె సార్. మేం మరణించం. జన యాదిల ఎప్పటికీ బతికే ఉంటమంటని. అమ్మా ఒస్త' అంటూ పిడికిలి బిగించాడు. 'భద్రం నాయినా' గొంతు తడబడింది 'నీకు చదువు జెప్పి సార్ నౌకరి సార్థకమైంది'. కొంగుతో కళ్ళద్దుకుంది. నూరేళ్ళు బత్కు తండ్రీ.'

* * *

'ప్రకాశ్ నిగ జూడలేమంటావా'

ప్రకాశు ప్రకాశు ప్రకాశు ఎవుడే ప్రకాశు కూట్లెరాయి దీయనోడు ఏట్లెరాయి దీస్తనని పోయినోడికోసం ఒకటే కల్వరిస్తున్నావేం. ఎన్మిదేండ్లాయె ఇంకా మర్సిపోవు' కసురుకున్నాడు. దూరం నుంచే మాటలు విన్పించాయి. రిటైర్‌డ్ టీచర్ నారాయణకు.

'నమస్తె మాష్టారు. రండి రండి. మీరైన చెప్పుదురూ మీ చెల్లెకు. వాని జ్ఞాపకంతో మూణ్ణెల్లుగా మరీ మంచం మీదనుండి దిగటం లే' పట్టా కుర్చీ దులిపి వాల్చాడు.

'నమస్తే రంగయ్య బావగారూ' కుర్చీమీద కూచుంటూ 'బాగా సిటపటలాడుతుండవ్ ఏందో మంచిగ సామెత జెప్తిరి.

'ఎవరో ఎన్‌కౌంటరయ్యారని టీవీల వార్తొస్తె ప్రకాశ్ గుర్తొచ్చి అడ్గిన..' మంచం మీద కూచున్న సీతారావమ్మ వివరించింది '.. ఎగురుతున్నడు.'

'కూట్లిరాయి దీయనోడు ఏట్లెరాయి దీస్తనని పోయినోడి కోసం రంధి ఎందుకూ మర్సిపోమంటున్నా.'

'ఆహా కరెక్టే ఎంత బాగా జెప్పింద్రు బావగారు' సీతారావమ్మ ముఖం చిన్న బుచ్చుకున్నది.

'ఆయున మాత్రం మర్సిపోయూరా అన్నా. వేరే ఎవరి ముచ్చటకూ కోపం రాని మనిసి వాని పేరెత్తితే చిందులేస్తున్నడంటే అర్తమేటి ఆ బాదే కోపం మాదిరిగా బైటకొస్తే లేదంటరా.'

'ఆయనొప్పుకుంటారా ఔనంటే' అని రంగయ్య వైపు దిరిగి 'టీవీ ఎప్పుడు దెచ్చింద్రు బావగారూ బాగుంది.' అడుగుతునే ఏదయినా ప్రతీక కోసం మనసులో వెతుకుతున్నాడు నారాయణ. 'ఈ పిల్లలెవరు బిడ్డపిల్లలా టీవీ ముందుగూచున్న పిల్లల్నుద్దేశించి అడిగాడు.

ఆ ఔను బిడ్డపిల్లలే. గా పక్క కూచున్నోల్లు. గిటు పక్క గూసున్నోల్లు నీకు దెల్సినోల్లే. పెద్దోని పిల్లలు.' 'అరేయ్ నికిలూ సౌండ్ తగ్గించరాదుర' పిల్లల్నుకోప్పడ్డాడు. ఇటు తిరిగి ఆ మాష్టారు టీవి ఎప్పుడు తెచ్చిన్నంటివా పిల్లల పోరుకు తోడు మీ చెల్లెలు ఆ టీవీ వంకయినా చూస్తా వాడిని మరిచిపోతదని మొన్న సోమవారం తెప్పిచ్చాం.' ఒరేయ్ వెధవా తీసెయ్ దాన్ని తీసెయ్ మంచిదివెట్టు' దాదాపు అరిచాడు.

నారాయణకో చిన్న అవకాశం దొరికింది 'బావగారు తేకముందు చూడకపోతివేమొగాని తెచ్చినాకయినా ఎప్పుడు ఓ అరగంట ఆ వార్తల కోస్రమైనా సూళ్ళేదా!'

'వార్తలకు టీవి దేనికీ! పేపరుండగా. ఏదో అప్పుడుడు ఓ పదినిమిషాలు చూశానంతే.'

'ఆ పిలగాని మీద అరిచావుగదా ఏదీ ఆ రిమోట్ తీసికొని ఏ చెడ్డదీ లేనిది ఓ ఛానెల్‌ను ఓ అరగంట పెట్టు చూద్దాం.'

'అదిగో అదిగో అటు చూడండి అదేందో జండుబామ్ లాగుంది దాని పనితనం చూపెట్టటాన్కి ఆడదాని ఒళ్ళంతా చూపుతూ రుద్దడం చూపాలటండి.'

'అదిగో మరొకటి చూడండి బక్కపడే ఎక్సర్‌సైజట దానికో పరికరం అక్కడా ఆడాళ్ళు వాళ్ళ ఒళ్ళు.'

'అదే అదే నేనంటుండ ఏరు ఏరే పొంగి చెత్తచెదారం ఇసుక ఇంట్లకొచ్చి రాల్లల్ల మెత్కలేరుడయితాంటె ఏరునాపాలెగాని మెత్కులల్ల.ఎన్ని రాళ్ళుంట నేరుతరు.'

'ఓహో అక్కడి కొస్తిరా మాష్టరు. గట్ల జెప్పె గద ఊరిల పిల్లల్నాగం జేసినవ్. నీ పిల్లల్నయితే పదిలంగ కాపాడుకున్నవ్.'

నారాయణ మొఖం వాడిపోవడం తల నేలకు వాల్చడం చూసిన రంగయ్యకు బాగానే చురక అంటించానని మురిసిపోయాడు. 'ఏమాయె మాట రావట్లేదా' చూశావా నా దెబ్బ అన్నట్లు ఉడికించే ప్రయత్నం చేశాడు.

'ఔ మాటొస్తలేదు కాని నీవనుకుంటున్నట్లు నీ దెబ్బకు గాదు...' దించిన తలపైకెత్తి ఎటో దూరంగా చూస్తూ 'నా కొడ్కు సంగతి మర్శిపోదమంటని ఒస్తె మల్లయాడికి దెస్తివి.'

'మరిచిపోవలసిన నీ కొడ్కు సంగతేటి?!' నారాయణ ముఖంలో విచారాన్ని చూసి ఆందోళనతో అడిగాడు రంగయ్య.

'ఏ మంటిరి నా పిల్లలైతే... ఔ శానబాగుండరు. పెద్దోడేమొ చెల్లెకు పెద్దింటి సమ్మదం జెయ్యాలంటిని లంచాలకు మర్గి అనుకున్నట్లే బాగనే జేసె. కాని అదయిపోయినంక ఉప్పు మరిగిన పాణం ఊకుండపాయె అట్లే కొనసాగె. ఏసీబీకి దొరికి సస్పెండాయె. చిన్నోడేమొ నౌకరున్న పెండ్లాన్ని జేస్కొని మమ్ముల గాన్త లేడు. మా కోడలమ్మ తల్లిదండ్రికి ఒక్కగానొక్క బిడ్డ వాళ్ళను గాన్తలేదు. ఇద్దరు బోయి బెంగుళూర్ల పడ్డరు.

'ఇద్దరు వోయిపడ్డరో నీ కొడుకే ఈడ్చుకపోయిండో!...'

'మీరన్నదీ నిజమే గావొచ్చు గుడ...' ఆగి వరండా కప్పు కేసీ చూసన్తా 'పెద్దోని సస్పెన్షన్ నిర్ధారణయి టెర్మినేషన్ ఆర్డరొచ్చిందంటని కోడలు ఫోన్ జేసి ఏడిస్తె ఏంతోచక నీకాడ్కి ఒచ్చిన.' ముగించాడు.

'ఔనా! అరెరే అట్లయిందా నీ పరిస్థితి దెల్వక ఏందో మాట్లాడిన ఏమనుకోకు మాష్టారూ. నీతిగుందామన్నా ఉండనీయని రాజ్యం పాలన. నాయకుల చట్టబద్ధమయిన విలాసాల అవినీతి దొరకదు. ఆ విలాసాలకు ఆకర్షింపబడి చిన్నవాళ్ళు చేసే చిన్న చిన్న అవినీతులు దొరుకుతాయి మరి 'ఏం చేసేటట్లు లేదు. బాధ పడమాకు.'

'బాధ పడేదేముంది. బైట శానమంది లాగనే కుక్కల్లాగా పందుల్లాగ మొర్గుకుంట కర్సుకుంట తిట్లు దిన్కుంట తమ కోస్రం బత్కుతుండరు నా కొడ్కులు. అందరి మేలు కోసం పులి లాక బత్కుతుండడు ప్రకాశు. వాన్కి గురువునై నాకు తృప్తి మిగిలింది. నీ వన్నట్లు నా సదువులన్ని కొందరి మంది పిల్లలకెక్కినయి నా పిల్లల కెక్కలే. ఐనా సెప్పుడు గొప్పగాదు. ఇన్నోడల్ల అందుకోరు. నా సబ్జక్టు మాత్రమే నా పిల్లలు కబ్బింది. సమాజం చదువబ్బలే. ప్రకాశ్ అసొంటి ఇద్దరి ముగ్గుర్కి మాత్రమే రెండూ అబ్బినయి... ఒస్త రంగయ్య బావాగారు' అంటూ లేవబోయాడు.

'బాధపడకండి మాష్టరు' గరికా ముర్గిదాల్క బరాబరనేది మీ తెలంగాణ సామెతే గద కూచోండి మజ్జిగ దాగి పోదురు.' 'అమ్మాయ్ మాష్టారుకు మజ్జిగ దీస్కరావే.'

'మజ్జిగ గాదు సల్ల' నవ్వాడు నారాయణ. గంభీరమైన వాతావరణాన్ని తేలికపరుస్తూ 'మనసును చల్లబరిచే సల్ల.'

అలాగే లెండి! ఇదో తీసుకోండి శిశ్యుని ఇంటి సల్లదాగి సల్లబడి పోండి'.

* * *

'నమస్తే మాష్టారు' వాకిట్లో నడిచివస్తున్న నారాయణను చూసి, 'మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు బెంజిమేన్‌ని పోలీసులు అదుపులోకి తీసుకున్నరని హక్కుల సంఘపోల్ల స్టేట్‌మెంట్ స్క్రోలింగుల వస్తుంది. తెల్సిందా మాష్టారు.' కుర్చీవాల్చి కూచోమనే అలవాటు కూడా మరిచిపోయాడు రంగయ్య.

'ఆ తెలుసు అది తెలిసే వొచ్చిన.'

అది తెలిసి ఇక్కడి కెందుకొచ్చాడో ననుకుంటూ నిర్వికారంగా నారాయణ వైపు చూశాడు.

'కూచోండి మాష్టారన్నా మాష్టారికి కుర్చీవాల్చు' భర్తకు గుర్తుచేసింది సీతారావమ్మ.

'అతను ఎవరో కాదు మన ప్రకాశ్' కుర్చీ తనేలాక్కుంటూ కూర్చున్నాడు నారాయణ. దిగ్భ్రాంతిలో మాటరాక నిలబడ్డాడు సామినేని రంగయ్య.

'రంగయ్య బావగారూ ఆ బెంజిమేనే మధు, రవి అలియాస్ మన ప్రకాశ్.'

'వాడు మన ప్రకాశా!' దిగ్భ్రాంతి నుండి కోలుకొని 'ఆ రోజు రాత్రి వాన్ని శ్రీనివాస్‌ను...' భర్త మాటలు హావభావాలు అర్థంగాక ఆత్రంగా ఆర్ద్రంగా రంగయ్య నారాయణల వైపు మార్చి మార్చి చూస్తున్నది సీతారావమ్మ.

'మా వాడని తెల్వక దూరం నుండి మసక వెలుతుర్ల గుర్తు బట్టలేకపోయాను. కండ్ల నిండా చూడకపోయాను. గంత పెద్ద నాయకుడయ్యిండా పార్టీల 'నారాయణను సమీపించి భుజం పట్టుకున్నాడు. కండ్ల నిండా నీళ్ళు.

నిదానంగా విషయం అర్థమవుతున్నట్లు కానట్లున్న సందిగ్ధ స్థితిలో మంచం మీది నుంచి మెల్లగా లేచి భర్తను సమీపించింది సీతారావమ్మ.

అందరూ టీవీవైపు ఆత్రంగా ఆందోళనగా చూస్తుండి పోయారు.

'24 గంటలలోపు బెంజిమేన్ అలియాస్ సామినేని ప్రకాశ్‌ను కోర్టుకు అప్పగించాలి' హక్కుల సంఘాల, రచయితల సంఘాల నాయకుల డిమాండ్‌లు టీవీలో.

అంతలో గ్రామ సర్పంచ్ ఎమ్పిటీసి మరికొంత మందీ వచ్చారు. వాళ్ళు వరండాలో బెంచీమీద కూచున్నారో లేదో కొందరు రైతులు ఆడ మగ వచ్చారు. 'బెంజిమేను మన ప్రకాశంట బాబాయ్' ఒక రైతు రంగయ్యతో. రంగయ్యకదేమీ విన్పించడం లేదు. కళ్ళను టీవీ కప్పగించి కూచున్నాడు.

'మన బెంజిమేనన్నను కాపాడండి సర్పంచు సాబూ' ఏడుపులాగా హక్కుగా ఇది మీరు చెయ్యాలన్నట్లు ఎమ్పీటీసీని నిలదీస్తున్నారు ఒక ఆడ రైతు, ఇద్దరు మగవాళ్ళు.

'బెంజిమేనన్న జెయ్యవట్కే మనూరిల శానమంది రైతుల పొలాలు మల్ల పచ్చగయినయ్. ఎవుసం నిలబడ్డది. మా అసొంటి కూలోల్లకు రెండుపూటల బువ్వ దొర్కుతుంది. అన్నను కాపాడండి. ఎమ్మెల్యేకు ఫోన్ జెయ్యండ్రి' సర్పంచు ఎమ్పీటీసీల ముందు కూలబడ్డారు.

టీవీ వైపు నుంచి దృష్టి మరల్చకుండానే 'ఎమ్మెల్యే కుడ ఏమీ చెయ్యలేడు తాతా' తమ నిస్సహాయతను వ్యక్తం చేశారు.

సీతారావమ్మొదినా బెంజిమేనన్నంటె మన అల్లుడు ప్రకాశేనంట.

'పోలీసుగాడ్డి కొడుకులసలే మడుసుల నెత్తురు మరిగిన కుక్కలు, కోర్టుకు అప్పజెప్తరంటవా సారూ' నారాయణ నడిగాడో ముసలి రైతు.

ఒక్కరొక్కరుగా వాకిట్లో జనం పెరుగుతున్నారు. అందరికీ బెంజిమేను అలియాస్ ప్రకాశని తెలిసింది. టీవీ వైపే అందరి చూపులూ.

గంట గడిచింది అందరిలో నరాలు తెగే ఉత్కంఠ. ఏదో ఆశ. వెంబడే కొంత ఆందోళన.

ఆందోళనే నిజమయ్యింది. 'మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు బెంజిమేన్ అలియాస్ రవి అలియాస్ మధు అలియాస్ సామినేని ప్రకాశ్‌రావు ఎన్‌కౌంటర్...' టీవీలో బ్రేకింగ్ న్యూస్. 'అరెస్ట్ చేసి తీసుక వెళుతుండగా... ...' అలవాటయిన ఎస్పీ వివరణే స్టేట్‌మెంట్‌గా ప్రసారం..

కొడుకు చావు వార్తతో 'వీళ్ళందరి ఈ ఆందోళనలేమిటి? ఈ రాత్రి కళ్ళనిండా ఈయన చూసుకోక పోవడమేమి? ఏ రాత్రి? ఏం జరిగింది?' వంటి ప్రశ్నలతో మున్న కుతూహలం మాయమై చూపు వినికిడి స్పర్శ కోల్పోయి మంచం మీద కూచున్నచోటే పక్కకు ఒరిగి పోయింది సీతారావమ్మ. నారాయణ జనం ఆవిడ చుట్టూ మూగారు.

* * *

'బెంజిమేనన్నకు జోహార్లు', కామ్రెడ్ ప్రకాశ్‌రావు ఆశయాలను కొనసాగిస్తాం', 'రవీ నీవు అస్తమించినా మళ్ళీ ఉదయిస్తావ్' 'ప్రజా యుద్ధ వీరుడు ప్రకాశ్‌కు అరుణారుణ జోహార్లు'... అంత్యక్రియల కోసం వేలాదిగా తరలవచ్చిన జనం గుండెల మంటల జ్వాలల ఎర్ర జెండాలు, బేనర్‌లు ఊరంతా పరుచుకున్నాయి. నినాదాలు పాటల హోరుతో ప్రకాశ్‌రావును సాగనంపుతున్నారు.

టీవీ ఛానెళ్ళముందు పత్రికా విలేఖరుల ముందు రాష్ట్ర అంతర్‌రాష్ట్ర ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతుంటే రంగయ్య దుఃఖం మాయమై కించిత్ ధిక్కార గర్వం గాంభీర్యం చోటు చేసుకున్నాయి. చేతిలో కుండతో హుందాగా నడుస్తున్నాడు. యంత్రం లాగా నడుస్తున్న సీతారావమ్మకు అప్పుడప్పుడే స్పృహ వస్తోంది.

ఆకాశంలో సూర్యుడూ మనాదిలో ఉన్నాడేమో మబ్బుల దుప్పటిలో ముడుచుకున్నాడు.

అంత్యక్రియల చివరి ఘట్టం వద్ద వక్తలు మాట్లాడుతుంటే 'మన కాపురం సార్థకమయ్యిందే సీతా నీవు వీరమాతవే' భుజం మీద ఒరిగిన భార్య తల నిమిరాడు రంగయ్య.

చెట్లకొమ్మల రెమ్మల ప్రకృతి పడకమీద, మరుసటి రోజు నుండి జనం మస్తిష్కాలలోనికి సాగించవలసి ప్రయాణం కోసం అలసట తీర్చుకుంటున్నాడు బెంజిమేన్, రవి, మధు అలియాస్ ప్రకాశ్‌రావు.

'ఆగండీ' ఆర్తనాదం వంటి కేకతో పాటు ఏడుపులూ విని అందరూ రోడ్డువైపు చూపులు మరల్చారు. టాటాసుమో దిగి పరుగు వంటి నడకతో శ్రీనివాసరావు. భార్య కూతురు అల్లుడితో సహా.

శ్రీనివాసరావు రాక కొందరికి ఆశ్చర్యం కల్గించింది.

మేనల్లుడిని చివరిసారిగా చూస్తానని అతనూ, బావను చూస్తానని శ్రీలత పట్టుబట్టడంతో పైన కప్పిన కట్టెలు తొలగించక తప్పలేదు. తండ్రీ కూతుళ్ళిద్దరూ ప్రకాశ్‌ను కావిలించుకొని భళ్ళుమన్నారు. చితిమీద ఒరిగిపోయారు. చితినుండి బలవంతంగా వాళ్ళను దూరం తరిలించారు. సామినేని రంగయ్య కొడుకు చితికి నిప్పంటించాడు.

మాఘ బహుళ మేఘాలు టపటప కన్నీళ్ళు రాల్చాయి.

పడమటి కొండల్లో ఎర్రగా సూరీడు - కట్టెలలో ఎర్రగా ప్రకాశ్ మండుతూ భూమిలోనికి కరుగుతున్నారు.

* * *

ఇంటి ముందు శామియానా కింద కుర్చీలల్ల సొమ్మసిల్లి కూలబడ్డారు బంధువులు మిత్రులతో సహా రంగయ్య సీతారావమ్మ నారాయణలు.

'నారాయణన్నా వీళ్ళంతా ఏంటో అంటూ ఏడుస్తున్నారు. వాన్కి అన్నం బెట్టె అవకాశం నీకు దక్కిందని ఈయన, వానివల్ల అన్నం దింటున్నమని జనం, తన బిడ్డ కాపురం నిలబడిందని వాడు శ్రీనివాస్... ఏమిదంత ఏమి అర్థమైతలేదు!'

'ఒక రోజు...' నారాయణ సార్ చెబుతుండగా 'మీరాగండి మాస్టారు నన్ను చెప్పనివ్వండి' అడ్డు తగిలాడు సీతారావమ్మ తమ్ముడు శ్రీనివాసరావు. 'నా గుండె బరువు దించుకోనివ్వండి. అక్కా, మూడేండ్ల కిందట భారీ వర్షాలొచ్చి మన చెరువు కట్ట తెగిపోయింది. నీళ్ళతోపాటు ఇసుక మొరం మన్ను చెరువు కింది పొలాలన్నిటినీ ముంచి మేట వేసింది.'

'ఔను అంతకుముందు ఆ చెరువు కట్టను నీవే మరమ్మత్తు చేయించావని, అది నీవు సరిగ్గా చేయించకనే అట్టయిందని రైతులంత గోలచేస్తే నీవే మేట దీపిస్తివి. మళ్ళీ ఆ చెరువు కట్టను బాగ చేయిస్తివి!'

రైతులు అడిగారనో అరిచారనో వాళ్ళ మీద ప్రేమతోనో తన తప్పు తెల్సుకొనో అంత సులువుగ నీ తమ్ముడు చేయించలేదు ఒదినమ్మగారూ' శ్రీనివాసరావు భార్య పద్మ కల్పించుకున్నది.

"నీవాగవే నేను ఉన్నదున్నట్టు సరిగ్గా చెబుతా" భార్యనాపి తనే కొనసాగించాడు. "ఔను రైతులు ఎంతడిగినా నేను పట్టించుకోలేదు. బావగారు కూడా చెప్పారు. 'అది ఊరి వాళ్ళందరి డిమాండ్ ఏళ్ళ తరబడి పోరాటం వల్ల మంజూరీ చేయించుకున్నది మంచి గుండదురా ఒక్క కాలంగుడ బోలే ఒక్క పెద్దవానే అనుకో - పోయింది. యాభై లక్షల రూపాలు. చేపెయ్యడం నీ ధర్మం' అని. నేను వినలే. ఒకరోజు నేను హైదరాబాదుకు పనిమీద పోయిన్నాడు దళంతో నాయింటికొచ్చిండట. రాతిరి ఎనిమిది తొమ్మిది గంటలకే. ఆ రోజు ఎంత రేతిరయినా తప్పక ఒస్తానని

చెప్పినట్లున్నరు. అంత వరకు షెల్టర్ దీస్కొటాన్కి మేస్త్రారింటికి పోయినట్లున్నడు. తర్వాత అది లీకయ్యి మాస్టర్ పోలీసుల చేతిల వడ్డడు. ఒంటిగంట ప్రాంతల నేనింటికొచ్చిన. అప్పుడు మా యింటికొచ్చారు. వాకిట్లోనే పంచాయితీ పెట్టారు. అప్పుడు వచ్చింది ప్రకాశనిగాని బెంజిమేననిగాని నాకేగాదు జనాలకు గుడ దెల్వదు. మహా అయితే మనూరి లేదా పక్కూరి మిలిటెంట్లుగా వొచ్చని మొండికేసిన. 'అన్నా ఈయన ఇట్ల ఇనేటట్లు లేడన్నా ఇంకో లాగ జెప్పాలె నీవు సరే అను.' అనటంతో ఒచ్చిందెవరో పెద్ద క్యాడరే అని కొద్దిగా భయమై 'నా పొలాలల్లగుడ ఇసుక మేట వేసింది నేనెవ్వన్కి జెప్పుకోవాలె. సరే మల్ల మంజూరు జేయించుకొని కట్ట బాగుజేయిస్త కని మేటదీయించుడు నా పనిగాదు ఎవ్వరిది వాళ్ళే.' అన్న 'నీకు వ్యవసాయమెందుకు శ్రీనివాసరావుగారూ' అప్పుడు నోరు విప్పాడు వాడు అదే బెంజిమేను.

'వ్యవసాయమెందుకా నాకు మరేందింట ఏం జేసి బతుకుతనన్కుంటాంఢ్రు.'

'కంట్రాక్టులల్ల ఒచ్చిన అదే దొబ్బిన పైసలే గద హైద్రబాదు శివార్లల్ల పనిజేస్తున్న నీ ప్రాక్లెయిన్లు, బుల్‌డోజర్లు అయ్యి తవ్వి తెచ్చే మన్ను దుబ్బరాళ్ళు జాలు నీకు నీ తర్వాత మూడు తరాలకు' ఒక దళ సభ్యుడు అన్నడు. తర్వాత ప్రకాశందుకున్నడు. 'ఇక్కడ ఎవరి చెవులల్ల పూలు లేవుగని మాకు టైము లేదు మర్యాదగ చెప్పిన పని జేయి.' సంభాషణలను దృశ్యాన్ని వర్ణించి చెబుతున్నాడు శ్రీనివాసరావు ఆ విధంగా బరువుదించుకుంటున్నాడు. అభిమానాన్ని పోగుచేసుకుంటున్నాడు.

'ఏం బెదిరిస్తాంఢ్రా ఏం చేసుకుంటారో చేసుకోండి అన్నెకరాలల్ల మేట దీయించుడయితె నా నుంచి గాదు' అని నేననడం తోటే తలెత్తి నా ఎన్క నిలబడ్డ దళ సభ్యుని వైపు చూశాడు ప్రకాశ్ అంతే వాడు కప్పుకున్న దుప్పటిని తొలగించి ట్రీనాట్ త్రీ తుపాకీ మడమతో కుర్చీల గూచున్న నా జబ్బ మీద గుద్దిండు. నేను ముందుకు నేల మీద తూలిపడ్డ. ఎడమచేత్తో ఆగమన్నట్లు సైగచేసి బాడ్లో దోపుకున్న పిస్తోల్ దీసి 'శ్రీనివాసరావుగారూ అంటుండగా నీ మర్దలూ శ్రీలత అడ్డం బడ్డరు. 'నేను పీపుల్స్‌వార్ జోన్ కార్యదర్శి బెంజిమేన్‌ను. మల్ల జెప్తుండ. చెర్వుకట్ట ఒక్కటి జేపిస్తనంటె కుదరదు. అదిగావాలె ఒచ్చే పునాసకల్ల చెర్వుకింద పొలాలన్ని ఎప్పట్లాక గావాలె. పునాసనాట్లువడాలె' అని హెచ్చరించి పిస్తోల్ బొడ్ల దోపుకుని పదండి పోదాం అని దళంనాజ్ఞాపించాడు. శ్రీలత వైపు తిరిగి 'సీలూ మీడాడీకి జెప్పు ఇంకోసారి మేమొచ్చే అవసరం వస్తె ఊకెపోము' అన్నడు. సీలు అన్న పిలుపుతో అప్పుడే అది మేము అందరం షాకైనం. సీలు తేరుకొని బెంజిమేను ముఖంలకు సూటిగ జూస్తా 'నీవు ప్రకాశ్ బావవేనా' అడగటంతోనే పొరబడ్డానని గ్రహించాడేమో మౌనంగా ఉండిపోయాడు. వెంటనే అది వాని కాళ్ళను చుట్టేసుకొని భళ్ళుమంది. దాన్ని లేపి మీడాడీని చెప్పినట్లు ఇన్పియండి. ఇప్పుడేం చేయము ఇంకోసారొస్తె ఇట్ల హెచ్చరించి పోము' అంటూ కదులుతుండగా పద్మ అందుకున్నది 'దాన్ని దాని మొగుడు ఒకటే హింసిస్తాండు - ఒకసారి కట్నం సాలదు మరొకసారి అందంగలేవని ఇట్ల పదేన్రోజులకో సారి ఇంటికి పంపుతాండు విడాకులిస్తానంటాండు' మల్లనేనే కల్పించుకొని 'ఇది వరకే పదిలక్షలు ఒప్పుకొని ఇర్వయిలక్షలిచ్చిన. ఇంకా సాలదంటున్నడు. 'ఔ అడ్గితే తప్పేంది కాంట్రాక్టర్ మామంటె పైసల ఊటంటని అడ్గుతాండు' అని ఒక దళ సభ్యుడు 'మరి చెర్వుకట్టకు మంజూరైన యాభైలక్షలల్ల ఇరవై లక్షల పని జేపిచ్చింటవ్. మిగిల్న ముప్పయెక్కడ వోయినయ్' ప్రకాశడిగాడు. 'కావొచ్చు అన్ని నాకే చెందినయా సాంక్షన్ జేయించిన మంత్రాకాన్నించి పీడబ్ల్యుడి డిపార్ట్‌మెంటోల్లు ఎమ్మెల్యే పర్సెంటేజిలు ఎమ్పీపీలు అందర్కింత జెందుతది. అవన్నీ ఇప్పుడొస్తయా' అన్న.

'మల్ల సాంక్షన్ జేపిచ్చుకో ఒద్దన్నోలెవరు ఈసారి అస్సలు పనికి నాల్గింతలు జేపిచ్చుకో ఆ ఒక్కింత సరిగ జేయి' అని కింద కాళ్ళ కాడ నేల మీద గూచున్న శ్రీలతను చేయి బట్టుకొని లేపుత 'లేవు లేవు సీలు నీకేం గాదులే అంత కుదుర్కుంటది నేన్జూస్త ధైర్యంగుండు.' శ్రీనివాసరావు గొంతు బొంగురుపోయింది. భార్య పద్మ అందుకున్నది 'దాన్ని నా సేతుల వెట్టి నీవు రంధి పడకత్తా సీలు కాపురం మంచిగైతది అన్కుంటు దళాన్నెంబడించుక పోయిండు..." ఏడుపు తన్నుకరావడంతో సీతారావమ్మ ఒడిలో ఒరిగిపోయింది.

'వాడి హామీతో గుండెల మీద నుండి గుట్ట దించినంతపని అయింది. నాలోపల పెత్తందారు పూర్తిగ మాయమైండు. మర్సటి దినం నుండే పనిలోన్కి దిగిన.

'ఇక మీరాగండి మామగారు' కార్తీక్ కల్పించుకున్నాడు 'నా బరువూ కొద్దిగా దించుకోనివ్వండి' అంటూ మొదలు బెట్టాడు.

'పోయిన సంవత్సరం ఫిబ్రవరి మొదటి వారంల నా వద్దకు ఒక లేడి ఒక జెంట్ వచ్చారు. శ్రీలత విషయం ప్రస్తావించారు. అది అడగడాన్కి మీరెవ్వరు మీకేమవసరం అన్న. సాటి మనుషులం అని చెప్పి నచ్చజెప్పే ప్రయత్నం చేయబోగా మాటలకు సందీయలేదు దాంతో వాళ్ళూ కొద్దిగా కఠినంగానే 'మాకేమవసరం లేదు మా బెంజిమేనన్నకవసరం'.

'బెంజిమేనెవడు వానికే..' అంటుండగానే 'మావోయిస్టు బెంజిమేన్‌గాఒచ్చని గుర్తుకొచ్చి అడిగిన. 'ఆయనకేమవసరం!'.

'బెంజిమేన్ అలియాస్ ప్రకాశ్‌రావు శ్రీలతక్క మేనబావ. అక్కని దెచ్చుకొని మర్యాదగ మంచిగ కాపురం జేయి. మల్ల పైసలు గియిసలు అన్నవంటె బేకారయితవ్' అంటూ లేచి పోతూ 'ఇప్పుడు అన్న జెప్పిరమ్మన్నడు. అంతే! జెప్పిపోతున్నం. చెప్పిన పని జేయకుంటె అన్న ఏమన్న జేసిరమ్మంటె అప్పుడు చెయ్యనీకె ఒస్తం. ఇగమల్ల మల్ల జెప్పుడు ఉండదు. అటెంక నీయిష్టం' అంటూ బైటకు అడుగేస్తుంటే ఆగమని ఆపాను...' అది వరకు తమకు కూడా చెప్పని విషయాలను ఆసక్తిగా వింటున్నారు శ్రీనివాసరావు పద్మ దంపతులు.

'నేను రియలెస్టేటు వ్యాపారంలో నిండా మునిగిపోయి పాట్నర్ల చేతుల్ల ఎట్లా ఇరుక్కుపోయింది చెప్పాను అడ్రస్‌లు

కథ

ఓ పగ్ని కథ

- ఎన్.డి.

ఫార్మేషన్‌లో నడుస్తుందన్న మాటే గానీ మీన మనసంతా ఆ రోజు ఉదయం రాజేష్‌నుండి వచ్చిన ఉత్తరం మీదే ఉంది. శత్రువు కదలికలు తక్కువగా ఉన్న ఏరియా కనక మీనకి ఆలోచనల్లో మునిగిపోవడానికి కొంత వెసులుబాటుగా ఉంది. అడుగు వెంబడి అడుగు యాంత్రికంగా పడుతోంది. సాధారణంగా అప్పటివరకూ జరిగిన సమావేశాన్ని సమీక్షించుకుంటూనో, వెళ్లే ఊరిలో జరపాల్సిన కార్యక్రమం గురించో ఆలోచిస్తూ పరిసరాలు గమనిస్తో నడవడం అలవాటు మీనకి. కానీ ఈ పూట ఆమె కళ్ల ముందు ఒకటే రూపం కదుల్తోంది.

పగ్ని

పగ్ని ఊరు ఉండిన దళం ఏరియాకు మీన బదిలీ కాగానే కమాండర్ సన్ను ఆమెకు ఒక పరిచయం లాగ ఏరియా విషయాల్ని చెప్పి ఉన్నాడు.

అప్పటికి దళం కొత్తగా వచ్చి తిరగబట్టి ఏడాది అవుతోందట. డిఏకెఎంఎస్ సంఘాలు అప్పుడప్పుడే ఏర్పడుతున్నాయిగానీ కెఎఎంఎస్ సంఘాలు ఇంకా మొదలు కాలేదు. ఆ ఊరికి దళం వెళ్లినప్పుడు మైని, ఇంకొందరు యువతులూ వచ్చేవాళ్లు. తర్వాత బంద్ అయింది. ఎందుకు అని అడిగితే ఊరు పెద్దలు 'మీరు విడిగా దళం దగ్గరకు పోకండి, మాతో పాటే రావాలి, మాతో పాటే వెనక్కి రావాలి గానీ విడిగా దళంతో ఉండద్దు' అన్నారట. విషయం తెలిసి సన్ను ఊర్లో మీటింగ్ చేసి అర్థం చేయించాక మళ్లీ రావడం మొదలైందిట.

ఆ తర్వాత కొన్నాళ్లకే మైని తనను ఎత్తుకుపోయిన వారినుండి పారిపోయింది. 7, 8 ఊర్ల వాళ్లను పిలిచి పెద్ద పంచాయితీ చేశారు. అంత పెద్ద పంచాయితీ దళం వచ్చాక చేయడం మొదటిసారి. చాలాసార్లు మహిళల సమస్య మీదనే ఏరియాల్లో ఇలాంటివి మొదలు కావడం యాదృచ్ఛికం కాదనీ, ఆదివాసీ సమాజంలో తెగ పెద్దల పెత్తనానికి బలైతున్న ఆదివాసీ స్త్రీలకు అండగా నిలవడం వల్ల అనేకచోట్ల ఇదే జరిగిందనీ మీనకి దండకారణ్యానికి వచ్చిన కొద్ది రోజులకే అర్థమైంది. మైనీ, పగ్నిలు మైనిని బలవంతంగా ఎత్తుకుపోయిన వాళ్లను కసిదీరా కొట్టారట.

'అక్కా, నువ్వు ఆ రోజు ఉండనుంటివి. వాళ్లలో ఎంత కసి అనుకున్నావ్. పెద్దలు కూడా ఇక కిక్కురుమనలేదు. మొత్తం ఏరియా మీద ప్రభావం పడింది. ఇక అక్కల సంతోషానికైతే హద్దే లేదు. ఏ ఊరుకు పోయినా పెద్దెత్తున రావడం మొదలైంది. ఒక ఊపు ఊపిందనుకో వీళ్ల పోరాటం' మీన స్త్రీల విషయంలో ఎక్కువ స్పందిస్తుందని తెలిసి ఆ పంచాయితీనీ, ఆ ఇద్దరి వ్యక్తిత్వాన్నీ కళ్లకు కట్టాడు సన్ను.

'సన్ను చెప్పింది నిజమే. ఆ రోజు తను ఉండాల్సింది. పితృస్వామ్యం సంకెళ్లు తెగిపడ్తున్న ఆ చప్పుడును వీనులవిందుగా విని ఉండేది. తన చదువు మాన్పించి మేనరికం చేసుకోవాలని బలవంతం చేసినవాళ్లని తను ఇలా పంచాయితీ పెట్టి ఎదిరించగలిగిందా? ఇక్కడ ఆదివాసీ యువతులకు ఎంత గొప్ప అవకాశాలు దొరుకుతున్నాయి!' అప్పటి తన భావాలన్నీ గుర్తుకొచ్చాయి మీనకి.

సన్ను చెప్పింది విన్నాక ఆ ఊరికెప్పుడు వెళ్తామా, వాళ్లనెప్పుడు పరిచయం చేస్కుంటానా అని మీన ఎదురుచూసింది. ఆ రోజు త్వరలో రానే వచ్చింది

'అక్కా! నేను నిన్న చెప్పింది ఈమె గురించే, గుర్తుంది కదా' అడిగాడు సన్ను మైని కేసి చూపిస్తూ. మీన చిరునవ్వుకు మైనీ చిరునవ్వు నవ్వింది.

'దళంలోకి వచ్చేస్తావా అయితే? కొన్నాళ్లుండి గ్రామంలో మహిళలందర్నీ నీలాగ ధైర్యంగా తయారు చేసి వస్తే మంచిది కాదా?' అడిగింది మీన.

'ఏం కాదు, నేను దళంలోకి వచ్చేస్తాను, పగ్ని గ్రామంలోనే ఉండి అక్కల్ని సంఘంలో నడిపిస్తుంది' అంది మైని ధీమాగా.

తీసుకున్నరు. వాళ్ళ దగ్గరకెప్పుడు పోయారో ఏం జెప్పారో పదిరోజుల్లోనే నా పాట్నర్లు నా వద్దకు వచ్చి అది వరకు నష్టాలు చూపించి నోళ్ళు నాకే కొంత ఎదురిచ్చి నీ ఒద్దు నీ పాట్నర్‌షిపొద్దు అని అంతానాకనుకూలంగానే సెటిల్ జేసుకున్నారు. నేనూ ఆ రూట్‌ను శాశ్వతంగా వదులుకున్న. తాగుడు బంద్ జేసిన. అన్న పుణ్యమా అది వేరే చిన్న వ్యాపారం చేస్తా ప్రశాంతంగా ఉన్న' ముగించాడు.

'రంగయ్య బావగారూ ఆ రోజు రాత్రి మీ ఇంటికొస్తె ఇన్‌ఫార్మర్ల నివహా ఉంటదని రాలే తనకు చావులేదని అమ్మనాయినలను ఆందోళన పడొద్దనీ చెప్పమన్నడు.' నారాయణ సార్ అంటుండగా వెక్కిళ్ళు విన్పించి సీతారవమ్మవైపు చూశారందరు. అక్కడే ఉన్న ఒక మాజీ పాటందుకున్నడు.

ఎండిపోయిన రైతుగుండెకూ - మీరు కుండలల్ల మెతుకులైనరూ... ... ... మీ త్యాగం ఉన్నతమైనదీ అది హిమశిఖరాల వంటిదీ'

☆

ఆమె గొంతులో తనను తీసుకోక తప్పదు అనే భావం బలంగా.

'పార్టీ చెప్పినట్టు చేస్తానన్నావు కదా, మరి ఈ మాట వినవా?' బనాయించింది మీన.

'ఏదన్నా వింటాను, ఇదొక్కటీ మీరు వినండి' మైని కూడా తగిన సమాధానం ఇచ్చానన్నట్లుగా.

'మరి పగ్ని కూడా వస్తానంటుందేమో, మీరిద్దరూ ఎప్పుడూ కలిసే అన్ని పన్లూ చేస్తారని సన్ను చెప్పాడే'

'అవును, చిన్నప్పటినుండి మేమిద్దరం జట్టే. సంఘంలోకీ ఇద్దరం అనుకునే వచ్చాం. దళంలోకి వచ్చే విషయం కూడా ఇద్దరం మాట్లాడుకున్నం. తను మీరు ఎట్లా చెప్తే అట్లా చేస్తానంది. నేను వెళ్తా అంటే కూడా మంచిదే అన్నది'

'చూడు మరి పగ్నినే పార్టీ మాట వింటోంది, నువ్వు వినడం లేదు'

'పగ్ని ఎట్లయినా చాలా మంచిదే, అక్కలందరికీ ఎంతో అభిమానం, మంచిగా నడిపిస్తది సంఘాన్ని'

ఇంకా తనని సందేహంలో పెట్టడం ఎందుకని 'నిన్ను ఇవాళ దళంలోకి తీసుకెళ్లాలనుకునే వచ్చాం' అని చెప్పేసింది మీన.

మైని సంతోషం స్పష్టంగా కన్పిస్తూనే ఉండింది. వెంటనే పగ్ని దగ్గరకు ఉరికింది. వాళ్ల స్నేహం చూసి ముచ్చటపడకుండా ఉండలేకపోయింది మీన. అలా మైని ఆ ఏరియాలో రిక్రూట్ అయిన మొదటి మహిళా కామ్రేడ్ అయింది.

పగ్నిని మొదటిసారి చూసినప్పటి ఆ రూపాన్ని మీన ఎప్పుడూ మర్చిపోలేదు. ఎంతమంది ఉన్నా చటుక్కున ఆకర్షించే మనిషి కాదు పగ్ని. చిన్నవైనా చురుకైన కళ్లు, ముఖాన్ని వెలిగించే చిరునవ్వు, కొద్దిగా రింగులు తిరిగిన జుట్టు, నుదిటిపై పచ్చబొట్టు, మరీ పొట్టి, మరీ పొడవు కాకుండా ఎత్తుకు తగ్గ లావు, నలుపు వైపుకే మొగ్గే శరీర ఛాయ. గలగలపారే సెలయేరులాంటి, దూకే జలపాతం లాంటి చురుకుదనం, చలాకీదనం లేదు. చురుకుదనం అంతా ఆమె కళ్లల్లో ఉండింది. తర్వాత ఆమె ఆలోచనల్లోని చురుకుదనం అర్థమైంది. 18 ఏళ్లు కూడా నిండని పగ్నిలో ఒకలాంటి గాంభీర్యం ఉండేది. ఆత్మవిశ్వాసం ఉండేది. గ్రామంలో సభ పెట్టి మీ సంఘం అధ్యక్షురాల్ని ఎన్నుకోండి అంటే ఆమెనే ఎన్నుకునే లాంటి నాయకత్వ లక్షణం ఉండింది.

'మన వాళ్లు దొడ్డికి పోతామంటున్నరు, కాస్సేపు ఆగుదాం' కమాండర్ మాటతో ఈ లోకంలోకి వచ్చిన మీన కిట్టు దించి చెట్టుకు ఆనుకునింది. ఆమె గార్డు కూడా 'పోతా' అంటే పొమ్మనింది.

రిక్రూట్ అయిన కొద్ది రోజులకే పార్టీ అవసరాల రీత్యా మైని వేరే దళానికి వెళిపోయింది. మైని స్థానంలో కెఎఎంఎస్ అధ్యక్షురాలిగా ఎన్నికైన పగ్నితో మీన అనుబంధం మాత్రం కొనసాగింది. బ్యాక్ పోచ్ ముందుకేసుకుని కూర్చున్న మీనకి పగ్ని ఫొటో తన దగ్గర ఉండాలని గుర్తుకొచ్చి తీసి చూసింది. మీనకి ఎవరివీ ఫొటోలు ఉంచుకునే అలవాటు లేదసలు. తన సహచరుడు కిరణ్ ఫొటోనే ఉంచుకోదు. 'మనసంతా నిండిన రూపానికి మళ్లీ ఫొటో ఎందుకు' అనేది కిరణ్ పెట్టుకోమన్నా కూడా. కానీ పగ్ని ఫొటో, సిఎన్నెం డ్యాన్సు చేస్తున్న పిల్లల ఫొటో మాత్రం చాలా నచ్చి ఉంచుకుంది. పగ్ని విడిగా ఫొటో కోసం ఫోజు ఇచ్చినది కాదది. మీటింగ్‌లో ఆమె మాట్లాడుతున్నప్పటిది. ఒక అమాయక ఆదివాసీ మహిళ ఆ చుట్టుపక్కల గ్రామాల్లో డిమాండ్ ఉన్న వక్తగా మారిన తీరును ప్రతిబింబించే ఫొటో అది. ధాటీగా ఒక చేయి పైకెత్తి తను చెప్పాలనుకున్న విషయాన్ని నొక్కి చెప్తున్నప్పుడు దళం వాళ్లే ఎవరో తీశారు. కిరణ్ రాసిన ఉత్తరాలు ఉంచుకున్న కవర్‌లో ఉండిచ్చు అని గుర్తుకొచ్చి చూస్తే నిజంగానే వుందది. నాలుగేళ్ల క్రితం తీసినది. తమ ఏరియాలో వేరే ఊర్లకు కూడా వెళ్లి ఉపన్యాసాలు ఇచ్చిన మొదటి మహిళ పగ్నినే. ఆ తర్వాత ఇంకొందరు వక్తలుగా ఈ రోజు తయారయ్యారంటే ఆమె ఉత్తేజం కూడా ఒక కారణం కదూ. అదొకటేనా, ఏరియాలో ఎన్ని విషయాలకు తను ఆద్యురాలు!

దొడ్డికి పోయిన వాళ్లు రావడంతో తిరిగి నడక మొదలైంది. మీన ఫొటోనీ, ఆలోచనల్నీ కూడా లోపల పెట్టేసి బైల్దేరింది. ఊరిలో కొచ్చి ఆగారు. అందరూ సంతోషంగా చేతులు కలిపి లాల్‌సలాం చెప్పసాగారు.

'దీదీ, చైతు వాళ్ల ఇంటి దగ్గరే ఆగుదాం' అంది సరిత మీన దగ్గర కొచ్చి.

'సరే, మనం అనుకున్న అన్ని మీటింగులూ చేసేవరకూ మూడు రోజులైనా పడ్తుంది కనక అదే మంచిది. అయితే మంగ్లీ బాలింత. మనమే అన్నీ చేసుకోవడమే కాక ఆమెనూ చూసుకోవాలి. ఆ విషయం కూడా సభ్యులకు చెప్పు' అంది మీన.

'ఇంగో' అని రోల్‌కాల్ చేసి, కవర్స్ చూపించి చేయాల్సిన పనులూ, తాము వచ్చిన పనీ అన్నీ చెప్పింది సరిత. అందరూ ఎవరి పనుల్లోకి వాళ్లు వెళ్లారు. సరిత చాయ్ పెట్టడంతో తాగి, మీటింగ్‌లో చెప్పాల్సిన అంశాల్ని అనుకున్నారు. సభ్యులందరూ రావడానికి ఇంకా సమయం ఉంది. కొందరు వచ్చిన ప్రజల్తో మాట్లాడుతున్నారు. కొందరు పిల్లల్తో ఆడుతూ పాటలు పాడిస్తున్నారు.

మీన గోడకు ఒరిగి కూర్చుని పేపర్ కటింగ్స్ తీసింది దొరికిన ఆ టైంలో చదువుదామని. పేపర్ గానీ, కటింగ్స్ గానీ దొరకడం రోజూ ఉండదు కనక దొరికినప్పుడు ఎన్ని పనులున్నా సాధ్యమైనంత త్వరగా వాటిని చదువుతూ ఉంటుంది మీన. కానీ ఇవ్వాళ కళ్లు అక్షరాల వెంబడి పరుగెడుతున్నాయి గానీ ఏవీ బుర్రకెక్కడం లేదు. దాంతో వాటిని పక్కన పెట్టేసింది.

ఇవ్వాళ వాళ్లు కలవబోయే జిపిసి (1) ఏరియాలో ఏర్పడిన నాలుగవ జిపిసి. మొదటి జిపిసి ఏర్పడింది పగ్ని వాళ్లతోనే. పగ్ని తమ ఏరియాలో మొదటి జిపిసి సభ్యురాలు. మూడు ఊర్ల పార్టీ సెల్ సెక్రటరీగా ఎదిగింది. ఆమె సెల్‌లో మిగతా ఇద్దరూ పురుషులే. కానీ వాళ్లు ఆమె నాయకత్వాన్ని హృదయపూర్వకంగా ఆమోదించేవారు. ఆమె వ్యక్తిత్వం, కలుపుగోలుతనం అలాంటిది. సెల్‌ని నడిపిస్తూనే కెఎఎంఎస్ గ్రామ కార్యవర్గాన్ని కూడా గైడ్ చేసేది. ఆమె నాయకత్వంలో ఎన్నో పోరాటాలు చేశారు. ఆ ఏరియాలో

బలవంతపు పెళ్లిళ్లు తక్కువ కావడంలో వీరి పాత్ర చాలా ఉండింది. వాళ్ల జిపిసి కొన్ని వూళ్లకు బాధ్యత వహించినా బలమైన సంఘాలు ఉన్న వూళ్లు కావడంతో చుట్టుపక్కల సెల్స్ లేని 10, 12 గ్రామాల ప్రజలు కూడా వీరి వద్దకు వచ్చి సలహాలు తీసుకునేవారు లేదా పంచాతుల కోసమో, పోరాటాల కోసమో, సభల కోసమో తీసుకెళ్లేవారు. దళం చాలా అనేక పనుల్లో తలమునకలుగా ఉండి అన్ని గ్రామాలనూ అందుకోలేకపోయినప్పుడు వీళ్లే వారితోనూ సంబంధంలో ఉండేవారు.

ఆ ఊర్లల్లో పగ్ని నాయకత్వంలో పోరాటాలెన్నో జరిగాయి. పగ్ని ఎక్కువ మాట్లాడేది కాదు సమావేశాల్లోనైనా. కానీ మాట్లాడిన కొన్ని మాటలూ తనకు స్పష్టత ఉన్నవే అయి ఉండేవి. ఆ సూటిదనం, ఇతరులు మాట్లాడేదాన్ని శ్రద్ధగా వినడం, పోరాటాల్లో ముందు ఉండిడం లాంటి లక్షణాలన్నీ ఆమెను ప్రజలకు దగ్గర చేశాయి.

పగ్ని వయస్సు వాళ్లు జతగాళ్లని వెతుక్కుంటున్నారు. పగ్నిని కూడా జిపిసి సభ్యురాలిగా తీసుకున్నాక మీననే పెళ్లి గురించి కదిపింది. అప్పటికి వాళ్లిద్దరి మధ్యా కలిసి పని చేయడం నుండి ఏర్పడే ఒక గాఢమైన అనుబంధం, స్నేహం ఏర్పడి ఉన్నాయి. తనకి నచ్చినవాళ్లు ఎవరూ లేరనీ, వుంటే చెప్తాననీ అంది పగ్ని. అప్పటికే మిగతా చోట్ల ఎదురైన అనుభవాలనుండి మీన రెట్టించి కూడా అడిగింది. పార్టీ నియమాలూ చెప్పింది. కానీ నిర్మలమైన కళ్లతో పగ్ని అదే చెప్పింది. అప్పటికి అదే నిజం కూడా.

పగ్ని పూర్తికాలం రావడానికి సిద్ధంగా ఉన్నట్లు ఉండేది కనక కూడా మీన ఆమె తనకి తగని వ్యక్తిని ఎక్కడ ఎంచుకుంటుందోనని కూడా శ్రద్ధగా అడిగింది. ఆమెకున్నంత నిబద్ధత అతనికి లేకపోతే కష్టమౌతుంది. అలా కొందరు చురుకైన అమ్మాయిలు ఇంటికి పరిమితమైపోవడం అరుదుగానైనా జరిగింది కనక జాగ్రత్తగా ఉండాలని మీనకి ఉండేది.

ఆ తర్వాత మీన జిల్లా కమిటీ సభ్యురాలిగా ఎన్నికవ్వడంతో తీరిక లేకుండా అయిపోయింది. పగ్ని వాళ్ల ఊరు కేంద్రంగా ఒకప్పుడు దళం పని ఉండేది. క్రమంగా ఉద్యమ ప్రాంతం విస్తరించింది. కొత్త దళాలూ ఏర్పడ్డాయి. దాంతో మీన పగ్నిని కలిసే సందర్భాలు తక్కువైనాయి. అయినా కలిసినప్పుడు ఎప్పుడైనా కామ్రేడ్లీ సంబంధాలు వారి మధ్య గుబాళించేవి. పగ్ని వ్యక్తిగత జీవితం గురించి ఆ రోజుటి సంభాషణ తర్వాత మళ్లీ ఎప్పుడూ ప్రస్తావించే అవకాశం కలగలేదు మీనకి.

'తను పొరపాటు చేసిందేమో, మళ్లా కొద్ది రోజులకు పగ్నితో మాట్లాడాల్సిందేమో' మీన ఏ వెయ్యోసారో తనని తాను నిందించుకుంది. అన్ని విషయాల్లో ముందు ఉంటూ పార్టీకి గొప్ప ఆశాకిరణంగా ఉండిన పగ్నీ ఈ విషయంలో ఎందుకు కాసుకోలేకపోయింది? అమాయకత్వమా? బలహీనతా?

సుదురుని మీన రెండు, మూడు సందర్భాల్లో కలిసింది గానీ అంతగా గుర్తు లేదు. అయితే 'సంఘటన' జరిగిన రోజు చూశాక గుర్తుపట్టింది. పగ్నికంటే నాలుగైదు ఏళ్లు పెద్దవాడే. మనిషి చక్కగా ఉంటాడు. కానీ బాగా తాగుతాడు. సంఘం సభ్యుడు. అన్ని కార్యక్రమాలకు తప్పక హాజరయ్యేవాడు. అతని లోపాల్ని పోగొట్టి పార్టీ సభ్యుడిగా ఎదిగించుకోవచ్చు అనే అంచనా కూడా ఇచ్చారట అక్కడి సెల్ సభ్యులు.

పగ్ని ఏం చూసిందతనిలో?

పెళ్లి విషయంలో అంత స్పష్టంగా మాట్లాడిన పగ్ని కొద్ది నెలల్లోనే ఎలా లొంగిపోయింది? తామే ఆమె అంతరంగాన్ని కొలవడంలో పొరపాటు పడ్డామా? తోడు కోసం ఆమె మనసు పడిన ఆరాటాన్ని ఎవరం గమనించలేకపోయామా?

'లాల్‌సలాం', పాండు గొంతు విని ఈ లోకంలోకి వచ్చింది మీన. జిపిసి సభ్యులందరూ వచ్చేశారు. అందరూ లాల్‌సలాం చెప్పుకుని చేతులు కలుపుకున్నారు.

'మనం ఏకంగా తిని కూచుందాం. వీళ్లు తినే వచ్చారు. ఈలోపు జిపిసి వాళ్లు ఊరు వాళ్లతోనూ మాట్లాడ్తారు'. ఊరివాళ్లూ తమ నాయకులైన ఆ జిపిసి సభ్యులతో మాట్లాడాలని చూస్తూ ఉంటారని తెలిసిన సరిత అంది.

అన్నాలు తిని కూచున్నారంటే మధ్యలో ఓ గంట సేపు తప్ప రాత్రి వరకూ సమావేశం కొనసాగించారు. చిన్న, చిన్న పనులు చేసుకుని తిని పాలిథీన్ మీద వాలేవరకూ 11 కావొచ్చింది. దళం సెంట్రీనే కాక మిలీషియా సెంట్రీ కూడా నడుస్తోంది. నిద్రలో సునీత కప్పుకున్న దుప్పటి పక్కకు పోతే తీసి మంచిగా కప్పింది మీన. తన కళ్లు మాత్రం పత్తికాయల్లా విచ్చుకునే ఉన్నాయి. పగ్ని గురించిన ఆలోచనలు మది నిండా అలుముకున్నాయి.

సుదురు కూడా పగ్నికి వరసకు అన్న అవుతాడు. రోజూ సాయంత్రం ఆమె ఇంటికి వెళ్లి ముచ్చట్లు పెట్టేవాడు. తాగేవాడు. క్రమంగా కలిసి తాగడం మొదలు పెట్టారు. పగ్ని తల్లిదండ్రులకూ, చుట్టుపక్కలవాళ్లకూ వారి మధ్య పెరుగుతున్న చనువు అనుమానాలకు దారి తీసింది. ఇంట్లో కాక ఖేతుల్ వద్ద కలవసాగాడు. ఆ క్రమంలోనే ఎప్పుడో ఒక రోజు సంబంధాలు కూడా పెట్టుకున్నాడు.

తప్పు జరిగాక కూడా పగ్ని దాన్ని తమకెందుకు చెప్పలేదో? గ్రామ ప్రజలు ఇలాంటి సంబంధాల్ని హర్షించరు సరి కదా నరికి పోగులు పెడ్తారని కూడా తెలుసు. పార్టీ కూడా ఇలాంటివాటిని హర్షించదు అనే అంశాన్నే చూసింది గానీ ఇలాంటి సమస్యల్ని పార్టీ సహాయంతోనే అధిగమించాలనే రెండో వైపు అంశాన్ని చూడలేకపోయింది. భయపడింది. తప్పు చేస్తున్నాననే అపరాధ భావం, మరోవైపు అతనికి లొంగిపోయిన బలహీనత. పగ్ని కొట్టుకుపోయింది. ఆమెకెక్కడా పట్టు దొరకలేదు.

ఇలాంటివి గ్రామాల్లో ఎంతకాలం దాగుతాయి? నెలరోజులు కూడా కాకుండానే ఖేతుల్‌లో ఇద్దరూ కలిసి ఉండగా గ్రామస్తులు పట్టుకున్నారు. ఇద్దర్నీ కొట్టుకుంటూ తీసుకొచ్చి గ్రామంలో కట్టేశారు.

ఆ రోజుని మీన జీవితంలో మర్చిపోలేదు. ఎప్పట్లాగే ప్రేమా, ఆప్యాయతల్తో స్వాగతం పలుకుతుందనుకున్న గ్రామం ఆ రోజు తాము వచ్చినప్పుడు 'పరిచయం లేనిదిగా' మారిపోయింది.

నిర్మానుష్యంగా, అసాధారణమైన నిశ్శబ్దంతో ఉన్న గ్రామాన్ని చూసి దళానికి ఏం అర్థం కాలేదు. ఇంతలోనే

'పగ్నినీ, సుదురునీ కట్టేశారు, చంపేస్తామంటున్నారు'

పాండు ఉరికొచ్చి చెప్పిన మాటల్తో అందరూ నిశ్చేష్టులైపోయారు ఒక్క క్షణం. సన్ను అందరికంటే ముందు ఉరికాడు. అందరూ వెనకాలే ఉరికారు. అప్పటికే బాగా కొడ్తున్నారు ఇద్దర్నీ. పగ్ని శరీరం వాతలు తేలి ఉంది. సన్ను అమాంతం వెళ్లి అడ్డం నిలబడ్డాడు. దళం అంతా వాళ్ల చుట్టూ నిలబడింది. సరిత గబగబా వెళ్లి పగ్ని కట్లు విప్పింది.

మీన పగ్నినే చూస్తోంది. ఎంత నిర్వికారంగా ఉన్నాయామె కళ్లు! కళ్ల నుండి నీళ్లు కూడా కారడం లేదు. అనుభవించాల్సిందేదో అనుభవించక తప్పదు అన్నట్లుగా ఉంది. ఎన్నో పంచాతుల్లో తీర్పు చెప్పే స్థానంలో ఉండిన పగ్ని ఇప్పుడు దయనీయంగా తీర్పు చెప్పించుకునే స్థానంలో నిలబడి ఉంది.

వరసకి అన్న చెల్లెళ్లైన వారి మధ్య సంబంధం తప్పు కాబట్టి చంపేస్తాం అని గ్రామస్తులూ, తప్పు ఒప్పుకుంటే చాలని దళమూ......పెద్ద యుద్ధమే జరిగింది రెండు పక్షాల మధ్యా. ఇద్దరూ తప్పు చేసినా గ్రామస్తులు పగ్ని విషయంలో ఎక్కువ సీరియస్‌గా ఉండడం మీన దృష్టిని దాటిపోలేదు.

తమ నాయకురాలిగా ఉండి ఇలా చేసిందనా? స్త్రీ అనా?

దళం ఆ గ్రామంలో తనకున్న పలుకుబడి అంతా ఉపయోగించి నయానా, భయానా కూడా చెప్తే తప్ప గ్రామస్తులు ఒక పట్టాన దిగిరాలేదు. ఆ గ్రామం కోసం పార్టీ చేసినదంతా గుర్తు చేసి, ఇప్పుడు కూడా పార్టీ వాళ్ల మేలు కోసమే చెప్తోందనీ, చిన్న కారణాలతో చంపుకోవడం వల్ల ఉపయోగం లేదనీ అర్థం చేయించేసరికి దళం తల ప్రాణం తోకకొచ్చింది. సన్ను పెద్ద కొండ లాగా నిలబడి ఏ మాత్రం సందు ఇవ్వకుండా వాదించుకుంటూ వచ్చాడు. పగ్ని, సుదురులు తప్పు ఒప్పుకున్నారు. మళ్లీ చేయం అని హామీ ఇచ్చారు. పగ్ని అదే గ్రామంలోనే ఉంటుందనీ, ఆమెకు ఎవరూ ఏ విధమైన హానీ తలపెట్టరాదనీ పదే పదే చెప్పింది దళం.

తాము అనుకోకుండా ఆ సమయానికి రావడం ఎంత మంచిదైందోననే భావం దళంలోని ప్రతి ఒక్కరి మనస్సులో మెదిలింది. సందేహం లేదు అంబు వేసో, గొడ్డలితో నరికో చంపేసేవారే. మంత్రగాళ్లు, మంత్రగత్తెలనే పేరుతోనో, ఆచారాల్ని ఉల్లంఘించారనే పేరుతోనో ఎన్ని హత్యలు జరిగేవి! పార్టీ వచ్చాక హత్యల శాతం బాగా తగ్గినా అక్కడక్కడ అవశేషాలు ఉన్నాయనే చెప్పాలి. సాంస్కృతికంగా ఇంకా చాలా కృషే అవసరం ఉంది. ఆర్థిక జీవనంలో మార్పు రాకుండా ఇది పూర్తిగా సాధ్యం కాదని ఎన్ని సార్లు అనుకునేవాళ్లు!

పగ్నిని ఆప్యాయంగా చేతులు కలిపి, మందులు ఇచ్చి ఇంటికి పంపేశారు. ఆ స్థితిలో ఆమెతో మాట్లాడేలా లేదు. జిపిసి ఆమెను పార్టీ సభ్యత్వాన్నుండి కొంతకాలం సస్పెండ్ చేసినప్పుడు పార్టీ చర్య సరైనదేననీ, తాను తప్పును సరిదిద్దుకుంటానని మాట్లాడిందనీ సన్ను ఉత్తరం రాసిందె తర్వాత.

ప్రజలపై గ్రామ పెద్దల పట్టును దళం అంచనా వేయలేకపోయింది. చాలా విషయాల్లో పార్టీ మార్గదర్శకత్వంలో నడిచే ప్రజలు కొన్ని విషయాల్లో ఇంకా పెద్దల మాటల్నే వింటున్నారు. గ్రామంలోనే పగ్నివి ఉంచాలనే నిర్ణయాన్ని ప్రత్యక్షంగా ఎదిరించకుండా, పరోక్షంగా ఆమెకి అక్కడ ఉండడం కష్టమయ్యేలా చేశారు. పగ్ని ఊరు వదిలి ఎందుకు వెళిపోయింది అనే ప్రశ్నకు సరైన సమాధానం రాలేదు. నోటితో చెప్పకున్నా పెద్దల పెత్తనం గురించి తెలిసిన దళానికి కారణం ఊహించుకోవడం కష్టం కాలేదు.

అదే కాలంలో మీనకి వేరే చోట బాధ్యతలు రావడంతో ఈ దళం ఏరియాకు రావడం దాదాపుగా ఆగిపోయింది. ఆ తర్వాత పగ్ని గురించిన సమాచారం సన్ను లేదా రాజేష్ రాసే ఉత్తరాల ద్వారానే ఆమెకు తెలిసేది.

'కా. పగ్ని మన ఏరియా పరిధిలో లేని ఒక దూరపు బంధువు దగ్గరకు వెళ్లిందని తెలిసింది. కాంటాక్టు చేసే ప్రయత్నం చేస్తున్నాం' అని మధ్యలో రాజేష్ ఉత్తరం రాశాక మీన కూడా ఇతర విషయాల్ని రాస్తూ కింద లైన్లు కొట్టి మరీ పగ్నిని ఎలాగైనా కలిసే ప్రయత్నం తీవ్రంగా చేయమని రాసిన విషయం మీనకి ఇంకా గుర్తుంది.

దాహం వేసి లేచి పక్కనున్న బాటిల్ నుండి నీళ్లు తాగింది. చల్లటి నీళ్లకు పళ్లు జివ్వుమన్నాయి. చప్పుడు కాకుండా లేచి తుపాకీ అందుకుని సునీతని కదిపింది. సునీత టక్కున లేచింది. కళ్లతో సైగ చేయగానే లేచి తుపాకీ అందుకుంది. ఇద్దరూ వెళ్లి సెంట్రీ చెకింగ్ చేసి వచ్చారు. అప్రమత్తంగానే ఉంది సెంట్రీ. మీన సంతృప్తిగా తిరిగి వచ్చింది. సునీత వెంటనే పడుకుంది గానీ మీనకి అస్సలు నిద్ర పట్టడం లేదు. దుప్పటి దగ్గరగా లాక్కుని సునీతకి దగ్గరగా జరిగింది.

ఆ తర్వాత....? మళ్లీ ఆ ఏరియాలో జిల్లా కమిటీ మీటింగ్‌కి వెళ్లినప్పుడు సన్ను చెప్పాడు పగ్నికి ఆ ఊర్లో ఎదురైన చేదు అనుభవం గురించి. ఆ దూరపు బంధువు పగ్నితో అశ్లీలంగా వ్యవహరించడానికి ప్రయత్నించడంతో పగ్ని ఆ ఊరునుండి వేరే దగ్గరకు వెళిపోయిందని. జిల్లా కమిటీ అందరూ ఉన్నారు కనక పగ్నిని ఎలాగైనా కలిసి సంగం బలంగా ఉన్న గ్రామంలో ఉంచాలని నిర్ణయం తీసుకున్నారు.

కొన్నాళ్లకు పగ్ని తిరిగి చురుగ్గా పని చేస్తోందని సన్ను ఉత్తరం రాసినప్పుడు తను ఎంత సంతోషించిందో తనకే తెలుసు. తను పగ్నికి ఉత్తరం రాసి పంపింది కూడా.

ఇప్పుడు మళ్లీ ఈ వార్త!

చప్పున కళ్లలో నీళ్లు తిరిగాయి మీనకి. బాధ, కోపం అన్నీ ఒక్కసారిగా ముంచుకొచ్చాయి.....

ఆలోచిస్తూ, ఆలోచిస్తూ ఎప్పటికో కళ్లంటుకున్నాయి.

* * *

రాజేష్ నుండి పగ్ని గురించి ఉత్తరం వచ్చి అప్పుడే నెల అయి ఉంది. కానీ మీన మనసు నుండి పగ్ని గురించిన ఆలోచనలు తొలిగింది లేదు. మధ్యలో భాస్కర్‌కు ఉత్తరం పంపాల్సి వచ్చింది. విషయాలు రాస్తూ చివరగా పగ్ని గురించి కూడా వివరంగా రాసింది.

పార్టీలో మహిళల స్థితిని మెరుగుపర్చాలనే తపన ఉన్న కామ్రేడ్‌గా భాస్కర్‌కు రాయడంతో మీన మనసు కొంత తేలికపడింది.

'పగ్నిని కలవగలిగితే బాగుండు'

అని చాలాసార్లు అనుకుంటూ ఉందేమో రాజేష్‌తో అపాయింట్‌మెంట్‌కి వచ్చిన బ్యాచ్‌లో పగ్నిని చూడడంతో మీన ఆనందాశ్చర్యాలలో మునిగిపోయింది.

అందరికీ లాల్‌సలాం చేసి పగ్నిని ఆనందంగానూ, ఆర్ద్రంగానూ కూడా దగ్గరకు తీసుకుంది. పగ్ని గతంకంటే గంభీరంగా ఉన్నట్లు తోచినా కళ్లలోని ఆ మెరుపు తగ్గలేదని గమనించింది మీన.

అపాయింట్‌మెంట్‌కి వచ్చిన పని చూసుకుని తిరిగి సాయంత్రానికల్లా పగ్ని వాళ్లు వెళ్ళిపోతారని మీనకి తెలిసినా పగ్నితో మాట్లాడడానికి ఎక్కువ సమయం కేటాయించుకోలేకపోయింది. అయినా చివర్లో ఇక త్వరత్వరగా సరితకి కొన్ని పనులు అప్పగించేసి పగ్నితో కూచుంది. డేరాకు ఒక వైపు పెద్ద రాళ్లు ఉండడంతో ఇద్దరూ అక్కడే కూచున్నారు.

పగ్ని మాట్లాడ్తుంటే తన నిర్మలమైన ముఖాన్నీ, చిరునవ్వునీ తనివితీరా చూస్తోంది మీన. వాళ్ల ఏరియాలో ఈ మధ్య చేసిన కార్యక్రమాల్ని అడిగింది మీన ఉపోద్ఘాతంగా. అవసరమైన వివరాల్ని మాత్రం సూటిగా, ముఖ్యమైన అంశాలు ఏవీ వదలకుండా చెప్తోంది పగ్ని. మగవాళ్లు కూడా ఇంటిపన్లు చేయాలనే అంశాన్ని కూడా ఎలా అమలు చేయించడానికి ప్రయత్నించారో పగ్ని చెప్తుంటే మీన ఆసక్తిగా విన్నది.

ఇంకా వివరంగా తన అనుభవాలు వినాలని ఉన్నా సమయం ఎక్కువ లేదని ఇక వ్యక్తిగత విషయాన్ని తడమాలనుకుని ఉపోద్ఘాతంగా,

'పగ్నీ, ఈ మధ్య మైని ఏమన్నా కలిసిందా?'

'లేదు'

'సతీష్ విషయం ఇలా అయిందని తనకి తెలుసా? రాశావా?' మెల్లగా భుజం మీద చేయి వేస్తూ అడిగింది.

ఒక్క క్షణం కనిపించీ కనిపించనట్టుగా పగ్ని ముఖంలో చిరునవ్వు మాయమైంది. తిరిగి కళ్లు మూసి తెరిచేంతలో అది ఆమె పెదవుల మీదకు పాకింది.

'అక్కడి దళంవాళ్లకి కూడా సతీష్ వెళ్ళిపోయిన విషయం డిసి నుండి తెలిసి ఉంటుంది కదా. నేనేం రాయలేదు'

'మీరు ఇద్దరూ అనుకున్నారా? లేక....?'

'ఆరు నెలలవుతుంది, సతీషే అడిగిండు, నాకూ నచ్చి సరే అన్నా'

'ఈ నెలలోనే పెళ్లి చేయాలని కూడా అనుకున్నారట కదా....వెళ్ళిపోయే ముందు కనీసం నీకు ఏమైనా అర్థమైందా, నీతో ఏమన్నా అన్నాడా?'

'అస్సలు అందాజనే అందలేదు దీదీ. అందితే రాజేష్ దాదాతో అనకపోదునా?'

'అవునులే. నాకు సతీష్ అంత పరిచయం లేదు, ఒకసారి చూశానంతే. నిజంగా ఇలా చేస్తాడనుకోలేదు. పార్టీకీ ద్రోహం, నీకూ ద్రోహం.....' మీన గొంతులో ఎంతో ఆవేదన. ఆమె తట్టుకోలేకపోతోంది. సమాజంలో మగవాళ్లూ మోసం చేసి, పార్టీ మనిషీ ఇట్లా చేస్తే ఎట్లా అని ఆమె మనసు కుతకుతలాడుతోంది.

'రాజేష్ దాదా కూడా అదే అన్నాడు. పార్టీకి చెప్పకుండా ఇలా వెళ్ళిపోవడం, అందులోనూ డబ్బులు తీసుకుని.....'

'నీకిట్ల చేసిండని బాధ పడ్తున్నావా పగ్నీ?'

'పార్టీలో మంచిగా ఉన్నాడనే కదా అడిగితే పెళ్లికి ఒప్పుకున్నా. పార్టీనే వద్దనుకున్నడు కదా..అందులోనూ ఇట్లా ద్రోహం చేసి...ఇంక బాధేముంటది? ఇట్లాంటి ద్రోహులతో ఎట్లుంటున్నావెమో అట్లుండాల్సిందే, ఇంకేముంది?' తొణకకుండా ప్రశాంతంగా చెప్పింది పగ్ని.

మీన మనసులో ఒకేసారి ఎన్నో భావాలు ముప్పిరిగొన్నాయి. ఇలాంటి కామ్రేడ్ పట్లనా సతీష్ ఇలా చేసిందని అతని మీద కోపం, విషయాన్ని ఇంత సరిగా అర్థం చేసుకుందని పగ్ని మీద గౌరవం, జీవితంలో ఇన్ని ఎదురుదెబ్బలు తిన్నా చెదరని ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్తున్న ఆమె పట్ల అబ్బురం...

'పగ్నీ, వ్యక్తిగత జీవితంలో నీకు వరసగా ఎదురు దెబ్బలు తగాలాయి. వాళ్లంతా సమాజంలో మగవాళ్లు. కానీ సతీష్ పార్టీ మనిషి అయి ఉండీ నిన్ను ఇలా మోసం చేశాడు, ఇలాంటివాళ్ల వల్ల పార్టీకి కూడా ఎంత చెడ్డ పేరు, నీకూ ఇది తట్టుకోవడం......'

ఇంతకాలానికి ఇన్ని ఢక్కామొక్కీలు తిన్న తర్వాత, పగ్ని సతీష్‌ని పెళ్లి చేసుకోవాలని ఇష్టపడ్డాక పార్టీ మనిషే ఇలా చేయడం అనేది మీనకి దుర్భరంగా ఉంది. అంత కాలంగా లోపల ఉన్న క్రోధం మాటల్లో ప్రతిఫలించింది.

పగ్ని కూడా ఒక క్షణం మౌనంగా కళ్లు దించుకుని కూచుంది. తలెత్తి చిన్నగా నవ్వి,

'దీదీ, అతను ఇలాంటివాడని పెళ్లికి ముందే తెలిసింది మంచిదే అనుకుంటున్నా. కాదా? ఇక మహిళల విషయంలో ఎవరు తప్పు చేసినా పోరాడాలనే కదా మనం మహిళా సంగంలో చెప్తున్నది, నువ్వూ మాకు క్లాసుల్లో అదే చెప్పావు. ఊరి దాదా అయినా, పార్టీ దాదా అయినా అంతే అని, కదా? అతను పార్టీనే వద్దనుకున్నాక ఇక అతని మీద మన పోరాటం కూడా అలాగే ఉంటుంది' నిబ్బరంగా వెలువడ్డాయా మాటలు ఆమె నోటినుండి.

మీన తదేకంగా చూస్తో ఉండిపోయింది ఆమెని. అప్పటిదాకా అల్లకల్లోలంగా ఉన్న మనసు ఒక్కసారిగా తేటపడ్డట్లయింది. ఆ మాటల్తో ఏదో శక్తి వచ్చినట్లనిపించింది.

'సరిగ్గా చెప్పావు' అంది మీన మనస్ఫూర్తిగా.

'మీన దీదీ, పగ్నిని పంపు, కిట్లు వేసుకుంటున్నాం' కొద్ది దూరం నుండి విజ్జో కేకేసింది.

పగ్నీ, మీన ఇద్దరూ తుపాకులు తీసుకుని లేచారు.

పగ్ని ముందుగా నడుస్తోంది. మీన ఏదో అడగబోయి ఒక క్షణం సందేహించింది. కానీ మళ్లీ ఎప్పుడు కలుస్తుందో ఏమో అని పగ్నీ వెనకే గబగబా నడుస్తూ

కథ

జెన్నీ, మకరందరావూ!

- ఎన్. వి. ఎస్. నాగభూషణాచార్యులు

రోజూ దినపత్రికను వదలకుండా చదివే వ్యసనం మకరందరావుక్కూడా ఉంది. దినపత్రిక చదవడం మంచి పనేకదా, మరి వ్యసనమంటారేమిటి అనంటారేమో, పత్రికను ఆమూల నుంచి ఈ మూలదాకా, ఆఖరికి అమాంబాపతు ప్రకటనల్ని కూడా అక్షరం ముక్క వదలకుండా చదవడాన్ని ఏమనాలి? పొద్దున్నే ఎంత జరూరు పనిలో ఉన్నా, పత్రిక రాగానే, ఎడారిలో ఒయాసిస్సును కనుగొన్న దాహార్తునిలా దాన్ని పూర్తి చెయ్యందే వదలరు కదా ఈ చదవరులు. అయితే ఈ మధ్యనే రిటైరయిన మకరందరావుకి అంత పొద్దున్నే పొడిచేసే అర్జంటు పనులేమున్నాయంటారేమో. ఆయనకు మట్టుకు ఆయనకు ఉదయపు నడకే పెద్ద పని! మరి కాకుంటే, అంత చేటు భారీకాయాన్ని వేసుకుని చచ్చేట్టు కాఫీ అయినా తాక్కుండా నడవాలంటే మాటలా? నడవకుంటే భార్యామణి ఊరుకోదు కాబట్టి, తప్పదు. అయితే ఆ నడక్కోసం దుస్తులూ వగైరా వేసుకుని సిద్ధమై కూడా, పత్రిక వేసే కుర్రాడు తన బాణాన్ని సంధించాడా, ఇక మనసు అటు లాక్కుండా ఎలా ఉంటుంది? మొదట నాలుగు హెడ్డింగులు చూసి పోదామని అనుకుంటాడు. అటుపై నాలుక్కాస్తా, నలభై నాలుగై ఊరుకుంటాయి. పత్రికా పఠనంలో ఉన్న మజాయే అది! అందులోనూ ఈ రోజుల్లో ఉత్కంఠ కలిగించే ఎన్నెన్ని వార్తలుంటున్నాయనీ!

ప్రపంచ కుబేరుల్లో మన వాళ్ళెంతమంది ఉన్నదీ, కేంద్రంలో మరే కుంభకోణం బద్దలయిందీ, ఫలానా కుంభకోణం సృష్టించడానికి ఏయే కొత్త మార్గాలు కనిపెట్టిందీ, మరే ముస్లిం దేశంలో ప్రజాందోళన పెచ్చు పెరిగిందీ, క్రికెట్లో సచిన్ ఇంకే ప్రపంచ రికార్డు బద్దలు కొట్టాల్సింది ఉందీ, ప్రధాన మంత్రి కాగల అర్హత రాహుల్ గాంధీకి ఎంత ఉన్నదీ.... ఇలాంటి విషయాలు తాజాగా చదివితే ఎంత రంజుగా ఉంటుంది!

అలా మకరందరావు వెళ్లేవాడు కాస్తా ఆగిపోయి, పత్రికలో పడి కొట్టుకుపోతున్నాడా. వాళ్ళావిడ ఇంట్లో పనిలో ఏ మూలున్నా కనిపెట్టి, అతని ఉత్సాహం మీద చప్పున చన్నీళ్ల కుండ దిమ్మరించేస్తుంది. "అయిందీ, పేపర్ తీశారూ.... ఇక ఈ రోజు మీ నడక సాగినట్టే..." అంటూ మొదలెడుతుంది. ఇక ఆ ప్రవాహానికంతుండదు కాబట్టి, మకరందరావు మనసుని చంపుకుని కదలాల్సిందే.

అయితే ఈ మధ్య భార్యని మించిన బెడద జెన్నీ రూపంలో వచ్చి పడింది మకరందరావు ప్రాణానికి. భార్యకయినా ఒకింత జాలీ దయా ఉందేమో గానీ, జెన్నీకి మాత్రం అవేవీ లేవు. ఆయన పొద్దున్నే కాలకృత్యాలు తీర్చుకుని బయటకు కదిలాడా సరే, లేకుంటే జెన్నీ ఇల్లు పీకి పందిరేస్తుంది. అందువల్ల జెన్నీ అంటే మొదట్లో గుర్రుగా ఉండేవాడు గానీ, ఈ మధ్య ఆయన వైఖరి మారిపోయింది. జెన్నీని ఎంతో ప్రేమగా చూస్తున్నాడు.

జెన్నీ రాక ముందు రెండు మూడ్రోజులకోసారి ఏదో వంకతో నడకని ఎగ్గొట్టేసే వాడుగానీ, ఇప్పుడది కుదరక ఠంచనుగా వెళ్లాల్సి వస్తోంది. ఇది ఆరోగ్య రీత్యా మంచిదే అనిపించిందిగానీ, ఇదికాదు ఆయనకి జెన్నీ మీద ప్రేమ కలగడానికి అసలైన కారణం. అసలు జెన్నీని పెద్ద కొడుకు తీసుకొచ్చి ఇంట్లో వదిలి వెళ్ళినప్పుడు ఆ పిల్లని ఎలా సాకాలా అని విసుక్కున్నాడు కూడా. ఎందుకంటే అది పాలు కూడా తాగడం రాని పసి కూన! ఆ పిల్లకి సీసాలో పాలు తాగడం నేర్పించడం దగ్గర్నుంచీ, మొత్తం దాని ఆలనా పాలనా యావత్తూ మకరంద రావుకే అప్పజెప్పింది ఆయన భార్య. మాట్లాడితే కొడుకు ఫోన్లు చేసి అజ కనుక్కోవడమొకటి! ఇక లాభం లేదని ఆయన గట్టిగా శ్రద్ధపెట్టి ఆ పిల్లకి పాలు, బిస్కెట్లు, బ్రెడ్లు, టానిక్కులు కూరడం మొదలు పెట్టాడు. అవన్నీ అరగడానికి నడిపించడం ఒకటీ, తనతో పాటు, అంత దూరం నడవలేక చిన్న

'పగ్నీ' అని పిలిచింది.

పగ్ని వెనక్కి తిరిగింది.

'పూర్తి కాలం దళంలోకి వస్తున్నావని రాజేష్ చెప్పిండు'

'ఇంగో'

'చాలా మంచిది'

'   '

పగ్ని చేతిని చేతిలోకి తీసుకుంది. పగ్నీ ఏంటన్నట్లుగా మీననే తదేకంగా చూస్తోంది.

'మళ్లీ నీకు ఒక తోడు కావాలనిపిస్తే ఇలా అయిందని చెప్పకుండా ఉండవు కదా?'

పగ్ని నవ్వింది.

ఇద్దరూ డేరా కేసి వెళ్లారు. లాల్‌సలాం చెప్పుకుని వెళ్లే బ్యాచ్ విడిపోయింది. మీన పగ్నీ కనుమరుగు అయ్యేవరకూ ఆమెనే చూస్తూ ఉండింది.

జీవితానుభవంతో, ఉద్యమ ఆచరణతో రాటుతేలిన వజ్రంలా ప్రకాశిస్తున్న పగ్ని తేజస్సుతో అడివి కొత్త అందాన్ని సంతరించుకున్నట్లనిపించింది మీనకి.

1. జిపిసి - గ్రామ పార్టీ కమిటీ.

పిల్ల అయినందు వల్ల కుంటుతున్నాగానీ. అయితే కొద్ది కాలంలోనే జెన్నీ తనతో పాటు నడవడం మొదలెట్టి మకరందరావు దిగులు పోగొట్టింది. అంతేగాక నడకలో తోడుగా కూడా కనిపించే సరికి జెన్నీ మీద ప్రేమ కూడా కలిగి ఆ పిల్లకి మంచి పేరు కోసం ప్రయత్నించాడు. అందుకాయనకు గల సాహిత్య పరిజ్ఞానం కొంత ఉపకరించింది.

పత్రికల పిచ్చికి మించిన పిచ్చి సాహిత్యం మీద కూడా ఉంది మకరందరావుకి. అందులో కొంత ఆయన ఇద్దరు పిల్లలకూ అంటింది కూడా(అది తన కంటనందుకు ఆయన భార్య తెగ సంతోషిస్తుంది). అందువల్ల జెన్నీకి పేరు పెట్టడం కోసం ఈ ముగ్గురూ తలా ఒక జాబితా తయారు చేశారు. ఏ విషయంలోనూ ఆయన మాట ఆ ఇంట్లో నెగ్గదు గానీ, జెన్నీ పేరు విషయంలో మాత్రం ఆయన తన మాట నెగ్గించుకో గలిగాడు. ఆ సమయంలోనే ఆయన ప్రసిద్ధ రష్యన్ రచయిత అలెక్సాండ్ర్ కుప్రీన్ రాసిన "యమకూపం" నవల చదివాడు. అది ఆయనపై తీవ్ర ప్రభావాన్ని కనబరిచింది. వేశ్యల పట్ల ఆయనకు అప్పటి దాకా చెప్పరానంత అసహ్యం ఉండేది. కానీ ఈ నవల చదివాక, అపార సానుభూతి ఏర్పడింది. అందులో జెన్నీ పాత్ర ఆయన్ని తీవ్రంగా ఆకర్షించింది. ఆ పిల్ల చూపిన తెగువ, ఆత్మాభిమానం, తెలివి, తర్కం అద్భుతం! అయితే చివరకు ఆ పిల్ల ఆత్మహత్య చేసుకోవడం ఆయన్ని తెగ బాధించింది.

ఆ పిల్లకి జెన్నీ పేరు పెట్టడానికి ఆయనకు ఆ పాత్ర పట్ల కలిగిన అభిమానమే కారణం. అయితే ఒక పడుపుకత్తె పేరెక్కడయినా పెడతారా అని కొడుకులడిగితే, ఏం వాళ్ళు మాత్రం మనుషులా కారా అనడిగాడు. ఈ సమాజం దుర్నీతికి పడుపు వృత్తే గొప్ప ఉదాహరణ అంటూ ఈ నామకరణం అనంతరం ఒక వ్యాసం కూడా రాశాడాయన.(అయితే ఆ వ్యాసాన్ని ఏ పత్రికా ప్రకటించలేదు. అది వేరే సంగతి).

'ఇందుగల వందులేవని' ఆ ఊళ్ళోనూ ఊరకుక్కలు ఎక్కువే ఉన్నాయి. జెన్నీకి ఆ కుక్కలంటే తగని భయం. వాటిని చూసి ముడుచుకొని పోయి, మకరందరావు వెనకే నక్కి, అడుగులో అడుగు వేసుకుంటూ నడుస్తుంది. నడక మధ్యలో వేగం తగ్గితే ఆయనకు తగని చిరాకు. "ఎందుకలా భయపడతావు... నువ్వే వాటిని భయపెట్టాలిగాని! అయినా నీ పక్కన నేనుండగా అవి నిన్నేం చేస్తాయి?" అంటూ ఆయన జెన్నీని తన పక్కనే నడిపించాలని చూసినా, జెన్నీ నడవదు. అవి వెళ్ళి పోయాక మాత్రమే జెన్నీ మామూలుగా, ఠీవిగా నడవడం! వయసుని మించి పెరగడమే గాక, ప్రకటనల్లో మోడల్ మాదిరుండే జెన్నీ అంటే ఊళ్ళో అందరికీ ఒక ఆకర్షణ! దారే పోయే వాళ్ళు కూడా జెన్నీని చూసి దూరంగా తొలగి, అలానే నిలబడి, జెన్నీ వెళ్ళిపోయేదాకా చూస్తుండిపోతారు.

అలా జెన్నీని వెంట బెట్టుకుని నడిచే మకరందరావు, ఊరు దాటి జనాల అలికిడి తగ్గిపోయే దాకా మౌనంగా నడుస్తాడు. ఆపై జనం ఎవరూ సమీపంలో లేరని నిర్ధారించుకున్నాక, ఇక జెన్నీతో కబుర్లు చెప్పడం మొదలెడతాడు. ఆ కబుర్లకి అంతూదరీ ఉండదు. కబుర్లంటే ఇద్దరూ చెప్పుకునే వనుకునేరు! జెన్నీకి మాటలు రావుగనుక, అన్ని మాటలూ మకరందరావే చెబుతాడు. జెన్నీ వింటూంటుంది. మధ్య మధ్యలో కళ్ళు పెద్దవి చేసి, ఆర్చీ, కనుబొమలు ఎగరేసి, అమాయకంగా చూసీ తన భావాల్ని వ్యక్తం చేస్తే వాటినర్థం చేసుకుని ఆయన మళ్ళీ తన సంభాషణ కొనసాగిస్తాడు.

మకరందరావు మంచివాడే. నాకు తెలిసీ ఆయనలో ఉన్న ఒకే ఒక్క చెడ్డగుణం, ఇతరులు కూడా మంచిగానే ఉండాలను కోవడం! అంతా నీతిగా, నిజాయితీగా, దయతో, ప్రేమగా ఉండాలనుకుంటాడు. ఈ లోకంలో గల సకల దుర్మార్గాల పట్లా ఆయనకు అంతులేని అసహ్యం ఉంది. అయితే ఆయన తన భావాల్ని ఎవరి దగ్గరా వ్యక్తం చెయ్యడు. ఎవరితోనో ఎందుకు, భార్య దగ్గర కూడా ప్రస్తావించడు. ఒక వేళ ఎప్పుడన్నా పొరబాటున ఏదన్నా ఆమెతో ప్రస్తావించబోతే, "మీదంతా చాదస్తం" అని ఒక్క మాటతో కొట్టేస్తుందావిడ. పెళ్ళయిన కొత్తలో ఒకసారి, భర్తగా తన ఆధిక్యాన్ని చలాయించాలని కాదు గానీ, తన విజ్ఞానాన్ని ప్రదర్శించాలన్న ఉబలాటంతో, ఏదో చెప్పబోయాడు. దానికామె విస్తుబోవడం అట్లా ఉంచి, ఆయన్ని సొంతం చెప్పనివ్వకుండా మధ్యలోనే అడ్డుకొని, "ఆకాశంలో విహరించడం మాని, కాస్తంత నేలపై నడవండి" అని సలహా ఇచ్చింది. ఆ మాటలకు ఖంగుతిన్న మకరందరావు ఇంకెప్పుడూ, తెలివితక్కువగా ఆమెతో వ్యవహరించకూడదన్న గట్టి నిర్ణయం తీసుకున్నాడు. నిర్ణయం తీసుకోవడమే కాదు, దీన్ని మూడు దశాబ్దాలుగా అమలు చేస్తున్నాడుకూడా.

ఈ విధంగా ఆ ఇంట్లో భార్యదే పై చేయి కావడానికి మరో కారణం కూడా జతపడింది. అదేమిటంటే ఆయన మీద ఆయనకే ఒక అపనమ్మకం ఏర్పడి, దృఢపడింది. తనకేమాత్రం లౌక్యం తెలీదని మకరందరావుకే గట్టి అనుమానం ఉంది! అది ఎన్నోసార్లు రుజువైంది కూడా. అందుచేత తమ ఇంట్లో ఏ ముఖ్యమైన కార్యం జరిగినా, భార్య మాటకే విలువిచ్చేవాడు. క్రమంగా అది భార్య అహంభావానికి దారి తీసినా, ఊరుకున్నాడనే కంటే, భార్య పెత్తనానికి అలవాటు పడ్డాడనడం సరిగ్గా ఉంటుంది. పిల్లలు పుట్టాక, వారు తల్లితో పాటు తండ్రి మాటకూ విలువివ్వడం మొదలు పెట్టేసరికి, "మొదలెట్టారూ, పిల్లల్ని చెడగొట్టడం..." అంటూ ఆమె వ్యంగ్య బాణాలు విసిరే సరికి, వారితో కూడా అనుబంధం తగ్గించుకున్నాడు. ఈ విధంగా తాను లోకంలో ఒంటరి వాడినన్న భావం ఆయనలో మొదలై, క్రమంగా బలపడింది. తన భావాల్ని ఇతరులతో పంచుకోవాలని ప్రతి వారికీ ఉంటుంది. అది ఒక రూపంలో కుదరకుంటే, మరో రూపంలో వ్యక్తం చెయ్యడానికి ప్రయత్నిస్తారు. ఆయన తన కుతి తీర్చుకునేందుకు పత్రికల ద్వారా ప్రయత్నించాడు. అనేక విషయాలపై తన భావాల్ని వ్యాసాల రూపంలో రాసి పత్రికలకు పంపిస్తూండే వాడు. అయితే అందుకు ఏ పత్రికా ఆయనకు సహకరించినట్లు లేదు. ఆయన భావాలు మరీ చాదస్తంగా అనిపించో, లేక వ్యాసరూపంలో సరిగ్గా

వ్యక్తం చేయకపోవడమో, లేదా తన భావాలకు తగ్గ పత్రికలను ఎన్నుకోక పోవడమో కారణం కావచ్చు. కారణం ఏదైతేనేం, ఆయన వ్యాసాల్ని ఏ ఒక్క పత్రికా ప్రచురించింది కాదు. ఇక చేసేదేం లేక ఉగ్గ బట్టుకుని రోజుల్ని వెళ్ళదీస్తున్నాడు. అదుగో అలాంటి సమయంలో సువర్ణావకాశంలా జెన్నీ లభించిదాయనకు. ఇక చెప్పేదేముంది, దోస్తీ మొదలెట్టాడు. ఒక్కో రోజు ఒక్కో అంశంపై జెన్నీతో చర్చించసాగాడు. ఆ చర్చంతా ఒకే రకంగా సాగుతూంటుంది.

ఉదాహరణకు, ఒకరోజు...."ఇదుగో చూడు జెన్నీ, ఈ జనాలకు ఎంత పిచ్చి పట్టిందో....." అంటాడాయన. 'ఏమిటీ' అన్నట్లు తల తిప్పి చూస్తుంది జెన్నీ. "పెళ్ళిళ్ళకి లక్షలకు లక్షలు తగలేస్తున్నారు. పిల్లికి బిచ్చం పెట్టని వాళ్ళు కూడా, పెళ్లిలో చేతికి ఎముక లేనట్టు ఖర్చు చేసేస్తారు.... అదే నేనయితేనా......" అంటూ తను చూసిన అనేక పెళ్ళిళ్ళలో చేసిన దుబారా గురించి ఉపన్యాసం సాగిస్తాడు, తన కొడుకు పెళ్ళిలో చేసిన దండగమారి ఖర్చు గురించి మర్చిపోయి.(అది భార్య ఇష్టం మేరకు జరిగింది మరి, తన అభీష్టానికి విరుద్ధంగా).

ఇంకొక రోజు "అసలు ఈ ఉద్యోగస్తులున్నారు చూసావు, వీరంత దౌర్భాగ్యులు లేరనుకో" అంటాడు. "ఎందుకో?" అన్నట్టు కళ్ళు విప్పార్చి చూస్తుంది జెన్నీ. "ఊపిరి తీసుకోవడమైనా మానేస్తారేమో గాని, లంచాలు తీసుకోకుండా ఒక్క పనీ చెయ్యరు కదా" అంటూ ధాటీగా లంచావతారాల్ని ఉతికి ఆరెయ్యడం మొదలెట్టే వాడు, తనకు లంచాలు పట్టే సీటు దక్కనందుకు బాధపడిన విషయం మర్చిపోయి.(లంచాలు పట్టే తెలివి తేటలు అతనికి లేవన్న సంగతి పై అధికారి గుర్తించి శాశ్వతంగా అతనికా అవకాశం లేకుండా చేశాడు. అది వేరే సంగతి)

ఇంకో రోజు తమాషాగా "ఇవ్వాళ ఏ విషయం పై చర్చిద్దాం జెన్నీ?" అనడుగుతాడు మకరందరావు.ఏదో ఆలోచిస్తున్నట్లు కనుబొమలు ముడేస్తుంది జెన్నీ. మళ్లీ ఆయనే "ఒక పని చేద్దాం.... సినిమా రంగం గురించి మాట్లాడుకుందాం.....ఏం?" అంటూ జెన్నీ కళ్ళల్లోకి చూస్తాడు. సరే నన్నట్లు కనురెప్పలు వాలుస్తుంది జెన్నీ. ఇక మొదలెడతాడాయన తన సినీరంగ పాండిత్యాన్ని. "అసలు నన్నడిగితే ఇప్పుడొచ్చే మన తెలుగు సినిమాలంత దరిద్రమైన సినిమాలు ఈ ప్రపంచంలోనే లేవు తెలుసా? ఏవో కాస్త చూడదగ్గవి కొన్ని ఉన్నా, అవన్నీ కాపీ సినిమాలే సుమా. అసలు తెలుగు నటులు వేసే కుప్పి గంతుల్ని చూసి నవ్వాలో ఏడవాలో తెలీదు. పైగా వాటిని తియ్యడానికి మన దేశం పనికిరాదు. విదేశాలు కావాలి. అక్కడి వారు నవ్వు కుంటారనైనా చూడకుండా.." అంటూ సాగిస్తాడు, తన యవ్వనకాలంలో ఆ కుప్పిగంతుల్నే, పదే పదే చూసిన సంగతి మర్చిపోయి.

మరో రోజు "జెన్నీ, ఈ విద్యారంగం ఉంది చూశావు... రాజకీయ నాయకుల ప్రయోగశాలగా మారిపోయింది తెలుసా?" అంటాడు మకరందరావు."ఎట్లా?" అన్నట్లు కళ్ళు పెద్దవి చేసి చూస్తుంది జెన్నీ. "ఏముంది... ఒక మంత్రి గారొస్తారు. ఉత్సాహంగా ఒక పథకం మొదలెడతారు. అరి సగంలో ఉండగానే మంత్రి వర్గంలో మార్పులు జరిగి ఆయన శాఖ మారిపోతుంది. కొత్త మంత్రికి తెల్లవారుఝామున కలలో ఒక కొత్త పథకం తడుతుంది. దాంతో పాత దాన్ని రద్దు చేసి, దాని స్థానే తన పథకాన్ని ప్రవేశ పెడతారు..." అంటూ ఆయా పథకాల గురించి చెప్పడం మొదలెడతాడాయన, తను కూడా ఒక కొత్త పథకాన్ని తన వ్యాసంలో సూచించిన సంగతి మర్చిపోతూ. (మకరందరావు విద్యారంగం పై కొన్ని వ్యాసాలు రాశాడు. వాటిని ఏ పత్రికా ప్రకటించని సంగతి మామూలే కదా! కానీ ఓ అనామక పత్రిక దయతలచి ఒక వ్యాసాన్ని లేఖా రూపంలో ప్రకటించగా, దానికాయన ఉబ్బి తబ్బిబ్బయి, తీసుకొచ్చి నాక్కూడా చూపించాడు.)

ఒక రోజు "ఫలానా పార్టీ సంగతి నీకు తెలుసా?" అని ప్రశ్నిస్తాడు మకరందరావు. "నాకేం తెలుసు?" అన్నట్టు బిక్క మొహమేస్తుంది జెన్నీ. "అవును నీకేం తెలుసు. నే చెబుతా... అసలా పార్టీకి ఏ సిద్ధాంతమూ లేదు. అయినా ఏదో ఉన్నట్టు పోజు పెడుతుంది... ఎంచేతంటావా.." అంటూ తను కనిపెట్టిన రహస్యాన్ని వివరిస్తూ పోతాడు. (ఆ పార్టీకే మకరందరావు ఒకే ఒక్కసారి ఓటేసి, ఆపై అసలు జన్మలో ఏ పార్టీకీ ఓటెయ్యనని ప్రతిన పట్టాడు)

ఈ విధంగా ప్రతిరోజూ మకరందరావు తన పాండిత్యాన్ని జెన్నీ ముందు ప్రదర్శిస్తూంటాడు. జెన్నీ కూడా ఆయన సంభాషణా చతురతకు ఆశ్చర్యపోయినట్టు శ్రద్ధగా వింటుంది. అయితే ఆయన ఈ ప్రదర్శన చుట్టుపక్కల ఎవరూ లేనప్పుడే చేస్తాడు. ఏ కాస్త అలికిడయినా మౌన ముద్ర దాలుస్తాడు. జెన్నీ కూడా ఏం తెలియనట్టు ఆయన వంక అమాయకంగా చూస్తుండి పోతుంది.

కొన్ని నెల్ల నుంచీ సాగుతున్న ఈ వ్యవహారం గుట్టు ఇటీవలె నాకు తెలిసింది. ఊళ్ళో ఒళ్ళొంగని జులాయి కుర్రాళ్ళు కొందరు దీన్ని గురించి ఉప్పందించారు నాకు. ఈ సంగతి ఇంకెవరికైనా చెప్పారా అని ఆరా తీస్తే ముందు నాకే చెబుతున్నామన్నారు వాళ్ళు. దాంతో నేను వారిచ్చిన గౌరవానికి సంతోషించక పోగా, "ఒరి వెధవల్లారా... ఏదో ఆయన ఆ మూగ జీవితో కబుర్లాడుతూ తన రిటైర్మెంటు జీవితాన్ని సంతోషంగా గడుపుతూంటే, మీకంత కడుపుమంటెందుకురా?" అంటూ కోప్పడ్డాను. అంతటితో సరిపుచ్చక, "గమ్మున మీ మానాన మీరు గోరుంబిళ్ళాడుకుంటూనో, లేదా గోలీ లాట ఆడుకుంటూనో ఉండండి. కాదంటే చెప్పండి, ఆయన జెన్నీని వదిలేసి, మీతోనే కాలక్షేపం చేస్తాడు.." అంటూ హెచ్చరించాను.

దాంతో వారంతా తారెత్తి, "ఇదేంటండి బాబూ...ఏదో కథలు రాస్తూంటారు గదా అని మీ చెవిన వేశాం. అంత మాత్రానికే మీరిలా బాంబు పేల్చి మా జీవితాలతో ఆడుకుంటానంటే ఎలాగండీ... మా మానాన మమ్మల్ని బతకనివ్వండి" అంటూ జారుకున్నారు.

ఏ మాటకామాటే చెప్పాలి. ఒక తమాషా వ్యంగ్య కథకి వారంతా తగిన మషాలా అందించారు కాదూ? మరి మకరందరావు

కథనం

ప్రజాయుద్ధంలో మట్టి వాసనలు

- సాధన

అది జూన్ నెల. మొత్తం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోనే అదిరిపోయే ఎండలకు కుంట ప్రాంతం పెట్టింది పేరు. 48 డిగ్రీలు దాటిన ఎండలు ఒక వైపూ, తీవ్ర నీటి ఎద్దడి మరోవైపు. ఈ సంవత్సరం ఏప్రిల్ మాసంలో అకాల వర్షాలు రావడంతో అడవి పచ్చబడి నీడను ఇచ్చి కాపాడుతోంది. లేకపోతే మనుషులు మరింత ఆగం కావల్సిందే. ప్రజా గెరిల్లాలు ఓ చిన్న నీటి వనరును ఆధారం చేసుకొని పొలాల్లోనే డేరా వేశారు.

ఎండలోనే పొయ్యి పెట్టారు. ఇద్దరు మహిళలు, ఇద్దరు పురుషులు వంట డ్యూటీలో ఉన్నారు. టి.సి.ఒ.సి. కావడంతో పెద్ద సంఖ్యలో గెరిల్లాలు యుద్ధ చర్యల కోసం జమయ్యారు. కంపెనీ (80 మంది) ప్రాతిపదికన వంట చేయడం కన్నా ప్లటూన్ ప్రాతిపదికన (27 మంది) చేయడం బాగుంటుందనీ, అదే రీతిలో పొయ్యిలు పెట్టి వంటలు చేస్తున్నారు. రాత్రిపూట మంటలను నిషేధించడంతో వెలుతురుండగానే రెండు పూటలకూ వండుతున్నారు. దీనితో వంట డ్యూటీ వారికి దినమంతా ఊపిరి సలపకుండా పోతూంది.

రాత్రి 12 దాటితే గానీ భూమి చల్లబడడం లేదు. పగటి ఎండకు ఇంకా కాలుతున్న భూమిపైనే పాల్తీన్ జిల్లీ పరచుకుని పడుకున్న రాహీకి రాత్రి 11 దాటినా నిద్రపట్టడం లేదు. జిల్లీపై పల్చని చద్దర్ పరిచినా వేడి కాక తగులుతూనే ఉంది. ఇటూ అటూ దొర్లుతున్న రాహీకి పగలు నరేందర్ చెప్పిన మాటలే మళ్లీ మళ్లీ గుర్తొస్తున్నాయి. ఆ పొలాల్లోనుంచే మూడు వైపులుగా వచ్చి గొంపాడు, గచ్చన్‌పెల్లి ఇంకా ఇతర ఊర్లను చుట్టుముట్టిన కోయ కమాండోలు, కోబ్రాల దారుణాలే ఆయన కళ్ళ ముందు కదలాడుతున్నాయి. 70 ఏండ్లు దాటిన ముసలి దూది మూయెను రొమ్ములు కోసి చంపిన కోబ్రాలు, కోయ కమాండోలు ఎంతటి కిరాతకులో గుర్తొస్తున్న రాహీకి గత ఆరేండ్లుగా జుడుం దాడులకు బలవుతున్న వందలాది ఆదివాసీ ప్రజలు అనుభవించిన దారుణాలే గుర్తొస్తూ కళ్లకు కునుకు పట్టనివ్వడం లేదు. గచ్చన్‌పల్లి, పాలచెలిమి, సింగన్‌మడుగు, గట్టపాడు, గొంపాడులలో హతహతులైన 24 మందిలో పదేండ్లు దాటని పిల్లలూ ఉన్నారు. ఏడాది నిండని పాప చేతివేళ్లు నరికిన మనుషుల క్రూరత్వాన్ని ఏ మృగత్వంతో పోల్చగలం? అనుకుంటూ రాహీ తన పక్కపై దొర్లుతూంటే సెంట్రీ దగ్గర మేఘనాథ్ దేన్నో కర్రతో బాదుతున్న చప్పుడు వినపడడంతో ఏంటి? పామా!' అంటూ ప్రశ్నించాడు రాహీ.

'ఆ, కట్లపాము' అంటూ బదులు ఇచ్చిన సెంట్రీ కర్ర దూరంగా విసిరాడు.

అర్ధరాత్రి దాటిన తర్వాత ఎప్పుడు కునుకు పట్టిందో గానీ, కిచన్ వాళ్ల గంజుల చప్పుడుతో రాహీకి తెలివిపడింది. వాచీ చూస్తే ఇంకా ఐదు కావడానికి 15 నిమిషాలు బాకీ ఉండడంతో మళ్లీ కళ్లు మూశాడు. సాయంత్రం వెళ్లాల్సిన దాడి గురించి ఆలోచిస్తున్న రాహీకి కరుణ 'చాయ్' అనడంతో లేవక తప్పలేదు.

'మనవాళ్లు సంతకు వెలుతున్నారు దాదా, దళానికి కోటా సామానులు పూర్తయ్యాయి. తెప్పిస్తే బాగుంటుందేమో!' అంటూ కరుణ చాయ్ గంజుతో వెనక్కి తిరిగింది.

'ఈ రోజు ఎక్కడి సంత సోనారు?' ప్రశ్నించాడు రాహీ.

'బూర్లంక శనివారం సంత' అంటూ గడుగ్గాయి వికాస్ మధ్యలో దూరాడు. తనకు కావల్సిన సామానుల లిస్టు పట్టుకొని మోతీ ముందు నిలబడ్డాడు.

'సామాను లిస్టు ఇమ్మన్నాడు నరేందరన్నా, అందరూ ఒకేసారి తెచ్చి ఇవ్వండి' అంటూ కమాండర్ మోతీ వికాస్ ఇచ్చిన లిస్టు అందుకుంది.

'ప్రజాయుద్ధంలో అన్నీ ప్రత్యామ్నాయంగా సృష్టించుకోక తప్పడం లేదు. ఖాకీలు అన్నీ విధ్వంసం చేస్తూపోతూ ఉంటే ఉద్యమం మళ్లీ అన్నీ తయారు చేసుకోక తప్పడం లేదు. ఈ ప్రాంతంలోని సంతలన్నీ పదేళ్ల క్రితం పోలీసులు మూసేస్తే జనతన సర్కార్‌లు జనం కోసం ఈ మధ్య తెరిచిన కొన్ని సంతల్లో బూర్లంక ఒకటి. ఈ సంతే ఇక్కడి 60-70 ఊర్లకు దిక్కవుతోంది. మిగితా పెద్ద సంతలకు వెళ్లాలంటే అన్నీ ఖాకీల వలయంలోనే ఉన్నాయి కదా' అంటూ క్రితం రోజు నరేందర్ చెప్పిన నిధుల కొరత విషయం గుర్తొచ్చిన రాహీ మోతీ వైపు చూస్తూ, 'లిస్టుతో పాటు డబ్బు కూడా ఇవ్వు మోతీ, ఇక్కడ డబ్బుకు చాలా సమస్యగా ఉంది' అన్నాడు.

రోజంతా గెరిల్లాలు ఎవరి పనుల్లో వాళ్లు పూర్తిగా మునిగిపోయారు. ఉదయాన్నే కమాండర్ నాగేశ్ సాయంత్రం జరపబోయే దాడి గురించి డ్రిల్ రిహార్సల్ చేయించాడు. లేత ఎండలోనే డ్రిల్ చేసిన గెరిల్లాలు ఒళ్లు చెమటలు కక్కడంతో గుడ్డలు పూర్తిగా తడిసిపోయాయి. గ్రౌండ్‌లో ఎంత చెమట కక్కితే యుద్ధభూమిలో అంత నెత్తుర్లు పారకుండా అరికట్టవచ్చునన్న

లాంటి వ్యక్తులు మీ కెన్నడైనా తగిలితే నన్ను గుర్తు పెట్టుకోండేం... అసలే కథలకి తగిన వస్తువులు దొరక్క అవస్థ పడుతున్నానీ మధ్య! ఎందుకంటే మూస కథల్తో విసుగెత్తి పోయిన పాఠకులు వైవిధ్యమున్న కథ కావాలంటున్నారు కదా! అందునా ఈ రంగంలో ఇటీవల పోటీ ఎక్కువైందాయె. తెలుగు కథకుల సంఖ్య వేలల్లోకి చేరిపోయిందని ఎవరో లెక్కేసి మరీ చెప్పారు కూడానూ.

స్పృహ గెరిల్లాల్లో బలంగా ఉంది. డ్రిల్ పూర్తయిన వెంటనే అందరూ స్నానాలకు వెళ్లారు. అరగంటలో వచ్చేశారు. చాలాకాలంగా టిఫిన్ అంటే 'పోపు అన్నం'గానే తయారైంది. వేడి వేడి పోపన్నం తిని వేసవి కావడంతో పొద్దస్తమానం గెరిల్లాలంతా పులిసిన అంబలి ప్రియంగా తాగుతున్నారు. దక్షిణ బస్తర్‌లో సంతలన్నీ ఉదయం పది లోపే పూర్తవుతాయి. సాహుకార్లు సంచులు సర్దుకొని కొట్లు కట్టేసి తిరుగు ప్రయాణం చేయడం అలవాటు. మరెక్కడా ఇలా లేదు. సంత అంటే సాయంకాలం వరకు సాగుతుంది.

బూర్లంక సంత నుంచి తెచ్చిన కూరగాయలతో పాటు జనం ఇచ్చిన చేపలు కలిపి కిచెన్ వాళ్లు వంట చేశారు. మధ్యాహ్నం భోజనాలు చేశాక తిరిగి సాయంకాలం ఆరు లోపే తినేవాళ్లు తిన్నారు. కొద్దిమంది సీనియర్ కామ్రేడ్స్ రాత్రి తింటామని క్యారియర్‌లో పట్టుకున్నారు. ఈ లోపు రోల్‌కాల్ విజిల్ రావడంతో పాలోమంటూ అందరూ పరుగు తీసి తమ తమ ఫార్మేషన్ ప్రకారం వరుసగా నిల్చున్నారు.

కమాండర్ అందర్నీ అటెన్షన్‌లోకి తెచ్చి ఉదయం చేయబోయే దాడి గురించి వివరించాడు. బలగాల మోహరింపూ చెప్పాడు. పోలీస్ స్టేషన్‌కు అతి సమీపంలోకి వెళ్లి దాడి చేయాల్సి ఉంటుంది కాబట్టి పూర్తి రహస్యాన్ని పాటించాలనీ, వేగంగా చర్యను పూర్తి చేసుకోవాలనీ, దృఢంగా ఉండాలనీ మూడు మాటల్లో గెరిల్లా ఎత్తుగడల మౌలిక నియమాలను గుర్తు చేశాడు. జుడుంకు వ్యతిరేకంగా చేసిన అనేక గెరిల్లా దాడుల్లో పాల్గొని మంచి అనుభవం సంపాదించిన తమ గెరిల్లాలకు ఆ బ్రీఫింగ్ సరిపోతుందనీ ఆయనకు తెలుసు. ఆ మాటలు విన్న అందరి ముఖాల్లో అగుపడ్తున్న సంసిద్ధతను చూసిన కమాండర్ ముసిముసిగా నవ్వుతూ 'విసర్జన్' అన్నాడు. వెంటనే గెరిల్లాలందరూ లైన్‌ల నుంచి విడిపోయారు. క్యాంపులోనే ఉండాలని కమాండర్ చెప్పిన పేర్లవాళ్లంతా నిట్టూర్పులతో డేరాలోకి వెళ్లారు.

బెజ్జి పోలీస్ స్టేషన్ పరిసరాల్లోకి పూర్తిగా తెల్లారక ముందే చీకట్లోనే చేరిన గెరిల్లాలు తమ తమ పొజిషన్‌లలో కమోఫ్లేజ్ అయి కూచున్నారు. శత్రు క్యాంపుకు 200 గజాల దూరంలో దాడికి సిద్ధంగా ఉన్న గెరిల్లాలు శత్రువును తీక్షణ చూపులతో నిశితంగా గమనిస్తున్నారు. పొజిషన్‌లలో కూచున్న వాళ్లంతా శత్రువును కొద్దిగానో, పూర్తిగానో క్యాంపు పరిసరాలన్నీ చూడగల్గుతున్నారు. వాళ్లు ఎప్పుడు బయటకి వస్తారా! అంటూ ఊపిర్లు బిగపట్టుకుని గెరిల్లలు దాడి లక్ష్యంతో పట్టుదలగా నిరీక్షిస్తున్నారు. సమయం

ప్రియమైన అరుణతార సంపాదకులకు,

ఎర్రెర్ర వందనాలు

మీరు అరుణతారలో వరుసగా గ్రీన్‌హంట్ ఉత్పాతాలు ప్రచురించినందుకు ధన్యవాదాలు. దండకారణ్య విప్లవోద్యమానికి మీరు అందిస్తున్న సహాయం, విప్లవోద్యమ పురోగమనంలో మీ వంతుగా చేస్తున్న కృషి అభినందనీయం. గత మూడు దశాబ్దాలుగా విరసంకూ, దండకారణ్య రచయితలకూ మధ్య ముడిపడిన పేగు బంధం విడదీయలేనిది. మా రచనలకు ఉన్న పరిమితులను, లోపాలనూ, బలహీనతలనూ సహృదయంతో అర్థం చేసుకుంటూ మీరు ఇస్తున్న ప్రోత్సాహం ఎల్లలెరుగనిది. దండకారణ్య భూభాగంలో భౌగోళికంగా ఉన్న హద్దులను విరసం ముప్పయి ఏండ్ల కిందనే చెరిపివేసి భాషకూ, భావాలకూ హద్దులెక్కడివి అంటూ మా వెన్నుతట్టుతూ మా కలాలను తమ కలాల్లో కలుపుకొని పోరు ప్రయాణంలో మాకు అండగా నిల్చినందుకు గర్వంగా ఉంది. ఈ రోజు భారత సైన్యం దండకారణ్య నడిబొడ్డున కాలుమోపింది. మా ప్రజల ఆటపాటలు, మా కళాకారుల గజ్జెల చప్పుళ్ళు, మా గాయకుల విప్లవ స్వరాలు, మా రచయితల కలాలకు తన తుపాకులను గురిపెడుతున్నది. మా భావాలను బంధించాలనీ చూస్తోంది. మా ఆలోచనలను నియంత్రించాలనీ హూంకరిస్తోంది. మా మనసులనూ, ఆలోచనలనూ కలుషితం చేయాలనీ కుట్ర పన్నుతోంది. కానీ మన ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం మా కలాలకు తన గన్నులను దన్నుగా నిలిపించి. ఒక నూతన సంస్కృతిని ఆవిష్కరించడానికి జరుగుతున్న అలుపెరుగని త్యాగాల కృషిని సర్వస్వాన్ని తన స్వరూపాన్ని ఒడ్డి ప్రోత్సహిస్తోంది. సువిశాల దండకారణ్య కాన్వాసుపై పరుచుకున్న రక్తచందనాన్ని కథలు, కవితలు, పాటలు, పీటోలు, నవలలు, నవలికలు, గల్పికలతో అందంగా అలంకరించడానికి మా పెన్నులకు తన గన్నులనూ అందిస్తూంది. తుపాకీ సన్నీలకు పాళీలను బిగించుకొని కదన రంగం నుంచీ జరుగుతున్న సాహిత్య సృష్టికి వాళ్లే ఒక పెద్ద ప్రేరణ - వారు కొనసాగిస్తున్న ప్రజాయుద్ధం దానికి ప్రాణం. దాని పోరాట వారసత్వానికీ, దాని త్యాగాల ఒరవడికీ ఇస్తున్న అక్షర రూపమే 'ప్రజాయుద్ధంలో మట్టివాసనలు'.

దండకారణ్యంలో భారత భద్రతా బలగాలు సృష్టిస్తున్న ప్రజా విధ్వంసాన్ని ప్రపంచం ముందు వెంట వెంట వెల్లడించలేక పోతున్నాం. బూర్జువా మీడియా ముందు విప్లవ ప్రజల జీవితాలు వెలుగులోకి రావడమే గగనంగా మారిన పరిస్థితులలో ఇదొక చిరు ప్రయత్నం. దండకారణ్య రచయితలు గ్రీన్‌హంట్ ఉత్పాతాలతో పాటు మట్టి వాసనలలో ప్రజల జీవితాలున్నాయి. పాఠకులు ఆ జీవితాల గురించి తెలుసుకోవడానికి అరుణతార ఒక సాధనంగా ఉందన్న పూర్తి విశ్వాసంతో వీటిని మీకు పంపిస్తున్నాం. ఇంకా పంపిస్తూ ఉంటాం.

విప్లవాభివందనాలతో,

- దండకారణ్య రచయితలు

కౌంట్‌డౌన్ మొదలయింది. తమ కమాండర్ నుంచి వస్తోన్న వైర్‌లెస్ ఆదేశాలు గెరిల్లాలను నిరంతరం అప్రమత్తం చేస్తున్నాయి.

కమాండర్‌తో పాటు ఎత్తైన ప్రదేశంలో కూచున్న నరేందర్‌కు బెజ్జి గ్రామం ఊళ్లో ఉన్నట్టుగానే స్పష్టంగా అగుపడుతోంది. పోలీసు స్టేషన్‌ను దాటిపోయిన ఆయన చూపులు వల్లకాడుగా మారిన బెజ్జిపైనే నిలిచాయి. 'జుడుంకు ముందు బెజ్జి ఎంత బాగుండేది!' అనుకుంటున్న నరేందర్‌కు రెండు దశాబ్దాల క్రితం తను కమాండర్‌గా ఉన్నప్పుడు తిరిగిన ఇల్లిల్లూ, మనిషి, మనిషీ గుర్తుకు వచ్చి గుండె బరువెక్కింది. ఆ ఇండ్లన్నీ ఇవ్వుడు మట్టికొట్టుకుపోతున్నాయి. మనుషులు మాయమయ్యారు. ఒకరి అడ్రస్ మరొకరికి దాదాపు తెలవకుండా పోయింది. జుడుం విధ్వంసానికి గురైన గడ్డి గుడిసెల కప్పులు కాలిపోయి మిగిలిన మట్టి గోడలు తల లేని మొండాల్లా మొండిగా అగుపడ్తున్నాయి. తలుగులు తెంపుకోగల్గిన పశువులు మాత్రం ఆగమైన మనుషుల్లాగే దిక్కు దివాణం లేకుండా ఆగమాగంగా తిరుగుతున్నాయి. ఊరకుక్కలకు పోలీస్ క్యాంపు పూటకూళ్ల కేంద్రమయింది. వాటిలో ఎన్ని శునకాలు నాగా పోలీసుల తూటాలకు బలై వారికి ఇష్టమైన భోజనంలో కూరగా మారాయో! ఊళ్లోని చిన్నపిల్లల బడి కమాండోలకూ, కోబ్రాలకూ నిలయమైంది. జుడుం బెజ్జిలో ఎందరిని చంపిందో, ఎంతమంది మహిళలపై అత్యాచారాలు చేసిందో చెప్పేదెవరు? బెజ్జి ఊరంతా అడ్రస్ లేకుండా పోవడంతో అక్కడ మిగిలింది పోలీసులు, జుడుం గూండాలే అని బెజ్జి చరిత్రను గుర్తు చేసుకుంటున్న నరేందర్‌కు ఎదురుగా వస్తున్న ఖాకీలు అగుపడ్డాయి. వెంటనే ఆయన దేహభాష మొత్తంగా మారిపోయింది. ఆయన చూపులు అతివేగంగా తన బలగాలను కలియజూస్తున్నాయి. పక్కనున్న కమాండర్‌తో కంటి సైగలతోనే ఖాకీల రాక గురించి మాట్లాడుతున్నాడు.

తమ మృత్యువు ఎదురుగా తాము ఎక్కబోతున్న పొలం గట్టు ఆవల పొంచి ఉందన్న సంగతిని గ్రహించలేకపోయిన పోలీసులు తాపీగా ఆ గట్టువైపే వస్తున్నారు. గట్టు ఎక్కబోతున్న పోలీసుకు ఆవలి వైపు ఎ.కె.తో కాల్చడానికి సిద్ధంగా ఉన్న గెరిల్లా హఠాత్తుగా కనబడడంతో మాట పెకలక 'అ! అ!' అంటూ నోరు వెల్లబెడుతూ వెనకడుగు వేస్తుండగానే గెరిల్లాలు తూటాలతో ఆ ఖాకీ దేహం నేలకూలింది. ఇరుపక్షాల మధ్య భయంకరమైన కాల్పులు ప్రారంభమయ్యాయి.

పొలాల్లా పడిపోయి ప్రోన్ పొజిషన్‌లో గెరిల్లాలపై కాల్పులు జరుపుతున్న పోలీసులకు మద్దతుగా క్యాంపులోని పోలీసులు రాపిడ్ ఫైరింగ్ చేస్తూనే మోర్టార్ షెల్స్ వేస్తున్నారు. పిడుగుపాటు శబ్దాలతో షెల్స్ పేలిపోతున్నాయి. గెరిల్లాలు మాత్రం చాలా ఆచి-తూచి కాలుస్తున్నారు. శత్రువుకు కొంత దూరంగా ఉన్న గెరిల్లాలు అసలు కాల్చడమే లేదు. శత్రువుకు తూటాల కొరతేముంది? షెల్స్‌కు తక్కువేముంది? కానీ గెరిల్లాలకు అన్నీ కొరతే. పది నిమిషాల ఫైరింగ్‌లోనే ముగ్గురు పోలీసులు నేలకూలగా, మరో ముగ్గురు గాయపడ్డారు. గుండె జారిన పోలీసులు మాత్రం వెంటనే కాలికి బుద్ధి చెప్పి చిటికెలో క్యాంపులో పడ్డారు. ఆ కాల్పుల మధ్యనే శత్రువు తూటాకు గెరిల్లా మంగ్డూ అమరుడయ్యాడు. అది గమనించిన సహచరులు ఇద్దరు ఒక్కదూటున లేచి వెళ్లి తమ సహచరుడి శవాన్ని వేగంగా తీసుకొచ్చి కమాండర్ వద్ద వేశారు. కిల్లింగ్ గ్రౌండ్ పరిస్థితి గమనిస్తున్న కమాండర్ సీజింగ్ కాషన్ ఇవ్వడంతో ఒక టీం కవర్ ఫైరింగ్‌లో వెళ్లి చచ్చిన పోలీసుల మూడు ఏ.కె.లు, వాళ్ల బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్లూ, వాళ్ల తూటాల పోచ్‌లూ అన్నీ ఖాకీల ఒంటిపై నుంచి స్వాధీనపర్చుకున్నారు. క్యాంపు నుంచి శత్రువు పిచ్చిగా తూటాలు కాలుస్తూనే ఉన్నాడు. మోర్టారు షెల్స్ వేస్తూనే ఉన్నారు. ఆ పరిసరాల్లోనే ఉన్న మందుపాతరల నిరోధక వాహనం గెరిల్లాల పైకి దూసుకురావడానికి సాహసించక ఉన్న చోటు నుంచే పిచ్చోడి చేతిలో రాయిలా గురి లేకుండా కాలుస్తూనే ఉంది. ఈ మధ్య ఒకే ఒక నెల రోజుల వ్యవధిలోనే గెరిల్లాల చేతుల్లో రెండు ఎం.పి.ఒలు తునాతునకలయ్యాయన్న వాస్తవం వాళ్లను నీరుగారుస్తోంది. వైర్‌లెస్ ఆపరేటర్ మొసపోస్తూ భయం, భయంగా పై అధికారులకు పంపిస్తున్న సందేశాలు గెరిల్లాలు వింటూనే ఉన్నారు.

అరగంటలో గెరిల్లా చర్య ముగిసింది. కిల్లింగ్ గ్రౌండ్‌లో పోలీసుల శవాలు దిక్కు లేకుండా పడి ఉన్నాయి. వాటిని తీసుకెళ్లడానికి క్యాంపు నుంచి ఏ పోలీసూ రావడం లేదు. క్యాంపులో నుంచి వాళ్ల కాల్పులు ఆగడం లేదు. నరేందర్ పక్కనున్న మంగ్డూ శవం విజయానికీ, త్యాగానికీ గల సంబంధాన్ని ఎత్తిపడుతోంది.

'వెళ్దాం' అన్న ఆదేశం కమాండర్ నుంచి రావడంతో గెరిల్లాలు మంగ్డూ శవాన్నీ, మూడు కొత్త తుపాకులనూ, బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లనూ పట్టుకొని విజయోత్సాహంతో బయలుదేరారు.

నరేందర్ మరోసారి ఎదురుగా ఉన్న బెజ్జి వైపు చూశాడు. శవంతోపాటు నడుస్తున్న నరేందర్‌కు బెజ్జి ఎర్రెర్రగా అగుపడుతోంది. పోలీసులు ఇంకా షెల్స్ వేస్తున్నప్పటికీ ఆ చప్పుళ్లకన్నా ఆయన ఊహల్లో బెజ్జిలో మళ్లీ ఆడుతున్న పిల్లల కేరింతలే వినపడుతున్నాయి. దాదాపు 20 ఏండ్ల కిందట తెలుగు గూడెంలోని యువతతో కబడ్డీ ఆడిన జ్ఞాపకాలు, ఆ ఆటలో గెరిల్లాల టీమే గెలిచి ప్రైజ్ పొందిన సంతోషం, బతికి చెడిన బెజ్జి సంస్థానాధీశుల వారసుల మెచ్చుకోలు సహా అలనాటి జ్ఞాపకాల చిత్తడిలో మునిగిన ఆయన తూటాల చప్పుళ్లకు విసురుగా తోకలు లేపుతూ పరుగెడుతున్న పశువులు నాగళ్లతో దున్నడానికి వెళుతున్నట్టు ఊహించుకుంటున్నాడు. సల్వాజుడుం సృష్టించిన విధ్వంసంలో నుంచి ఫీనిక్స్‌లా ఎన్నో ఊళ్లు పుట్టుకొచ్చినట్టూ బెజ్జి మళ్లీ వస్తుందన్న ఆశతో నరేందర్ శవం మోస్తున్న వాళ్లకు తన భుజాన్ని అందించాడు. నెత్తుటి వాసనల మధ్య ఆయన ఆలోచనలు బెజ్జి చుట్టే తిరుగుతున్నాయి. మట్టివాసనలతో మురిసిపోతున్నాయి.

మంగ్డూ శవం చుట్టూ వందలాది గెరిల్లాలు, జనాలు గుమిగూడి ఉన్నారు. శత్రువు నుంచి స్వాధీనం చేసుకున్న తుపాకులు శవం పక్కన విజయచిహ్నాంగా నిల్చి ఉన్నాయి. వాళ్లంతా మంగ్డూ గురించే మాట్లాడుకుంటున్నారు.

చాలా పేదరికంలో పుట్టి పెరిగిన మంగ్డూ గత ఆరేళ్లుగా విప్లవోద్యమానికే అంకితమై పని చేస్తున్నాడంటూ ఆయన

మంచితనాన్నీ, ఆదర్శాలనూ గెరిల్లాలు తలచుకుంటున్నారు. ఊరి పిల్లలు శవాన్నీ, తుపాకులనూ పదే పదే పుణికి పుణికి చూస్తున్నారు. శవంపై జనతన సర్కార్ వాళ్లు రెండు నక్షత్రాలతో పాటు మధ్యలో సారించిన విల్లును హత్తిన జెండాను కప్పారు. అప్పటికే కమాండర్ పార్టీ జెండా కప్పగా, తమ సంప్రదాయం ప్రకారం జనం శవం దగ్గర డబ్బులు పెడుతున్నారు. కలిగిన వాళ్లు కొత్త గుడ్డలనూ శవం పక్కన ఉంచుతున్నారు. అక్కడ ఎవరూ పెద్దగా శోకం పెట్టి మాత్రం ఏడవడం లేదు. విచారంతో మనసులు చిన్నపుచ్చుకుని చేష్టలుడిగినట్టు ఏ ఒక్కరూ అగుపడ్డం లేదు. 'జీవితమే యుద్ధం అయిన చోట, త్యాగమే జీవితమైన వేళ అలాగే ఉంటుందేమో'నని రాహీ సమాధానపడుతూ శవం గుండెపై గుర్తుగా మిగిలిన గాయాన్ని పరిశీలించి, జనాన్నీ, పిల్లలనూ చూస్తూ నరేందర్ వైపు అడుగులు వేశాడు.

'కామ్రేడ్ రాహీ! మంగ్డూ సంస్మరణ సభ జరిపి శవాన్ని వాళ్ల ఇంటికి పంపుదాం' అంటున్న నరేందర్ మాట ముగుస్తూండగానే రాహీ తలూపుతూ 'సరే' అన్నాడు.

ముగ్గురు ముగ్గురుతో కూడిన వరుసల్లో గెరిల్లాలు, ప్రజలు నిశ్శబ్దంగా శవం ముందు నిల్చున్నారు. 'ఉల్టాశస్త్ర్' కాషన్ వినబడడంతో గెరిల్లాలు తమ టోపీలు తీసి, తుపాకి గొట్టాలను నేల వైపు చేసి అమరుడికి గౌరవంగా, ఆయనను స్మరిస్తూ మౌనంగా తలలు వంచి నిల్చున్నారు. నిముషం తర్వాత వాళ్లంతా 'పొడియం మంగ్డూ అమర్ రహే, అమరవీరుల ఆశయాలను కొనసాగిద్దాం, గ్రీన్‌హంట్‌ను ఓడిద్దాం, దండకారణ్యాన్ని విముక్తి చేద్దాం, భారత కమ్యూనిస్టు పార్టీ (మావోవాది) జిందాబాద్, పిఎల్‌జిఎ జిందాబాద్' అంటూ ఒక్కసారి గొంతెత్తి నినదిస్తుంటే మధ్యలో దూరంగా హెలికాప్టర్ వెళుతున్న చప్పుడు విన్న రాహీ మృతపోలీసుల కోసం 'పుష్పక విమానం' వెళుతూందనుకున్నాడు.

శవం ముందు కూచున్న గెరిల్లాలనూ, ప్రజలనూ ఉద్దేశించి కమాండర్, రాహీ మాట్లాడారు. మంగ్డూ జీవితాన్ని కమాండర్ ప్రజలకు పరిచయం చేయగా, రాహీ మంగ్డూ ఆశయాల స్ఫూర్తితో ప్రజాయుద్ధాన్ని మరింత తీవ్రం చేయాలన్నాడు. 'దండకారణ్యాన్ని వల్లకాడుగా మార్చాలని ఈ మధ్యే మాడ్ కొండల్లోకి భారత సైన్యం దిగింది. ఇప్పటికే ఖాకీల దాడులతో మన దగ్గర వందలాది ఆదివాసీ గ్రామాలు బెజ్జిలా తయారయ్యాయి. వందలాది మంది ప్రజలు, గెరిల్లాలు ఆత్మరక్షణా పోరాటంలో తమ అతి విలువైన ప్రాణాలు ధారపోస్తున్నారు. దండకారణ్య భూమిలో దాగి ఉన్న గనులు, ఖనిజాలు కబళించడానికే ఖాకీలు దిగాయి. వాటికి అండగా ఇప్పుడు సైన్యం దిగింది. కానీ ఇక్కడి మట్టంతా నెత్తుటి వాసనతో, నీళ్లన్నీ ఎరుపు రంగుతో, గనులూ, ఖనిజాలూ పడియోర సుదీర్ఘ పోరాట చరిత్రతో, అడివంతా ఆత్మగౌరవంతో, ఆకాశమంతా అమరుల సందడితో జీవిస్తుందనీ భారత సైన్యాలకు గట్టిగా తెలుపుదాం, దోపిడీ పాలకవర్గాలు వదిలిన ఆఖరి అస్త్రం సైన్యాన్ని సైతం ఎదుర్కోవడానికి మనం సిద్ధం కావాలి' అంటూ బిగించిన పిడికిలి పైకి ఎత్తడంతో మరొక్కసారి విప్లవ నినాదాలు మిన్నుముట్టాయి.

శవానికి అంతిమ వీడ్కోలు చెప్పడంలో భాగంగా గెరిల్లాలు వరుసగా ఒక్కొక్కరూ వచ్చి మంగ్డూకు బిగించిన పిడికిళ్లతో లాల్‌సలాం చేస్తున్నారు. మహిళలు కొద్దిమంది మాత్రం ఆదివాసీ సంప్రదాయం ప్రకారం ప్రేమగా శవం తల నిమురుతూ తమ తలకు వేళ్లు నొక్కుకుంటున్నారు. ఆదివాసీలలో అది ఆప్యాయతకు నిదర్శనం. దూరంగా నరేందర్ రేడియో వార్తలు వింటూ భారంగా తలూపడం చూసిన రాహీ అటు కదిలాడు.

'కామ్రేడ్, ఛత్తీస్‌గఢ్ వార్తలన్నీ ప్రజలను చాలా రెచ్చగొడుతున్నాయి. నెలరోజుల్లో మన చేతిలో దాదాపు 40 మంది పోలీసులు చనిపోయారనీ, ప్రజలంతా అతి సంవేదనాభరితంగా ఉన్నారంటూ న్యూస్‌రీడర్ తాజా వార్తగా కోయ కమాండోలతో కూడిన పోలీసు వాహనం ఒకటి ఇప్పుడే తృటిలో మందుపాతర ప్రమాదం నుంచి బయటపడిందని చెప్పాడు. వల్లకాడుగా మారిన బెజ్జి గురించి వాస్తవాలను దాచి పెట్టిన మీడియా, సైన్యం దిగిందన్న నిజాన్ని మరుగున పెడుతున్న మీడియా జనాలను రెచ్చగొట్టడానికి అంకితమైంది' అంటూ నరేందర్ చెపుతుండగా శవాన్ని గెరిల్లాలు ట్రాక్టర్ వద్దకు తరలించారు. వందలాది జనం 'పొడియం మంగ్డూ అమర్ రహే' అంటూ నినదిస్తుండగా ట్రాక్టర్ హెడ్‌లైట్లు ప్రసరించిన వెలుగులతో దారి అంతా కాంతులు చిమ్మింది. ఆకాశంలోని నెలవంక పూర్ణిమ వైపు సాగుతోంది. 24 గంటల్లో మంగ్డూ జీవితం చరిత్రకెక్కింది. పోరాట వారసుడిగా అది పడియోర జాబితాలో చేరింది. నెత్తుటి వాసనలతో ట్రాక్టర్ సాగింది. కొత్త స్మృతులతో మంగ్డూ జీవితం మొదలైంది.

స్మృతి నెగళ్లు

రాహీ దళం ఇంద్రావతి నదిని దాటింది. నది మోకాలు లోతు మించని నీళ్లతో పారుతోంది. కొన్ని చోట్ల మరీ తగ్గింది. ఏప్రిల్ నెలలోనే నది ఇంత చిక్కిపోతే జూన్ ఎండలకు ఇంకెంత చిక్కిపోతుందోనని ఊహించుకుంటూ దళంతో పాటు నది దాటిన రాహీకి ఎదురుగా ఎత్తైన కొండ అగుపడింది. ఒక్కసారి కళ్లు పైకి లేపి చూశాడు. కానీ కొండ శిఖరం కనుచూపు మేరలో అగుపడలేదు. 'ప్చ్! కాకూర్, దారకొండ, డొంకరాయి కొండల ముందు ఈ కొండెంత?' అనుకుంటూ ఎత్తైన ప్రతి కొండ ఎక్కే ముందు గత అనుభవాలను గుర్తు చేసుకోవడం అలవాటైన రాహీకి అదే కొండెక్కే ధైర్యాన్నిస్తోంది.

కొండెక్కుతున్న రాహీకి వెనుక వస్తున్న శ్యాం అగుపడడం లేదు. కానీ శ్యాంకన్నా భారీకాయం రఫీక్ మోస ఎగబోస్తూ, కొండెక్కుతూ అగుపడ్డాడు. 'శ్యాంకన్నా 20 ఏండ్లు చిన్నవాడు. ఆ మాత్రం ఎక్కకపోతే రఫీక్‌ను యువకుడని ఎలా అంటాం?' అని తనలో తానే అనుకుంటూ ముసిగా నవ్వుతూ రాహీ ముందుకు చూస్తే బక్కపల్చని రతన్ ఊతకర్రతో వడివడిగా అడుగులు వేస్తూ అగుపడ్డాడు. ఎండలో నడుస్తున్న మోతి ముఖం కందిపోయి కోతిముఖంలా తయారై అందర్నీ నవ్విస్తోంది. నడుస్తున్న దళం పది నిముషాల్లో శిఖరాన్ని చేరింది. కమాండర్ చిన్నగా విజిల్ ఊదడంతో అందరూ ఆగిపోయారు. తల మీది బరువులూ, వీపుల కిట్లూ దించుకున్నారు. తమ వెంట తెచ్చుకున్న ప్లాస్టిక్ డబ్బాల్లోని నీళ్లు గటగటా తాగి, చెమటలు కక్కుతున్న ముఖానికి చేతి

రుమాలుతో గాలి తగిలిస్తున్నారు.

తొలిదళాల వాళ్ల చేతుల్లో వేసవి వేస్తుందంటే నీళ్ల కోసం జనం దగ్గర అడుక్కున్న సొరకాయ బుర్రలే ఉండేవి. వాటికి దట్టంగా చెట్ల నార అల్లడం, అదీ అందమైన డిజైన్‌లో అల్లడం, స్టైల్‌గా జబ్బకు వేలాడదీసుకుని నడవడం గుర్తొచ్చిన రాహీకి ప్లాస్టిక్ డబ్బాలను పరిచయం చేసిన రంగన్న వెంటనే గుర్తొచ్చాడు.

రంగన్న కమ్మరి కులస్థ నేపథ్యం ఉంది. జగిత్యాల ప్రాంతం వాడు. పనిలో మంచి నిపుణుడు. నిరంతరం కష్టపడే అర్ధశ్రామికుడు. దశాబ్దంన్నర కాలం విప్లవోద్యమంలో పని చేసిన ఆయన గెరిల్లా జీవితానికి సరిపడే టెక్నిక్కులు కనిపెట్టడంలో, సరళమైన సాహితీ రచనల చేయడంలో, ప్రజల బాణీల్లో పాటలల్లడంలో మంచి పట్టు సాధించినవాడు. కానీ అనైతికత ఆయనలో పరాకాష్టకు చేరి ఆయన విప్లవ జీవితానికి చరమగీతం పాడింది అంటూ తనలో తానే సుదీర్ఘ గతాన్ని గుర్తు చేసుకుంటుండగా శ్యాం ఆయన ముందు కిట్టు దించుకుని చతికిలపడ్డాడు.

'మాకన్నా ఏడు నిమిషాలు, రఫీక్ భాయి కన్నా నాల్గు నిమిషాలు లేటు' అన్నాడు శ్యాంను ఉద్దేశిస్తూ రాహీ.

శ్యాం ముసిముసిగా నవ్వుతూ 'అంతే కదా!' అన్నాడు.

'చూడు శ్యాం, గుట్టకు ఏడు నిమిషాలు, గంటకు 10 నిమిషాలు నీవు వెనుకబడితే మనం నరేందర్‌ను చేరడానికి కనీసం పది గుట్టలు ఎక్కి దిగాలి, కనిష్టంగా 70 గంటలు నడవాలి అంటే నీవు ఎంత వెనుకబడతావో చెప్పు' - రాహీ.

'అబ్బ! లెక్కల గొడవ పడలేక ఇంట్లో, స్కూల్లో చివాట్లు పడేవాడిని. నువ్వు మళ్లీ ఇక్కడ అదే లెక్కల ప్రశ్నతో వస్తున్నావు. నీ ముందు వరుసలో మా లెక్కల టీచర్ మీనా ఉంది. ఆమెను అడుగు. అయినా రాహీ, చేగువేరా చెప్పాడు కదా, 'గంటకు ఒక దళం ఎంత వేగంగా వెళ్తుందంటే, చివరివాడి వేగమంత' అని, కాబట్టి మీరెంత పరిగెత్తినా నా కోసం ఆగాల్సిందే కదా, వీ ఆర్ కామ్రేడ్స్ ఇన్ ఆర్మ్స్' అంటూ గలగలా నవ్వాడు. రాహీ ఆ నవ్వులో భాగమయ్యాడు.

చిన్నగా రెండు విజిల్స్ రావడంతో అందరి కిట్లూ యథావిధిగా వీపెక్కాయి. మూటలు తల మీద కూచున్నాయి. నడక సాగుతోంది. అరగంట నడిచిన దళం ఓ చోట ఆగింది. ఈ పూట ఇక్కడే మన డేరా అన్నాడు రతన్. అందరికన్నా సంతోషంగా రాహీ, శ్యాం, రఫీక్‌లు క్షణం కూడా లేట్ చేయకుండా కిట్లు దించుకున్నారు. పాలిథీన్ షీట్లు పరుచుకున్నారు. కాళ్లు బార్లా జాపి చేతులు వెనక్కి ఆన్చి అలసిన ముద్రలో కూచున్నారు.

ముగ్గురు పెద్దల అవస్థ చూసిన సమర్ వినయంగా చాయ్ సంచీ, మగ్గూ తీసుకుని కిచెన్ వైపు దారి తీశాడు. అరగంటలో ముగ్గురికి చాయ్ అందడంతో వాళ్లు ఛాయ్ తాగుతూ తమ అలసట తీర్చుకున్నారు.

'ఈ రోజు బ్రూస్‌లీ సినిమా చూడాలి' అంటూ గడుగ్గాయ్ వికాస్ తన ప్రతిపాదనను ముందుకు తెచ్చాడు. 'లేదు, ఓంపురి నటించిన 'అర్ధసత్య' అంది కరుణ. '300 స్పార్టా అవుతేనే నేను చూస్తా' అన్నాడు గగన్. 'నాది మరో ప్రపోజల్ ఉంది. హమ్ ఖేలే హై జీ జాన్‌సే 'కొత్తగా వచ్చిన సినిమా ఉంది. అది చూద్దాం. అది స్వాతంత్ర్య సమరం నాటి చిట్టగాంగ్ ఘటన ఆధారం చేసుకుని తీశారు. సూర్యాసేన్ పాత్రకు అభిషేక్ సరిపోలేదు గానీ సినిమా మనం చూడొచ్చు' అన్నాడు రఫీక్. 'ఈ ప్రపోజల్ బాగుంది' అన్నాడు శ్యాం. క్షణాల్లో బ్యాటరీ, డీవీడీ అన్నీ తయారైనాయి. ప్రేక్షకులూ వచ్చారు. 'గెరిల్లాలు తెలుగుకన్నా హిందీనే ఎందుకు కోరుకుంటారు శ్యాం' అన్నాడు రాహీ.

'మన చర్చలు తర్వాత బాబు, ముందు చిట్టగాంగ్ సినిమా చూద్దాం' అంటూ శ్యాం కళ్లజోడు సర్దుకుంటూనే 'మనది ఉత్తరాది ప్రయాణం కదా' అని మాత్రం కలిపాడు.

రోజుకు మూడు పూటలూ నడుస్తూ, ఒకటీ, రెండు కొండలు రోజూ ఎక్కుతూ, దిగుతూ పది రోజుల్లో రాహీ దళం నరేందర్ వద్దకు చేరింది. రాహీ దళానికి స్వాగతం పలుకుతూ దాదాపు అరఫర్లాంగ్ పొడవుతో నిల్చున్న గెరిల్లాల లైన్‌లో నరేందర్ ఎక్కడబ్బా అనుకుంటూ రాహీ కళ్లు లైన్ వెంట పరుగెడుతున్నాయి. సందెలు పడే వేళ ఆ శ్యామవరుణుడు ఎక్కడబ్బా అనుకుంటూనే ప్రతీవాళ్లను పరికించి చూస్తూ 'లాల్‌సలాం' అంటూ ఆప్యాయంగా బదులు చెప్పుతూ ముందుకు కదులుతున్నాడు. రెండడుగుల దూరంలో మరో కామ్రేడ్ ఆవల నరేందర్ ఆకారం అగుపడడంతో రాహీ ముఖం శుభోదయం కమలంలా విప్పుకుంది. నరేందర్ అంతే ఆప్యాయంగా తన చేయి చాచడంతో రెండు చేతులూ బలంగా కరచాలనం చేసుకున్నాయి. సీనియార్టీ, పెద్దా అనే పనికిమాలిన భావన వాళ్లిద్దరి ఆలింగనానికి అడ్డు తగిలి నిండుగా ఇద్దరూ కళ్లతోనే 'క్షేమం' అన్న సైగలు చేసుకున్నారు. అలా మరో 50 అడుగులు వేయడంలో 'లాల్ సలాం' సంప్రదాయం ముగిసింది.

'ప్రయాణం ఎలా సాగింది? మనవాళ్లంతా క్షేమమేనా' - నరేందర్.

'ఆ! పెద్ద ఇబ్బంది ఏం కాలేదు. పోలీసులు అంతా ఉప ఎన్నికల లొల్లిలో మునిగారు. చాలా చోట్ల అదనపు పోలీస్ క్యాంపు వేశారు' - రాహీ.

'మోతీ! మీ బ్యాచ్ వాళ్లు ఆ ఇప్పచెట్టు నుంచి ఈ తిర్మన్ చెట్టు వరకూ కవర్లు చూసుకోండి కామ్రేడ్. తూర్పు దిశకు ఫైరింగ్ ఆర్క్ చెప్పు. ఉదయాన్నే ఒక పందిరి వేస్తే నీడ అవుతుంది' అంటూ గెరిల్లా బలగాల కమాండర్ మోతీతో చెప్పి వెళ్లిపోయాడు.

మోతీ తన దళం వాళ్లందరికీ కవర్లు చూపింది. పరిసరాల్లో తాడివనంలాగే పెద్ద-పెద్ద తాడిచెట్లుండడంతో ఉదయాన్నే తాటి కమ్మలతో చల్లని పందిరి వేసుకోవచ్చు అని మనసులో ఊహించుకున్న మోతీ ఆ మాటే సోనారు, గగన్‌లతో అంది.

వాళ్లిద్దరూ ఒకేసారి 'ఇంగో' అన్నారు.

రాహీ, నరేందర్, శ్యాం, రఫీక్‌లు తమ మాటల్లో తామున్నారు. పశ్చిమాసియా నుంచి అన్నా హజారే వరకు వాళ్ల చర్చలు నడుస్తున్నాయి.

'పట్టణ యువతలో గూడు కట్టుకున్న నిరసనను, నిప్పులు చెరుగుతున్న ఆగ్రహాన్నీ హజారే చక్కగా తన అవినీతి వ్యతిరేక

పోరాటం వైపు మళ్లించుకోగలుగుతున్నాడు. నిజానికి వీళ్లంతా విప్లవోద్యమంలో సమీకరించబడాల్సిన వాళ్లు' అన్నాడు రఫీక్.

'అవును, పరిస్థితి చాలా అనుకూలంగా ఉంది. కానీ ఏం లాభం? మనం పట్టణాల్లో చాలా దెబ్బ తిన్నాం కదా' శ్యాం.

'ఆ నిప్పు కణికలు చల్లారేవి కావు. అన్నాకు అంత శక్తి లేదు. మన అడవి ఉద్యమం తప్పకుండా త్వరలోనే వాళ్లను చేరుకోగలుగుతుంది' అన్నాడు రాహీ.

'అదేలా?' అన్నాడు నొసలు చిట్లిస్తూ రఫీక్.

'మన నరేందర్ చింతల్‌నార్ రిపోర్టు చెప్పితే మీకే తెలుస్తుంది' అన్నాడు రాహీ.

'సరే, మీరు అలిసిపోయి ఉన్నారు. రేపుదయం కూచుందాం' అంటూ నరేందర్ చర్చకు తెర దించాడు.

* * *

ఉదయం నాల్గుగంటలకే క్యాంపు అంతా అలర్ట్ అయ్యారు. క్యాంపు చుట్టూ పరిసరాలు చెక్ చేయడానికి పెట్రోలింగ్ బ్యాచ్‌లు వెళ్లి వచ్చాయి. ఆరు గంటలకు ముందే రోజంతా ప్రచండ నిప్పులు కురిపించే రవితేజుడు తన ప్రతాపంతో కొండల్లో నుంచి పొడుచుకు వస్తున్నాడు. ఉదయాన్నే పాచి అంబలి తాగి కడుపు చల్లార్చుకున్న గెరిల్లాలు స్నానాలకు బయలుదేరారు. అప్పటికే స్నానం పూర్తి చేసుకున్న రాహీ, శ్యాంలు నరేందర్ వద్దకు చేరుకున్నారు. రఫీక్ స్టెత్ పట్టుకుని బి.పి. ఆపరేటర్‌తో తన టీంను వెంటేసుకొని అన్ని డేరాలు తిరుగుతున్నాడు.

'క్యా రఫీక్ భాయి? మరీంజోంకా హాల్ క్యాహై?' (ఏమండీ రఫీక్‌గారూ! రోగుల పరిస్థితి ఎలా ఉంది?) - రాహీ ప్రశ్న.

'ప్రస్తుతం బాగానే ఉంది' అంటూ డాక్టర్ జవాబు ఇచ్చాడు. 'మీ బి.పి. చూడమంటారా? డాక్టర్ ప్రశ్న.

'థాంక్స్, ఫర్వాలేదు. తర్వాత మీ వద్దకే వస్తాను' రాహీ జవాబు.

నరేందర్ ఇవేవీ పట్టించుకోవడం లేదు. ఆయన ఆలోచనలన్నీ తింపురం, ముర్రుం, తాడిమెట్లల చుట్టే తిరుగుతున్నాయి. మార్చ్ 11-16 మధ్య జరిగిన ఘటనలే ఆయన గుండెల్లో పొటమరిస్తున్నాయి.

'రాహీ, ఏప్రిల్ నుంచి మన టి.సి.ఒ.సి. ప్రారంభమవుతుంది కదా! దానికి ముందే మనలను ఒక గట్టి దెబ్బ తీయాలనే పెద్ద ప్లాన్‌తోనే పోలీసులు దాడికి వచ్చారు. అలాగే 2010 ఏప్రిల్ 6, మన పిఎల్‌జిఎకు గొప్ప విజయ దినం. దానికి విరుగుడుగా ముందే పోలీసులు మనపై దాడికి దిగారు. ఇదీ వాళ్ల దాడికి అసలు నేపథ్యం. కాకపోతే అనేక కట్టుకథలు మీడియాకు విడుదల చేశారు' అంటూ నరేందర్ రిపోర్టు మొదలుపెట్టి ఒక్కసారి చుట్టూ పరిసరాలు కలియజూశాడు.

నరేందర్‌లో ఎలాంటి ఉద్వేగం, ఉద్రేకం కనబడడం లేదు. ఉద్రిక్తత అంతకన్నా లేదు. తాను చెప్పాల్సిన విషయాలు చాలా నెమ్మదిగా, సౌమ్యంగా తన వాళ్లతో పంచుకుంటున్నాడు. ఏ విషయం చెప్పినా మూలాల్లోకి వెళ్లి అమూలాగ్రంగా చెప్పడం ఆయన స్వభావం. ఆయన అందులో ఎంతగా లీనమైపోతారంటే ఆయన చెప్పింతర్వాత ఎదుటి వాళ్లకు మళ్లీ ప్రత్యేకంగా ఎదురు అడగడానికి పెద్దగా ఏమీ మిగలకుండానే చెప్పడాన్ని ఆయన ఒక కళగానే అభ్యసించాడు. నరేందర్ మళ్లీ తన సంభాషణను ప్రారంభించాడు.

మార్చ్ 11నాడు పోలీసులు ఉదయాన్నే ముర్రుం (మోరపల్లి) చేరారు. పోలీసులు వస్తున్న సమాచారం మిలీషియా అందించిన వెంటనే గ్రామస్తులు ఎప్పటిలాగే అడవిలోకి జారుకున్నారు. మాడవి చూలాలు మాత్రం చెట్టుపై దాక్కుంటే అగుపడనేమో అనుకొని చింతచెట్టు ఎక్కాడు. కాగా పోలీసుల రాక కబురు వినని మహిళలు ఇద్దరు ఊళ్లోనే ఉండిపోయారు. ఊరి పక్కన ఇప్పపూలు ఏరుకుంటున్న ఒక కుటుంబం అక్కడే ఉండిపోయింది. ఊళ్లోకి వచ్చిన పోలీసులు వెంటనే ఇండ్లపై పడ్డారు. చేతికి దొరికిందల్లా సదురుకున్నారు. కంటబడిన ఇద్దరు మహిళలపై అత్యాచారం చేశారు. ఇదంతా జరుగుతుండగానే ఇండ్లకు నిప్పంటించే బ్యాచ్ ఆ పని పూర్తి చేసింది. ఇప్పపూలు ఏరుకునే తండ్రి, కూతురు, కొడుకును కాపలా నిలిచిన పోలీసులు కట్టడిలో తీసుకున్నారు. తమ పని ముగిశాక పోలీసులు క్షణం కూడా ఆలస్యం చేయకుండా వచ్చిన దారిన ముగ్గురు గ్రామస్తులతో బయలుదేరారు. వెనక్కి వెళుతున్న పోలీసుల్లో ఒక కోయ కమాండో తన డేగచూపులతో చెట్టు పైనున్న చూలాలును పసిగట్టిన వెంటనే ఫైర్ చేశాడు. ఆ కాల్పుల్లో చూలాలు పైనే కన్నుమూశాడు. ఈ కబురు మాకు సరిగ్గా 10.30కు చేరింది. మేము ఏ మాత్రం ఆలస్యం చేయకుండా పరుగు పరుగున ముర్రుం వెళ్లేసరికి సరిగ్గా పగలు 12 అయింది' అంటూ నరేందర్ గట్టిగా శ్వాస పీల్చి వదిలాడు.

'ఇదన్న మాట పోలీసుల ప్రతాపం. నక్సలైట్ల ఆయుధాల ఫ్యాక్టరీని ధ్వంసం చేయడానికి వెళ్లినారన్న వార్తలోని వాస్తవం ముర్రుంలో 33 ఇండ్లకు నిప్పంటించడం. వీళ్లన్న మాట ప్రజల హృదయాలనూ, మెదళ్లనూ గెల్చుకునేవాళ్లు' అన్నాడు శ్యాం.

'ప్రాణాలు తోడేసే మృత్యుక్రీడలో పోలీసులు చరమ స్థాయికి చేరారు శ్యాం. చూలాలును చెట్టుపైనే కోయ కమాండోలు కాల్చడం రజాకార్లను తలపింపజేస్తున్నది. గర్భిణీ స్త్రీల పొట్టలను చీల్చడం, చిన్నారి పిల్లల చేతివేళ్లు నరకడం, వృద్ధురాళ్ల వక్షోజాలు కోయడం, యువతులపై మృగాల్లా పడి సామూహికంగా అత్యాచారం జరపడం, పురుషుల మర్మాంగాలను నుజ్జు నుజ్జు చేయడం అబ్బా! ఇరాక్‌లోని అబూగ్రేబ్‌లాంటి జైళ్లలో అమెరికా సైనికుల ఆగడాలను గుర్తుకు తెస్తున్నాయి శ్యాం' అన్నాడు రాహీ.

ఎండ తీక్షణం పెరిగింది. తాటికమ్మలతో వేసిన పందిరిగావడంతో కొంత చల్లగానే ఉంది. పందిరి గుంజకు వేళాడుతున్న షాగల్ తీసుకుని చల్లటి నీళ్లు ముగ్గురూ తాగారు. బయట ఎవరూ అగుపడడం లేదు. సెంట్రీ వెళ్లాల్సినవాళ్లు వెళుతుంటే, డ్యూటీ ముగిసిన వాళ్లు డేరాల్లోకి వచ్చి సేద తీర్చుకుంటున్నారు. నరేందర్ తిరిగి తన జ్ఞాపకాల్లోకి వెళ్లాడు. ఆయనలో జ్వలిస్తున్న ఆ స్మృతి నెగళ్ల సెగలు బయటి వేడికన్నా ఎక్కువగా ఆయనను దహించి వేస్తున్నాయనడానికి ఆయన గంభీర ముద్రే సాక్ష్యంగా ఉంది.

'మన గెరిల్లాలంతా ఊళ్లోకి వెళ్లేసరికి ఊరి దృశ్యం చాలా భయంకరంగా అగుపడుతోంది. ఇండ్లు తగలబడిపోతున్నాయి. ఆ అగ్నికీలలకన్నా ప్రజల గుండెలు అధికంగా రగిలిపోతున్నాయి. దూరి తమ ప్రాణం కన్నా మిన్నగా చూసుకునే ధాన్యం, పప్పులు, అడవి గెడ్డలూ జనం ఆ మంటల్లోనే బయటకు తెచ్చుకుంటున్నారు. ఎండిన మాంసం ముక్కలు మాడులు అయ్యాయి. అవి కాలి గబ్బు వస్తున్నాయి. పోలీసులు చంపిన కోళ్లు, పందులు, మేకల తోళ్లన్నీ కాల్పులతో కమురు వాసన వేస్తూ అడవి గాలి అంతా కలుషితమైపోయింది. ఆ దృశ్యాలు చూసిన గెరిల్లాలు ప్రజలతో కలిసిపోయారు. పొద్దుగూకులు మేమంతా అక్కడే ఉండి మంటలు చల్లార్చి సాయంకాలం తిరిగే డేరాకు బయలుదేరాం. ఇండ్ల మంటలు చల్లారాయి గానీ వాళ్ల గుండెల్లోని మంటల్ని చల్లార్చడం ఎవరి వల్లవుతుంది రాహీ?' అంటూ నరేందర్ ఆగాడు.

'పోలీసులు తమ వెంట తీసుకెళ్లిన రైతు, ఆయన కూతురు, కొడుకు పరిస్థితి ఏంటి?' అంటూ శ్యాం, నరేందర్ వైపు చూశాడు.

'ఆ! వాళ్లను విడిచిపెట్టాలని కోరుతూ 25 మంది ఊరి మహిళలు తెల్లారి చింతల్‌నార్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. పోలీసులతో ఘర్షణపడ్డారు. చివరకు రైతునూ, ఆయన కొడుకునూ, ఒంటి మీద గుడ్డలు లేని స్థితిలో అతి దైన్యంగా అగుపడుతున్న ఆయన కూతురునూ ఠాణా నుంచి తమతో పాటు ప్రజలు ఊళ్లోకి తెచ్చుకున్నారు' అంటూ సమాధానమిచ్చాడు నరేందర్.

'గొప్ప జనం! అది కాశ్మీరైనా, మణిపూరైనా, దండకారణ్యమైనా 'ఘర్షణ ప్రాంతాలు' ఏవైనా ప్రజల సమస్యలు ఒకటే. వాళ్ల ఔన్నత్యం చాలా గొప్పది. ఒకనాడు దొరల గడీల్లో అత్యాచారానికి గురైన ఆడపడుచులను తెలంగాణ వీరజనం ఇదే విధంగా తమ అక్కున చేర్చుకున్నారు. పోలీసుల పోరుబిడ్డలపై అత్యాచారాలు చేయగల్గుతున్నారేమో గానీ వాళ్ల గుండెల్లోని ఆశయాల సౌధాలను చీల్చడం ఎవరి తరం అవుతుంది నరేందర్?' అంటూ శ్యాం చాలా ఉద్రేకంగా తన భావాలను వాళ్ల ముందు పెట్టాడు.

నరేందర్ ఔనన్నట్టు తలూపుతూ మళ్లీ రిపోర్టును మొదలు పెట్టాడు. "12వ తేదీ పోలీసులు ఎవరూ ఠాణా బయటకు రాలేదు. 13నాటి ఉదయాన్నే మేం మళ్లీ ఊరు పరిసరాల్లోకి వెళ్లాం. ప్రజలు తమ పనిలో తాము ఉంటే వాళ్లకు మేం రక్షణగా ఉండిపోయాం. సరిగ్గా ఉదయం 11 గంటలకు చాలా దూరంగా అస్పష్టంగా ఏవో కేకలు పకడో! పకడో! అంటూ వినపడ్డాయి. మళ్లీ తోడేళ్ల మంద వస్తుందనుకున్నాం. మేం చాలా అలర్ట్‌గా ఉంటూ ప్రజలను అలర్ట్ చేశాం. కానీ మధ్యాహ్నం వరకూ వాళ్ల జాడ లేదు. దీంతో మేం భోజనాలకు వెళ్లిపోయాం. పగలు రెండు గంటల పుల్లాన్‌పెల్లి వైపు మోర్టార్ షెల్స్ పడిన చప్పుడు విన్నాం. వెంటనే ఏమాత్రం ఆలస్యం చేయకూడదంటూ కమాండర్ అనడం పూర్తికాక ముందే గెరిల్లాల పరుగు మొదలైంది. మళ్లీ మేమంతా ఊరి పరిసరాల్లోకి చేరేసరికి చీకటి పడింది. కాసేపు అక్కడే ఆగిపోయాం. తింపురం ఊళ్లో ఖాకీలున్నట్టు అర్థమైంది. మేం ఇండ్ల పక్క పొలాల్లోనే కవర్లు తీసుకుని కూచున్నాం. పోలీసులు తెల్లవార్లూ చావుభయంతో కాల్పులు జరుపుతూనే ఇండ్ల బయటికి రాకుండా ఊళ్లోనే బందీలయి ఉండిపోయారు. మేం పొద్దుపొడవక ముందే ఊరికి దూరంగా అడవిలో పోలీసులు వెళ్లే దారిలో మాటుదాడికి కూచున్నాం. 14 నాడు ఉదయం 10 గంటల వరకు ఊళ్లో నానా బీభత్సాన్ని సృష్టించి మెల్లగా కొల్ల సొమ్ముతో బయలుదేరారు. వీళ్ల ప్రతి చర్యా, ప్రతి కదలికా జనం మాకు వేగుల్లా వెంట వెంట చేరవేస్తున్నారు. సరిగ్గా 10.45 నిమిషాలకు 350 మంది కమాండోలు మా మధ్యకు చేరుకున్నారు. ఇంకేముంది? మన స్నైపర్ సమీర్ కాల్చిన మొదటి తూటాకే ఒక కోయ కమాండో కిమ్మనకుండా నేలకూలిపోయాడు. సమరం మొదలైంది. 12.15కు కాల్పులు ఆగిపోయాయి. మన సీజింగ్ బ్యాచ్ అడ్వాన్స్ అయి కిల్లింగ్ జోన్ అంతా గాలింపు జరిపింది' అంటూ నరేందర్ చెపుతుండగానే శ్యాం మధ్యలో ఆపాడు 'కిల్లింగ్ జోన్ ఎంత స్థలం ఉంటుంది?' అంటూ.

'అక్కడికే వస్తున్నాను శ్యాం, మన గతకాలం కిల్లింగ్ జోన్ 80-100 గజాలు మించేది కాదుగా, కానీ ఇప్పుడు మనం, మన ప్రజా మిలీషియా, ప్రజలు అందరం కలిసే యుద్ధం చేస్తున్నాం కదా! శత్రువు కూడా వందల సంఖ్యలో వస్తున్నాడు. కాబట్టి కిల్లింగ్ జోన్ అర కిలోమీటరుకు తగ్గడం లేదు' అంటూ నరేందర్ రిపోర్టును కొనసాగించాడు. 'కిల్లింగ్ జోన్‌లో ముగ్గురు కోయ కమాండోల శవాలు, మూడు తుపాకులు దొరికాయి. ఈలోగా వందలాది జనం మన చుట్టూ మూగారు. మనం మన వీర గెరిల్లా ముచాకి గంగాల్‌ను కోల్పోయాం. ప్రజలు కిల్లింగ్ జోన్ అంతా మహాసంబరంగా తిరిగారు. ఊళ్లోకి పారిపోతున్న పోలీసులు దారెంట పారేసుకున్న కొల్ల సొమ్మంతా ప్రజలు తిరిగి సంతోషంగా స్వాధీనం చేసుకున్నారు. ముక్కుపుల్లలు, చెవుల పోగులు, దండ కడియాలు, కత్తులు, విల్లంబులు, డబ్బు, కోడి, పంది, మేకలు చివరకు పచ్చి మాంసపు ముద్దలు కూడా జనం వదలలేదు. అవి వాళ్ల కష్టార్జితం కదా! ఎలా వదులుతారు. మేం పగలు రెండు గంటల వరకు ప్రజల వేడుకలో భాగమై అక్కడే ఉండిపోయాం. ఊళ్లో చిక్కిపోయిన పోలీసులు తమ అధికారులతో జరుపుతున్న సంభాషణను మేం దాడిలో వాళ్లు వదిలేసిన వాకీలో స్పష్టంగా వినగలిగాం. కాలిన ఇండ్లల్లో దాగిన పోలీసులు ఒక్క అడుగు కూడా బయటకు రావడానికి సాహసించడం లేదు. "మన కమాండోలు ముగ్గురు చచ్చారు. అదనపు బలగాలు రాకుండా మేం ఇక్కడి నుంచి రాలేం. చాలామంది కమాండోలు గాయాలతో పడి ఉన్నారిక్కడ'' అంటూ పోలీసులు ఇక్కడి నుండి మెసేజ్ పంపుతుంటే అవతలి నుంచి డిఐజి కల్లూరి గట్టిగా ఆదేశాలిస్తున్నాడు - 'నాకు వంద శవాలు కావాలి. మీరు ఏమైనా చేయండి. మీకు హైదరాబాద్ నుండి హెలికాప్టర్‌లో తూటాలు వస్తున్నాయి. గాయపడిన వాళ్లను హెలికాప్టర్‌లో తరలించండి షాల్' అంటూ కల్లూరి అరుస్తున్నాడు. ఈలోగా హెలికాప్టర్ వచ్చి ఇండ్ల పక్కన వాలింది. గాయపడిన కమాండోలను తరలించారు. కమాండోల శవాలు మాత్రం ఇంకా మా స్వాధీనంలోనే ఉన్నాయి. మేం మధ్యాహ్నం మూడు వరకు ప్రజలతో ఉండి వాళ్లను జాగ్రత్తగా అడవిలోకి వెళ్లండి అని చెప్పి ముచాకి గంగాల్ శవంతో డేరాకు

వెళ్లాం కానీ వాళ్లు ముందర రోజు ఊళ్లో పట్టుకున్న బాడ్సె భీమా, మన్నూ యాదవ్‌లను మాత్రం తీసుకురాలేకపోయాం. అప్పటికే వాళ్లిద్దరినీ పోలీసులు చంపేశారు'.

'మరి పోలీసులు ఊరు వదిలి వెళ్లింది ఎప్పుడు?' - శ్యాం.

'మేం అడవిలోకి చేరాక సాయంత్రం హెలికాప్టర్ మళ్లీ వచ్చి కమాండోల శవాలను, మున్నా యాదవ్ శవాన్ని తీసుకెళ్లింది. కోయ కమాండోలు రాత్రి 10 గంటలకు ఊరు వదిలి అర్ధరాత్రి 12 గంటలకు పోలీస్ స్టేషన్ చేరినట్టు వాళ్ల వాకీ ద్వారానే మనం వినగలిగాం' అంటూ నరేందర్ ముగించాడు.

'ఇదీ అసలు విషయం. కానీ పోలీసు ఉన్నతాధికారులు ఎన్ని అబద్దాలతో మీడియాను వాడుకున్నారు! ముప్పై మంది నక్సలైట్లు మరణించి ఉంటారని ప్రాంతీయ, జాతీయ వార్తల్లో ఊదరగొట్టారు. దూరంగా ఉన్నవాళ్లు కూడా నమ్మలేని స్థితికి వీళ్ల ప్రచారం దిగజారుతోంది' అంటూ రాహీ టైం చూసుకున్నాడు.

'సరే, మిగతా విషయాలు భోజనాల తర్వాత మాట్లాడుకుందాం' అని నరేందర్ అనడంతో ముగ్గురూ లేచారు.

కిచెన్‌లో 'కోయ కమాండోలు ఉల్టా బాణంపుల్లలా మోహరించి నక్సలైట్లను గట్టిగా ఎదుర్కొన్నారని పత్రికల్లో అనేక పొగడ్తలతో రాశారు. అదేంటి రాహీ?' అంటూ శ్యాం అడుగుతుండగానే నరేందర్ అక్కడకు చేరుకుని 'అంతా పత్రికల మాయ, అది పోలీసుల ఉల్టా ప్రచారం. ఆత్మస్థైర్యం కోల్పోతున్న పోలీసులను నిలబెట్టుకోవడానికి అధికారులు సృష్టించిన పదక్రీడ అది. బతుకు జీవుడా! అంటూ ఇళ్లల్లోకి దూరి బయటకు రాని కమాండోలు అంటూ ఏ పత్రిక వాస్తవాన్ని రాస్తుంది చెప్పు శ్యాం' అన్నాడు.

భోజనాలు ముగించుకున్న ముగ్గురూ తమ తమ పాలీథిన్ షీట్లపై నడుం వాల్చారు. నరేందర్ క్యాంపు విషయాలు, చుట్టుపక్కల విషయాలు కమాండర్‌ను అడిగి తెలుసుకుంటున్నాడు. 'ఊళ్లో ఎవరైనా జబ్బు పడ్డవాళ్లుంటే రమ్మనండి. మన డాక్టర్ ఉన్నాడు, వైద్యం చేస్తాడు' అంటున్న నరేందర్ తన మాట ముగించక ముందే 'ఆ పని జరుగుతూంది. కాకపోతే సరిపడా మందులు లేవు' అన్నాడు కమాండర్.

'మందులు రావడం పెద్ద గగనమవుతోంది. పోలీసులు మెడికల్ షాపు వాళ్లను చాలా కట్టడి చేశారు. అయినా ప్రయత్నిద్దాం. అవసరమైన మందుల లిస్టు డాక్టర్‌తో రాయించు' - నరేందర్.

'సరే కామ్రేడ్' - కమాండర్.

నిద్ర లేవడంతోనే మళ్లీ ముగ్గురూ కూచున్నారు. నరేందర్ తన రిపోర్టు ప్రారంభించాడు. కానీ ఆయన ముఖంలో ఒక రకమైన బాధ స్పష్టంగా అగుపడుతోంది. ఆయన చాలా గిల్టీగా ఫీలవుతూ 'మన గంగాల్ శవాన్ని జనతన సర్కార్ ద్వారా ఇంటికి పంపలేకపోయాం. చాలా దూరం వాళ్ల ఊరు పోతే, మన దగ్గర మనుషులు తప్ప మరే సాధనమూ లేదా రోజు' అంటూ 'ఇక్కడే మేము, ప్రజలు కలిసి విప్లవ సంప్రదాయాలతో మన కామ్రేడ్ గంగాల్‌కు అంత్య సంస్కారాలు పూర్తి చేశాం' అన్నాడు. '15వ తేదీ పోలీసులు ఈ గ్రామాల్లోకి ఎక్కడికీ రాలేదు గానీ 16 నాడు తాడిమెట్లపై దాడి చేసి 207 ఇండ్లు కాల్చి బూడిద చేశారు. మొర్రంలో 33, తింపురంలో 56, తాడిమెట్లలో 207, మొత్తం 296 ఇండ్లు కోయ కమాండోల విధ్వంసానికి బూడిదయ్యాయి. ఇద్దరు మహిళలు వారి లైంగిక హింసకు బలి కాగా దాదాపు 30 మంది ప్రజలు తీవ్ర హింసకు గురయ్యారు. ఇదీ జరిగింది. కానీ వాస్తవాలు ప్రపంచానికి వెల్లడి గావడం లేదు. భారీ సంఖ్యలో మావోయిస్టులు చనిపోయారంటూ, మావోయిస్టులే గృహదహనాలు చేశారంటూ విడుదలైన పోలీస్ ప్రకటనలతో వాస్తవాలు గ్రహణం పట్టిపోయాయి'.

సాయంత్రం ఉక్కపోతకు ముగ్గురూ లేచి నీటి చెలిమ వైపు దారి తీశారు. అక్కడికి నేరుగా చూస్తే 100 గజాల దూరంలో తునికి ఆకు కళ్లం అగుపడుతోంది. అక్కడ చాలా సందడిగా ఉంది. నెత్తి మీద బరువైన మూటలతో కళ్లంలోకి వచ్చేవాళ్లు వస్తుంటే పోయేవాళ్లు పోతున్నారు. ఆకుల కట్టల లెక్క పూర్తి అయిందంటే వాటిని వరుసగా ఒక్కొక్కటిగా సర్ది పెట్టి వెళ్లాలి. ఎండిన ఆకులను పెద్ద పెద్ద సంచుల్లోకి ఎత్తి కుప్ప పెట్టారు. పూర్తిగా ఎండని ఆకులు ఆ బస్తాల కుప్ప పక్కనే వరుసగా ఉన్నాయి. ఆ కళ్లం వైపే చూస్తున్న రాహీ 'ఈ సంవత్సరం తునికి ఆకు కోత కూలి ఎంత ఇస్తున్నారో' అని స్వగతంలోనే మాట్లాడుకోగా తన గార్డు గగన్ 'షేకడా 105 రూపాయలు ఇస్తున్నారు కామ్రేడ్' అని బదులిచ్చాడు.

'ఈ సంవత్సరం ఆకు ఎట్లుంది గగన్?'

'అకాల వర్షాలు అన్నిటికీ ముప్పే గానీ ఆకులకు వరంలాంటిది. ఈ యేడు ఆకు చాలా బాగుంది. కానీ కొంతమందికి ఆకుల కోత రుచించడం లేదు. ఆంధ్ర కూలికే అలవాటు పడుతున్నారు.'

'ఎందుకు? ఆంధ్ర కూలికన్నా ఆకులు కోస్తే డబ్బు ఎక్కువగా వస్తుందిగా' - రాహీ.

'నిజమే, కానీ ఆ పట్టణాల సోకులు, సినిమాలు, హోటళ్లు, తిరుగుళ్లు వాళ్లను ఆకట్టుకొంటున్నాయి. ఆకుల కోత వాళ్లకు నచ్చడం లేదు. అసలు ఆదివాసీ జీవన విధానమే వాళ్లకు గిట్టడం లేదు' కమాండర్ బదులిచ్చాడు.

'కూలికి వెళ్తున్న వాళ్లలో కొందరు చాలా చెడిపోతున్నారు. సామ్రాజ్యవాద సంస్కృతికి వాళ్లు బానిసలవుతున్నారు. దాన్నే అనుకరించడానికి ఉవ్విళ్లూరుతున్నారు. జుడుం శిబిరాలలో చూసిందాన్నే పట్టణాల్లో వెలగబెడ్తున్నారు' అన్నాడు శ్యాం.

స్నానాలు పూర్తి చేసుకుని కిచెన్ దగ్గరకు చేరారు.

'చింతల్‌నార్ వాస్తవాలన్నీ పత్రికలకు ఎలా ఎక్కాయి నరేందర్?' - శ్యాం.

'అది రెండో అంకం, టీ తాగి చెప్పుకుందాం' - నరేందర్.

ఆరుబయటలాగా 'అడవి బయట' చెట్టు లేని ప్రాంతంలో పాలీథిన్ షీట్లు పరుచుకొని ముగ్గురూ కూచున్నారు. వాళ్లకు కొద్ది దూరంలో వాళ్ల అంగరక్షకులు పహారా కాస్తున్నారు. గత దశాబ్ద కాలంగా మధ్యస్థాయి నుంచి అత్యున్నత స్థాయి నాయకత్వ కామ్రేడ్స్ అందరికీ అంగరక్షకులను సమకూర్చడం తీవ్రమవుతున్న శత్రు సైనిక దాడులను తెలియచేస్తోంది. టీ తాగి ఉక్కపోత అవస్థల

మధ్యనే నరేందర్ మీడియా ప్రపంచంలోకి వెళ్లాడు.

'రేడియో వార్తలే కదా అడవిలో మనకు పెద్ద దిక్కు. ఆకాశవాణి పూర్తిగా అవకాశవాణి, అవాస్తవాల వాణి అని మనకు తెలుసు గానీ అమాయక ప్రజలకు తెలియక కదా! ఇక పత్రికల్లో పోలీసు కలాలు ఎన్ని విచిత్రాలు గుప్పిస్తున్నాయో ఊహించుకోవల్సిందే! ఇలాంటి సందిగ్ధ, అనిశ్చిత పరిస్థితులతో వాస్తవాలను బయటపెట్టడం ఎలా? భారీ పోలీసు వలయాల్ని ఛేదించుకొని మీడియ పర్సన్స్ రావడం సాధారణ విషయమేమీ కాదు. ఆర్‌టీఐ (రైట్ టు ఇన్ఫర్మేషన్) అంటూ, హక్కులంటూ అరిచేదంతా వాళ్లకు ప్రమాదం కాని, నష్టం లేని, హితవు కోరి రాసే విషయాలకే పరిమితం అని తెల్సిందెందరికి? అసలు ఈ విషయాలు పొక్కకుండా పాలించడమే వాళ్ల గొప్పతనం కదా! ఏమైనా, మీడియా పర్సన్స్‌ను ఆహ్వానించాలి, వాస్తవాలు వెల్లడించాలి. కొత్త మార్గాలు వెతకాలి. ఇలాంటి విషయాల్లో మనం ఇచ్చే ప్రకటనలకన్నా విలేకర్లు రాసే విషయాలకే ఎక్కువ సాధికారత ఉంటుంది. వాళ్లే ప్రజల గొంతుకను అక్షరాల్లోకి అనువదించగల శక్తిమంతులు అనుకున్నా రాహీ' అంటూ నరేందర్ గుక్క తిప్పుకోకుండా నేపథ్యాన్ని తన సహచర కామ్రేడ్స్‌కు వివరించాడు.

'సమాచార హక్కు, విద్యా హక్కు, ఈ హక్కూ, ఆ హక్కూ అంటూ ఊదరగొట్టేదంతా ప్రజలను పక్కదార్లు పట్టించడానికే. అవేవైనా వారి కోసమే అనుమతించబడుతాయి తప్ప మరో రకంగా కాదని విప్లవ సంక్షోభమే నగ్నంగా బయటపెట్టగలుగుతుంది నరేందర్' అన్నాడు రాహీ.

'అదే జరిగింది రాహీ, జరిగిన ఘోరం విషయం మనం కబురు చేయగానే హిందూ, తెహెల్కా, హక్కుల సంఘాల కార్యకర్తలూ ఒకరి తర్వాత ఒకరు రెక్కలు కట్టుకుని వాలారనుకో! వాళ్లను నేరుగా జనం మధ్యకే వెళ్లమన్నాం. తీసుకువెళ్లే బాధ్యత జనమే తీసుకున్నారు. వాళ్లలో ఏ ఒక్కరినీ మనం కలవలేదు. వాళ్ల పని వాళ్లు స్వేచ్ఛగా చేసుకోవడమే మంచిది అనుకున్నాం మేమంతా. వాళ్లు ఎవరు వాస్తవాలు రాస్తారు? ఎవరు వక్రీకరిస్తారు? హక్కుల కార్యకర్తల్లో ఎవరు ఏ వైఖరి తీసుకుంటారు? వాళ్ల కలాల శక్తి ఎంత? నేరుగా జనానికే తెల్సిపోతుందనుకున్నాం. వాళ్లు మార్చ్ 19, 20 తేదీలు జనం మధ్య ఉండి తర్వాత బయటకు వెళ్లి రాసింది 23 నాటికి గానీ వెలుగు చూడలేదు' అంటూ నరేందర్ అభినందనపూర్వకంగా మీడియావాళ్ల, హక్కుల కార్యకర్తల పర్యటన వివరాలన్నీ విప్పి చెప్పాడు.

'జనం తల్చుకుంటే ఏమైనా చేస్తారు. వాస్తవాలను వెలికి తేవాలన్న ఆరాటం, అఫ్‌కోర్స్ కెరీరిజంతోనే ఎందుక్కాకూడదు, కానీ అది మనం తప్పకుండా ఉపయోగించగలగాలి. మనం గెరిల్లా బేసులు, జనతన సర్కార్లు నిర్మించుకోలేకపోతే ఇంతటి ప్రజాపునాదే సాధ్యమయ్యేది కాదు' అన్నాడు ఉద్వేగంగా ఉపన్యాస ధోరణిలో.

'ఆ తర్వాతే అనుకుంటా ఢిల్లీ నుంచి స్వామి అగ్నివేశ్, మరొకరు, మరొకరు వచ్చింది' - రాహీ.

'ఆ, వాళ్ల రాకనేమో మీడియాలో ప్రచారమైంది. వాళ్లు కాకుండా ఇంకా చాలా మంది ఖాకీల కంటపడకుండా అడ్డదారుల్లో వచ్చి కలం పని పూర్తి చేసుకున్నారు' - నరేందర్.

'ఎస్.పి.ఓ.లు ఎంత బరి తెగించారు. కల్లూరి పచ్చి ఫాసిస్టు. ఖాకీ బలగాల్లో కూడా పచ్చి రియాక్షనరీ భూస్వామి పాత్ర డిఐజీగా గొప్పగా వెలగబెడుతున్నాడు. మేధావులనూ, సంఘ సేవకులనూ ఏమైనా అంటే లోకం దుమ్మెత్తిపోస్తుందన్న లోకజ్ఞానం కూడా మర్చిన మదమెక్కిన అధికారి అతగాడు. ఎస్.పి.ఓ.లతో ఐఎఎస్, ఐపిఎస్‌లనే కొట్టించిన దాష్టీకుడు, ప్రతిపక్షాల నాయకులనే రోడ్డు దాటనివ్వలేదు, పల్లెలో అడుగుపెట్టనివ్వలేదు, ప్రజలను చూడనివ్వలేదంటే ఎంతటి ఫాసిస్టు పాఠాలు నేర్చుకున్నారో ఆ ఖాకీ దుర్మార్గుడు' - శ్యాం.

'ఇలాంటి పరిస్థితులలో సైన్యం దిగింది శ్యాం, ఇంకా చూడు ఎంతటి దారుణాలు జరిగిపోతాయో! కాశ్మీర్‌లో, మణిపూర్‌లో సైన్యం చేతుల్లో మాయమైన అమాయక పౌరులు వేల సంఖ్యలో ఉంటారు. ఇంకా గడ్డు రోజులే ముందున్నాయి' రాహీ గంభీరంగా విషయాన్ని వాళ్ల ముందు పెట్టాడు.

'ప్రజల స్పందన బాగుంది రాహీ, పత్రికల్లో తాడిమెట్ల వాస్తవాలు బయటకు రావడంతో మూడు గ్రామాల ప్రజలను ఆదుకోవడానికి డబ్బు, ధాన్యం, గుడ్డలు వాళ్లకున్నదాంట్లోంచి ఉడతా భక్తిలా అందించడం మొదలుపెట్టారు. అయితే అప్పటికే మన జనతన సర్కార్లు పి.ఎల్.జి.ఎను పట్టుకొని రంగంలోకి దిగాయి. తాటికమ్మలతో తాత్కాలిక నీడ తయారు చేసి పెట్టారు' అంటూ నరేందర్ ముగిస్తూ పక్కకు వచ్చి నిల్చున్న కమాండర్‌ను చూశాడు.

'సర్కార్ అధ్యక్షుడు ఇడ్మాల్ వచ్చిండు. నిన్ను కలవాలంటున్నాడు' అంటూ కమాండర్ తను వచ్చిన పనిని కోయలో చెప్పాడు.

'సరైన టైంకే వచ్చాడు, ఇక్కడికే పంపించు, మిగిలింది ఆయన చెప్పాల్సిందే' - నరేందర్.

'ఈ లోగా మనం డేరా దాకా వెళ్లి వద్దాం' అంటూ శ్యాం లేచాడు.

'అవును ఇది మన ప్రైంటైం కదా. వరుసగా అన్ని వార్తలు వచ్చేదిప్పుడే. తెలుగు, మరాఠీ, ఒడియా, హిందీ చివరకు బీబీసి పూర్తయ్యేసరికి ఎనిమిదిన్నరవుతుంది. పద నేనూ వస్తా' అంటూ రాహీ రేడియోతో లేచాడు.

ఫర్లేదు, మనం వార్తలు, భోజనాలు ముగించుకొనే వద్దాం, ఇడ్మాల్ రాత్రి ఇక్కడే పడుకుంటాడు, ఫ్రీ టైం' అన్నాడు నరేందర్.

* * *

రాత్రి తొమ్మిది కావస్తోంది. ఆకాశ వెన్నెల అడవిని నింపేసింది. రాత్రివేళ ఏ లైటూ చేతిలో పట్టుకోకుండానే ఎక్కడికైనా వెళ్లే గెరిల్లాలకు అడవి వెన్నెల ఆనందాన్నిస్తోంది. మునిమాపువేళ తిండ్లు ముగించుకున్న గెరిల్లాలు ఏ అల్లరీ లేకుండా తమ తమ డేరాల్లో పడుకున్నారు. దూరంగా ఆగి, ఆగి కుక్కలు మొరుగుతుంటే సెంట్రీలు చెవులు నిక్కరించి వింటున్నారు. ఈ మధ్య చిన్న చిన్న హంతక టీములు రహస్యంగా అడవిలో,

తిరుగుతూ ఒంటరి గెరిల్లాలను హతమార్చడం ప్రారంభమయ్యాక సర్వత్రా అప్రమత్తత పెరిగింది.

రాహీ, శ్యాంలు టిఫిన్ క్యారియర్‌లో తెచ్చిపెట్టిన అన్నం తింటూ ఇంగ్లిషు బిబిసి వార్తలు వింటున్నారు. ప్రపంచం ఆర్థిక సంక్షోభ తాకిడికి బిబిసి గతంలోలా రోజంతా హిందీలో నాలుగు ప్రసారాలు కాకుండా కేవలం రాత్రిపూట ఒక ప్రసారం మిగలడంతో దాన్ని మాత్రం తప్పనిసరిగా అందరూ వింటారు. అప్పుడే రఫీక్ చేరుకున్నాడు.

'క్యా రఫీక్ భాయీ, ఆన్‌లైన్ న్యూస్ క్యా హై?' - శ్యాం.

'ఏం వార్తల్లో కానీ హిందీ నేర్చుకోవడం మాత్రం రంభకష్టంగా ఉంది. కోయ హాయిగా నేర్చుకోవచ్చు. సగం తెలుగుతో కలుస్తుంది. ద్రావిడులకు ఇబ్బంది లేకుండా ఉంటుంది. ఈ హిందీలో లింగభేదాలతో మాట్లాడలేక నవ్వులపాలవుతున్నానుకోండి. మీసాన్ని స్త్రీ లింగంలోనూ, గెడ్డాన్ని పుంల్లింగంలోనూ చెప్పాలంటే ద్రావిడులకు ఎలా ఉంటుందో చెప్పండి' అంటూ రఫీక్ భాషతో పడుతున్న కుస్తీనంతా బాధగా చెప్పుకొచ్చాడు.

'ముస్ ముస్ కవ్వీనిన్ రాహీ' అంటూ శ్యాం ముసిగా నవ్వుతున్న రాహీ వైపు చూస్తే రఫీక్ 'చూశారా! మీరు రెండు పదాలు మాట్లాడితే అందులో ముస్, ముస్ అన్నది తెలుగులోనూ ఉంది. అందుకే హిందీకన్నా కోయపైనే శ్రద్ధ పెట్టడం సమంజసం అంటాను' అంటూ రఫీక్ తన అభిప్రాయాన్ని ఈసారి మరింత గట్టి నిరసనతో వ్యక్తం చేశాడు.

'ఏం లేదు శ్యాం, ఓ రోజు దారిలో నిన్ను గెరిల్లాలకు హిందీ భాషపై మోజు ఎందుకని అడిగితే, మనది ఉత్తరాది ప్రయాణం అంటూ ఇచ్చిన జవాబు గుర్తొచ్చి నవ్వుతున్నాను' అంటూ రాహీ తన నవ్వులోని అర్థాన్ని చెప్పి చేయి కడుక్కోడానికి లేచాడు.

'భాష విషయంలో మనం చాలా అధ్యయనాన్ని చేయాల్సి ఉంది' స్వగతంలోనే అనుకుంటూ శ్యాం కూడా లేచాడు.

'ఓహ్! రఫీక్ భాయీ, ఆప్ భీ యహా పర్? బడియా' అంటూ నరేందర్ ఇడ్మాల్‌ను వెంటబెట్టుకుని రాహీ డేరాలోకి వచ్చాడు.

'ఔను కామ్రేడ్, నిద్ర రావడం లేదు, చదువుకుందామంటే రాత్రి లైట్లు వెలిగించకోడదనుకున్నాం కదా! క్యాంప్‌లో పేషెంట్లు ఎవరూ లేరు, అందుకే మన కామ్రేడ్స్ దగ్గరికి వచ్చాను' అంటూ వచ్చీరాని కోయలో బదులిచ్చాడు రఫీక్.

'మీ 'కోయగు' బాగుంది' అని నరేందర్ అనడంతో రఫీక్ వెంటనే 'మీ పదప్రయోగం బాగుంది - కోయగు, తెలుగు, హిందీ' అంటూ మరోసారి ఆ విశేష పదాలను ఉచ్చరించాడు.

'ఇడ్మాల్ మర్యాదగా 'లాల్‌సలాం కామ్రేడ్స్' అన్నాడు.

'లాల్‌సలాం, కూచోండి' శ్యాం వారి కోసం మరో పాలిథీన్ షీట్ పరిచారు.

ఇడ్మాల్ నల్లగా, బక్కపలుచగా ఉన్నాడు. పొడవు అయిదున్నర అడుగుల పైనే ఉంటాడు. ముఖం నున్నగా ఉంది, మీసాలు, గెడ్డాలు పెద్దగా లేవు. వేసవి కావడంతో ఆయన ఒంటిపై షర్టు లేదు. ఒంటిపై ఎక్కడా ఒక్క వెంట్రుక కనబడడం లేదు. అచ్చమైన ఆదివాసీకి ప్రతిరూపంగా ఇడ్మాల్ అగుపడుతున్నాడు. అంగవస్త్రంగా టవల్ మాత్రమే చుట్టుకుని వాళ్ల ముందు నిల్చున్న ప్రజా ప్రభుత్వపు అధ్యక్షుడిని చూస్తున్న రాహీకి చాలా గర్వంగా ఉంది. ముప్పయి ఏండ్ల దండకారణ్య ఉద్యమంలో పేదల చేతుల్లోకి ఈ మేరకైనా అధికారం వచ్చిందన్న తృప్తి ఆయన మాటల్లో ఎప్పుడూ వ్యక్తం అవుతూ ఉంటుంది. ఢిల్లీ ఇంకా చాలా దూరం ఉందనడానికి ఆయన ఎప్పుడూ 'సై, సై ఓ నల్లగొండ వీరుండా, నువు ఎత్తేదే ఎర్రజండా.. నల్లగొండ నీ పేరు చెప్పితే ఢిల్లీ కోటలో గుండె ఝల్లుమనే' అనే పాత పాట విన్పిస్తూ ఉంటాడు. ఇడ్మాల్ వయస్సు ముప్పయికి మించలేదు. ఉద్యమంతో పాటే పుట్టి పెరిగిన తరం ఆయనది. నరేందర్ ఎత్తుకుని ముద్దాడిన వాళ్లలో ఇడ్మాల్ లాంటివాళ్లు అనేక మంది నేటి దండకారణ్య ఉద్యమ బాధ్యతల్లో ముందున్నారు. నరేందర్, ఇడ్మాల్‌లు జిల్లీపై కూచున్నారు.

'నీ శేషప్రశ్నకు ఇడ్మాల్ జవాబు ఇస్తాడు. అడవి ఉద్యమం ఢిల్లీని ఎలా ఆగం చేస్తుందో ప్రత్యక్షంగా విను కామ్రేడ్' అంటూ రాహీ గత సంభాషణను గుర్తు చేశాడు. ఇడ్మాల్ గొంతు సవరించుకొని కోయలో మొదలుపెట్టాడు.

'ఏప్రిల్ రెండవ తేదీనాడు మా గూడేనికి ముఖ్యమంత్రి వచ్చాడు. ఆయన వెంట మందీ, మార్బలం తక్కువ రాలేదు. అయితే అందులో చాలా మంది పోలీసులే ఉన్నారు. కోయ కమాండోలు మాత్రం చాలామంది సివిల్‌లో జనం మధ్య కూచున్నారు' అని ఓసారి గొంతు సవరించుకుని ఇడ్మాల్ మొదలుపెడుతుండగా రఫీక్ 'ఏప్రిల్ ఒకటికి రావల్సింది ముఖ్యమంత్రి' అన్నాడు.

'ఎందుకు దాదా?' అన్నాడు ఇడ్మాల్ అమాయకంగా.

'అది అమాయకులనూ, నిజాయితీపరులనూ మూర్ఖులను చేసే రోజు అంటారు బయట' అని నరేందర్ 'నువ్వు చెప్పు' అంటూ ఇడ్మాల్‌ను ప్రోత్సహించాడు.

'ముఖ్యమంత్రి హిందీలో చాలా సేపు మాట్లాడాడు. మరెవరో పెద్ద మనిషి కోయలో చెప్పుతూ పోయాడు. మీకు డబ్బు ఇస్తాం, నూకలిస్తాం, ఇండ్లిస్తాం, మందులిస్తాం అంటూ పదే పదే మావోవాది, మావోవాది అనేవాడు. కోయలో మాత్రం దాదాలోర్, దాదాలోర్ అనే చెప్పాడు. సారాంశం మాత్రం మావోవాదిలను మీ వద్దకు రానివ్వకోడదు అనే చెప్పారు. అసలు వాళ్ల మాటలు మా మధ్య కూచున్న కోయ కమాండోలు విననిస్తే అనే చెప్పారు. అసలు వాళ్ల మాటలు మా మధ్య కూచున్న కోయ కమాండోలు విననిస్తే కదా, 'వాళ్లు ఇస్తుంటారు, మేం కాలపెడుతాం, కూలగొడుతాం, ఇది ఆగేది కాదు' అంటూ కోయలో బహిరంగంగానే చెప్పుతుండేవాళ్లు. చివరకు పైసలు పంచిండు. అయితే ఇదంతా బజార్ల జరుగుతుంటే మా ఇండ్ల చాటుకు పోలీసోల్లు కోళ్లూ, మేకలూ చంపుతనే ఉన్నారు' అంటూ ఇడ్మాల్ సీరియస్‌గా చెపుతుంటే రఫీక్ 'ఎందుకు అడ్డుకోలేదు' అన్నాడు.

'అగ్నివేశ్‌ను రానివ్వలేదు, అధికార్లనూ రానివ్వలేదు. పైగా రాళ్లతో, కోడిగుడ్లతో కొట్టిన కోయ కమాండోలు ప్రతిపక్షాలను కూడా అడుగుపెట్టనివ్వలేదు. తనకూ ఆ గతి ఎక్కడ పడుతుందోనని సిఎం కోయ కమాండోలకు జడిసి పదిహేను

పుస్తక సమీక్ష

నడుస్తున్న చరిత్రకు వ్యాఖ్యానం 'చిలుకలు వాలిన చెట్టు'

- కె. నాగేశ్వరాచారి

చిలుకలు వాలిన చెట్టు కథా సంపుటి చదువుతూ ఉంటే, సంపుటకర్త జి. వెంకటకృష్ణ ఒక నవలకు వేసుకున్న పథకం కథలుగా విడిపోయాయని అనుమానం వేస్తుంది. ఒకే సమస్యను భిన్న పార్శ్వాల నుంచి చూపిస్తున్నాడు. కథలలో పురోగామి శక్తులను గురించి అంచనా వేస్తున్నాడు. వాటి మీద విమర్శలు చేస్తున్నాడు. ఘర్షణకు లోనవుతున్న వర్గాలన్నీ కథల్లో ఉన్నాయి. ముంపు గ్రామాల సమస్యలు - వరదకు గురైన గ్రామాల సమస్యలు - విధ్వంసమవుతున్న వ్యవసాయరంగం - రాజకీయ నాయకుల కుటిలనీతి - కుల చైతన్యం వల్ల ఏర్పడే ఘర్షణలు ఇన్నిటినీ కథల్లో చర్చిస్తూ, ఈ సమస్యలన్నిటినీ ఒక తాత్త్విక స్థాయికి తీసుకువెళతాడు. కాబట్టి నవలకు వేసుకున్న పథకం చెడి, కథలుగా పరిణమించినట్లు అనుమానమేస్తుంది.

ఇందులోని ఒక్కొక్క కథను వివరించి చూడకుండా కథల్లోని సమస్యలన్నీ విశ్లేషించి చూస్తే ఒకటి మరోదానికి కొనసాగింపుగా కనిపిస్తాయి. ఇందులో సామాన్య ప్రజల సందేహాలు, అపోహలు అన్నీ చర్చకు వస్తాయి. సమస్యల విశ్లేషణ కనబరిచినా, సమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న ఉద్యమాల పట్ల రచయితకు సందేహాలున్నట్లు ఈ కథలు చదివితే తెలుస్తుంది. ఉద్యమం జరగాలన్న దాంట్లో ఎంతటి స్పష్టత ఉన్నదో, జరుగుతున్న తీరు పట్ల రచయితకు అంత విశ్వాసం ఉన్నట్లు కనబడదు. మొత్తానికి తీవ్ర చర్చల్లో రచయిత మునిగిపోయినట్లు తెలుస్తూ ఉంది.

ఇంకా స్పష్టంగా మాట్లాడుకుంటే ఈ సంపుటిలోని తొమ్మిది కథలు వివిధ సామాజిక సమస్యా రూపాల్ని చిత్రిస్తే, మరి నాలుగు కథలు కొనసాగింపుగా అన్నట్లు ఆ సమస్యల కోసం జరుగుతున్న ఉద్యమాల్ని గురించి రాసినవి ఉన్నాయి.

దాదాపు ఈ దశాబ్దంలో గ్రామీణ జీవితాల్ని గురించి కథా రచయితలు రాసిన కథలన్నీ విధ్వంసమవుతున్న దృశ్యాల్నే చిత్రించారు. నూతన ఆర్థిక విధానాల ప్రతిఫలనాల్ని చిత్రించారు. పెద్ద పెద్ద ప్రాజెక్టు నిర్మాణాల వల్ల నిర్వాసితులయ్యే గ్రామీణ జీవితాల్ని చిత్రించిన కథలు వెలువడ్డాయి. చిలుకలు వాలిన చెట్టు కథల్లో 'మూడు దృశ్యాలు' కథ ముంపు గ్రామాల నిర్వాసితుల గురించి చెబుతుంది. ఈ కథలో సమిష్టి జీవన విధ్వంసాన్ని చూడవచ్చును. ఓ కవితలో నందిని సిద్దారెడ్డి అన్నట్లు ఊరిని ఖాళీ చేసినంత తేలికగా జీవితాన్ని ఖాళీ చేయలేం కదా! ఊరంటే ఇళ్ళు, పశువులు, పంటపొలాలు, మురికి నీటి గుంతలు, నగ్నంగా వీథుల్లో కనిపించే పిల్లలే కాదు కదా! వీటన్నిటి సంబంధాల కూడలి గ్రామం. అటువంటి గ్రామం శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణం వల్ల ఖాళీ అయింది. ఆనకట్టల ప్రయోజనాన్ని గురించి మాట్లాడే వాళ్ళను వెంకటకృష్ణ ఈ కథలో ప్రశ్నిస్తాడు. ఆస్తులున్న వారికే ప్రభుత్వం నష్ట పరిహారం ఇస్తుంది కాని, ఆస్తి లేని వాళ్ళకు ప్రత్యామ్నాయంగా ఏం కల్పిస్తుంది? ఇటువంటి అభివృద్ధి వల్ల 20 సంవత్సరాల్లో నిర్వాసితులౌతున్న వాళ్ళ సంఖ్య 20 నుండి 40 కోట్ల వరకు

రోజులు ఈ వైపు చూడలేదు. అలాంటివాళ్ల ఆగడాలను ఆపడం ప్రజా గెరిల్లాలకు తప్ప మరొకరికి సాధ్యమా'! అంటూ ఇద్మాల్ బదులు నరేందరే జవాబివ్వడం పూర్తవ్వగానే తిరిగి ఇద్మాల్ తన జ్ఞాపకాలలోకి వెళ్లాడు.

'ముఖ్యమంత్రి పోయినాంక కొద్దిరోజులకు ఎవరో పెద్ద మనిషి వచ్చి ఢిల్లీ కోర్టు పంపిందనీ, ఆకలి చావుల గురించి తెలుసుకోవడానికి వచ్చాననీ చెప్పాడు. ఆయన్ను కూడా తింపురం దాటనివ్వలేదు. పత్రికల్లో ఏం రాసిండో తెలియదుగానీ మనిషి మర్యాదగానే ఉన్నాడనిపించింది. ఇంకా చానమందే వచ్చిండ్రు' అని ఇద్మాల్ అంటుండగానే 'సుప్రీం కోర్టు హర్షమందర్‌ను పంపింది. ఆయన జాతీయ ఆహార కమిషనర్‌గా ఉన్నాడు' అంటూ శ్యాం వివరించాడు.

'ఆయన సంస్కరణవాది. పోలీసులూ, మావోయిస్టుల మధ్య ఆదివాసీలు నలుగుతున్నారనే పక్షం ఆయనది. ఆకలితో ఎవరూ చావలేదు గానీ, ఆకలి చావుల పరిస్థితే నెలకొందంటూ రిపోర్టు ఇచ్చాడు. చనిపోయిన రైతు అడవిలో దారి తప్పి తిండిలేక చనిపోయాడని రిపోర్టులో రైతు మరణాన్ని అపహాస్యం చేశాడు' అంటూ రాహీ తాజాగా మీడియాలో వచ్చిన రిపోర్టు గురించి ప్రస్తావించాడు.

'దండకారణ్యం నెగళ్లు ఢిల్లీకి దగడు అందిస్తున్నాయి. ఇక్కడి మరణాలు మానవహక్కుల కార్యకర్తలను కదిలిస్తున్నాయి. అయితే ఇక్కడి హత్యలు, అత్యాచారాలు, విధ్వంసం హజారేలకూ, బాబాలకూ పట్టవు. ఈ మట్టివాసనలు వారికి సోకవు. కానీ ఈ మట్టిలో దాగిన కల్లోల అంతరంగం మహా భూకంపాన్ని సృష్టించి తీరుతుంది' అంటూ రాహీ తన పక్కన కూచున్న ఇద్మాల్‌ను తదేకంగా చూస్తూ ధ్రువతారపై దృష్టి నిలిపాడు. ఉద్యమం తన ప్రశ్నకు హామీగా ఎదుగుతుందన్న విశ్వాసంతో తలూపుతూంటే ఇద్మాల్ తన స్మృతి నెగళ్ళ నుండి బయటపడి నరేందర్ వైపు చూస్తుంటే తను వాచీ చూసుకుని 'రేపు దగ్గర పడుతోంది, వెళ్దామా' అంటూ లేచాడు.

☆

ఉండవచ్చని అంచనా. ఈ కథలో నిర్వాసితులైన వారి దగ్గరకు నిజాయితీ గల విలేకరులు వెళ్ళి వాస్తవాల్ని తెలుసుకుంటారు. ఈ కథలో ఇద్దరు విలేకరులు గ్రామంలోని వ్యక్తుల్ని సంప్రదించి, ప్రజల స్పందనలు ఎలా ఉన్నాయో తెలుసుకుంటారు. నిర్వాసితులైన వారు చెల్లా చెదురుగా ఉంటే ఏర్పడే పర్యవసానాల్ని గురించి ఆలోచించాల్సిన బాధ్యతను ఈ కథలో పాఠకునికి రచయిత అందజేస్తాడు. 'దృశ్యాదృశ్యం' కథ 'మూడు దృశ్యాలు' కథకు కొనసాగింపే. నిర్వాసితుడైన ఆనంద్ గ్రామం నుంచి బయలుదేరి పట్టణంలో స్థిరంగా ఒక చోట ఉండలేని స్థితిని వివరిస్తాడు. ఆనంద్‌తో పాటు అదే గ్రామం నుండి బయలుదేరిన హనుమంతరెడ్డి పట్టణంలో కాపురముంటూ సైకిల్‌పై తిరిగేవాడు. ఇప్పుడు రియల్‌ఎస్టేట్ వ్యాపారంతో కారులో తిరుగుతున్నాడు. ఆనంద్ అద్దె సెలూన్ షాపును ఖాళీ చేయించి, అదే స్థలంలో గొప్ప హర్మ్యాన్ని నిర్మిస్తాడు హనుమంతరెడ్డి. ఈ అద్దె షాపు హనుమంత రెడ్డిదే. ఇప్పుడు ఆ హర్మ్యంలో అధునాతన బ్యూటీ పార్లర్‌షాపు ప్రత్యక్షమైంది.

ఈ సన్నివేశాల్లోనే పాఠకుడు క్షణమాగి ఆలోచించాలి. ఒకే గ్రామం నుంచి బయలు దేరిన వ్యక్తులు పూర్వ సంబంధాల్ని రద్దు చేసుకుని కొత్త సంబంధాలు ఏర్పరచుకున్నారు.ఆనంద్ తన పాత విధానాన్ని రద్దు చేసుకోలేదు. హనుమంత రెడ్డి కొత్త విధానాన్ని ఏర్పరచుకున్నాడు. ఇలా ఎందుకు జరిగింది? వీరి మధ్యన తెగిన లింకు ఏది?

'మూడు దృశ్యాలు' కథలో ఒక స్త్రీ ప్రత్యామ్నాయ జీవితం దొరక్క పిచ్చిదైపోయింది. యువతకు ఉద్యోగాలిస్తామన్న ప్రభుత్వం మొండి చేయి చూపించింది. నిర్వాసితుల పట్ల ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా ఉంటుందో ఈ కథలోని పోలీసుల ప్రవర్తన ద్వారా తెలుసుకోవాలి. 'దృశ్యాదృశ్యం' కథలో ఆనంద్ సెలూన్‌షాపుకు షాపు దొరక్క దాదాపు పిచ్చివాడయ్యే పరిస్థితి ఏర్పడింది. ఈ రెండు కుటుంబాలు నిర్వాసితుల సూక్ష్మ విశ్లేషణే. మానవ సంబంధాలు వ్యాపార, ఆర్థిక సంబంధాలుగా ఎలా పరిణమిస్తున్నాయో ఈ కథలు చెబుతున్నాయి. ఇదీ అభివృద్ధి ఫలితం. ఈ అభివృద్ధి ఏ నూతన సమాజాన్ని ఆవిష్కరిస్తుందో? ఇటువంటి కథలు ఇంకా ఎన్ని రావాల్సివుందో? ప్రథమ భారత ప్రధాని కాలంలో శ్రీశైలం ప్రాజెక్టుకు పునాది వేస్తే, 1982 లో పూర్తయింది. శ్రీశైలం ప్రాజెక్టు ముంపు గ్రామాల బాధితులకు పదమూడు మంది ప్రధానులు మారిపోయిన తరువాత - ముప్పై సంవత్సరాలకు పి.వి.నరసింహారావు ప్రధాని అయిన తరువాత నష్ట పరిహారం చెల్లించారు. ఈ ముప్పై ఏళ్ళ కాలంలో జరిగిన నష్టం అంచనా వేయాలా? ఇటువంటి అభివృద్ధిని. గురించే వెంకటకృష్ణ మాట్లాడుతున్నది. కేవలం చరిత్రను రికార్డు చేయడమే కాదు, దాన్ని వ్యాఖ్యానిస్తున్నారు కూడా. గ్రామాలు వదలి పట్టణాల్లో రోడ్డు పక్క దుకాణం నడుపుకుని బతుకుదామంటే, రోడ్ల వెడల్పు - రహదారుల అభివృద్ధి పేరిట నిర్వాసితుల్నే చూడాల్సి వస్తుంది. 'దారి కాచిన దృశ్యం' కథలో సావిత్రమ్మ చెక్కతో చేసిన దుకాణాన్ని ప్రొక్లెయిన్‌లతో పక్కకు తోసివేయించారు. సరుకులన్నీ నేల పాలయినాయి. తోపులాట, దొమ్మిలో పోలీసులు తోసివేస్తే, సావిత్రమ్మ సొమ్మసిల్లి పోయింది. హైబ్రిడ్ విత్తనాల మాయలో పడి గిలగిల తన్నుకుని బతుకు జీవుడా అని రైతు కాడి కింద పడేసి జీవికకోసం ఏర్పాటు చేసుకున్న దుకాణం ప్రొక్లెయిన్ కబంధ హస్తాల్లో నలిగిపోయింది. 'అభివృద్ధి' నిర్వాసితుల్ని వెంటాడి వేటాడుతూనే ఉంది.

పై రెండు కథలు మాండలిక భాషను బట్టి, కర్నూలు జిల్లా ప్రాంత కథలని భ్రమించడానికి అవకాశముంది. ఆ మాండలిక

భాషను పక్కనబెడితే దేశంలో నిర్వాసితుల వ్యథలన్నీ ఇలాగే ఉంటాయని ఈ రెండు కథల్ని బట్టి ఊహించుకోవచ్చును. 'అభివృద్ధి' ఉన్నత వర్గానికే పరిమితమైందని చెబితే 'వేకువ ప్రశ్న' కథలోని ప్రభాకర్‌కు అర్థం కాదు. తనకు రైతు జీవిత పునాది లేదుగదా! సాహిత్యం పాఠకుని అభిప్రాయాల్ని సరి చూసుకోవడానికి చర్చ ద్వారా అవకాశం కల్పించడమే కదా. పాఠకునిలోని అశాస్త్రీయ భావాల్ని సరిదిద్దేదే గొప్ప రచన.

నిర్వాసితుల సమస్యలు వెంకటకృష్ణ చుట్టూ ఉన్నవే. జరుగుతున్న సంఘటలను శాస్త్రీయంగా పరిశీలించగల నేర్పు ఈయనకుంది. ఆయా సమస్యల వెనుక ఉన్న అసలు విషయాన్ని ఈ కథలు బయట పెడుతున్నాయి. తక్షణ సమస్యలకు స్పందించి రాయడం రచయిత పని. అలా స్పందించి రాసిన కథ 'ఆ...దినాలు'.

2009 అక్టోబరు 2న తుంగభద్రా నదికి వరదలొచ్చాయి. నదికి ఎగువ ప్రాంతం ఆదోని డివిజన్‌లో అధిక వర్షం, తుంగభద్ర డ్యాం గేట్ల ఎత్తివేత రెండూ ఒకేసారి జరిగాయి. వరదలు సుంకేసుల డ్యాంను తాకాయి. సమన్వయం లేక అధికారులు డ్యాం గేట్లు సకాలంలో ఎత్తి వేయలేదు. ఫలితంగా నదికి ఇరువైపులా ఉన్న రాజోళి గ్రామం, సుంకేసుల గ్రామం రెండూ వరదల పాలయ్యాయి. ఎగువ ప్రాంతంలో నాగులదిన్నె దగ్గర నది పైన బ్రిడ్జి వరదకు కూలిపోయింది. శ్రీశైలం గేట్లు ఎత్తలేదు. నది బ్యాక్ వాటర్ కర్నూలు నగరాన్ని ముంచెత్తింది. ఇప్పటికీ నదికి ఇరువైపులా ఉన్న నిర్వాసితుల పునరావాస కార్యక్రమాలు పూర్తి కాలేదు. మంత్రాలయంలో భక్తుడు పార్క్ ఫెన్సింగ్‌లో చనిపోయి వేలాడుతున్న శవం హృదయ విదారకం. మంత్రాలయ మఠాధ్యక్షులు హెలికాప్టర్‌లో బెంగుళూరుకు దేవుని దయవల్ల సురక్షితంగా చేరుకున్నారు!

ఈ వరద తాకిడికి గురి అయిన సుంకేసుల గ్రామంలోని ఒక వైశ్య కుటుంబ కల్లోల దృశ్యాన్ని 'ఆ...దినాల' కథ చూపిస్తుంది. 2009 అక్టోబరు 2న తుంగభద్ర నది వరదల నష్టం కేవలం అధికారుల అశ్రద్ధ వల్లే జరిగిందనేది స్పష్టం. ఈ వాస్తవ సంఘటనను కల్పనా సాహిత్యంలోకి తర్జుమా చేసే సమయంలో వెంకటకృష్ణ కు 'ఆర్ద్రతా' భావం తోడయింది. ఈ కథలో విశ్వనాథమయ్య తండ్రి వృద్ధాప్యం వల్ల జబ్బు చేసి చనిపోతాడు. అప్పుడే సుంకేసుల ఆనకట్ట తెగిపోవడం వల్ల అంత్యక్రియ నిర్వహించ లేక తనను తాను కాపాడుకునే స్థితిలో విశ్వనాథమయ్య

ఉండిపోతాడు. తండ్రి శవాన్ని గ్రామంలోనే వదిలి పెట్టి పోతాడు. వరద తగ్గిన తరువాత గ్రామంలోని వరిగడ్డి వామి దుర్వాసన వస్తుందని గ్రామస్తులు కిరోసిన్ పోసి తగలబెట్టారు. వరిగడ్డి వామి కాలుతూ ఉండగా అందులోంచి 'టప్' మని శబ్దంతో పుర్రె కింద పడుతుంది. అదే తన తండ్రి పుర్రె అనుకొని, శాస్త్రోక్తంగా కర్మకాండలు చేయలేక పోయానని విశ్వనాథమయ్య విలవిలలాడి పోతాడు.

అనతి కాలంలో పూడ్చుకోలేని అపార ఆస్తి నష్టం వల్ల కుదేలైన జన జీవితపు అగచాట్లు కాకుండా శాస్త్రోక్తంగా కర్మకాండలు చేయలేకపోయిన విశ్వనాథమయ్య కష్టాలు రచయిత ఎందుకు చర్చించాడో అర్థం కాదు. బల్లపరుపుగా ఉన్న భూములు మిట్ట పల్లాలుగా కావడం, ఒండ్రుమట్టి నేలలు చౌడు భూములుగా మారి సేద్యా యోగ్యంగా లేకపోవడం, ఇండ్లు నేలమట్టం కావడంతో జనం కకావికలమైపోయారు. తలదాచుకోవడానికి ఇల్లు, పండించుకోవడానికి భూములు లేక ప్రజలు అనాథలైపోయారు. ఆ పూటకు తిండి గడవడం కష్టమైనా జనం కష్టాలను రచయిత ఎందుకు ఫోకస్ చేయలేక పోయాడో? ముంపు వల్ల, రోడ్ల వెడల్పు వల్ల, వరదల వల్ల నిర్వాసితులైన సంఘటనలు చెప్పే క్రమంలో 'ఆ...దినాలు' కథ దగ్గర కొచ్చేసరికి గమనం కుంటుబడినట్లైంది. విశ్వనాథమయ్య కథలో ప్రధానం కాకపోయి ఉంటే ఓ క్రమం కథలకుండేది. అధికారుల నిర్లక్ష్యమే వరదలకు కారణమన్నది స్పష్టం చేయాలి. అధికారుల నిర్లక్ష్యం మరో పార్శ్వంలో - ఇతర విషయాలలో ఎలా ఉంటుందో తెలిపే కథ 'క్రీడ'.

తార, నక్షత్ర అని ఇద్దరమ్మాయిలు పత్తి చేలో అత్యాచారం చేయబడి, హత్యకు గురయినారు. వారి కథ 'క్రీడ'. ఈ కేసు యువ పోలీసు అధికారి, సీనియర్ పాలనానుభవం కలిగిన ఎస్.పి.ల మధ్య నలుగుతూ ఉంది. రాజకీయ నాయకుడు కేసులో జోక్యం చేసుకుని, తన కుమారుణ్ణి రక్షించుకుంటాడు. అధికారులంతా రాజకీయ నాయకుల చేతిలో కీలు బొమ్మలని ఈ కథ చెబుతుంది. ఈనాటి ప్రభుత్వ విధానాల కొనసాగింపే పై కథలతో పాటూ ఈ కథలోనూ నడిచింది. కాకపోతే కథా స్థలం మారింది. నూతన ఆర్థిక విధానాలలో డి పొలిటిసైజేషన్ ఒకటి. రాజకీయ యంత్రాంగం చట్టాల్ని అమలుచేయలేని బలహీనస్థితికి తీసుకురావడమన్న మాట. అందుకే విప్లవకారులు ఈ వ్యవస్థను పేపర్ టైగర్ అని అన్నారు. ప్రస్తుతం ఆదర్శాలు, విలువలు అన్న పదాలు నిఘంటువుల నుంచి తొలగించి, అటకెక్కించారు. తమ మనుగడే ముఖ్యం. దానికి ఎందరు బలి అయిపోయినా ఇబ్బంది లేదు. ఈ కథలో తార, నక్షత్రల హత్య తీవ్ర కలకలం సంఘటన. వీరి హత్యకు కారకుడైన రాజకీయ నాయకుని కుమారుడు ఉద్యోగం చేసుకుంటూ కాలక్షేపం చేస్తుంటే, బాధ్యుడు కాని ఓ జీతగాడు శిక్షననుభవించాల్సి వచ్చింది. చట్టబద్ధ పాలన ఒక ఎండమావి అని రచయిత ఈ కథలో స్పష్టంగా చూపించాడు. ఈ కథలో రచయిత ధర్మాగ్రహానికి మేర లేదు. నివురుగప్పిన నిప్పు.

నూతన ఆర్థిక విధానాల సృష్టే 'దారి తప్పిన కుల చైతన్యం'. ఉద్యోగులలోనూ, ఆర్థిక స్థితిగతులు ఉన్నతంగా ఉన్నచోట కుల చైతన్యం దారి తప్పింది. వృత్తులు ఆధారంగా ఉన్నచోట కుల చైతన్య ప్రభావం తక్కువే. ఇక్కడ కుల నిర్మూలనా ఉద్యమ సంస్థలను పోల్చుకోవడానికి వీల్లేదు. వీటి లక్ష్యం, అవగాహన కేవలం కులచైతన్య సంస్థలకు భిన్నమైనది. 'వేపకాయంత నిజం' కథలో వేమయ్య యాదవ్ వామపక్ష భావజాలం కలిగినవాడు. అగ్రవర్ణాలకుండే అణచివేత స్వభావాన్ని ఈ పాత్ర ఎదిరిస్తుంది. అగ్రవర్ణాల చేతిలోని ఆయుధం ప్రభుత్వ యంత్రాంగం. పంచాయితీ ఎన్నికల్లో తమ అస్తిత్వం నిలబెట్టుకునేందుకు చేసిన ప్రయత్నఫలితం మద్దయ్యయాదవ్ తండ్రి సోమన్నపై పులిని చంపిన కేసుగా పరిణమించింది. మద్దయ్య ఈ తప్పుడు కేసును వర్గ చైతన్యంతోనే ఎదిరించాడు. ఇతనికి

వామపక్ష రాజకీయాలు తెలిసిన మిత్రుడు నాగేశ్వరరావు ఉన్నాడు. అతని ప్రభావమే మద్దయ్యయాదవ్ అయినాడు. 'వేకువ ప్రశ్న' లోని పాత్ర ప్రభాకర్ కుమారుడు వామపక్ష ఉద్యమ రహస్య కార్యకర్త. ప్రభాకర్‌కు ఉన్న కుల చైతన్యం తలకిందులుగా ఉన్నది. సంస్కరణా భావజాలంలో ఉంది. మద్దయ్యయాదవ్‌లో ఆధిపత్యాన్ని ఎదిరించే తత్వముంది. ప్రభాకర్ పాత్ర తమ వెనుకబాటు తనానికి కారణం అణచివేత అని గుర్తించకుండా, అసంఘటితంగా ఉండడమేనని తన అజ్ఞానాన్ని బయటపెట్టుకుంటాడు. ఇటువంటి తలకిందుల చైతన్యం ఓట్ల రాజకీయాలకు పనికొస్తాయేమో!

అభివృద్ధి నినాదంలోని క్రూరత్వాన్ని 'వేపకాయంత నిజం' లో పోలీసు పాత్రలో రచయిత బయటపెట్టాడు. వ్యవస్థ తన మనుగడను ప్రశ్నించే ఏ రూపాన్ని కూడా సహించదు. అయితే ప్రశ్న అనుమతులు కోరదుకదా! ప్రశ్న ఉద్యమంగా పరిణమిస్తుంది. ఈ ప్రశ్న 'వేకువ ప్రశ్న' కథగా వెంకటకృష్ణ మన ముందుంచారు. నిజానికి ఈ కథను గురించి ప్రత్యేకంగా చర్చించుకోవాల్సినంత విస్తృతి గలది. ఈ కథా సంపుటిలో చర్చించిన అన్ని అంశాలపై ఈ కథ పోరాటాన్ని ప్రకటించింది. కుటుంబ సంబంధాల్ని ప్రజాస్వామికీకరించే ప్రయత్నం అతి కఠినంగా ఈ కథలో సాగింది. భిన్న స్థాయిలోంచి చైతన్యవంతులైనవారు ప్రధాన పోరాటంలోకి వచ్చే సమయంలో కొన్ని అపశృతులు దొర్లడం సాధారణ విషయమే. ప్రభాకర్‌కు అతని భార్య శాంతమ్మకు ఉద్యమం పట్ల ఉండే భిన్నాభిప్రాయాలే ఆ అపశృతులు. కుమారునిపై మమకారం ఉద్యమంపై మమకారంగా పరిణమిస్తున్న దశ శాంతమ్మలో కనిపిస్తుంది. ప్రభాకర్‌లో కుమారుడు మిలిటెన్సీ కుల సంఘంలో ఉండి ఉంటే బాగుండేదన్న అభిప్రాయముంది. ఈ ఘర్షణలో శాంతమ్మకు సహాయపడిన వాడు ఆమె రెండో కుమారుడు. ఇంతవరకైతే ఫరవాలేదు కాని చర్చించవలసిన అంశాలు చాలా ఉన్నాయి. ఆ చర్చ మరోసారి చూద్దాం.

ప్రభుత్వ విధానాల్ని నిరసిస్తూ ఉద్యమాలు పోరాట రూపాలు తీసుకుంటున్నాయి. ఈ క్రమంలోనే కూంబింగ్, ఎన్‌కౌంటర్లు ప్రభుత్వ పాలనా విధానాల్లో భాగమయ్యాయి. నక్సలైట్ల ఏరివేత పేరిట ప్రభుత్వ ఖజానా కొల్లగొడుతున్న పోలీసు అధికారుల అవినీతి

విధానాల్ని 'గాలింపు ఖర్చులు' కథలో వివరించారు. మాజీ డిఐజి స్వర్ణజిత్ సేన్ విధానానికి వెంకటకృష్ణ భాషా, కథా కథనాన్ని చెక్కి ఆ విధంగా మలచాడు. ఉద్యమాల్ని అంతగా వెకిలిగా చూసిన ఇటీవలి కాలంలోని అధికారులలో ఇతని లాంటివారు లేరు. ప్రభుత్వ క్రూర స్వభావానికతడు ప్రతీక. ఉమర్‌ముక్తార్ సినిమాలో-వాస్తవమో కాదో మరి ముస్సోలినీ సైనికాధికారులు ఉమర్ ముక్తార్‌తో చర్చలు చేయడానికి వచ్చిన సందర్భంలో టోపీలు పక్కనబెట్టి ఉమర్ ముక్తార్‌ను అభినందిస్తారు. శత్రువులోని గొప్ప లక్షణాల్ని గౌరవించే సాంప్రదాయం వీరులకే ఉంటుంది. ఉద్యమాల అణచివేతకు కనిపించని బుసకొట్టే నాగుల్ని ప్రభుత్వం ఈ దశాబ్దంలో సృష్టించింది. ప్రజా ఉద్యమాల వెల్లువలో అవి తోక ముడిచాయి.

వ్యంగ్య హాస్యాన్ని జోడించిన ఈ కథ పోలీసుల డొల్లతనాన్ని బయటపెట్టింది. 'మధుపానము సేవించుచూ ముచ్చటిస్తున్న' సందర్భంలో 'మన గణతంత్ర పరిషత్‌కు బందిపోటు దొంగలకు భేదం' గురించి దండనాధికారి, కోశాధికారి చర్చించుకుంటారు. ఈ సన్నివేశాన్ని బట్టి రక్షణ వ్యవస్థ ఈ దేశంలో తయారు చేస్తున్న కాగితపు పులేనని రచయిత మరోసారి చెప్పారు. నిర్వాసితులు ఉద్యమించే క్రమంలో అణచివేత కూడా కొనసాగుతుంది. ఇదో యుద్ధభూమి. అందుకే ఈ కథల సమాహారం ఒక నవలా పథకంలాగా కనిపిస్తుంది.

రచన ప్రధానంగా జీవిత తాత్వికతను చర్చిస్తుంది. సాహిత్య ప్రాథమిక స్వభావమిది. ఉద్యమాలు ఎంత చురుకుగా ముందుకు అడుగేస్తున్నాయో తెలుగునాట రచన అంతగా పదునెక్కుతూనే ఉంది. తాత్విక అంశాల్ని సరళంగా వివరించడం ఉద్యమ రచయితల రచనల్లో కనిపించే సాధారణాంశం. అల్లం రాజయ్య తుపాను కథలో చెట్టంతా గాలికి ఊగుతూ ఉంటే నేనూగను, నాకిష్టం లేదని ఆ చెట్టుకుండే ఆకులు ఊగకుండగలుగుతాయా అని అంటారు. ఈ ఉపోద్ఘాతమెందుకుగాని వెంకటకృష్ణ 'కథ మళ్ళీ మొదలైంది' కథలో వైరుధ్యం, ఘర్షణ నిరంతరం ఉంటాయనే ప్రతిపాదన చేశాడు. తల్లి పిచ్చుక దాని పిల్ల పిచ్చుక, తొండ మధ్య జరిగే కొట్లాటను ఒక తండ్రి పాపకు చెబుతూ ఉంటాడీ కథలో. తొండ సరీసృప జాతికి చెందింది. పరాన్నజీవి. పక్షి స్వతంత్ర జీవి. పక్షి స్వేచ్ఛకు సంకేతం. స్వేచ్ఛగా బతకాలని, విజయం సాధించాలని పాఠకుడు కోరుకుంటాడు. పాఠకుని స్థానంలో రచయిత పాప పాత్రనుంచాడు. కథా రచన పరిణతికిది తార్కాణం. జటిలమైన అంశాల్ని పాఠకుడికి తేలికగా అందించడం రచన బాధ్యత తెలిసిన వారి పని. ఇది వరకు రావిశాస్త్రి పిపీలకం, కొంగల దేముడు వంటి కథలు తాత్విక ప్రతిపాదనలే. ఈ కథల పుస్తకంలో కర్నూలు, అనంతపురం జిల్లాలకు చెందిన కథలున్నాయి. కథ మళ్ళీ మొదలైంది, గాలింపు ఖర్చులు, వేకువ ప్రశ్న ఈ మూడు కథలు సాధారణ కథలు. ఆదిలక్ష్మి కేరాఫ్ ఆరెస్ రోడ్డు, చావు నీళ్ళు ఆ రెండు కథలకు అనంతపురం జిల్లా కథా స్థలమైంది. చావునీళ్ళు కథలో వర్షాభావ పరిస్థితిని వివరించారు. నదీ జలాల పునః పంపిణీ, తక్షణావసరాల దృష్ట్యా జరగాలని చేసిన ప్రతిపాదన ఈ కథలో గమనించదగిన అంశం. నిర్వాసితులు, వలసలు, నేటి భారతీయుల జీవన విధానం కాబోలు. ఈ కథలో ఈశ్వరప్ప పాత్ర కరవు వల్ల వలస పోయిన నిర్వాసితుడే. ఈ కథాంశం కూడా పై అన్ని కథల్లో పర్యవసించేదే. మొత్తం విధ్వంస రూపాల్ని వివిధ రూపాల్లో చిత్రిస్తున్న కథలివి. కరవు, వలసలు సృష్టించే విధ్వంసాలు ఏ కొత్త రూపాన్ని తీసుకుంటాయో మానవ సంబంధాలు ఎలా పరిణమిస్తాయో ఊహించుకుంటే భయమేస్తుంది.

శాస్త్ర, సాంకేతిక రంగాలు ఎంత అభివృద్ధి సాధించినా మానవ సంస్కారాన్ని అభివృద్ధి పరచుకోకపోతే అది నిష్ఫలమే. దళితుల కంటే, స్త్రీల కంటే, దళిత స్త్రీల కంటే భిన్నమైనది హిజ్రాల జీవితం. అందరికంటే నిరాదరణకు గురి అయిన జీవితం వారిది. జెండర్ అస్తిత్వాన్ని కోల్పోయిన తరువాత స్త్రీ పురుష పని విభజనలో వీరికి తావు లేకుండా పోయింది. ఏవైనా వృత్తుల్లో నైపుణ్యం సాధించుకున్నా, పని స్థలాల్లో నిత్యం అవహేళనకు, నిరాదరణకు హిజ్రాలు గురికాక తప్పడం లేదు. అవమానాలను, హింసను భరిస్తూన్న జీవితం హిజ్రాలది. ఈ కథా సంపుటిలో ఆదిలక్ష్మి కేరాఫ్ ఆరెస్ రోడ్ కథ

హిజ్రాల గురించిన కథే. ఈ కథలో సరళకు బాగా పరిచయమున్న వ్యక్తే ఆదినారాయణ. ఆదినారాయణే ఆదిలక్ష్మిగా హిజ్రా అయింది. సరళ తండ్రి ఆదినారాయణ ఊర్లోనే ఉపాధ్యాయునిగా పనిచేసేవాడు. చిన్నప్పటి నుంచి బాగా పరిచయమే. సరళ ఉండే పట్టణంలో అంగళ్ళ దగ్గర ఆదినారాయణ డబ్బులు అడుక్కోవడం చూసి, గుర్తు పట్టి పిలుస్తుంది. ఆదినారాయణ నీవెవరో నాకు తెలియదని సరళతో అంటాడు. చివరికి వాస్తవం చెబుతాడు. ఆదినారాయణ ఆదిలక్ష్మిగా మారడానికి కారణాలు కథలో రేఖా మాత్ర వివరణ ఉంది. సరళ ఆదినారాయణ అలా మారిపోయినందుకు బాధ పడుతుంది. పొదుపు సంఘాల్లో చేరితే రైతు బజార్లో కూరగాయలమ్మే పని కల్పిస్తాననంటుంది. ఈపాటి సంస్కారగుణం సరళలో ఉండడం మంచిదే.

ఎన్నో తాత్విక విషయాల్ని, సామాజికాంశాల్ని శాస్త్రీయంగా అంచనా వేయగలిగిన రచయిత ఈ కథలో ఇంత తేలికగా హిజ్రాల విషయం ఎందుకు చెప్పాడో అర్థం కాలేదు. దైహిక బలహీనతలను, లోపాలను శాస్త్రీయంగా వివరించి ఒక మార్గం చూపించి ఉండవచ్చును లేదా ఇప్పటి వరకు హిజ్రాల జీవితం ప్రపంచానికి తెలియదు. ఆ జీవితంలోని హింసా, అవమానాల్ని పరిచయం చేసి ఉండవచ్చును. అలా కాక సంస్కరణలతో కథ ముగించాడు. ఇది సంక్షేమ పథకాల యుగ లక్షణమా? మిగతా కథల్ని ఉత్సుకతతో చదువుకున్న పాఠకులకు ఈ కథ కొంత నిరాశ కలిగిస్తుంది. హిజ్రాల వివక్షత అంత తేలికగా పరిష్కారం కాదు. మానవ సంస్కారానికి సంబంధించిన విషయమిది. కర్ణాటకలోని హక్కుల సంఘాలు వీరి సమస్యల గురించి ఉద్యమాలు చేశాయి. హిజ్రాలతో ఇంటర్వ్యూలు చేసి రెండు భాగాలుగా పుస్తకాలు ప్రచురించారు.

పదేళ్ళ క్రితం కలకత్తాలో హిజ్రాలు దేశ స్థాయిలో సభలు జరుపుకున్నారు.

భారత శిక్షా స్మృతిలో 377 సెక్షన్ కింద కేసులన్నీ హిజ్రాలవే. పోలీసులకు అలవోకగా చిక్కే నేరస్తులు వీరేనేమో. శిక్షా స్మృతి వీరిని మనుషులుగా గుర్తించలేదు. ఈ సమస్యలో రచయిత చేయవలసినంత కృషి చేయలేదు. అడుగు జాడ కథలో ఒక స్త్రీ స్వేచ్ఛా జీవితం కోసం ఆంతరంగిక ఘర్షణ పడ్డ స్త్రీ జీవితాన్ని అత్యంత హేతుబద్ధంగా చిత్రించారు. సరైన భావాలు వర్గ పోరాటం, ఉత్పత్తి కోసం జరిగే పోరాటం, శాస్త్రీయ ప్రయోగాల నుంచి సరైన ఆలోచనలు వస్తాయని కదా మనం చదువుకుంది! ఈ అంశాలన్నీ ఇంచుమించుగా 'అడుగుజాడ' కథలో ఉన్నాయి. ఈ కథలో సుజాత డిగ్రీ వరకు చదువుకుంది. తల్లి చలం మైదానంలోని రాజేశ్వరిలా స్వేచ్ఛను కోరుకుంది. నాన్న మాత్రం మైదానం నవలలోని ముక్కుపొడుం లాయరు కాదు. సుజాత మేనత్త సునంద ప్రజా సంఘాల్లో పని చేస్తుంది. ఆమె సహచరుడు కూడా సునంద లాగే ఉద్యమ కార్యకర్త.

తల్లి నుంచి సుజాత పెళ్ళి విషయంలో శాస్త్రీయ అవగాహనకు వచ్చింది. 'ఆర్థిక స్వాతంత్ర్యం లేకుండా చలం గిలం తత్త్వాలు చల్లే నయ్' అన్న సునందతో సుజాత ఏకీభవించింది. తల్లి ఇబ్బందుల్నీ, మేనత్త స్వాతంత్ర్యాన్ని గమనించిన సుజాత ఆర్థిక స్వేచ్ఛను కోరుకుంది. స్త్రీ, పురుషుల వైరుధ్యాలు అర్థం చేసుకుంది. ఈ సమాజంలో పురుషాధిపత్యమే ఉంది కాబట్టి తానూ పీడిత వర్గంలోని దానిగా భావించి విముక్తి బాటలో పయనించడానికి సునందతో కలిసి బయలుదేరింది. సుజాత శాస్త్రీయ ప్రయోగం తల్లిలో చూసింది. అందులోని సాఫల్య, వైఫల్యాన్ని గమనించింది. స్వతంత్ర్య జీవితంలో ఎదురయ్యే సమస్యల్ని తల్లిలో చదువుకుంది. ఉపాధ్యాయ శిక్షణ పొందితే ఉపాధ్యాయినిగా బతుకవచ్చని తండ్రి ద్వారా ఉత్పత్తి కోసం జరుగవలసిన పోరాటాన్ని తెలుసుకుంది. మేనత్త, ఆమె భర్త నుంచి ఇన్ని సమస్యలకు కారణమైన సమాజాన్ని అర్థం చేసుకుని వర్గపోరాట ఆవశ్యకతను గుర్తించింది. సుజాత ఒక వ్యక్తిత్వం, కలిగిన మనిషిగా తయారుచేశాడు. వెంకటకృష్ణను అభినందించకుండా ఎలా ఉండాలి?

శాస్త్రీయ ప్రయోగమనుకుని 'చిలుకలు వాలిన చెట్టు' కథలో రచయిత స్పష్టత కోసం ఇబ్బందులు పడ్డాడు. ఉద్యమ కార్యకర్తల ప్రవర్తన, వారి మానసిక స్థితిగతులు, ఇతరుల తోడి వ్యవహారం, సాంస్కృతిక కార్యకలాపాలలోనూ, మిత్రులతో వ్యవహరించేతీరు, స్త్రీల పట్ల వారి వైఖరి కవితాత్మకంగా చిత్రించారు. ఉద్యమం నిర్బంధానికి గురికావడంతో ఒకింత అలజడికి లోనయినట్లున్నాడు. వసంతం వస్తుందన్న ఆశతో కథ ముగించాడు. మరో మాటలో చెప్పాలంటే ఉద్యమాన్ని సమీక్షించి ముందడుగు వేస్తుందన్న విశ్వాసంతో కథ ముగించాడు.

ఘర్షణ నిత్యమనే విషయాన్ని 'కథ మళ్ళీ మొదలైంది' కథలో తేలికగా చెప్ప గలిగిన రచయిత ఉద్యమాన్ని ఉద్యమ కార్యకర్తల గురించి చెప్పడానికి జటిలమైన కథనాన్ని ఎందుకెంచుకున్నారో అర్థం కాదు. ఉద్యమం పట్ల వేమన ప్రశ్న కథలోని ప్రభాకర్ లాంటి వాళ్ళకు వాస్తవ స్థితులర్థమయ్యేలా చెప్పవలసిన సందర్భంలో ఈ కథనం జటిలం గానే కనిపించింది. ఒక లోతైన అవగాహన పాఠకుడికి అందించాల్సిన కథావస్తువును సూటిగా చెప్పడంలో రచయిత ఇబ్బందులకు లోనయ్యాడా? చెప్పవలసిన విషయం కంటే చెప్పే విధానమే ఇందులో డామినేట్ చేసింది. రచయిత కథ చెప్పే విధానానికే ప్రాముఖ్యతనిచ్చాడా?

ఈ సందర్భంలో రచయిత కొంత నిటకడగా ఆలోచిస్తే బాగుండును. రచన స్వభావం అంతుదొరకనప్పుడు టెక్నిక్ కోసం వెదుకులాట ప్రారంభమవుతుంది. ఈ కథ చదువుతుంటే ఉద్యమాల పురోభివృద్ధి పట్ల రచయితకు విశ్వాసం సడలిందా అన్న అనుమానం కలుగుతుంది. అందుకు ఈ కథలో ఆయన వెలిబుచ్చిన అభిప్రాయాలే ఆధారం. ఉద్యమం పట్ల సానుభూతి ఉన్నపుడు, ఉద్యమంలోని లోటుపాట్లను చర్చించాల్సినపుడు పాఠకుడు ఉద్యమ కార్యకర్త అవుతాడు. ఉద్యమాల పట్ల సానుభూతి, అవగాహన పెంచాలనుకున్నపుడు పాఠకుడు సామాన్యుడౌతాడు. మరీ కథకు పాఠకుడు ఉద్యమ కార్యకర్తా లేక సామాన్య పాఠకుడా?

రచన సమాజాన్ని ప్రతిఫలించాలనుకుంటాం గాని రచనలో రచయిత అర్థం చేసుకున్న సమాజమే ప్రతిఫలిస్తుందని కె.కె. అంటారు. కె.కె. ఇంకోమాట కూడా అంటారు. అదేమిటంటే కళకు వ్యాపార ధర్మం సోకినపుడు శిల్పంలో సత్వరాభివృద్ధి కనిపిస్తుందని. వ్యాపారం లాభసాటిగా జరగాలంటే శిల్ప నాణ్యతను, కొత్తదనాన్ని సంతరించుకోవాల్సి ఉంటుంది. వెంకటకృష్ణ సీరియస్ రచయితే. మరి ఈ శిల్పాన్ని ఎందుకెంచుకున్నట్లు? జరుగుతున్న చరిత్రను అక్షరబద్ధం చేయడమే కాదు వ్యాఖ్యానిస్తున్నారు కూడా. గాలింపు ఖర్చులు, చిలుకలు వాలిన చెట్టు కథలలో కొత్తదనం కోసం ప్రయత్నించినట్లుంది.

ఈ కథల్లో వాడుకున్న పదజాలం, మాండలిక భాషా ప్రయోగాన్ని మరోసారి సమీక్షించుకోవాల్సి ఉంది. యాసకు, మాండలికానికి తేడా గుర్తించాలి. కొన్ని అభ్యంతరకర పద ప్రయోగాలున్నాయి. వాటిని ఎందుకుపయోగించాడో మరి. కవిత్వ భాష లేని కథలిందులో లేవు. ఇంకా పురాణ ప్రతీకల పట్ల మమకారం తీరినట్లు లేదు. "నాగ స్వరం వినే నాగుబాములున్నాయి", "ఉపన్యాసాలిచ్చే నా కొడుకులు", "చాలా దూరం వెళుతుందీ ముండ" వంటి పదాలు కథల్లో కనిపిస్తున్నాయి. అలా వ్యవహరించడం వాస్తవమే అయినా సభ్యత మాటేమిటి?

మొత్తానికి కథలన్నిటి మధ్య వస్తు సమన్వయముంది. గ్రామీణ జీవిత విధ్వంస రూపాల్ని పలు కోణాల్లోనూ, ఉద్యమాలు మరికొన్ని కోణాల్లోనూ ఈ కథల్లో చిత్రితమైనాయి. మొత్తానికి చరిత్రను అక్షరబద్ధం చేస్తూ వ్యాఖ్యానిస్తున్నారు. అన్ని కథల్లో రచయిత కంఠస్వరం స్పష్టంగా ఉంది. ఇంకా ఎలాంటి కథలు రాస్తాడో చూద్దాం. ★

పుస్తక పరిచయం

గతితార్కిక భౌతికవాదం

- ఐరా గొలోబిన్

స్వేచ్ఛానువాదం: కొడవటిగంటి రోహిణీప్రసాద్

(గత సంచిక తరువాయి...)

3

మొదటి అధ్యాయం

కార్మికులూ, వైజ్ఞానిక తత్వశాస్త్రం

వైజ్ఞానిక తత్వశాస్త్రం గురించి కార్మికులెందుకు తెలుసుకోవాలి?

(ప్రారంభంలోనే కార్మికులను ప్రస్తావించడంలోని ఉద్దేశం కార్మికులు కానివారెవరికీ వైజ్ఞానిక తత్వశాస్త్రంతో ప్రమేయం ఉండరాదని కాదు. ఇలాంటి సందర్భాల్లో కార్మికుల ప్రస్తావన సామాన్యంగా అంతగా ఉండదు కనుకనే వారి ప్రాముఖ్యతనూ, ప్రమేయాన్నీ గుర్తించడం అవసరం)

ఆలోచనాశక్తి ఎంత పరిమితమైనప్పటికీ, ఆలోచించగలిగిన ప్రతివారికీ ఒక ప్రాపంచికదృక్పథం ఉంటుంది. కొంత కుతూహలమూ, సకల విషయాలనూ గురించిన కొంతపాటి జ్ఞానమూ ఉంటాయి. యోచించగలిగిన ప్రతివారికీ అంతోఇంతో తత్వధోరణి ఉండకపోదు. కాని, వారి ప్రాపంచికదృక్పథం విజ్ఞానవంతం కావాలంటే మాత్రం వారికి గతితార్కిక భౌతికవాదాన్ని అవగాహన చేసుకోవడం తప్పనిసరి.

వైజ్ఞానిక తత్వశాస్త్రం (లేదా గతితార్కిక భౌతికవాదం, లేదా మార్క్సిస్ట్ తత్వశాస్త్రం) జ్ఞానంలోని ఒక విభాగమే. ఇందులో విశ్వాంతరాళం గురించిన సమగ్రమైన సామాన్యసత్యాలూ, అన్నిటిలోనూ, అన్ని ప్రక్రియల్లోనూ, ఎల్లవేళలా కనబడే ఏకరూప లక్షణాలూ, ఎల్లెడలా ఉండే సార్వత్రికతా మొదలైనవన్నీ ఉంటాయి. సంఘటితమైన ఈ సత్యాలే ప్రకృతి, సమాజం, ఆలోచనావిధానం మొదలైనవాటి గురించిన వైజ్ఞానిక ప్రాపంచిక దృక్పథాన్నిస్తాయి.

పెట్టుబడిదారీ దేశాల్లోనూ, నయావలస, అస్వతంత్ర దేశాల్లోనూ ఉన్న కార్మికులకు వైజ్ఞానిక తత్వశాస్త్రం గురించి తెలుసుకోవలసిన అవసరమేమిటి? మొదటిది అదెంతో ఉపయోగకర, పరమ ప్రగాఢమైన సత్యం; నిత్యజీవితంలోనూ, దీర్ఘకాలికంగానూ కూడా కొనసాగే పోరాటాల్లో విజయాలకది అవసరం. అన్ని విషయాలూ పరస్పర సంబంధం కలిగి, నిరంతరం మారుతూ ఉండేవేననీ, దేనికదిగా, మారకుండా ఏదీ ఉండదనీ గతితార్కిక భౌతికవాదంవల్లనే మనకు తెలుస్తుంది. వైజ్ఞానిక తత్వశాస్త్రం వైజ్ఞానిక పరిశీలనకు పనికొచ్చే సాధనం. వివిధ విషయాలను వేటికవిగా, రూపాంతరం చెందనివిగా భావించేవారు సహజంగా పొరబడుతున్నట్టే అనుకోవాలి; దీనికి పరిష్కారమల్లా వారి ఆలోచనలోని తప్పుడు అవగాహన తొలగిపోవడమే. జియోర్డానో బ్రూనో చెప్పినట్టు "వేసుకున్న చొక్కా గుండీల్లో మొదటిది తప్పుగా పెట్టుకున్నట్టయితే వరస మొత్తంగా తప్పిపోతుంది".1

అలాగే విజ్ఞానరహితమైన తత్వశాస్త్రం బూర్జువావర్గాలకు ముఖ్యమైనదిగా అనిపిస్తుంది (విజ్ఞానరహితమైన తత్వశాస్త్రం అంటే పూర్వవైజ్ఞానిక, లేదా విజ్ఞానవిరోధక తత్వశాస్త్రం అనుకోవచ్చు వైజ్ఞానిక తత్వశాస్త్రం అనే రెండు మాటల్లో రసాయనశాస్త్రం, పరుసవేది అని కలిపి అన్నట్టుగా వైరుధ్యం ఉందనిపిస్తుంది. గతంలో కొంత పెనగులాట జరిగాకనే రసాయనశాస్త్రం పరుసవేది అనేదాన్ని ఒక మూఢనమ్మకంగా వెనక్కు నెట్టగలిగింది; అలాగే వైజ్ఞానిక తత్వశాస్త్రం కాలక్రమేణా విజ్ఞానరహితమైన తత్వశాస్త్రాన్ని కాలదన్ని, దాని స్థానే ప్రాపంచిక దృక్పథంగా కొనసాగుతుంది. అప్పుడు అందరూ దాన్నే తత్వశాస్త్రం అంటారు) పెట్టుబడిదారీ వర్గాలకు భౌతికమూ, ఆధ్యాత్మికమూ అనే రెండు రకాల సొత్తులుంటాయి. రాజ్యమూ, ఉత్పత్తి సాధనాలూ, కార్మికుల పనితనమూ, ఆలోచనలూ అన్నీ వారి సొత్తే. "గతించిన తరాల సంప్రదాయమంతా ఆధునికుల భావాల్లో గుదిబండలాగా కొనసాగుతూ ఉంటుంది".[2] గతకాలపు దోపిడీ పాలనవల్ల కొనసాగుతున్న పీడక మానసిక ప్రవృత్తిని నేలరాచి నాశనం చెయ్యడానికి వైజ్ఞానికతత్వశాస్త్రం పనికొస్తుంది. కార్మికులకు వైజ్ఞానిక తత్వశాస్త్రం అవగతమైతే వారి బుద్ధినీ, సామర్థ్యాన్నీ అదుపుచేస్తున్న పెట్టుబడిదారీ శక్తులు బాగా బలహీన పడతాయి. అప్పుడు పెట్టుబడిదారీ విధానం కొనసాగడం కష్టమవుతుంది. వర్గసమాజంలో చేతలకూ, బుద్ధికీ మధ్య తలెత్తే వైరుధ్యం పాలకులకూ, పాలితులకూ మధ్య ఉన్నలాంటి వైరుధ్యమే. చైనా సిద్ధాంతకర్తలు ఏనాడో చెప్పినట్టుగా "బుద్ధినుపయోగించేవారు పాలకులు; కండలు కరిగించి పని చేసేవారు పాలితులు. పాలితులు అందరికీ అన్నదాతలు; పాలకులు ఇతరుల కష్టార్జితాన్ని స్వాహా చేస్తారు".[3]

బానిసల యజమానులైనా, భూస్వామ్య ప్రభువులైనా, పెట్టుబడిదారులైనా దోపిడీవర్గాలెప్పుడూ జనసామాన్యానికి తత్వవివేచన కలగకుండా చూస్తాయి. రెండువేల ఏళ్ళ క్రితమే ప్లేటో అనే తత్వవేత్త అప్పట్లో బలహీనపడుతున్న బానిసవ్యవస్థకు మద్దతునివ్వడానికి ప్రయత్నిస్తూ "తత్వవేత్తలే రాజులు కావాలనీ, రాజులు తత్వవేత్తలుగా మారాలనీ" ఉద్బోధించాడు.[4] "సామాన్యప్రజలకు తత్వశాస్త్రం తగదనీ",[5] నీచజన్మనెత్తిన బానిసలూ, చేతిపనివారూ, బానిస సమాజపు ఉత్పాదనకై పాటు పడేవారూ, వ్యాపారస్తులూ మొదలైనవారెవరూ తత్వశాస్త్రం నేర్వరాదనీ అతను అన్నాడు.

క్రీ.పూ. నాలుగో శతాబ్దంలో అరిస్టాటిల్ తన తాత్వికరచనలు ప్రచురించాడు; అందువల్ల ఉన్నత వర్గాలకు చెందనివారందరూ

కూడా వాటిని చదివెయ్యగలుగుతున్నారని అతని శిష్యుడైన అలెగ్జాండర్ స్వయంగా అరిస్టాటిల్‌ను మందలించవలసివచ్చింది. క్రీ.పూ. అయిదో శతాబ్దపు చైనా తత్వవేత్త లావో త్జు ప్రజలకు విజ్ఞానం పంచినవారిని కోప్పడ్డాడు. "ప్రజలకు జ్ఞానం పెరిగేకొద్దీ వారిని పరిపాలించడం కష్టమవుతుంది. అందుచేత జ్ఞానం పంపిణీ చేస్తూ పాలించదలుచుకున్నవారు రాజ్య వ్యవస్థను బలహీనపరుస్తారు. అలా చెయ్యని పాలకులను రాజ్యం పాలిట వరప్రసాదంగా భావించాలి".[6]

తన కాలంలో కొన్ని నగరాలకు అధినేతలైన అల్పజన పరిపాలకులు (oligarchy) చేసే ఒక రహస్య ప్రతిజ్ఞను అరిస్టాటిల్ బైటపెట్టాడు "నేను ప్రజలకు శత్రువునై, (ప్రజలంటే స్వతంత్రులైన నగరవాసులు; బానిసలు లెక్కలోకి రారు) వారికి నా చేతనైనంతవరకూ హాని తలపెడతాను..."[7] అరిస్టాటిల్ దీనికి మరొక నాజూకు అంశాన్ని చేర్చడం మంచిదని భావించి, ఇలా అన్నాడు. "అల్పజన పరిపాలకులు తాము ఎల్లవేళలా ప్రజల పక్షాన ఉన్నట్టుగానే పైకి ప్రకటించాలి; ప్రస్తుతం చేస్తున్న రహస్యప్రతిజ్ఞలకు పూర్తిగా వ్యతిరేకమైనవాటిని ప్రజలకు బాహాటంగా తెలియజెయ్యాలి... అందులో తాము ప్రజలకెన్నడూ హాని తలపెట్టబోమనే వాగ్దానం ఒకటి స్పష్టంగా ఉండాలి".[8]

ప్రజలకు వ్యతిరేకి అయిన తత్వవేత్త కాంట్ కూడా "జనసందోహానికి నచ్చడమూ, వారి ప్రశంసలు పొందడమూ తత్వవేత్త అయినవాడికి అవమానకరం" అని భావించాడు.[9] "పొట్టకూటికై పాటుపడేవారికి తత్వశాస్త్ర ధోరణి సరిపడ"దని అతను నొక్కి వక్కాణించాడు.[10]

రాజీ ధోరణి లేని తత్వవేత్తలంటే పాలకవర్గాలకు ద్వేషం ఉంటుంది. తమను ఎదురు ప్రశ్నించిన కులీనుడు సోక్రటీస్‌వైఖరిని చూసి బెదిరిన ఏథెన్స్ నగరపాలకులు అతనికి మరణశిక్ష విధించారు. తత్వవేత్త, ప్రకృతిశాస్త్రజ్ఞుడూ అయిన జియొర్డానో బ్రూనోపట్ల భయంకొద్దీ మతన్యాయస్థానపు భూస్వామ్య పాలకవర్గం అతన్ని సజీవదహనం చెయ్యమని ఉత్తరువిచ్చింది. (హెగెల్ బ్రూనోను గొప్ప మేధావిగా అభివర్ణించాడు Lectures on the History of Philosophy, సంపుటి 3, పుట 123. బ్రూనో కోపర్నికస్ సిద్ధాంతానికి ప్రాచుర్యం కల్పించాడు. మత న్యాయస్థానం విచారణలో అధికారులు "చివరగా చెప్పుకునేదేమైనా ఉందా?" అని అడిగినప్పుడు బ్రూనో "శిక్ష విధించడానికి మీరే నాకన్నా ఎక్కువ భయపడుతున్నారు" అన్నాడట. మత న్యాయస్థానంలో పేరుపొందిన సెయింట్ ఇగ్నేషియస్ Spiritual Exercises అనే తన పుస్తకంలో మతవిశ్వాసాలను ఇలా నిర్వచించాడు "చర్చ్ యొక్క మతవిశ్వాసాలను అనుసరిస్తున్నప్పుడు అవసరమైతే నల్లనివన్నీ తెల్లనివని నమ్మడానికి మనమెప్పుడూ సిద్ధంగా ఉండాలి, అలా చేస్తే ఎటువంటి పొరబాట్లూ జరగవు" Camus రాసిన The Rebel నుండి, పుట 242). ఆలోచనల్లోనూ, ఆచరణలోనూ ఉద్దండులైన ఈనాటి కార్మికనాయకులను అణగదొక్కడంలోనూ, కార్మికుల ఆలోచనావిధానాన్ని బూర్జువా వైఖరికి పరిమితం చెయ్యడంలోనూ వర్గసమాజానికి కొమ్ము కాచే సామ్రాజ్యవాదుల క్రౌర్యం పాతకాలంవారిని తలదన్నే స్థాయిలో ఉంటుంది. హిట్లర్ స్థాపించిన లేబర్ ఫ్రంట్‌కు అధినేత రాబర్ట్ లే (Robert Ley) కార్మికుల ప్రాథమిక భావనల్లో తత్వధోరణి యొక్క ప్రాముఖ్యతను బాగా అర్థం చేసుకున్నాడు. "నాజీ కార్యక్రమంలోని శాస్త్రాలూ, కళలూ అన్నీ కార్మికుల ఆత్మలను లొంగదీసుకునేందుకే; నిజానికి పౌర, సైనిక, జాతీయ, విదేశీ నాజీ వ్యవహారాలన్నిటి లక్ష్యమూ ఇదే".[11]

కార్మికులెవర్కైనా "మీరు మీ యజమానులతో సఖ్యంగా ఉండండి" అని చెపితే వారు దాన్ని హాస్యాస్పదమని కొట్టిపారేస్తారు. తమకూ, యజమానులకూ వ్యతిరేక ప్రయోజనాలుంటాయని వారికి బాగా తెలుసు. అయినప్పటికీ వారు అప్రయత్నంగా మొత్తంమీద పెట్టుబడిదారీ విధానం శాసించే ఆలోచనాపద్ధతినే అనుసరిస్తారు. అందులో జరిగేదల్లా కార్మికుల శ్రమనుంచి యజమాని లాభాలను గుంజుకోవడమే. కార్మికులకు కనక ఇందులోని తాత్విక "జాలం" అవగతం కాకపోతే వారు అందులో చిక్కుకుంటూనే ఉంటారు. తామున్నది కారాగారంలోనని బందీలకే తెలియకపోతే అంతకన్నా పదిలమైన జైలును ఊహించలేం. "నాకేదో కాస్తంతే తెలుసునని నేను గ్రహించగలిగితే మరింత తెలుసుకోవడానికి గట్టిగా ప్రయత్నిస్తాను..."[12] బూర్జువా ఆలోచనావిధానం ఫలితాలెటువంటి వంటే మానసిక ఎదుగుదలకు అవసరమయే పోషకాల లోపం, అసలు అటువంటి పోషకాలే లేకపోవడం వంటివన్నీ తప్పనిసరిగా జరుగుతాయి. అందులోని నిగూఢమైన, అంతర్గతంగా పరిపూర్ణమైన అంశాలను పట్టించుకోకుండా పైపైనే తడిమే ధోరణి ఉంటుంది. "చిల్లి చెంచాతో తింటూ, నోటికందే లోపలే ఎక్కువగా కారిపోతూంటే కడుపెలా నిండుతుంది?"[13] ఈ ప్రశ్నలోనే జవాబుంది. కార్మికుల్లో చాలామందికీ, వారి పక్షాన నిలిచే శాస్త్రవేత్తలూ, రచయితలూ, కళాకారులూ, తదితరులకూ కొన్ని గంభీరమైన విషయాలు అవగాహన చేసుకోవడం చాలా అవసరం. కార్మికుల ఆలోచనలు స్వతంత్రం కానంతవరకూ వారి బంధాలను పూర్తిగానూ, శాశ్వతంగానూ విడిపించడం సాధ్యం కాదు.

కార్మికులు బూర్జువా తత్వధోరణిని చాలావరకూ చెత్తదిగా భావిస్తారు. ఇంకాస్త దుందుడుకుగా, వైజ్ఞానిక తత్వశాస్త్రంతోసహా మొత్తం తత్వశాస్త్రాన్నే తృణీకరించేవారిది మాత్రం తప్పుడు ధోరణి; అలాటివారు "పనికిమాలిన తత్వవేత్తల చవకబారు ధోరణులవల్ల ప్రభావితులౌతారు".[14] వైజ్ఞానిక తత్వశాస్త్రమంటే ఏమిటో తెలియకపోవడంతో వారి అవగాహనా, చర్యలూ అన్నీకూడా రోజువారీ జీవితాల పైపై విషయాలకూ, తత్సంబంధిత దృక్పథానికీ పరిమితమైపోతాయి. ఆ కారణంగా జీవితపు విశాలతరమైన సందర్భాలు అకస్మాత్తుగా ఎదురైనప్పుడల్లా వీరు తడబడుతూ ఉంటారు. "వ్యవహార దక్షులెప్పుడూ కాలుజారే పరిస్థితికి లోనవక గమనికగా ఉంటారు. చిన్నచిన్న విషయాల్లో వారు బోల్తాపడరు కాని... జీవితగమ్యం ఎటువంటిదో గుర్తించకపోతే అదుపుతప్పిపోతూ ఉంటారు".[15]

రోజువారీ జీవితంలోని మామూలు వ్యవహారాలకయితే వాస్తవిక వైఖరీ, ప్రపంచజ్ఞానమూ పనికొస్తాయి; కాని, ఒక

తత్వధోరణీ, ప్రపంచస్థాయికి తగిన సమగ్రమైన దృక్పథమూ అవసరమైన పరిస్థితిలో మాత్రం వాటి పరిమితులన్నీ బైటపడతాయి. ఒకలా చెప్పాలంటే ఈ సందర్భంలో "లోకజ్ఞానమంటే నిన్నామొన్నటి విజ్ఞానం, తత్వశాస్త్రాలూ, కళలూ, మతాలూ వగైరాలనుంచి మనకు కేవలం అపోహల స్థాయిలో సంక్రమించే పరిజ్ఞానమే".16

1886లో చికాగోలో జరిగిన హే మార్కెట్ సమ్మెలో అమరులయినవారి తరఫున వాదించిన జోసెఫ్ డియెట్జెన్‌ను (Joseph Dietzgen) కార్ల్ మార్క్స్ "మన కార్మిక తత్వవేత్త" అని పేర్కొన్నాడు. అమెరికాలో వైజ్ఞానిక తత్వశాస్త్రానికి ప్రాచుర్యం కల్పించిన డియెట్జెన్ ఏనాడో చెప్పాడు. "శరీరశ్రమ చేసే కార్మికులు మానసికశ్రమయొక్క విలువను తగినంతగా గుర్తించరు. బూర్జువా సమాజంలో రాతకోతలు చేసేవారిపట్ల వారికుండే ఆరోగ్యకరమైన అపనమ్మకం ఒక్కొక్కప్పుడు మితిమీరుతుంది. మేధావుల కార్యకలాపాల ముసుగులో ఎన్నెన్ని తప్పుడుపనులు జరుగుతూ ఉంటాయో వారికి తెలుస్తూ ఉండడంతో వారు శరీరశ్రమను ఎక్కువగానూ, మానసికశ్రమను తక్కువగానూ అంచనా వేస్తారు. ఈ మొరటయిన భౌతికవాదాన్ని సరిదిద్దాలి. శరీరశక్తీ, కండబలమూ కార్మికవర్గాలకు విశిష్టాధికారాల వంటివి. అయితే మానసికశిక్షణ విషయంలో మాత్రం వారిది ప్రస్తుతం వెనకడుగే. కార్మికవర్గాలు స్వేచ్ఛను సాధించాలంటే వారికి ఈ శతాబ్దపు విజ్ఞానంమీద పట్టు ఉండటం అవసరం".[17]

మానసికశ్రమను సరిగ్గా అంచనా వేస్తున్నప్పుడు మేధావివర్గం గురించిన విచక్షణారహితమైన అపనమ్మకం ఉంటే మటుకు అది నిజాన్ని వక్రీకరించడమే అవుతుంది; అది కార్మికవర్గానికి శ్రేయస్కరం కాదుకూడా. ఇందులో సంపూర్ణమైన అవగాహన ఉండదు; వ్యక్తుల, లేదా సముదాయాల ప్రత్యేక లక్షణాలను పరిశీలించకుండా అందరినీ ఒకే గాట కట్టేసి, ఉన్న పరిస్థితులకి కొమ్ముకాచే బూర్జువాలుగా భావించడమే కనబడుతుంది. బూర్జువా ధోరణులున్నప్పటికీ మేధావుల్లో చాలామంది సమాజపు సాంస్కృతిక వారసత్వంలోని గొప్ప అంశాలను అందిపుచ్చుకుని, వాటికి సృజనాత్మకంగా మెరుగుపెట్టినవారే. వారందరినీ ఒకే పద్ధతిలో కట్టగట్టి, కార్మికవర్గానికి అన్ని విషయాల్లోనూ, ఎల్లవేళలా శత్రువులుగానే ఉంటారని అనుకోవడం భావ్యం కాదు.

భావాత్మకబంధాలను సవాలు చేసి నిర్మూలించకుండా ఆర్థిక, రాజకీయబంధాలను తెంచుకోవడం వీలవదు. కార్మికుల రాజకీయప్రణాళిక ఎంత బాగున్నప్పటికీ, బూర్జువా ఆలోచనాధోరణి ఉన్నంత కాలమూ అది భ్రష్టుపట్టిపోతుంది. శాస్త్రబద్ధమైన రాజకీయాలకు వైజ్ఞానిక తత్వశాస్త్రం అవసరం.

ఎంగెల్స్ వైజ్ఞానిక తత్వశాస్త్రం గురించి చెపుతూ "అది మాకున్న (మార్క్స్, ఎంగెల్స్) శ్రేష్ఠతమమైన పరికరం, పదునైన కత్తి..." అన్నాడు.[18] మార్క్స్ ప్రసిద్ధ రచన కాపిటల్ ఈ పరికరంవల్ల తయారైనదే. "తత్వశాస్త్రాన్ని తత్వవేత్తల ఉపన్యాసాలనుంచీ, పాఠ్యపుస్తకాలనుంచీ విడుదల చేసి, సామాన్యప్రజల చేతుల్లో పదునైన శస్త్రంగా మార్చండి" అన్నాడు మావో జెడాంగ్.[19] వైజ్ఞానిక తత్వశాస్త్రం లేకుండా కార్మికవర్గం ముందడుగు వెయ్యలేదు. "ఇది (తత్వశాస్త్రం) అర్థం కాకపోతే మనందరికీ (మార్క్సిస్టులకు) పనికొచ్చే భాషగాని, పద్ధతిగాని ఏర్పడదు".[20] విప్లవంలో విజయం సాధించాలంటే వైజ్ఞానిక తత్వశాస్త్రాన్ని కూలంకషంగా తెలుసుకోవాలి; దానివల్ల పని త్వరగా జరుగుతుందికూడా.

References:

1. Quoted in Siu, *The Tao of Science*, p.44
2. Marx, The 18th *Brumaire of Louis Bonaparte*, p.13
3. Lu Hsun, *Selected Works*, Vol.4, p.64
4. Plato, *The Republic*, Part 7, sec. 473d
5. Ibid., sec. 494a
6. Fung, *A History of Chinese Philosophy*, Vol.1, p.189
7. Aristotle, *Politics*, p.236
8. Ibid.
9. Kant, *Prolegomena to Any Future Metaphysics*, p.7
10. Quoted in Nizan, *The Watchdogs*, p.99
11. Quoted in Robert A. Brady, *The Spirit and Structure of German Fascism*, 1937, p.119 cited in Harap, *Social Roots of the Arts*, p.156
12, Lenin, *On Socialist Ideology and Culture*, p.56
13. Bellamy, *Looking Backward*, p.314
14. Engels, *Dialectics of Nature*, p.184
15. Pisarev, "Thinking Proletariat", in *Selected Philosophical, Social and Political Essays*, p.642
16. Kaufmann, *Critique of Religion and Philosophy*, p.95
17. Dietzgen, *Some of the Philosophical Essays*, pp.131-32
18. Engels, *Ludwig Feuerbach*, p.44
19. "Turing Chairman Mao's Philosophical Thinking into Sharp Weapon in the Hands of Workers", *Peking Review*, Nov. 14, 1969, p.10
20. Mao, "Speeches at the National Conference of the Communist Party of China", *Selected Works*, Vol.5, p.160

లేఖ :

అరుణతార సంపాదకులకు ...

'ప్రజా ఉద్యమాలు - నాటకాలలో స్త్రీల భాగస్వామ్యం' గురించి అరుణతార ఏప్రిల్ 2011 సంచికలో చదివితే గతకాలపు జ్ఞాపకాలు ముసురుకున్నాయి. ప్రజా ఉద్యమాల్లో - కళారంగాల్లో స్త్రీలు నటించేందుకు ఎంత సంఘర్షణ అవసరమయిందో ఈ తరానికి తెలియదు. జె.ఎన్.ఎం. అరుణోదయ కళాకారుల పేర్లు చేర్చనందుకు వ్యాసకర్త ఉద్దేశాన్ని శంకిస్తూ తరుణ రాయడం అసమంజసమనిపించింది. 'నాటకాలలో స్త్రీల భాగస్వామ్యం' ఆనాటి ఉపన్యాస అంశం. తరుణ పేర్కొన్న కళాకారులు గాయకులే గాని నటీమణులుకాదు. ఇంతకన్నా సమగ్రమైన వ్యాసాన్ని సవివరంగా తరుణ రాయాలని విన్నపం. దాని వలన మంచి డాక్యుమెంటు తయారవుతుందని ఆశ. ప్రస్తుతం దాని అవసరం చాలా ఉంది.

కృప, వైజాగ్

గుమ్మెటమోత

- పాణి

(13)

(గత సంచిక తరువాయి...)

సుధాకర్‌ను విడిగా కలిస్తే బాగుంటుందనిపించింది. నిజంగానే తన అంచనాకు విరుద్ధంగా సుధాకర్ స్పందించడంతో చాలా సంతోషం కలిగింది. అయినా మనుషుల గురించి ఎల్లకాలాలకూ సరిపోయే అంచనాలకు రావడం కష్టమేమో. ఎవరైనా అలాంటి సాహసం చేయబోతే తారుమారైపోయి ఆశ్చర్యపోవలసి వస్తుంది. సరిగ్గా ఇప్పటి తనలాగే. మొండిగా ఉంటే మూర్ఖత్వం రుజువు అవుతుంది తప్ప మరేమీ కాదు. సుధాకర్‌లాంటి వాళ్లు దేనికి ఎట్లా రియాక్టవుతారో చెప్పలేం. సొంత అభిప్రాయాలతో సంబంధం లేకుండా న్యాయం పక్షాన నిలబడే సుగుణం కూడా వాళ్లకు ఉంటుంది. లేకపోతే ఫ్రీ మాడ్రన్ కమ్యూనిటీల ఆకాంక్షల గురించి ఇద్దరి మధ్య అంత గొడవ జరిగి, అది వ్యక్తిగత విబేధాలకు కూడా దారి తీశాక సరిగ్గా అలాంటి దాన్లోనే సుధాకర్ ఇట్లా స్పందించాడు మరి.

సుధాకర్ మొన్న మీటింగ్‌కు రావడం, దీని మీద ఏ పని అప్పగించినా చేస్తాననడం చాలా సంతోషంగా ఉన్నా ఇప్పుడు గిరికి తన అంచనాల పట్ల కించిత్ సందేహం కూడా కలుగుతోంది. మనిషి వ్యక్తిత్వంలో మనకు తెలియని సొరుగు కూడా ఉంటుందని జాగ్రత్తపడడం మంచిదేమో! అనిపించింది. అసలు ఇద్దరి మధ్యా ఏమీ లేనట్టు సుధాకర్ తనంత తానుగా ఎంత బాగా వచ్చేశాడు. అయితే ఇప్పటికీ ఒక సంకోచం పీకుతూనే ఉంది. సుధాకర్ ఎప్పుడు ఏం మాట్లాడుతాడో, ఏ పని చేస్తాడో, దేనితో పేచీ పెట్టుకుంటాడో చెప్పడం కష్టమనే ప్రచారం ఉంది. దాన్నాయన అప్పుడప్పుడూ నిజం చేస్తూనే ఉంటాడు.

ఈ సందిగ్ధం నుంచి బైటపడి గిరి ఒక నిశ్చయానికి వచ్చాడు. అతనితో పని వరకు ఫర్వాలేదు. అంత వరకే ఆగాలి. వాదనలోకి వెళ్లితే చిక్కు వస్తుంది. అయితే మాటల మధ్య ఏదో ఒకటి రాకుండా పోదు. నోరు కట్టుకొని బతకలేంగా. ఇంత దగ్గరై మళ్లీ దూరమైతే చూడ్డానికే బాగుండదు. ఉలిగప్పతో ఇవన్నీ వివరంగా మాట్లాడాల్సిందే. సుధాకరంటే తనకు భలే మోజు. సాన్నిత్యంతో వెంటనే అల్లుకపోతాడు. మొన్న సుధాకర్ మాటలకు బాగా ఇంప్రెస్ అయ్యాడు. ఇంత కాలం నీవు సరిగా ఆయన్ను అర్థం చేసుకోలేదని కూడా పరోక్షంగా అనేశాడు. ముందే ఇవన్నీ మాట్లాడకపోతే రేప్పొద్దున ఏదైనా వస్తే అంతా తనే మోయాల్సి వస్తుంది.

ఇవన్నీ ముందే మాట్లాడాలి.

విశాలకు కూడా చెప్పాలి.

ఉలిగప్ప పొద్దున్నే వెళ్లిపోయాడు. ఈ జీవో మీద హైదరాబాదులో ఎల్లుండి జరగాల్సిన ధర్నా పని మీద వెళ్లాడు. ఒకే రోజు కోస్తా, రాయలసీమ జిల్లాల్లో ర్యాలీలు, కలెక్టరేట్ల ఎదుట భారీ ధర్నాలు జరపాలి. హైదరాబాదులో కూడా ధర్నా చేయాలి. మొన్న సమావేశంలో ఈ నిర్ణయం చేసేటప్పుడు సిటీలో అవసరమా? అన్నారు. తెలంగాణలో సమస్య లేదు కదా అనే ఉద్దేశంతో. కానీ గిరి పట్టుపట్టాడు. ఇక్కడ చేస్తే సమస్య బాగా ఫోకస్ అవుతుందని గట్టిగా చెప్పాక తప్పలేదు. విధిలేక ఒప్పుకున్నారు కాబట్టి పనుల్లోకి బలవంతంగా కదిలించాల్సిందేనని గిరి, ఉలిగప్ప అనుకున్నారు. ఆ పని మీదే ఉలిగప్ప నిద్ర లేవగానే వెళ్లిపోయాడు. అన్నీ చక్కబెట్టుకొని సాయంకాలం బైటే కలుస్తానన్నాడు. ఆ సమయానికి విశాలను కూడా రమ్మని చెప్పాడు.

ఇద్దరి కోసం ఎదురు చూస్తున్నాడు.

విశాలతో ఏదైనా ఎంత సులభమో అంత కష్టం. ఆమెకు ఈ చిరాకులేవీ తెలియవు. పైగా పట్టించుకోదు. పని ఉంటే దూకేయడం, అవతలి వాళ్లు తప్పు చేశారనుకుంటే దులిపేయడం... ఈ మధ్య వాళ్లిద్దరూ మురిపెంగా ఎంత గొడవపడతారో.. అంతగా ఒక్కోసారి ఆశ్చర్యకరంగా చెరో వైపు నుంచి ఒకే మాట మాట్లాడుతున్నారు.

వాళ్లిద్దరూ తనకు బాగా తెలుసనుకునే వాడు. కానీ ఒక కొత్త బంధం ఏర్పడుతున్నప్పుడు అంత దాకా కనిపించని కొత్త వెలుగులు మనుషుల్లో కనిపిస్తాయి. ఇప్పుడు వాళ్లిద్దరిలో గిరి అలాంటి కొత్తదనాన్ని ఎన్ని సార్లు చూశాడో. ప్రతిసారీ తెగ ఆనందిస్తుంటాడు. బ్రమ్మాండంగా ఎంజాయ్ చేస్తున్నాడు. ఇద్దరూ దేన్నయినా సింపుల్‌గా, సూటిగా తేల్చేసుకుంటారు. ఈ మధ్యే ఉలిగప్ప లోపలికి విస్తరిస్తున్నాడు.

గిరికి వాళ్లిద్దరి గురించి ఇట్లా ఆలోచించడం ప్రతిసారీ వింత అనుభవమే.

వీళ్లేంది ఇంకా రాలేదూ.. అనుకుంటూ ఉంటే ఓ చిలిపి ఊహ కలిగింది. కొంపతీసి ఉలిగప్ప ఆ పిల్లను కలవడానికే వెళ్లలేదు గదా? అనిపించింది.

అంత లోనే విశాల ఒక్కతే ఆటో దిగింది. తన ఊహకు నవ్వుకుంటూ ఉంటే.. 'ఏందీ నన్ను చూసేనా నవ్వుకోవడం' అని విశాల అంత దూరం నుంచే అన్నది. నిజంగానే తాను ఏమనుకున్నదీ చెప్తే ఎట్లా రియాక్ట్ అవుతుందో తెలిసినా, టపీమని ' మీరిద్దరూ కలిసి వస్తారనుకున్నాలే..' అన్నాడు.

"అవును కలిసే వద్దామనుకున్నాం. నాకే వీలు కాలేదు.. అయితే ఏంటి?" అని అంతే వేగంగా అన్నది.

"ఆహా.. ఏం లేదు. ఎదురు చూసేవాళ్ల బాధ ఇతరులకు ఏం తెలుస్తుంది? నేను వచ్చి గంటవుతోంది. కాబట్టి నేను ఏమైనా అనుకోవచ్చు. నాకు ఆ హక్కు ఉంది..." అని " "ఇంతకూ మనం మాట్లాడుకొని వెళ్లేటప్పటికి సుధాకర్ తిని గుర్రు పెడతాడు.." అన్నాడు.

"తనను కలవడానికైతే నేరుగా అటే వెళ్లే వాళ్లంగా.." అనింది విశాల.

"వెళ్లొచ్చు... కానీ సుధాకర్‌తో పని గదా? ముందే కొంచెం మాట్లాడుకోకపోతే తర్వాత ఇబ్బందుల్లోపడతాం. మావాళ్లకు అసలే ఇష్టం లేదు. మొన్న ఎట్లా మాట్లాడారో చూశావుగా..?" గిరి మాటలు పూర్తి కాకముందే " నీకు కూడా ఇష్టం లేదా ఏమి?" అనింది.

గిరి అదిరిపడ్డాడు.

స్థిమితంగానే అందుకొని " నాకు ఇష్టం లేకపోతే మొన్ననే చెప్పేవాడినిగా...మనం మాట్లాడుకోవాలనేది నా ఇష్టా ఇష్టాల గురించి కాదు. సుధాకర్ కొన్ని విషయాల్లో డిఫరెంట్‌గా ఆలోచిస్తుంటాడని మన దృష్టిలో లేకపోతే ఇబ్బందని చెప్పడమే నా ఉద్దేశం.." అన్నాడు.

విశాల అన్న మాటకు కలిగిన రియాక్షన్‌ను తన మాట పూర్తయ్యే సరికే సర్దుకున్నాడు. ఆమె మాటల వెనుక ఉన్న స్ఫూర్తిని గుర్తించడం వల్ల చాలా మామూలయ్యాడు.

"అందరూ నీలాగే ఎందుకు ఆలోచించాలి? అసలు నీలా ఆలోచించని వాళ్లతో నీ సంబంధాలు ఎలా ఉంటాయనేదే నీ వ్యక్తిత్వానికి గీటురాయి..." విశాల ఇంకా ఏమో చెప్పబోతోంటే గిరి మధ్యలోనే ఆపేశాడు.

"ఇప్పుడు ఇదంతా ఎందుకు? సుధాకర్‌తో కలిసి పనిచేయాలని నేనే అనుకుంటున్నాను కదా. దానికే అయితే ఈ హితబోధ అక్కర్లేదు. నేను నా కులం వాళ్ల ప్రయోజనం కోసం ఎవరితోనైనా కలుస్తాను. ఇప్పటికి ఇలా నన్ను వదిలెయ్ తల్లీ...." అని మొదట రాజకీయ ఫక్కీలో అని, ఆ తర్వాత విధేయత తొంగి చూస్తుండగా అన్నాడు.

"అంటే.. నాతో వాదించలేక ఒప్పుకుంటున్నావా? లేక మీ కుల ప్రయోజనం కోసం ఒప్పుకుంటున్నావా?.." అని అంత కంటే గట్టిగా నిలదీస్తూ అడిగింది విశాల.

"ఈ రెంటిలో ఏది చెప్పినా నన్ను వదిలిపెట్టవని తెలుసు. నీవు చెప్పినట్లు ఉండడమే ప్రజాస్వామ్యమని మనస్ఫూర్తిగా అంగీకరిస్తున్నాను.." అన్నాడు భుజాలు పూర్తిగా వంచుతూ.

"అదీ.. అట్లారా దారికి.." పగలబడి నవ్వింది విశాల.

గిరి అంతే ఆహ్లాదంగా " నీకో సంగతి తెలుసా? ఇట్లా మెడ మీద కత్తిలాగా వాదన పేర్చి ఒప్పించడాన్ని మాత్రం ప్రజాస్వామ్యమనరు" అన్నాడు సూటిగా ఆమె కళ్లలోకి చూస్తూ.

దెబ్బ తిన్నట్లు చూసింది విశాల.

'నిజమే. తాను అట్లా ఆలోచించలేకపోయింది. అంతా సవ్యంగా ఉన్నప్పుడు ఫరవాలేదుగాని చిక్కుముడిపడి తేల్చవలసి వచ్చినప్పుడు చాలా అన్యాయం జరిగిపోతుంది...' అనిపించింది. ఆ క్షణమే ఆమె ముఖం అదోలా అయిపోయింది. గిరి గమనించాడు.

"ఏం లేదు... భావోద్వేగపూరిత వాదనలోలాగే, వాదన కోసమే చేసే వాదనలో కూడా కత్తి వాదర ఉంటుందిగాని, రెంటిలోనూ కొంచెం బ్లాక్‌మెయిల్ పాలు జాస్తి. దీనికి ఇంకేదీ సమానం కాదు...." అని విశాల ముఖంలోకి పరీక్షగా చూశాడు. ఇంతకూ ఏమనుకుంటోందీ... అని.

ఆమె చాలా చిత్తశుద్ధితో, ఉద్యమ అవసరం కోసం మాట్లాడుతూ... సరదాగా వాదిస్తే తాను ఏకంగా క్లాస్ తీసుకుంటున్నట్లుంది ... అనుకున్నాడు. అతని సందిగ్ధాన్ని గమనించి విశాల ఊ... పూర్తి చెయ్ అంది.

"అహా.. ఏం లేదు,..బ్లాక్ మెయిల్ అన్నాను కదా.. ఫీలయ్యావేమోనని " ఆగాను. అని ఓ నిమిషమాగి తనే "అయినా అనుకున్నది పూర్తిగా చెప్తాను. చెప్పడమే ఎందుకైనా మంచిది. ఇంతకూ అసలు విషయమేమేంటే... ఆ రెంటికంటే గొప్ప బ్లాక్‌మెయిల్ మరోటి ఉంది. అది అలక. వాదనలో, సంబంధాల్లో అలక అనేది ఉంది చూశావ్... అది అన్నిటికన్నా బ్లాక్‌మెయిల్. దాని ముందు ఇతరులు మోకరిల్లక తప్పదు. ఇతరులను సాగిలపడేలా చేసుకోడానికే అలుగుతారు. అదొక ఆధిపత్యమన్నమాట. తప్పొప్పులు, మంచి చెడ్డలు అన్నీ గాలికిపోయి అలకలు, ఓదార్పులు మాత్రమే మిగులుతాయి. నిజానికి ఓదార్పు కోసం అలగరు. ఇతరులు తామే తప్పు చేశామేమో అని పశ్చాత్తాపానికి గురయ్యేలా చేయడమే అసలు ఉద్దేశం. లొంగదీసుకోడానికి, ఒప్పింపచేసుకోడానికి అలక అతి దగ్గరి దారి..."

"అలక నా జీవితంలో లేదు..." రోషమని అన్నది విశాల. అట్లా అనడంలో కొంచెం ఉక్రోషం తొంగిచూసింది.

"ఆ సంగతి నాకూ తెలుసు. అసలు ఉలిగప్ప ఓసారి ఏమన్నాడంటే... విశాల కోపమొస్తే ఇంటి మీదికి వచ్చి కొట్లాడుతుందేమోగాని ఫీలయ్యే రకం కాదన్నాడు. నిన్ను బాగా తెలుసుకున్నాడు కదూ" అన్నాడు. అప్పటికి ఇక ఆ వాదనా వలయం నుంచి బైటపడాలని.

"అంటే... మీరిద్దరూ కలసి నా గురించి మాట్లాడుకుంటారన్న మాట" అంది చిరు కోపంగా. అందులో ఏదో ఇష్టం, అపురూపం కూడా వ్యక్తమైంది.

"నేను మాట్లాడను కాని, తనైతే నీ గురించే మాట్లాడతాడు. ఇక నాకూ తప్పదు. వినేవాడు లేకుంటే చెప్పేవాళ్ల హక్కులు చెల్లుబాటు కావుగదా? " అన్నాడు.

"అది అతని హక్కా?" నిలదీసింది.

" ఆ సంగతి నాకు తెలియదు. మీరిద్దరే తేల్చుకుంటే మంచిది...."

విశాలకు మురిపెంగానూ, కొంచెం ఇరుకుగానూ అనిపించింది. ఇంతకూ ఏం మాట్లాడుతుంటాడు? అని ఓ క్షణం అనిపించింది. ఆ సంగతి తెలుసుకోడానికి మళ్లీ అవకాశం వస్తుందో లేదో అన్నట్లు. పైగా గిరిని కాకపోతే ఇంకెవరిని తను అడుగుతుంది? అంతలోనే చాలా అల్పమనిపిస్తుందేమో అని జంకింది. నిజానికి ఈ గుంజాటన ఈ మధ్య ఎన్నడూ కలగలేదు. ఇంటి నుంచి బైట పడ్డాక అనుభవంలోకి వచ్చిన స్వేచ్ఛా ప్రపంచంలో సకల సందిగ్ధతలను జయించాననే ధీమా ఉండేది. అంతక ముందు అన్నీ అదిమిపట్టుకొని ఉండేది. ఆలోచనలు, అభిప్రాయాలు బైట పెట్టుకోవడంలో ఎంత ఆనందం ఉంటుందో నిండుగా అనుభవిస్తున్న విశాలకు మళ్లీ ఇప్పుడీ ఇరుకుదనం. చాలా చిన్నదానికి ఎందుకిందంతా... అనుకొని వదిలేస్తూ "ఇంతకూ సుధాకర్‌ను కలిసేది ఉందా? లేదా?" అని మాట మార్చేసింది.

"ముగ్గురం కలిసే వెళ్దాం.."

"అవును కాని, మొన్న మన సమావేశం జరిగాక ఎట్లాంటి రెస్పాన్స్ వచ్చింది?" ఆరాగా అడిగింది.

గిరి కాసేపు ఆలోచనలోపడ్డాడు.

"ఏమని చెప్పాలి? నేను ఏ అంచనాకు రాలేకపో తున్నా.

ఈ దెబ్బతో మాలోళ్లతో మావాళ్లకు తెగిపోయినట్టే. దండోరాకు అడ్డం ఉన్నారని ఇప్పటికే బాగా వ్యతిరేకత ఉండె. ఇప్పుడు ఈ జీవో కత తెలిస్తే ఊళ్లలో చాలా కష్టం. కాకపోతే మావాళ్లు ఊరి బైట ఉంటారు కాబట్టి కొట్లాటలు జరగవు. మనసులైతే చీలిపోతాయి. పైన ఎవరో చేసిందానికి ఊళ్లల్లో మామూలు జనాలకు ఈ తంటాలు... పైగా అవతలి వాళ్లకు కూడా ఇవన్నీ ఏం తెలుస్తాయి? దారినపోయేది వాళ్ల నెత్తిన పడ్డట్టయింది.

ఇంతలో ఉలిగప్ప వచ్చాడు.

రాగానే పెద్ద నిట్టూర్పుతో " నిన్న మీటింగ్‌లో ఒప్పుకున్నారుగాని ధర్నాకు ఒప్పించేసరికి యాసికొచ్చింది. ఒక దిక్కు వెంకటేశ్వర్లు సారు, మరో దిక్కు స్టేటు వాళ్లు చెబితే గాని ఒప్పుకోలా.." అని తన విసుగునంతా బైటపెట్టుకున్నాడు.

"ఎందుకట్ల...? మొన్న ఒప్పుకున్నారుగా?" విశాల ఆశ్చర్యపోయింది.

"ఎందుకేంది? ఈ సమస్య తెలంగాణలో లేదు కదా? ఇక్కడెందుకు? అని. అంతకంటే వేరే లాజిక్ ఏమీ లేదు.."

"ఓహో.." వ్యవహారం ఇంత జటిలమా? అనిపించింది విశాలకు. కులం ఒకటే కావచ్చు... మళ్లీ అందులో ప్రాంతాలు.. ఇందులో ఏది నిజం? ఏది అబద్ధం? అనే సందేహం కలిగింది.

"ఇంతకూ ప్రోగ్రాం ఉన్నట్టే గదా? " అడిగాడు గిరి.

"ఉందంటే ఉంది. సిటీ వాళ్లు చూస్తారని మనం ఊరుకోడానికి లేదు. అది సరే ... ఈ ధర్నాకు మనల్ని సపోర్టు చేస్తున్న వాళ్లందర్నీ పిలవాలి.. లిస్టు తయారు చేశావా? " అన్నాడు.

"ముందు సుధాకర్ సంగతి తేల్చండి.. మిగతా తర్వాత చూసుకోవచ్చు" అని విశాల అసలు విషయంలోకి వచ్చింది.

"తేల్చేదేముంది? వెళ్దామనుకున్నాం గదా?" అని ... ఇది కాక ఇంకా ఏమైనా ఉందా? అన్నట్లు గిరి వైపు చూశాడు ఉలిగప్ప.

" సుధాకర్ మనతో కలిసి తిరగడం ఎంత కాదనుకున్నా గొడవయ్యేదే. మనోళ్లకు చెప్పడమే ఇబ్బంది. ఇంక దండోరా వాళ్లతో మరీ కష్టం..."

"ఆయన అందరి మాదిరి కాదని, మన డిమాండ్లను సపోర్టు చేస్తాడని చెప్తాం.." అన్నాడు ఉలిగప్ప.

"సమస్య సర్దిచెప్పడం గురించి కాదు. ఆయన ఏ కులంలో పుట్టాడనేది. ఆ రెండు కులాల మధ్య అనవసరంగా రగడ నడుస్తుండె. మనమూ వర్గీకరణ కోరుతుంటిమి. పైగా సుధాకర్‌కు ఎప్పుడు ఏ కొత్త ఆలోచనో వచ్చి ఏదైనా రాశాడనుకో.. అది కొంపదీసి మనవాళ్లకు ఇబ్బందిపెట్టేదైతే ఇంక మనం ఇరకాటాన పడతాం.."

"దీన్ని కాదనలేం. మనం జాగ్రత్తగా ఉండాలి. అంతేగాని మనం కూడా ముందే తీసి పక్కన ఎట్ల పెడతాం? " అన్నాడు ఉలిగప్ప.

"నాదీ ఇదే అభిప్రాయం. ఇట్లాంటి పేచీలు వస్తాయని మన దృష్టిలో ఉంటే చాలు.. " గిరి ముగించాడు.

విశాలకు అప్పటికి గాని గిరి పడుతున్న అవస్థ అర్థం కాలేదు. నిజమే అంత తేలిగ్గాదు.. అనుకుంది.

కాసేపు తర్జనభర్జన పడ్డారు.

"అయితే ఇదంతా ఎందుకు? లేనిపోని గొడవ. ఆయన ఏదైనా సాయం చేస్తే బైటి నుంచి తీసుకుందాం.." అని విశాలే అన్నది. నిజంగానే ఆమెకు ఇప్పుడు ఇదంతా అవసరమా? అనిపించింది.

"ఊహూ .. ఇదొక మంచి ఛాన్స్. ఇట్లాంటి ఉద్యమాలకు అవసరమైన కొన్ని కొత్త ఆలోచనలను ఈ కాంబినేషన్లో తేవచ్చు. అసలు కొన్ని కొత్త ఆలోచనలు చేయకపోతే ఇది ఇంక ముందుకు పోదు. జీవో 144 వచ్చిపడి మనవాళ్లు ముందుకు పోవడానికి ఆటంకమైనదానికంటే ఆలోచనలు నిల్చిపోవడం మరీ పెద్ద సమస్య. మనోళ్లలో చదువుకున్నవాళ్లు, సిద్ధాంతాలు చెప్పేవాళ్లు తక్కువ కాబట్టి సరిపోయింది. లేకపోతే మనమూ చాలా ఇబ్బంది పడాల్సి వచ్చేది. అయినా మనకూ తప్పడం లేదని మొన్న మీటింగులో తేలిపోయింది. అన్ని కులాల ఉద్యమాలు అట్లనే తయారయ్యాయి కాబట్టి మనవాళ్లు కూడా అట్లనే ఆలోచిస్తున్నారు. దీనికి ఎవర్నో తప్పు పట్టడానికి లేదు. అస్తిత్వ ఆలోచనల్లో ఉన్న ఈ చిక్కును అధిగమించడం ఎట్లా అనేదే సమస్య. సుధాకర్ కాంక్రీటుగా నిలబడి వాదన పెడితే చాలా బాగుంటుంది. ఆయన మన గురించి మాట్లాడటం నిజంగానే సంచలనమవుతుంది... అస్తిత్వాల న్యాయం గురించి బైటి వాళ్లు మాట్లాడితే ఎట్లా ఉంటుంది? అనే చర్చకు దారి తీస్తుంది.."

"ఓ.కే... ఓ.కే.. ఇప్పుడు నాకు అర్థమైంది. మరి ఆలస్యం ఎందుకు.. పదండి" అన్నది విశాల.

* * *

సందె వేళ .. నాలుగో అంతస్తులో సుధాకర్ గదిలోకి కిటికీలోంచి సూర్యాస్తమయపు ముదురు కాంతి ప్రసరిస్తోంది. సుధాకర్ రాతబల్ల ముందు కూర్చుని ఎవరో క్లయింట్‌తో మాట్లాడుతున్నాడు.

ఈ ముగ్గురినీ చూచి సంభ్రమానికి గురయ్యాడు. వస్తున్నట్లు ఫోన్ చేద్దామని గిరి అంటే... అక్కర్లేదు... ఆ టయంలో ఎక్కడికీ వెళ్లడు అనే భరోసా విశాల ఇచ్చింది. మిగతా ఇద్దరూ ఎప్పుడూ వచ్చేవారే అయినా గిరి ఇట్లా వాళ్లతో కూడా రావడంతో సుధాకర్‌కు ఆనందం కలిగింది. కుర్చీలోంచి లేచి ఎదురుగా వెళ్లి గిరికి గట్టిగా చేయి కలిపాడు.

" పనిలో ఉన్నట్లుంది..!" అన్నాడు గిరి.

"ఫర్లేదు... అయిపోయింది..." అనడంతో సదరు క్లయింట్ తన కేసు గురించి మరోసారి మూడు ముక్కల్లో చెప్పి బయల్దేరాడు.

గిరి గది అంతా ఒకసారి పరికించాడు. వాకిట్లోంచి లోపలికి తొంగి చూస్తుంటే..సుధాకర్ లేచి " టీ చేసుకుంటూ మాట్లాడుకుందాం.." అని లోపలికి కదిలాడు.

లోపల వంట గది. కానీ ఓ చివర గట్టు మీద వంట సామాగ్రి తప్ప మిగతా అంతా పుస్తకాలే. గిరి వెళ్లి ఒక్కోవరుస చూస్తుంటే.. ఉలిగప్ప వెనుకే వచ్చి నిలబడి" సుధాకర్ ఇంట్లో మూడొంతులు పుస్తకాలే.." అన్నాడు.

నిజమే.. బైట తన ప్రొఫెషన్ బుక్స్ ఉంటే లోపలి గది నిండా రకరకాల పుస్తకాలు. బైట నాలుగు కుర్చీల కోసం, లోపల ఓ మంచం జాగా పోతే అంతా నిండిపోయింది.

"నీ రూంలో ఉంటే పుస్తకాల కొట్లో ఉన్నట్లనిపిస్తోంది..." అన్నాడు గిరి.

స్టవ్ వెలిగిస్తూ చిన్నగా నవ్వాడు సుధాకర్

"మధ్యలో కుర్చీ వేసుకొని కూర్చుంటే ఏ పుస్తకం కావాలన్నా చెయి సాచి అందుకోవచ్చు..." విశాల అన్నది.

చాలా పద్ధతిగా పెట్టుకున్నాడు.. కొన్ని పుస్తకాలు చూస్తుంటే ఆ టైటిల్ కూడా తాను ఇంత వరకు వినలేదనిపించింది. అవన్నీ చూస్తుంటే సుధాకర్‌కు ఇంగ్లీష్ మీద ఎంత పట్టు ఉందో ఊహించగలిగాడు. వాళ్ల ఇంట్లో చదువుకున్న వాళ్లలో రెండో తరం వాడు.. కాబట్టి..ఆలోచనలకు బ్రేక్ వేస్తూ సుధాకర్ ఆ పక్కకు తిరిగి" నిన్ననే రాశా..చూడు" అని నాలుగు కాగితాలు చేతిలో పెట్టాడు.

ఇంగ్లీషు వ్యాసం. ఒక క్షణం అమ్మో అనిపించింది. సుధాకర్ ఇంగ్లీషులో కూడా రాస్తాడని తెలీదు. గబగబా పేజీలు తిప్పేశాడు. జీవో 144 గురించే రాశాడు. చాలా జాగ్రత్తగా వాదన పెట్టాడు. మామూలుగా అయితే అడుగడుగునా విసుర్లు, ఎక్కడలేని వెటకారం ఉండేవి.

"అప్పుడే రాసేశావా? " ఆశ్చర్యంగా అని ఉలిగప్పకు అందించాడు.

"ఊ.. మొన్న అక్కడి నుంచి వచ్చాక బాగా డిస్ట్రబ్ అనిపించింది. ఏవో ఆలోచనలు వస్తే బరబరా రాసేశాను.. ఇంకా దేనికీ పంపలేదు.."

"మామూలుగా నీ స్టైల్‌లో లేదు.. " అన్నాడు గిరి.

టీ అందిస్తూ భళ్లున నవ్వాడు సుధాకర్

"రచనలో ఒక వ్యసనం ఉంటుంది తెలుసా?" అని గిరి కళ్లలోకి సూటిగా చూశాడు.

నోటి దగ్గర ఉన్న టీ కప్పు లోంచి కనుబొమ్మలు పైకి ఎత్తి ఏమిటీ? అన్నట్టు చూశాడు.

విశాల అడగనే అడిగింది. రాయడమే ఒక వ్యసనమనా? అని.

"అంత సింపుల్ కాదు.. తోచిన వన్నీ రాయడం, ఏది రాసినా ఒకేలా రాయడం...ఇంతకూ నేనలాంటి వ్యసనపరుడినైన రచయితగా ఇంకా మారలేదు.." అన్నాడు సుధాకర్.

"నేను చెప్పిన దానికి... నువ్వు చెప్పిన దానికి తేడా ఏముంది? అని మళ్లీ తనే " అయినా నా అంత సింపుల్‌గా చెబితే నీ ప్రత్యేకత ఏముంది?" అని తేల్చిపారేసింది.

ఉలిగప్ప ఇవేవీ పట్టించుకోకుండా టీ తాగుతూ వ్యాసం చదివేసి "చాలా బాగుంది.." అని మనస్ఫూర్తిగా అన్నాడు.

అన్నీ ఒకేలాగా రాయడం... అనే మాట గిరికి లోతుగా అర్థమైంది.

ఏవో రెండు పుస్తకాలు చేతపట్టుకొని బైటికి కదిలాడు. ఉలిగప్ప నేరుగా విషయంలోకి వచ్చి " దీన్ని ఏం చేద్దాం. నీవేమంటావో తెలుసుకుందామని వచ్చాం" అని అడిగాడు.

అంతే సూటిగా సుధాకర్ ప్రారంభించాడు.

"మొన్న చెప్పాను గదా? మూడు రకాలుగా మనం వర్క్ చేయాలి. ఒకటి లీగల్‌గా. ఇంతక ముందు నుంచి కూడా దీన్ని చూస్తున్న లాయర్ల టీంతో కలిసి అవసరమైనవన్నీ చేస్తాను. ఇక రెండోది ఉద్యమం. మొన్న చాలా ప్లాన్ చేశారు గదా? ఇంకా మీ పై కమిటీ అట్లాంటివి చాలా చేయవచ్చు. వీటిలో నేను అవసరం అని మీరనుకున్న చోటికల్లా వస్తాను. రేపు ఎప్పుడో ధర్నా అనుకున్నారు గదా? నేనూ వస్తాను. మూడోది.. " అని కొన్ని క్షణాలు ఆగి..." దీని వల్ల తక్షణ ఫలితం ఉండదు. కానీ ఇలాంటప్పుడే ప్రయత్నించాలి. ఈ జీవో రావడం, దాని వెనుక పని చేసిన ధోరణి అనేవి మిగతా జీవోల్లాగా కేవలం ప్రభుత్వానికి, రాజకీయాలకు సంబంధించినవే కాదు. మన సోషల్ రియాలిటీ లోని సంక్లిష్టతను ఇవి తెలియజేస్తున్నాయి. వాటి గురించి విడిగా మాట్లాడితే అర్థం కాదు. పైగా చెప్పడం కూడా కష్టం. ఇట్లాంటప్పుడే చర్చ లేవ దీయాలి. వాళ్లవైపు, మీ వైపు ఉండే ఉద్యమ నాయకత్వం ఎట్లా వ్యవహరిస్తుందనేది వేరే. ఉదాహరణకు మొన్న నన్ను పిలిచారు. నేను సిద్ధపడే వచ్చాననుకోండి. మీ పై నాయత్వం, ముఖ్యంగా ఉద్యమాన్ని రెప్రజెంట్ చేసే వాళ్లుంటే నన్ను రిసీవ్ చేసుకోవడం చాలా కష్టం. ఎందుకంటే ఒక రకమైన వాదన మీద ఆధారపడి నాయకులు తమ కమ్యూనిటీని కదిలిస్తుంటారు. దాని వెనక కొంత రియాలిటీ ఉంటుంది. అంతా వాళ్ల వాదన మీదే ఆధారపడిందనలేంగాని, దానికి భిన్నమైన ఆలోచనల వల్ల ఉద్యమం దెబ్బ తింటుందనే ఆందోళన వాళ్లకుంటుంది. అదీ అసలు సమస్య. అయితే మనలాంటి వాళ్లం కొన్ని ఆలోచనలు చేయవచ్చు. వాటి వల్ల వాతావరణంలో కొంచెం మార్పు వస్తుంది. అది ఉద్యమాలకేగాక వాటి వెనుక ఉండే అవగాహనకు కూడా హెల్ప్ చేస్తుంది....."

ఈ నాలుగు ముక్కలు చెప్పి ఆగిపోయాడు.

ఉలిగప్పకూ, విశాలకూ ఆ మాటలు నచ్చాయి గాని గిరి మాట్లాడితే బాగుంటుందని ఊరుకున్నారు.

వచ్చేటప్పుడు సుధాకర్‌తో పని వరకే పరిమితం కావాలనుకున్నా ఇప్పుడు అతడి మాటలు విన్నాక గిరి సంతృప్తిగా చూస్తూ... "ఈ మూడు పనుల్లో నీవు మాతో కలవాలి. రేపటి ధర్నాలో నీవు మాట్లాడాలి. నీలాగా బైటి కమ్యూనిటీల్లోని డెమొక్రాట్స్‌ను పిలుస్తున్నాం.. " అన్నాడు.

"రాయలసీమ, కోస్తాలలో బుడగజంగాలు లేరనే వాదన వెనుక పాలిటిక్స్‌తోపాటు కొంత సోషియాలజీ కూడా ఉంది. దాన్ని మనం చెప్పాలి. లేకపోతే మాల వ్యతిరేకతను మనమూ ప్రోత్సహించినట్లవుతుంది. రూలింగ్ క్లాస్‌లోకి వెళ్లిపోయి, ఈ జీవో తేవడానికి రావడానికి కారణమైన మాల సెక్షన్ గురించి ఎట్లాగూ మాట్లాడాల్సిందేగాని సమస్య అంత మాత్రమే కాదు.." అన్నాడు సుధాకర్.

ఈ స్పష్టతతో గిరికి తేలికనిపించింది.

పని వరకే మాట్లాడి వెళ్లిపోదామని వచ్చినా సుధాకర్‌తో వ్యవహారం అట్లా ఉండకపోవచ్చనే శంక నిజమే అయింది. ముందు తాను అట్లా అనుకున్న సంగతి కూడా గిరి మర్చిపోయాడు.

"ఒక సంచార తెగ స్థిర జీవితంలోకి మారే క్రమంలో ఎదరవుతున్న సవాళ్లు ఇవి.." అంటూ ఉంటేనే సుధాకర్ కల్పించుకొని " అదీ .. అసలు సమస్య.." అన్నాడు.

గిరి పొడిగిస్తూ, " ప్రీ మోడ్రన్ కమ్యూనిటీ తనకూ ఆధునికతలో గుర్తింపు కావాలని, వాటా దక్కాలని అనుకోవడం వల్ల ఇప్పటికే ఆధునికతా సరిహద్దుల్లోకి వచ్చిన కులాలతో, పాలక వర్గాలతో తలెత్తిన ఘర్షణ ఇది.. ఒక రకంగా ఈ సమస్య మాదిగ కులానికి కూడా లేదు. వాళ్లకూ ఆధునిక ఫలాలు దక్కకపోయినా స్థిర నివాసంలో ఉన్నారు... కాబట్టి" అన్నాడు.

గిరి ఆలోచనలు ఎట్లా ఉన్నా వాటి వెనుక ఏదో బలమైన పునాది ఉంటుంది. మాటలు ద్రవ రూపంలో ఉండవు... అని అనుకునేవాడు. ఇప్పుడు తన ఆలోచనలు నచ్చడమేగాక తన అంచనా నిజమనిపించింది.

"మరి రేపటి ధర్నాకు ఈ డిమాండ్‌ను ఒప్పుకొనే వాళ్లందర్నీ పిలవండి... న్యాయం గురించి రోజూ మాట్లాడేవాళ్లలో ఎంత మంది దీని పక్షాన నిలబడతారో తేలుతుంది..." అన్నాడు సుధాకర్.

అట్లా.. చర్చ పని మీదికి వెళ్లింది.

రాత్రి ఎనిమిది అవుతుండగా బయల్దేరారు. దారిలో విశాలను వదిలేసి హాస్టల్‌కు బయల్దేరారు.

* * *

తెల్లారి ఇద్దరూ రోడ్డు మీద పడ్డారు.

ధర్నాకు సిటీ లోంచి వీలైనంత మందిని కదిలించడానికి ప్రయత్నాలు చేశారు. పెద్ద మనుషులందరికీ.. తెలిసిన వాళ్లనూ తెలియని వాళ్లనూ .. అందరినీ ఆహ్వానించారు. కొందరిని నేరుగా కలిసి సమస్య చెప్పి ధర్నాకు వచ్చి మాట్లాడాలని ప్రత్యేకంగా చెప్పారు. సీమ, కోస్తా జిల్లాల్లో తమకు పరిచయమైన కులస్తులతో ఫోన్లలో మాట్లాడి ఏర్పాట్ల గురించి ఆరా తీశారు. జిల్లాలో పనులు ఎంత వరకు వచ్చిందీ ఉలిగప్ప ఎప్పటికప్పుడు మాట్లాడుతునే ఉన్నాడు. తమ్ముడికి ఫోన్ చేసి నాయిన్ను, జేజి నాయన్ను కర్నూలుకు తోలకపోవాలని చెప్పాడు. అప్పుడు తెలిసింది.. జేజి నాయనకు వారం దినాల నుంచి జ్వరమని. మూసిన కన్ను తెరవడం లేదని.

ఉలిగప్పకు అనుమానం వచ్చి " ఇంతకూ ముసలోల్లు యాడున్నారు? " అని తమ్ముడ్ని అడిగాడు.

"యాడుంటరానా? దేశం మీద పాయినారు. నిన్న ఏకున కల్లల్లో ఊపిరి పెట్టుకొని వచ్చినాడు. ఆడికి జేజి గట్టిగ అరిస్తే కదిలినాడంట. మనిసి మన ద్యానలో లేడు. ఏదేదో మాట్లాడుతుండాడు. నాకు మండింది. నోటికొచ్చినట్లు తిట్టి ఆటోలో కొట్కూరుకు తోలకపోయి సూదులేపించినా.." యాసిరికపడ్డాడు తమ్ముడు.

అందులో తన మీద కోపం వెళ్లగక్కాడా? అనిపించింది ఉలిగప్పకు. 'నువ్వేమిడిదీ పట్టించుకోవ'నే నిష్ఠూరం ఉందా? అన్నట్లు తోచింది.

మనసంతా కలిచివేసింది. అప్పటిదాకా ఉన్న ఉత్సాహాన్ని సాంతం తోడేసినట్లు డీలా పడిపోయాడు. కాసేపటి దాకా మాటా పలుకూ లేదు.

గిరి గమనించాడు.

"ఏమైంది?.." అని అడిగాడు.

"చెప్పడానికి ఏముంది? మా ముసలోడి యవ్వారం..."

గిరికి జంబులు గుర్తుకొచ్చాడు. ఆయన కళా వైభవం కళ్ల ముందు కదిలాడింది.

"వాళ్లతో కష్టం. మన దారికి తెచ్చుకోవాలనుకొని ... రాక బాధపడ్డం కంటే అర్థం చేసుకోవాల్సిందే. అట్లా తప్ప ఇంకో మాదిరి బతకమంటే అన్యాయంగా చచ్చిపోతారు. .." అంటూ ఉంటే ఉలిగప్ప తీవ్ర స్వరంతో "ఇట్ల కూడా చచ్చిపోయేదే గదా?" అన్నాడు.

ఆ మాట ఎంత లోతు నుంచి వచ్చిందో తెలుస్తున్నది కాబట్టి గిరి వెంటనే అందుకోలేదు.

"కొడుకు, మనవడు బువ్వ పెట్టమంటే ఎత్తక తినడం బాగుంటది.." అన్నాడు ఉలిగప్ప.

చిన్నగా నవ్వుతూ "ఆయన సమస్య తిండి కాదబ్బా. అట్లనుకుంటే ఎన్నటికీ వాళ్లను అర్థం చేసుకోలేం. వాళ్లకు ఇంకా చాలా కావాలి. మనం ఎట్లాగయితే తిండి తిప్పలేగాక మనోల్లకు ఇంకా చాలా కావాలనుకుంటున్నామో ఆయన కూడా చాలా కావాలనుకుంటాడు. ఆయనే కాదు.. ఊళ్లల్లోకి పోతే చాలా మంది మీ జేనాయిన లాంటి మనుషులు కనిపిస్తారు. తేడా ఏందంటే.. మనం కావాలనుకునేవి, వాళ్లు కావాలనుకునేవి వేరే. అసలు పోలికే ఉండదు. మనం వీటి కోసం ఎట్లా తిరుగుతున్నామో.. ఆయన అట్లా తిరుగుతున్నాడు. ఎవరైనా వచ్చి ఇవన్నీ ఎందుకు అంటే మనం ఊరుకుంటామా? ఆయనా అంతే..." నెమ్మదిగా చెప్పి వేడిగా టీ తాగుదాం పదా... అని దారి తీశాడు.

తేరుకోడానికి ఉలిగప్పకు చాలా సమయం పట్టింది. గిరి వెంట ఎక్కడికి వెళ్లినా, ఎవరితో మాట్లాడుతున్నా జంబులే వెంటాడాడు. చెప్పిన మాట వినడం లేదని జేజినాయన మీద కోపమో.. ఈ వయసులో ఊర్లు పట్టుకొని తిరిగి సరిగా తిండి తిప్పలు లేక, మందు మాకుల్లేక ప్రాణం మీదికి తెచ్చుకుంటాడే అనే మమకారమో తెలియడం లేదు.

ఉలిగప్ప సంగతి తెలుసు కాబట్టి గిరి పనులు చక్కబెడుతూనే ఏదో ఒక మాట కలుపుతున్నాడు.

"మా ఊళ్లో మా చిన్నప్పుడు నేను చూసిన ఒకాయన ఇట్లనే ఉండేటోడు. దాసరాయిన. మీ జేజినాయిన మాదిరే గొప్ప గాయకుడు. మా ఊళ్లో అప్పట్లో రెడ్డి గారికి మాదిగోల్లకు తగాలుండేవి. దసరా పండగ వస్తే ఊళ్లో మూడు దినాలు హరికథలని, నాటకాలని పెట్టేవాళ్లు. ఊరితో తగాదా ఉండటాన ఆ మూడు దినాలు మాదిగోల్లు పోటీగా దాసరి రాముడితో కత చెప్పించేవాళ్లు. అన్నాలు తిన్నాక మొదలు పెడితే కోడి కూసేదాక చెప్పేవాడు. మూడు దినాలు నరసింసామి కత, ఆరెవాళ్ల కత, కాటమరాజు కత చెప్పేవాడు. ఒక సారి మనం చెవ్వు పెట్టామంటే ఇక ఆయను సరెండర్ కావాల్సిందే. ఊర్లో వాళ్లకు కడుపు మంటగా ఉండేది. దాసరి రాముడు సారంగి మీద లెక్కలేనన్ని పాటలు పాడేవాడు. అసలు కత ఏమంటే - ఆయన కొడుకు హాస్టల్లో ఉండి నానా కష్టాలు పడి చదువుకొన్నాడు. జడ్చర్లలో ఏదో ఉద్యోగం చేస్తున్నాడు. మనవళ్లు బాగా చదువుకుంటున్నారు. ఆయినా దాసరి రాముడు ఊరు వదిలి వాళ్ల దగ్గరికి పోయేవాడు కాదు. ఊర్లో పాత మసీదు కట్ట దగ్గర ఆయన మకాం. చుట్టు పక్కల ఊర్లలో తిరిగి కతలు చెప్పడం, సారంగి మీద పాటలు పాడుకుంటూ

తిరగడం, అడక్కొచ్చుకొని మసీదు కట్ట దగ్గర కాలక్షేపం చేయడం.. చాన్నాళ్ల కింద పెళ్లాం చనిపోయింది..'ఒక్కడివి ఈ బతుకేందే'ని కొడుకు పిలిస్తే వెళ్లడు. ఊర్లు తిరిగి పాటలు పాడి అడుక్కొచ్చుకోకపోతే ఆయన బతకలేడు.. ఆయన్ను ఏమనాలి? తిండి తిప్పలు కోసమే అయితే అవన్నీ కొడుకు దగ్గర దొరుకుతాయి. ఆయనకు ఇంకా ఏమో కావాలి. వాటి కోసమే ఆ తండ్లాట..."

ఇప్పుడు ఎందుకో దాసరి రాముడు గుర్తుకు వచ్చాడు. ఇంతకూ జేజినాయన గురించి విచారపడుతున్న ఉలిగప్పకు ఇది ఓదార్పు ఇస్తుందా? లేక మరింత కుంగదీస్తుందా? అనే సందేహం వచ్చింది గిరికి.

పరీక్షగా ముఖంలోకి చూశాడు.

"వాళ్లు యాడనో బందీలయ్యారు.." అన్నాడు ఉలిగప్ప తేరుకుంటూ.

"అంతేమరి. అందులో నైసర్గికమైన సౌందర్యం ఉంది. అది జీవితం నుంచి, కులం మూలాల నుంచి సంక్రమించింది. అది చాలా విలువైనది. కానీ మనలో చాలా మంది ఆ సౌందర్యాన్ని, పసిదనాన్ని చూచి మురిసిపోయి పొగుడుతూ ఉంటారు. అది నిస్సందేహంగా అత్యద్భుతమైనది. రెండో మాటే లేదు. కానీ మారుతున్న జీవితానికి ఆ వైభవాన్ని మోసుక తిరగడం సాధ్యంకాదు. ఒకప్పుడు జీవితంలో భాగంగా ఉండేది ఇప్పుడు జీవితానికి బరువైపోయింది . ఈ మాట అంటే గొంతుపట్టుకుంటారు కాని, జీవితం కొత్త దశలోకి వెళ్లాక దాని లాజిక్ మారుతుంది. ముసలోళ్లకు ఆ సంగతి తెలియదని కోప్పడి ప్రయోజనం లేదు. మనలాంటి వాళ్లకు తెలియకపోతేనే నష్టం. అప్పుడు నాకూ సుధాకర్‌కు అన్ని రోజులు పత్రికల్లో జరిగిన గొడవంతా అదే. ఇప్పుడు మార్చుకున్నట్లుంది..."

ఇలాంటి మాటలు గిరి ఎప్పుడూ చెప్పేవే అయినా ఇప్పుడున్న మూడ్‌లో ఉలిగప్పకు బాగా చేరాయి.

"ఇంకంతే వాళ్లను మనమేం చేయలేం. ఇంటికి వచ్చినప్పుడు ఇంత ముద్దేయడం తప్ప..." ఉలిగప్ప అన్నాడు. అందులో తానేదే తేల్చుకున్నట్లు, స్పష్టమైనట్లు గిరికి తోచింది.

సాయంకాలం దాకా సుడిపడ తిరిగారు. ఏదో అర్జంట్‌గా రాసే పనుందని విశాల కలవలేదు. రేప్పొద్దున ఏకంగా వచ్చేస్తానని చెప్పింది.

మర్నాడు అనుకున్నదాని కన్నా ఎక్కువ మందే కలిశారు. బైటి నుంచి మద్దతుగా కూడా బాగానే వచ్చారు. సుధాకర్ చాలా ఉద్వేగంగా మాట్లాడాడు. డజన్ల కొద్దీ గుమ్మెటతాంబురలతో వచ్చారు. పాత పాటలు, అవే వరుసల్లో కొత్త పాటలు పాడారు. కులం ఎదుర్కొంటున్న సమస్యల మీద, **144** జి.ఒ. మీద అప్పుడే ఒకటి రెండు పాటలు కట్టి ఎవరో ఒక యువకుడు పాడాడు. ముసలోళ్ల పాటలు విన్నాక ఆ పాటలు అంత రక్తి కట్టలేదనిపించింది ఉలిగప్పకు. ఆ సంగతే గిరి చెవిలో గుసగుస అన్నాడు.

ఉష్.. ఈ పక్కన ఉన్నాయనే వాటిని రాసింది.. వింటే బాధపడతాడు.. అన్నాడు. ఆ తర్వాత పక్కకు పోయాక నీవు చెప్పిన తేడా ఉంది. ముసలోళ్ల పాట వరిజినల్. దాని కంటెంట్, ఫారం రెండూ ఒకే కాలానివి. మనకవి బాల్యం లాంటివి. వాటిలో ఆ బలం ఉంటుంది. కానీ వీళ్లు పాత ఫారంను తీసుకొని కొత్త జీవితాన్ని, కొత్త ఆలోచనలతో రాశారు. నీకు అంత బాగున్నట్లనిపించకపోవచ్చుగాని, ఆ ఫారం ఈ కంటెంట్‌లోతప్ప మరోలా బతకలేదు. ఇట్లాంటి ఉద్యమాలకు ఈ పాటలూ అవసరమే. బాల్యం ఉమ్మడి గతమైనట్టే ముసలోళ్ల పాటలు కూడా అందరినీ ఒక చోటికి తేవడానికి, మేం ఫలానా అని చెప్పుకోడానికీ అవసరం. అంత వరకే. ..." అన్నాడు.

సాయంకాలం దాకా ధర్నా జరిగింది. ఎవరెవరో సంఘీభావంగా మాట్లాడుతున్నారు. సంగం పెద్దలకు కూడా సంతృప్తి కలిగింది. గిరి, ఉలిగప్ప పూనుకోవడం వల్లే ఇంత మంది బైటి నుంచి వచ్చారనుకున్నారు. సుధాకర్ మాట్లాడాక ఒకరిద్దరు పెద్దలు వెళ్లి ఆత్మీయంగా చేయి కలిపారు. ఆసాంతం వెంకటేశ్వర్లు సారు ఉండి టెంట్ తీసేసేటప్పుడు వెళ్లిపోయారు. పనిలో పనిగా వెంకటేశ్వర్లు సారు, విశాల ఓ పక్కన కూర్చుని పోతులూరి గురించి చాలా సేపు ముచ్చట్లు పెట్టుకున్నారు. ఆయనతో మాట్లాడటం వల్ల చాలా సమాచారం తెలిసిందని విశాల అనుకుంటే, 'ఈ పిల్లలేంది..? ఇన్ని కొత్త ఆలోచనలను ఎక్కడి నుంచి పట్టుకొస్తారు? ఇవన్నీ వింటే ఉక్కిరిబిక్కిరి తనకు అవుతుంది. వీటినంతా అర్థం చేసుకొని ఒక పద్ధతి ప్రకారం వాదన పెట్టడం ఈ తరం వాళ్లకే సాధ్యమవుతుందేమో.. ' అనుకున్నాడు.

"మధ్యలో నీవూ గిరి, ఉలిగప్ప కలిసి ఆలోచిస్తుంటారు గదూ?" అన్నారు.

"ఎలా చెప్పగలిగారు?" అని అడిగింది విశాల.

"వాళ్లు నాతో ఇలాంటివే చాలా చర్చిస్తుంటారు. నీవూ అట్లాగే ఆలోచిస్తున్నావు.." అన్నారు.

విశాల నిండుగా నవ్వింది.

అంతా వెళ్లిపోతోంటే సుధాకర్‌తో " సార్‌ను వదిలేసి వెళ్తావా?" అని ఉలిగప్ప అన్నాడు.

తనకా విషయం తోచనందుకు నొచ్చుకుంటూ అలాగే అన్నాడు సుధాకర్.

అప్పుడే ఊరి నుంచి తమ్ముడు ఫోన్ చేశాడు.

ధర్నా బాగా జరిగిందని, ఊరి నుంచి ఇరవై మందిమి పోయామని చెప్పాడు.

"ముసలోడికి ఎట్లుంది? " అని అడిగాడు ఉలిగప్ప.

"జరం కొంత తగ్గింది. ఇడిసిడిసి వస్తుండది. ఏం పెట్టినా తినడం లేదు. మంచం లోంచి లెయ్యాలేకపోతుండాడు.." అన్నాడు.

ఉలిగప్పకు భయమేసింది.

"ఈ పొద్దు నీతోపాటు కర్నూలుకు తోలకపోయి డాక్టర్‌కు చూపించాల్సింది" అన్నాడు.

"నేను అదే చెప్పినా. రెండు దినాలు ఆగి పోదాం. కొట్కూర్లో చూపిస్తుండవుగా అన్నాడు" నిస్సహాయంగా ఉంది తమ్ముడి గొంతు.

ఏం చేయాలో తోచక ఫోన్ పెట్టేశాడు.

(ఇంకా ఉంది)

-: స్వీకారం :-

ధ్వంసమైన స్వప్నం
రచయిత : అరుంధతీరాయ్
ప్రచురణ : మలుపు
వెల : రు. 75/-
పేజీలు : 208

మహోజ్జ్వల తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట నవలా సాహిత్యం - పరిచయాలు - పరిశీలన
ప్రచురణ : జనసాహితి
వెల : రు. 50/-
పేజీలు : 172



ఎస్.సి. రిజర్వేషన్ వర్గీకరణపై - నాలుగు వ్యాసాలు
రచయిత : డా. సి. కాశీం
ప్రచురణ : సహచర
వెల : రు. 15/-
పేజీలు : 23



ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు - విద్రోహ రాజకీయాలు
రచయిత : డా. సి. కాశీం
ప్రచురణ : సహచర
వెల : రు. 10/-
పేజీలు : 16



ఆఖరి మనిషి అంతరంగం
రచయిత : జి. కళ్యాణరావు
ప్రచురణ : కుల నిర్మూలన
వెల : రు. 60/-
పేజీలు : 101



తెలంగాణ - విరసం కవిత్వం
ప్రచురణ : విప్లవ రచయితల సంఘం
వెల : రు. 30/-
పేజీలు : 108

సెజ్‌లు రైతుల మెడకు ఉరితాళ్ళు
ప్రచురణ : ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం
వెల : రు. 20/-
పేజీలు : 40



ఫ్యాక్షన్ మాఫియా
ప్రచురణ : ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం
వెల : రు. 75/-
పేజీలు : 207



ఛత్తీస్‌ఘడ్‌లో ఏమి జరుగుతోంది?
ప్రచురణ : ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం
వెల : రు. 20/-
పేజీలు : 64



సూత పురాణం-1
మూలం : కవిరాజు త్రిపురనేని రామస్వామి
వచనం : బి. రామకృష్ణ
ప్రచురణ : పీకాక్ క్లాసిక్స్
పేజీలు : 144



సూత పురాణం-2
మూలం : కవిరాజు త్రిపురనేని రామస్వామి
వచనం : బి. రామకృష్ణ
ప్రచురణ : పీకాక్ క్లాసిక్స్
పేజీలు : 176



వ్యాపారం గుప్పెట్లో విద్య
ప్రచురణ : ఆంధ్రప్రదేశ్ విద్యా పరిరక్షణ కమిటీ అఖిల భారత విద్యాహక్కుల వేదిక
వెల : రు. 20/-



అనుగర్రలు తెలంగాణ ఉద్యమ గేయాలు
సంపాదకులు : నల్లెల్ల రాజయ్య
ప్రచురణ : వరంగల్లు రచయితల సంఘం
వెల : రు. 15/-
పేజీలు : 62



కొన్ని రంగులు ఒక పద్యం
రచయిత : జి. వెంకటకృష్ణ
ప్రచురణ : స్ఫూర్తి
వెల : రు. 30/-
పేజీలు : 144

కా. గణపతి ఇంటర్వ్యూ పూర్తి పాఠం
ప్రచురణ : ఎఱ్ఱ నక్షత్రం
వెల : అమూల్యం
పేజీలు : 59

KLUA101M156

ARUNATARA A Literary and Cultural Telugu Monthly Journal of Revolutionary Writers Association (VIRASAM)

• RNI Regn.No.21152/72 • Published on 20/12/2011 288 - Sept - Oct, 2011

100

తెలంగాణ ప్రజావెల్లువలో ప్రభుత్వ, సామ్రాజ్యవాద వ్యతిరేకత ఇనుమడించాలి!

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం నడుస్తున్న సకల జనుల సమ్మెకు విప్లవ రచయితల సంఘం జేజేలు పలుకుతోంది. తెలంగాణ సకల జీవన రంగాల నుంచి వెల్లువెత్తిన ప్రజా సంచలనానికి విరసం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోంది. తెలంగాణ సాగిస్తున్న ఈ కడపటి పోరాటం ఇటీవలి కాలంలోని అరుదైన సామూహిక వ్యక్తీకరణగా తెలుగు ప్రజల చరిత్రలో నిలిచిపోతుంది. విద్యార్థులు, యువకులు, గ్రామీణులు, ఆలోచనాపరులు చేస్తున్న ఆందోళనకు సైదోడుగా సింగరేణి కార్మికులు, ఆర్టీసీ కార్మికులు, టీచర్లు ప్రైవేటు రంగంలోని కార్మికులు, ప్రభుత్వ ఉద్యోగులు అకుంఠిత దీక్షతో సమ్మె సాగిస్తున్నారు. ప్రభుత్వ హెచ్చరికలకు, బెదిరింపులకు తలొంచకుండా సమ్మె నడుస్తోంది.

అయితే ఎప్పటి వలెనే ఇంత పెద్ద ప్రజాందోళనలో రాజకీయ పార్టీల భాగస్వామ్యం కొరవడింది. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు కేంద్రంపై ఒత్తిడి తేవడానికి తగిన పద్ధతులను ఎంచుకోవడం లేదు. తెలంగాణ తెచ్చినా, ఇచ్చినా కాంగ్రెసే అనే బీరాలు పోవడం తప్ప ఏక కంఠంతో కేంద్రం మెడలు వంచలేకపోతున్నారు. ఉద్యమ ఒత్తిడికి తట్టుకోలేక రాజీనామాలు చేయడం తప్ప ఈ సకల జనుల సమ్మెలో క్రియాశీల భాగస్వామ్యం తీసుకోవడం లేదు. తెలుగుదేశం పార్టీ ఇప్పటికీ రెండు కళ్ల సిద్ధాంతాన్నే అధికారికంగా వల్లె వేస్తోంది. ఆ పార్టీ తెలంగాణ నాయకులు మొదట రాజీనామాలు చేసినా, ఆ తర్వాత ఒకడుగు కూడా ముందకుపోలేక తెలంగాణ ప్రజల ఆగ్రహానికి గురవుతున్నారు. చివరికి తెలంగాణ ఉద్యమ ప్రతినిధిగా చెప్పుకొనే టీఆర్ఎస్ అధినాయకత్వం సకల జనుల సమ్మెలో రాజకీయశక్తిగా పాలుపంచుకొని ఉద్యమాన్ని ఉధృతం చేయడం లేదు. అయినా తెలంగాణ ప్రజల పోరాటతత్వం ఈ సమ్మెలో అద్భుతంగా వ్యక్తమవుతోంది. తెలంగాణ పక్షాన న్యాయం ఉన్నదని భావించేవారు ఎక్కడున్నా సహానుభూతితో ఉద్వేగానికి లోనయ్యేంతగా ఈ ఆందోళన సాగుతోంది.

సమ్మె తీవ్రమయ్యే కొద్దీ కోస్తా దళారీ పెట్టుబడిదారీ వర్గం ఉన్మాద స్థాయిలో మాట్లాడుతోంది. తెలంగాణను అడ్డుకోవడానికి వాళ్లు చేస్తున్న ప్రయత్నాలు, ప్రసంగాలు ఒక ఎత్తయితే; కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ప్రజల ఆకాంక్షను గౌరవించి హైదరాబాదుతో కూడిన ప్రత్యేక రాష్ట్రాన్ని ఇవ్వకుండా అజాద్ నివేదిక పేరుతో రాయల తెలంగాణ అనీ, హైదరాబాదును కేంద్రపాలిత ప్రాంతం అనీ వదంతులను ప్రజల్లోకి వదిలింది. ఇది సమస్య పరిష్కారానికి దోహదపడదు. మరింత జటిలం చేస్తుంది. ఒక రకంగా ఇది తెలంగాణ ఇవ్వనని చెప్పడమే. మూడు ప్రాంతాల వారూ కొట్లాడుకుంటూ ఉంటే మళ్లీ ఎన్నికల దాకా కాలక్షేపం చేయాలనే ఉద్దేశం తప్ప నిజాయితీతో తెలంగాణ సమస్యకు పరిష్కారం వెతికే ఉద్దేశం ఇందులో లేదు. నిజానికి ఇప్పటికే సకల జనుల సమ్మెను ఒక పథకం ప్రకారం హింసాపూరితం చేశారు. ,,,, రోజులుగా శాంతియుతంగా జరుగుతున్న సమ్మెలో సెప్టెంబర్ 27 వ తేదీ ఘటనలతో మొదలైన నిర్బంధం ఈ రకమైన అన్యాయమైన ప్రచారాలతో, ప్రతిపాదనలతో మరింత ఉద్రిక్తమవుతుంది.

తెలంగాణ ప్రజలు అడగని కర్నూలు, అనంతపురం జిల్లాలను కూడా కలిపి ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేయాలనే ఆలోచనే ఉంటే అంత కంటే దారుణం మరొకటి ఉండబోదు. దశాబ్దాలుగా తెలంగాణ ప్రజల ఆకాంక్ష ప్రభుత్వానికి కనీసంగా కూడా అర్థం కాలేదని దీన్నిబట్టి స్పష్టమవుతుంది. 1956లో ఆంధ్రరాష్ట్రంలో విలీనమైన తెలంగాణ మాత్రమే కావాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. పైగా రాయలసీమకూ చరిత్రలో ఎంతో కొంత సొంత అస్తిత్వం ఉన్నది. ఆ నాలుగు జిల్లాల్లో రెండు జిల్లాలను తెలంగాణలో, మరో రెంటిని కోస్తాలో కలిపితే ఆ ప్రాంత అస్తిత్వం పూర్తిగా రద్దయిపోయినట్టే. దీనికి ఆ ప్రాంత ప్రజలు సమ్మతించే అవకాశం కూడా లేదు. ఇవన్నీ పుకార్లా..?, ప్రచారాలా..?, నిజంగానే పరిష్కారాలుగా ముందుకు వస్తాయా..? అనేది అటుంచి తెలంగాణ విషయంలో కేంద్ర ప్రభుత్వం ఎందుకిలాంటి వైఖరి ప్రదర్శిస్తోంది అనేది చాలా ముఖ్యం.

కోస్తా దళారీ సంపన్న వర్గాలను సంతృప్తిపరచాలనే దురుద్దేశం తప్ప ఇందులో మరేమీ లేదు. తెలంగాణ ప్రజల ఆకాంక్షను గుర్తించి, గౌరవించే ప్రజాస్వామిక దృష్టి లేకపోవడం వల్లే ఇన్ని మడతపేచీలు పెడుతోంది. ఆంధ్రప్రదేశ్ ఏర్పాటులో, ఆ తర్వాత జరిగిన అన్యాయాన్ని సవరించడానికి ప్రభుత్వం సిద్ధం కావడం లేదు. తెలంగాణ ప్రజల ఆందోళనను పట్టించుకుంటే రాజ్యాంగ ప్రక్రియ ద్వారా తప్పక న్యాయమైన పరిష్కారం దొరుకుతుంది. కానీ ప్రభుత్వం న్యాయ భావన మీద ఆధారపడకుండా రాజకీయ ప్రయోజనాల కోసం ఆధారపడింది.

(మిగతా 10వ పేజీలో...)

Edited, printed, published and owned by Chalasani Prasad, H.No. 33-13-3, Seetharampuram, Vijayawada - 520 002
Printed at Nagendra Printing Press, Vijayawada - 520 002,
Editor : Chalasani Prasad

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA101M156
పుస్తకం పేరు	అరుణతార
తారీఖు	08 February 2025
ముందు అట్ట	ఉంది
వెనుక అట్ట	ఉంది
మొత్తం పేజీలు	101
పెద్ద సైజు పేజీలు	no
ఖాళీ పేజీలు	no
లేని పేజీలు	no
తయారు చేసినది	nazma
పేజీలు విడదీసినది	Bhanu
స్కాన్ చేసినది	sharmila
పరీక్ష చేసినది	HASEEMA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	Good